# రిజర్వేషన్లు

## ప్రజాస్వామిక దృక్పథం



కె.బాలగోపాల్

ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతిభ ఉన్నవాళ్ళకే ఇవ్వాలంటున్నారు. ప్రతిభకు ఇస్తున్న నిర్వచనాన్ని పక్కకు పెట్టి, ఇది ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలకేనా లేక అన్నిటికి వర్తిస్తుందా? కొడుకుకు ప్రతిభ ఉంటేనే తండ్రి ఆస్తికి వారసుడు అవుతున్నాడా? ప్రతిభ ఉన్నా లేకపోయినా తండ్రి ఆస్తి కొడుకుకే రిజర్వు అయిపోలేదా? భూమిగల వాళ్ళందరికీ వ్యవసాయం చేయడంలో ప్రతిభ ఉందా? సేద్యం చేయడంలో ప్రతిభ ఉన్నవాళ్ళకే భూమి అంతా పంచేస్తామంటే ఒప్పుకుంటారా? చెప్పులు కుట్టేవాళ్ళకే చెప్పుల ఫ్యాక్టరీలు చెందాలనీ, బట్టలు నేసే వాళ్ళకే బట్టల ఫ్యాక్టరీలు చెందాలనీ, మూటలు మోసేవాళ్ళకే గోడౌన్లు చెందాలని చట్టం చేస్తే ఒప్పుకుంటారా? ఆస్తిలో కానీ, ప్రైవేటు సెక్టర్ ఉద్యోగాలలో కానీ, ప్రైవేటు కళాశాలల సీట్లలో కానీ వారసత్వానికి, బంధుత్వాలకు, రికమెండేషన్లకు, 'మావాడు' అనే సామాజిక సంబంధానికి ఉన్న ప్రాధాన్యం ప్రతిభకు లేదు. దీనివల్ల నూటికి 90 శాతం ప్రయోజనం పొందుతున్నది అగ్రకులాల వాళ్లే. వాళ్ళ యాజమాన్యంలో లేని ప్రభుత్వ ఉద్యోగాలలో తమకు ప్రవేశం కావాలని దళితులు కోరుకుంటే ఇంత దుమారం లేపుతున్నారు. సమాజంలోని అన్ని వనరులనూ ఆక్రమించుకున్న వాళ్ళు ప్రభుత్వ ఉద్యోగాలనే ఈ చిన్న వనరును కూడా దళితులతో పంచుకోవడానికి సిద్ధంగా లేరు. ఆస్తి నుండి ఉద్యోగాల దాకా అన్ని వనరులలోనూ జనాభా ప్రాతిపదిక మీద ప్రవేశం డిమాండ్ చేస్తే ఆకాశమే బద్దలవుతుందో, ప్రళయమే వచ్చేస్తుందో!

**- కె. బాలగోపాల్**

పుట్టుకతో ప్రతిభావంతులు అనే అగ్రహారపు ఆలోచనా ధోరణుల పునాదులను ప్రశ్నిస్తూ బలహీనవర్గాలకి రాజ్యాంగంలో నిర్దేశించిన కనీస న్యాయం కూడా అమలుకాని వైనాన్ని 'రిజర్వేషన్లు' కేంద్రంగా బాలగోపాల్ వివరించాడు. సామాజిక న్యాయం అమలులో - లోపల (చట్ట సభలు, కోర్టులు, పరిపాలనా యంత్రాంగం), బయట (రాజకీయ పోరాటాల్లో నిమగ్నమయ్యే వాళ్ళలో) - ఉన్న ఉదారవాద ధోరణులను బాలగోపాల్ విమర్శించాడు. ఒక అడుగు ముందుకు వేసే క్రమంలో, తెలిసో తెలియక వెనక్కిపడే నాలుగు అడుగుల పట్ల మనల్ని మనం నిత్యం ఎంత విమర్శనాత్మకంగా తీర్చిదిద్దుకోవాలో ఈ వ్యాసాలు మన దృష్టికి తెస్తాయి. బాలగోపాల్ రచనలన్నింటా కనిపించే లక్షణమే - ఈ రచనల్లోనూ కనిపిస్తుంది.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, స్త్రీలు, వికలాంగుల కోసం చట్టం చెప్పని న్యాయం కోసం కూడా పోరాడాల్సిన వాళ్ళు - చట్టం ఇచ్చే నామమాత్రపు రక్షణలకి కూడా తూట్లు పడుతుంటే - కదలాల్సినంతగా కదలటం లేదు. దీనికి కారణమైన, మనలో అంతర్లీనంగా ఉన్న అగ్రహారపు ఆలోచనా కేంద్రాలను ధ్వంసించాల్సిన అవసరాన్ని బాలగోపాల్ రచనలు మరోసారి ఎజెండా మీదకు తెచ్చాయి. ఇవి ఇవ్వాళ్టి అవసరమే కాదు - రేపు, ఎల్లుండి కూడా అధ్యయనం చేయాల్సిన రచనలే, మన ఆచరణకు గీటురాయి కావాల్సిన రచనలే.

**- ఆర్ కె**

ప ర్ స్పె క్టి వ్స్

*బాలగోపాల్ జననం - బళ్ళారి (కర్ణాటక)లో. తండ్రి కందాళ పార్థనాథశర్మ, తల్లి నాగమణి. జర్నలిస్ట్ వేమన వసంతలక్ష్మి జీవిత సహచరి. చదివింది ఎమ్.ఎస్.సి. (ఆర్.ఇ.సి-వరంగల్) గణితంలో డాక్టరేట్ - న్యాయవాద శాస్త్రం. కాకతీయ యూనివర్సిటీలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు (1981-1985). ఆం.ప్ర. పౌరహక్కుల సంఘంలోనూ (1981-1998), ఆ తర్వాత చివరివరకూ మానవహక్కుల వేదికలోనూ పని చేశారు. లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు. చాలాకాలం విరసం సభ్యుడు. ప్రజాబంధు అనే ముసుగు సంస్థ 1989లో కిడ్నాప్ చేసింది. అనేక స్వతంత్ర రచనలతో పాటు, చిన్న పత్రికలలో కూడా కాలమ్స్ రాశారు. ఇంగ్లీషులో ఈ.పి.డబ్ల్యు ఇంకా ఇతర మాగజైన్లలోనూ, అనేక తెలుగు పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు. బాలగోపాల్ పర్‌స్పెక్టివ్స్ సంస్థాపక సభ్యుడు.*

బాలగోపాల్ పుట్టింది 10.06.1952. మరణం : 08.10.2009

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# రిజర్వేషన్లు

## ప్రజాస్వామిక దృక్పథం

కె. బాలగోపాల్


పర్స్పెక్టివ్స్
సామాజిక శాస్త్రం / సాహిత్యం
హైదరాబాద్
2013



ఇన్నర్ టైటిల్ :

ఎ వరల్డ్ టు విన్ (2005 / 31) - వాల్యూం - 1 నెంబర్ 16
సంచిక నుంచి.......ఆర్టిస్ట్ వివరాలు తెలియవు.

---



ISBN-978-93-81172-05-6

for ebook : www.kinige.com

ప్రచురణ సంఖ్య : **48**
అక్టోబరు 2013

**రిజర్వేషన్లు**
ప్రజాస్వామిక దృక్పథం
(వ్యాసాలు)

**కె. బాలగోపాల్**

సోల్ డిస్ట్రిబ్యూటర్స్
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
విజ్ఞాన్‌భవన్ - బ్యాంక్‌స్ట్రీట్
హైదరాబాద్ - 500 001
ఫోన్ నెం. 040-24744580

పబ్లిషర్స్
**ప ర్ స్పె క్టి వ్స్**
సామాజిక శాస్త్రం / సాహిత్యం
ఫ్లాట్ నెం. 305,
ఇ.నెం. 2-2-647/182/ఎ3,
హిమశివ అపార్ట్‌మెంట్స్,
బాగ్ అంబర్‌పేట్, హైద్రాబాద్ - 13.

వెల : **₹ 120/-**

ప్రింట్ సపోర్ట్
**వేమన వసంత లక్ష్మి**
మన్నం బ్రహ్మయ్య

కవర్ డిజైన్ :
**రమణజీవి**

కంపోజింగ్
శ్రీశ్రీ గ్రాఫిక్స్
హైదరాబాద్

ముద్రణ
**చరిత ఇంప్రెషన్స్**
ఆజామాబాద్,
హైదరాబాద్ - 500 020
ఫోన్ నెం. 040-27678411

# విషయ సూచిక


* ప్రజాస్వామిక విలువగా రిజర్వేషన్లు ...వి.యస్.ప్రసాద్ VII
* గరీబ్ నవాజ్ బాలగోపాల్ ...ఖాదర్ మొహియుద్దీన్ XII
* బాలగోపాల్ అవగాహన - ఒక మాట ...కంచ ఐలయ్య XVI
* రిజర్వేషన్లు - (అ)న్యాయ వ్యవస్థ ...కె. సత్యనారాయణ XIX
* వైకల్యంపై చక్కని విశ్లేషణ ...కె. నాగేశ్వరరావు XXII

1. రిజర్వేషన్లు దళితుల ప్రజాస్వామిక హక్కు 25
2. ప్రైవేటు రంగం - రిజర్వేషన్లు - వర్గీకరణ 46
3. వర్గీకరణ మళ్ళీ మొదటికి 83
4. ఆదివాసుల హక్కులకు గండ్లు 86
5. రిజర్వేషన్లు : సుప్రీంకోర్టు రాజకీయాలు 89
6. ఎవరు చూడొచ్చారులే! 92
7. గచ్చిబౌలిలో మండల్ కమిషన్ 95
8. ఈ ఆధునిక అగ్రహారాలను చూడండి 99
9. విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కాపాడుకుందాం 102
10. 'రీసర్చ్'లో రిజర్వేషన్లు తీసివేయడం ఏం న్యాయం? 105
11. ముస్లింలకు రిజర్వేషన్లు సబబే 108

12. ఎ.బి.సి.డి.పైన సుప్రీంకోర్టు తీర్పు : విజ్ఞత లేదు, తర్కమూ లేదు 112
13. సమాన విద్యావకాశాలకు సుప్రీంకోర్టు కూడా ఆటంకమైతే ఎలా? 120
14. ముస్లింలు, బిసిలు, రిజర్వేషన్లు 126
15. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన ఏ ప్రయోజనాల కోసం 130
16. ముస్లిం రిజర్వేషన్‌ను అడ్డుకోవడమంటే సామాజిక న్యాయాన్ని బలహీన పర్చడమే! 134
17. విద్యాగ్రహారాలు 140
18. రిజర్వేషన్లు - న్యాయస్థానాల వైఖరే అసలు సమస్య 144
19. తిరిగి తిరిగొచ్చిన ముస్లిం రిజర్వేషన్లు ఈసారైనా నిలిచేనా? 155
20. ఈ తీర్పుతోనూ సమస్యలున్నాయి 159
21. వర్గీకరణ అటకెక్కినట్టేనా? 163
22. సచార్ కమిటీ చెప్పిన సత్యం - ముస్లింలు దళితులకే దగ్గర 167
23. ఒబిసిల కోటా అగ్రకులాలకు! 198

* అనుబంధం

గట్టి ప్రయత్నం అవసరం 202

రిజర్వేషన్లు - సామాజిక న్యాయం - కోర్టులు (జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పుకి సంక్షిప్త అనువాదం) 205

### ప్రజాస్వామిక విలువగా

# రిజర్వేషన్లు

**బా**లగోపాల్ ఆలోచనలు, రచనలు, ఆచరణ అన్నీ కూడా ప్రజాస్వామిక విలువల ఆధారితమయినవి. 1980ల నుంచి 2009లో చనిపోయే వరకు ఆయన చేసిన రచనలను, ఆచరణను పరిశీలించినట్లయితే ఈ విషయం స్పష్టమవుతుంది. డి.డి.కోశాంబి రచనలతో ప్రేరేపితుడై మార్క్సిస్టు అవగాహనతో, ప్రజాస్వామిక దృక్పథంతో బాలగోపాల్ సమాజాన్ని విశ్లేషించాడు. అసమానతలు, అణచివేత లేని సమాజం కోసం నిరంతరం కృషి చేశాడు. ఏ దృష్టితో రచనలు చేశామనే దానిపైనే అవి ఎవరికి ఉపయోగపడ తాయనేది ఆధారపడి ఉంటుంది. బాలగోపాల్ రచనలన్నీ భారతీయ సమాజంలో మెజారిటీగా ఉన్న వెనుకబడినవర్గాల దృష్టినుంచి, అంటే వారి న్యాయమైన ప్రజాస్వామిక ఆకాంక్షల నుంచి చేయబడ్డవే. ఆయన మార్క్సిస్టు విశ్లేషణ సాధికారతను పరిశీలించినా; రాజ్యం - సంక్షేమం గురించి, దళితుల సమస్యల గురించి చేసిన, నక్సలైట్ ఉద్యమం గురించి ఆయన రాసిన రచనలను పరిశీలించినా; పౌరహక్కుల గురించి చేసిన విశ్లేషణలోనైనా; ప్రాంతీయ ఉద్యమాల గురించి చేసిన చర్చలో అయినా; నీటి పంపిణీ సమస్యకు పరిష్కారాలను సూచించినా; జెండర్ సమస్యను పరిశీలించినా; దేశ అభివృద్ధి నమూనాలను ప్రశ్నించినా; సాహిత్య విమర్శ చేసినా - అన్నీ కూడా సామాన్య ప్రజల ప్రజాస్వామ్యయుతమైన ప్రయోజనాల ఆధారంగానే చేశాడు. అందుకే బాలగోపాల్ రచనలన్నీ భారతదేశంలో ప్రజాస్వామ్యం కోసం నిరంతరంగా సాగుతున్న పోరాటాలకు ఉపయోగపడ తాయని పర్‌స్పెక్టివ్స్ భావిస్తోంది. అందుకనే బాలగోపాల్ రచనలను సాధ్యమైనమేరకు ప్రచురిస్తున్నాం.

ఈ సంవత్సరం (2013) రిజర్వేషన్లపై బాలగోపాల్ రచనలను ప్రచురిస్తున్నాం. రిజర్వేషన్లపై బాలగోపాల్ రచనలు సమస్యను మొత్తంగా అర్థం చేసుకోడానికి, ఆచరణలోని పరిమితులను తెలుసుకోడానికి, వాటిని అధిగమించడానికి అవసర మయిన చర్యలను సూచించే చర్చకు, ఆచరణకు ఉపయోగపడుతుందని భావిస్తున్నాం.

భారతదేశంలో విద్యా, ఉద్యోగరంగాల్లో రిజర్వేషన్లకు వంద సంవత్సరాలకు పైనే చరిత్ర ఉంది. తీవ్రంగా సాగిన అనుకూల, వ్యతిరేక ఉద్యమాల అనుభవం ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటిష్ పాలనలోని కొన్ని ప్రాంతాలలో, కొన్ని స్వదేశీ సంస్థానాలలో రిజర్వేషన్లు ఉండేవి. అయితే భారత రాజ్యాంగానికి మొట్టమొదటి సవరణ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడం కోసమే చేయబడిందనేది గమనించదగ్గ విషయం. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కూడా అసమాన సమాజంలో సమానత్వం కోసం తీసుకొనే చర్యలలో రిజర్వేషన్లను ఒక చర్యగా భావించడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే నూతన రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు (Art 15[1]) కులప్రాతిపదికపైన రిజర్వేషన్లు ఇవ్వడం వ్యతిరేకమని కొందరు కోర్టుకు వెళ్ళారు. రిజర్వేషన్లు రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు (Art 15[1]) వ్యతిరేకమని సుప్రీంకోర్టు కూడా తీర్పు చెప్పింది. అప్పుడు పార్లమెంటు మొట్టమొదటి రాజ్యాంగ సవరణ చేపట్టి 1951లో రాజ్యాంగంలో ఆర్టికల్ 15కు క్లాజు 4ను చేర్చింది. ప్రభుత్వం సామాజికంగానూ, విద్యాపరంగాను వెనుకబడిన వర్గాలకోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చని ఆ క్లాజ్‌లో పేర్కొన్నారు. దీనితో రాజ్యాంగబద్ధత విషయంలో కొంత స్పష్టత వచ్చినప్పటికి, నాటినుంచి నేటివరకు రిజర్వేషన్లకు సంబంధించిన అనేక విషయాల గురించిన వివాదాలు, ఉద్యమాలు, శాసనాలు, న్యాయస్థానాల తీర్పులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఈ సమస్య జటిలతను, ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి.

వెనుకబడిన వర్గాలంటే ఎవరు; కులాన్ని వెనుకబడిన వర్గాలను నిర్ణయించడానికి ఆధారంగా తీసుకోవచ్చా; వర్గీకరణకు ఆధారాలేంటి; ఉపవర్గీకరణను చేయవచ్చా; రిజర్వేషన్లు ఎంతశాతం ఉండవచ్చు; ఎంతకాలం ఉండాలి; కుల ప్రాతిపదికపైన ఉండాలా లేక పేదరికం ప్రాతిపదికపైన ఉండాలా; ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఉండవచ్చా; మత ప్రాతిపదికపైన రిజర్వేషన్లు ఉండవచ్చా; పోటీ ప్రపంచంలో రిజర్వేషన్ల ఆధారంగా మనగలగటం సాధ్యమా లాంటి ప్రశ్నలన్నింటినీ బాలగోపాల్ మన రాజ్యాంగ మౌలిక విలువల ఆధారంతో పరిశీలించి, వాటికి శాస్త్రీయమైన సమాధానాలు చెప్పాడు. రిజర్వేషన్లు అనేవి ప్రభుత్వం ఇచ్చే సదుపాయంగా కాకుండా, వెనుకబడిన వర్గాల ప్రజాస్వామిక హక్కుగా బాలగోపాల్ భావించాడు. 'ప్రతిభ', 'సమర్థత' వ్యక్తిగతమని భావించబడు తున్నప్పటికీ, దాని సామాజిక స్వభావాన్ని బాలగోపాల్ వివరించాడు. 'ప్రతిభ' వెనక ఉన్న వేల సంవత్సరాల మానవ చరిత్ర విజయాలను ప్రామాణికంగా వివరించాడు. మనిషికుండే విలువలను గురించి ప్రస్తావించకుండా ప్రతిభను గురించి, సామర్థ్యాన్ని గురించి మాట్లాడటంలో అర్థం లేదు. ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే విలువ

ఉన్న వాళ్ళ ప్రతిభ, సామర్థ్యం వల్లనే సమాజానికి మేలు కలుగుతుందనేది మనకందరికి అనుభవమైన విషయమే. బాలగోపాల్ జీవితమే దీనికి ఉదాహరణ.

కులవ్యవస్థ పోవాలంటూ కులం పేరుమీద రిజర్వేషన్లు ఎంతవరకు సమంజసం అనే అగ్రవర్ణాల వాదనను బాలగోపాల్ తిప్పికొట్టాడు. కులాధిక్యతను ఉపయోగించుకొని ఇంతవరకు ప్రయోజనాలు పొందినవారికి, కులవివక్షకు గురి అయినవారు కులం పేరుతో పొందే ప్రయోజనాలను ప్రశ్నించే నైతిక హక్కు లేదని చెప్పాడు. మండల్ కమిషన్ వ్యతిరేక ఆందోళనల్లో జడలు విప్పిన కులతత్వాన్ని ఎండగట్టాడు. ఆర్థిక ప్రాతిపదిక ఆచరణలో అగ్రవర్ణాలవారికే ప్రయోజనకరంగా ఉంటుందని బాలగోపాల్ వాదించాడు. రిజర్వేషన్ల వల్ల వెనుకబడిన వర్గాలలోని సంపన్నులకే ప్రయోజనాలు కలుగుతాయనే వాదన సమంజసం కాదంటాడు బాలగోపాల్. అభివృద్ధి క్రమంలో - ముఖ్యంగా పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో ఏ రంగంలోనయినా అప్పటికే అభివృద్ధి చెందిన వారే మొట్టమొదట ప్రయోజనాలను పొందుతారు. అదే విధంగా రిజర్వేషన్ల విషయంలో కూడా వెనుకబడ్డ వర్గాలలో కొంత అభివృద్ధి చెందినవారే ముందుగా లాభపడవచ్చు. ఆ విధంగా లాభపడ్డవారికి తమ వర్గాలకు చెందిన ఇతరులకు సహాయం చేయడానికి, వారి రాజకీయ వ్యక్తీకరణకు రిజర్వేషన్లు ఒక అవకాశంగా చూడాలనేది బాలగోపాల్ అభిప్రాయం. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ గురించి వివరమైన చర్చ ఈ రచనల్లో ఉంది. 'సంపద సామాజికం' అనే ప్రాతిపదికపైన బాలగోపాల్ ఈ చర్చ చేశాడు. సొంతపెట్టుబడి కూర్చుకున్న పద్ధతుల గురించి అవగాహన ఉంటేనే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల ఆవశ్యకతను అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా విద్యారంగం ప్రైవేటీకరణ చెందుతున్న ఈ దశలో, ఈ రంగంలో రిజర్వేషన్లు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సామాజిక న్యాయానికి విరుద్ధమైన అనేక ధోరణులు ప్రైవేటు రంగంలో చోటు చేసుకుంటున్నాయి. అన్ని రంగాలలో అందరికీ అవకాశాలుంటాయనే భావన ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థల ఉనికికి ఆధారంగా ఉండాలి. అది లేకపోవడం మొత్తం సమాజ ఉనికికే ప్రమాదం. అందుకే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను బాలగోపాల్ గట్టిగా సమర్థించాడు.

రిజర్వేషన్ల ఆచరణను గురించి కూడా బాలగోపాల్ వివరమైన చర్చ చేశాడు. ఈ విషయంలో నాకు కూడా కొంత ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. నా వృత్తిరీత్యా విద్యా, ఉద్యోగరంగాలలో రిజర్వేషన్ల అమలును కొంత దగ్గరగా పరిశీలించే అవకాశం కలిగింది. నా అనుభవం నుంచి, పరిశీలన నుంచి నేను గమనించిన కొన్ని సమస్యలను ప్రస్తావిస్తాను. మొదటగా ఉద్యోగాల విషయంలో చట్టంలో పేర్కొన్న శాతం రిజర్వేషన్లు ఆచరణలో నిజంగానే లేవు. ఉన్నత పదవుల్లో ఎస్.సి, ఎస్.టి ఉద్యోగుల శాతం చాలా తక్కువ. విశ్వవిద్యాలయాల్లో కూడా, ముఖ్యంగా పేరుగాంచిన కేంద్రీయ విశ్వవిద్యా

లయాల్లో ఎస్.సి, ఎస్.టి కేటగిరీలకు చెందిన అధ్యాపకుల శాతం ఉండాల్సిన దానికంటే చాలా తక్కువ ఉంది. అందుకే బాలగోపాల్ ఈ విశ్వవిద్యాలయాలను 'బ్రాహ్మణ అగ్రహారాలని' పరిహసించాడు. ఈ పరిస్థితులకు అనేక కారణాలు చెబుతారు. సరి అయిన అభ్యర్థులు దొరకటం లేదని చెబుతుంటారు. దాని అర్థం వెనుకబడిన వర్గాలకు విద్యావకాశాలు పూర్తిగా అందట్లేదనే కదా. రిజర్వేషన్లు ఇంకా ఎంతకాలం ఉండాలనే దానికి ఈ పరిస్థితి సమాధానం కాదా? రిజర్వేషన్ల ఉద్యోగాలు పూర్తిగా నింపక పోవడానికి ఇదొక్కటే కారణం కాదనే విషయాన్ని కూడా గుర్తించాలి. సాధారణంగా ఉద్యోగాలను భర్తీ చేసే బాధ్యతలలో అగ్రవర్ణాలకు చెందినవారే ఎక్కువగా ఉంటారు. వారికి వెనుకబడిన వర్గాలను రిక్రూట్ చేసుకోవాలనే సంకల్పం చాలా తక్కువ. మన దేశంలో చట్టాలు ఒక మేరకు ప్రగతిశీలమైనవే. దానికి కొంతవరకు ప్రజా ఉద్యమాలు కారణం. ప్రజలను భ్రమలలో ఉంచాలనే పాలకుల ప్రయత్నం కూడా ఈ ప్రగతిశీల చట్టాలకు కారణం. అయినా వాటి అమలులో పాలకుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇబ్బందులు సృష్టిస్తున్నారు. రిజర్వేషన్ల చట్టాల విషయంలో కూడా ఇదే జరుగుతున్నది. అందుకే రిజర్వేషన్ల అమలుకోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంది. పాలకుల దయతో కాకుండా, ఉద్యమాల వల్లనే తమకు రిజర్వేషను ప్రయోజనాలు కలిగాయనే విషయాన్ని ఆ ప్రయోజనాలు పొందుతున్నవారు గ్రహించాల్సిన అవసరం ఉంది.

రిజర్వేషన్ల ఆచరణలోని ఇంకొక ప్రధాన సమస్య - విద్యా సంస్థలలోని అనుకూల, వ్యతిరేక పరిస్థితులు. విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్ కేటగిరికి చెందిన విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రజాస్వామిక దృక్పథంతో ఆలోచించే సామాజిక శాస్త్రవేత్తలు, ఆ వర్గాల నుంచి వచ్చిన మేధావుల, విద్యార్థుల అనుభవాలతో కూడిన అనేక రచనలు వచ్చాయి. కొన్ని విద్యా సంస్థలలో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. ఇవి చాలా సందర్భాలలో ఆత్మహత్యలకు దారితీశాయి. అగ్రవర్ణాలకు చెందిన తోటి విద్యార్థుల అసహనం, అగ్రవర్ణాల అధ్యాపకుల ద్వేషభావం, ఉద్యోగ బృందం నిర్లక్ష్యం మొత్తంగా విద్యావ్యవస్థలోని స్థితిగతులు రిజర్వేషన్ కేటగిరికి చెందిన విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన దళిత, గిరిజన విద్యార్థులకు గౌరవప్రదంగా లేవు. తరగతి గదిలో పరిస్థితులు కూడా ఆ వర్గాలవారి అనుభవాలకు దూరంగా ఉంటాయి. మొత్తంగా విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య వాతావరణం, అందరినీ గౌరవించే సంప్రదాయం, భిన్నత్వాన్ని గౌరవించే పరిస్థితులు, విలువలతో కూడిన ప్రతిభను గుర్తించే పద్ధతులు ఉన్నప్పుడే రిజర్వేషన్ల ప్రయోజనాలను పూర్తిగా ఉపయోగించుకోవడం సాధ్యమవుతుంది. దీనికి సమష్టి కృషి అవసరం.

సమష్టి కృషికి సరైన అవగాహన అవసరం. బాలగోపాల్ వ్యాసాలు ఇందుకు తోడ్పడతాయి. దేశంలోని నిరుద్యోగ సమస్యకు రిజర్వేషన్లు కారణం కాదు. రిజర్వేషన్లు తీసేయడం దానికి పరిష్కారమూ కాదు. ఉన్న అవకాశాలను సమంగా పొందడానికి ఏర్పాటు చేసుకున్న ఒక మార్గం మాత్రమే రిజర్వేషన్లు. అది పూర్తిగా ఒక ప్రజాస్వామిక చర్య. అందుకే అందరు ప్రజాస్వామిక వాదులూ దానిని సమర్థించాలి. దానితోపాటు అందరికీ ఉద్యోగ అవకాశాలు, విద్యావకాశాలు కల్పించే రాజకీయ, ఆర్థిక వ్యవస్థ నిర్మాణం కోసం కృషి చేయాలి. ఈ రచనలు అందుకు దోహదపడతాయని భావిస్తున్నాం.

బాలగోపాల్ రచనలు, జీవితం భావితరాలకు ఆదర్శం అని భావించినందు వల్లనే, భావితరాలను తీర్చిదిద్దే బాధ్యత గల కాకతీయ విశ్వవిద్యాలయంలో (REC, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ లకు బాలగోపాల్ బౌద్ధిక పరిణామక్రమంలో ప్రధానమైన స్థానం ఉన్నందువల్ల) ప్రతి సంవత్సరం 'బాలగోపాల్ సంస్మరణ ఉపన్యాసం' ఏర్పాటు చేయడానికి పర్‌స్పెక్టివ్స్ చొరవ తీసుకుంది. దానికి విశ్వవిద్యాలయం అంగీకరించడం, గత నాలుగు సంవత్సరాలుగా ఉపన్యాసాలను ఏర్పాటు చేయడం జరిగింది. అందుకు సహకరిస్తున్న విశ్వవిద్యాలయం వారికి మా కృతజ్ఞతలు.

ప్రతి ఏటా బాలగోపాల్ రచనలని తీసుకురావటంలో ఎంతగానో శ్రమిస్తూ, సహకరిస్తున్న ఆత్మీయ హితవరులు వేమన వసంతలక్ష్మి, మన్నం బ్రహ్మయ్యలకు మరొక్కసారి మా కృతజ్ఞతలు చెబుతున్నాం.

**- వి.యస్.ప్రసాద్**
పర్‌స్పెక్టివ్స్

# గరీబ్ నవాజ్ బాలగోపాల్

**స్థూ**లంగా చేసే ఏ వర్గీకరణ అయినా తన లోపలి అసమానతలను దాచుకుంటుంది.

రిజర్వేషన్ల గురించి బాలగోపాల్ రాసిన ఈ వ్యాస సంపుటిలో ఇది చాలా బలమైన వాక్యం. ఇది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ లందరికీ సమానంగా వర్తించే విలువయిన ఒక సూత్రీకరణ కూడా. అయితే నాకు కేటాయించిన స్థల, కాలాలను బట్టి పరిశీలన ముస్లిం రిజర్వేషన్ల అంశానికే పరిమితం.

భారత ముస్లింలకు సంబంధించిన ఏ అంశాన్ని గురించి చర్చించాలన్నా దేశవిభజనకు పూర్వం ఉన్న పరిస్థితి గురించిన అవగాహన ఒక కనీస అవసరం. ముస్లిం రిజర్వేషన్ల వ్యవహారంలో అయితే ఇది మరింత తప్పనిసరి. విభజనకు పూర్వం భారతదేశ రాజకీయా లను ప్రభావితం చేసిన ముస్లిం ఎలీట్ వేరు. ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, సామాజికంగా వాళ్ల స్థాయి వేరు. కానీ, భారత రాజ్యాంగ నిర్మాతల దృష్టిలో భారత ముస్లింలు అంటే వాళ్ళే. వాళ్ళు భారతదేశం నుంచి అయితే వెళ్ళిపోయారు గానీ మన రాజ్యాంగ నిర్మాతల మనోఫలకం మీద మాత్రం అలాగే మిగిలి పోయారు. భారతదేశంలో మిగిలిపోయిన ముస్లింల ముఖచిత్రం మన రాజ్యాంగ నిర్మాతల ఊహలకు కూడా అందని అంశం.

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ ప్రభుత్వం వివిధ సామాజిక సముదాయాలను దేశ రాజకీయ ప్రక్రియలో భాగస్వాములను చేసింది. ఈ క్రమంలో ముస్లింలకు వివిధ చట్టసభలలో ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించింది. దీంతో రాజ్యాంగ నిర్మాణ పరిషత్ చర్చల్లో నిర్ణయాత్మకమయిన ఒక మార్పు వచ్చింది. రాజ్యాంగ నిర్మాణ పరిషత్ అనుబంధ సంస్థలలో ఒకటైన మైనారిటీలు, ప్రాథమిక హక్కుల సలహా సంఘం ముస్లిం రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించాలని అభిప్రాయపడింది. అయితే దేశ విభజన ముస్లింలకు రిజర్వేషన్లు కాదుగదా, అసలు ముస్లింలను గురించిన ఆలోచనలకే అడ్డుకట్ట వేసింది. వలస పాలనాకాలంలో పీడితవర్గాలు (depressed

classes)గా పరిగణింపబడిన మైనారిటీలు అనే పదం అనంతర కాలంలో తన అర్థాన్ని సయితం కోల్పోయింది. అప్పటివరకూ ఎస్‌సి, ఎస్‌టిలలో భాగంగా ఉన్న మైనారిటీలు కేవలం మతమైనారిటీలుగా మారిపోయారు. కేవలం ఒక్క హిందూ మతాన్ని విశ్వసిస్తున్న సామాజిక సముదాయాలు మాత్రమే రిజర్వేషన్లకు అర్హమైనవని మన రాజ్యాంగ నిర్మాతలు తీర్మానించారు. వెనుకబడిన కులాలు హిందూ మతంలో అంతర్భాగం అన్నారు. జనాభా లెక్కల సేకరణకు కులం స్థానంలో మతం ప్రాతిపదికగా మారి పోయింది.

రాజ్యాంగం పుట్టుకలోనే భారత ముస్లిం అనే నవజాత శిశువుకు సంధి కొట్టింది. ఈ చారిత్రక విషాదం పట్ల బాలగోపాల్‌కు పూర్తి సహానుభూతి ఉంది. అందుకే ఆయన ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముస్లింలు ముస్లింలుగా సంఘటితం కానంతవరకూ వాళ్ళ సమస్యలు పరిష్కారం కాజాలవని ఆయన బలంగా భావించారు. ఆ దిశగా ముస్లిం సముదాయాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నించారు. ముస్లిం సమస్యలను గురించిన సమగ్ర అవగాహన కలిగిన అతికొద్దిమంది మేధావులలో బాలగోపాల్ ఒకరు. ఈ సమగ్ర అవగాహనే బాలగోపాల్‌ను ముస్లిం పక్షపాతిగా మార్చింది. ముస్లింలను పట్టించుకునేలా చేసింది. ముస్లిం రిజర్వేషన్ల అంశం మీద ఇంతగా శ్రమించిన మేధావి మరొకరు లేరనటం అతిశయోక్తి కాదు, ఒక వాస్తవం. ముస్లిమేతరులలోనే కాదు, ముస్లింలలో సయితం ఇంతటి శ్రద్ధనీ, ఇంతటి ఆసక్తినీ కనబరిచిన ఆలోచనాపరుడు మరొకడు లేడు.

అసందర్భం అనిపించినా సరే ఒక వాస్తవం ఇక్కడ చెప్పటం చాలా అవసరం. ఈ వ్యాసాలపై నా అభిప్రాయం అడగటానికి ఒక కారణం 'పుట్టుమచ్చ' పద్యం అనుకుంటాను. అయితే ఆ కవిత పుట్టుక వెనుక బాలగోపాల్, వసంతలక్ష్మి - ఇద్దరి ప్రమేయమూ ఉంది. అసలు మతాన్ని స్వంతం చేసుకుని ఆ విధంగా అది రాయవచ్చునా లేదా అనే మీమాంసలో నేను కొట్టుమిట్టాడుతున్న కాలంలో అది రాయకపోవటమే అన్యాయం కాగలదని చెప్పిన తొలి ఇద్దరిలో ఒకరు కె.వి.రమణారెడ్డి కాగా రెండవ వ్యక్తి బాలగోపాల్. అలాగే ఆ కవితలో దూదేకుల ప్రస్తావనకు సంబంధించిన పూర్తి క్రెడిట్ వసంతలక్ష్మిది.

ఇది కేవలం రిజర్వేషన్లను గురించిన పుస్తకం మాత్రమే కాదు. నిజానికి ఇది మొత్తం భారత సమాజాన్ని పట్టిపీడిస్తున్న అగ్రకుల ఆధిపత్య వ్యవస్థమీద పీడిత సమూహాల తరపున నిజాయితీగా ఎక్కుపెట్టిన ఆలోచనల సంపుటం.

బాలగోపాల్ మాటల్లోనే చెప్పాలంటే రిజర్వేషన్లు ''మొత్తంగా కులవ్యవస్థ మూలాన్ని తాకే చర్య. అంతటి ప్రజాస్వామిక పరిణామాన్ని తట్టుకునే శక్తి మన రాజకీయ వ్యవస్థకు లేదు....కులవ్యవస్థ అన్నదాన్ని నాశనం చేయనిదే ఈ దేశంలో ప్రజాస్వామ్యం

అనేది సమగ్రం కాదు. సంపూర్ణం కాదు....రిజర్వేషన్లు సమాజంలో సమానత్వం సాధించటానికి ప్రజాస్వామ్యబద్ధమైన ఒక సాధనం....రిజర్వేషన్ల పరిరక్షణ ప్రజాస్వామిక ఉద్యమంలో భాగం. మనం ఒక ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించుకోవాలంటే అగ్రకుల ఆధిపత్య వ్యవస్థను కూలదోయాలి. అందుకు రిజర్వేషన్లు ఒకసాధనం.''

ఈ పుస్తకం మన న్యాయవ్యవస్థ పొట్టవిప్పి దాని నిజస్వరూపాన్ని బట్టబయలు చేసే ఒక బలమైన ప్రయత్నం.

రిజర్వేషన్ల పట్ల, సమానత్వం, సామాజిక న్యాయం అనే భావనల పట్ల మన న్యాయవ్యవస్థకి వీసమెత్తు గౌరవం ఉన్నట్లు కనపడదు. రిజర్వేషన్ల విషయంలో తీర్పు చెప్పటానికి అవసరమయిన సామాజిక శాస్త్ర పరిజ్ఞానం కానీ, సామర్థ్యంకానీ న్యాయ వ్యవస్థను శాసిస్తున్న మన న్యాయమూర్తులకు లేదనే వాస్తవాన్ని ఈ వ్యాసాలు మనకు మరోసారి గుర్తు చేస్తాయి. రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదు, ఒక సాధనం అని చాటి చెబుతాయి.

''రిజర్వేషన్లు 50 శాతం కంటె ఎక్కువ ఉండటానికి వీలులేదని శాసించే హక్కు సుప్రీంకోర్టుకు లేదు. ఆ అభిప్రాయం కింది కోర్టులకు శిరోధార్యం కాదు....కోర్టులు శాసనాలు చేయలేవు. శాసనాలను వ్యాఖ్యానించటం మాత్రమే కోర్టుల బాధ్యత'' అని ఈ వ్యాసాలు విశదీకరిస్తాయి. అంతేకాదు. ''రిజర్వేషన్లు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వం చేతినుండి తన చేతిలోకి తీసుకోవడానికి న్యాయవ్యవస్థ చాలాకాలంగా చేస్తూన్న ప్రయత్నం ఎంత అన్యాయమయిందో'' మనకు తేటతెల్లం చేస్తాయి. మన న్యాయ మూర్తులు తమ అగ్రకుల ఆధిపత్య స్వభావాన్నీ, తద్వారా మెజారిటీ మతస్వభావాన్నీ రాజ్యాంగానికి ఆపాదిస్తున్న వింత వైనాన్ని వివరిస్తాయి.

గరిష్ఠ పరిమాణం 50 శాతం అనటం వెనుకవున్న దుర్మార్గాన్ని వివరించటమే కాదు, సంఘటితంగా ప్రతిఘటించమని కూడా ఈ వ్యాసాలు మనలను ప్రబోధిస్తాయి. భవిష్యత్తులో ముస్లిం సమాజం గనక రిజర్వేషన్లను డిమాండు చేస్తే శూన్యహస్తాలు చూపించటానికి న్యాయస్థానాలు ముందుగానే సిద్ధం చేసుకున్న ఒక కుహకం అని బాలగోపాల్ మండల్ కమిషన్ మీద తీర్పు వెలువడడానికి ముందే పసిగట్టి పీడిత ప్రజానీకానికి హెచ్చరిక చేశారు.

బిసి కమిషన్ ముస్లింల మీద నివేదిక రూపొందిస్తున్నప్పుడు స్వయంగా ఆయన అనేక విలువైన సూచనలు ఇచ్చారు. తక్కువ ఉత్పాదకత గల సంప్రదాయక ఆర్థిక రంగంలో స్వయం ఉపాధి మీద బతికే ముస్లింలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించ వచ్చునని ఆయన సూచించారు. పోనీ, భూస్వామ్య వ్యవస్థ సృష్టించిన వృత్తులను

ఆశ్రయించిన ప్రజా సమూహాలను వెనుకబడిన కులాలుగా గుర్తిస్తున్నారు కాబట్టి ఆధునిక పారిశ్రామిక సమాజం సృష్టించిన వృత్తులను స్వీకరించిన వారిని ముస్లింలలో వెనుకబడిన కులాలుగా గుర్తించవచ్చు. అయితే బిసి కమిషన్ ఇటువంటి విలువైన సూచనలను సుతరామూ పట్టించుకోలేదు.

ఈ వ్యాసాల్లో మనకు సంక్షేమాన్ని కాంక్షించే విలువలు అంతరించిపోతున్నాయనే ఆవేదన కనిపిస్తుంది. సంక్షేమానికి సంబంధించిన ఒక్కొక్క హక్కునూ మనం మౌనంగా కోల్పోతున్నామనే వేదన వినిపిస్తుంది. మరీ ముఖ్యంగా ఈ వ్యాసాల నేపథ్యంలో వినిపించే బాలగోపాల్ రక్తనాళ సంస్పందన మనలను నిలువునా కదిలిస్తుంది.

నక్సల్బరీ ఉద్యమం ఈ లోకానికి అందించిన ఒక అపూర్వమైన వరం బాల గోపాల్.

ఈదురుగాలుల చలిలో చిక్కిన క్షతగాత్రుడికి అందిన తొలి నులివెచ్చని చేతిస్పర్శ వంటిది బాలగోపాల్ ఉనికి.

అంతరంగంలో ఆయన ఒక అవధూత. మానసికంగా ఆయన ఒక సూఫీ సెయింట్. గరీబ్ నవాజ్....దీనబంధు....దీనదయాళువు.

బాలగోపాల్‌తో పోల్చదగిన వ్యక్తి బాలగోపాల్ తప్ప మరొకరు లేరు. బాలగోపాల్ వ్యక్తిత్వం విలువను అక్షరాలలోకి అనువదించాలని ప్రయత్నించిన ప్రతిసారీ మహాత్మాగాంధి గురించి ఐన్‌స్టీన్ చెప్పిన మాటలు ఎవరో వచ్చి చెబుతున్నట్లు నా చెవుల్లో గింగురుమంటాయి.

> Generations to come, it may well be, will scarce believe that such a man as this one ever in flesh and blood walked upon this earth.

**- ఖాదర్ మొహియుద్దీన్**

*గరీబ్ నవాజ్ అంటే పేదల సంరక్షకుడు*

# బాలగోపాల్ అవగాహన - ఒకమాట

ఆంధ్రప్రదేశ్‌లో మా తరం రిజర్వేషన్ల గురించి ఎదుర్కొన్న మొట్టమొదటి సమస్య 1985-86 లలో ఎన్.టి.రామారావు ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 44 శాతానికి పెంచుతూ ఇస్తూ జీవో ఇచ్చిన తరువాత వచ్చిన అనుకూల, ప్రతికూల రిజర్వేషన్ల ఉద్యమం. అప్పుడు నేను ఒపిడిఆర్‌లో ఉన్నాను. బాలగోపాల్ ఎపిసిఎల్‌సిలో ఉన్నాడు. ఈ రెండు సంస్థల్లోని అగ్రకులస్తులకు ఈ అంశంపై స్టాండ్ తీసుకోవడం ఒక సంకటంగా మారింది. (అప్పటికి ఆ సంస్థల్లో ఎస్‌సి., బిసిలు అతికొద్దిమందే ఉండేవారు. ఆనాడు పౌర ప్రజాస్వామిక హక్కుల సంఘాలన్నీ అగ్రకుల సంఘాలే.) అయితే అది మా కులాల అభివృద్ధికి సంబంధించిన సమస్య కనుక నాలాంటి వారికి రిజర్వేషన్ అనుకూల స్టాండ్ తీసుకోవడం సులభమైంది. ఆ దశలో కూడా ఎపిసిఎల్‌సిలో ఒక్క బాలగోపాల్ మాత్రమే రిజర్వేషన్ల అనుకూల వైఖరి కొంత స్పష్టతతో తీసుకున్నట్లు నాకు గుర్తు. ఆనాడు ఫూలే - అంబేద్కర్ సిద్ధాంత విస్తృతి ఎక్కువ లేకపోయినా నాలాంటివారిమి దాన్ని అణచివేయబడ్డ కులాల అభివృద్ధి సమస్యగా చూశాం. కారంచేడు పోరాటం కూడా దాదాపు అప్పుడే వచ్చింది. మేమందరం కొత్త పోరాట రూపాలతో సతమతమౌతున్న రోజులవి.

ఆ రోజుల్లో పౌర హక్కులంటే రాజ్యం అణచివేతకు వ్యతిరేకంగా మాత్రమే పనిచేయాలనే అవగాహన ఉండేది. ఈ దశలో దళిత బహుజనుల రిజర్వేషన్ల హక్కు కోసం పోరాడడమనేది మార్క్సిస్టు లెవరికీ అంతుపట్టని అంశం. అయినా ఈ దశలోనే రిజర్వేషన్ల రక్షణ, వాటిని పెంచడం ఒక చట్టపరమైన హక్కుగానే గుర్తించాలని బాలగోపాల్ అభిప్రాయపడ్డాడు. చట్టపరమైన హక్కుగానే కాదు సామాజిక హక్కు, రాజకీయ హక్కుగా కూడా గుర్తించాలని కొంతమందిమి భావించేవారిమి. ఈలోగా మురళీధరరావు కమిషన్ నుండి పోరాటం మండల్ కమిషన్ దశకు ఎదిగింది. ఈ దశ నాటికి బాలగోపాల్ అవగాహన కూడా విస్తృతమైంది.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ రంగంలోనే కాదు ప్రైవేట్ రంగంలో కూడా తమ వాటాను పొందాలనే అవగాహనకు బాలగోపాల్ క్రమంగా వచ్చాడు. ఆ క్రమంలో ఎపిసిఎల్‌సిలోని మిగతా వారు కూడా ఆ అవగాహనకు వచ్చినా ఈ అంశంపై బాలగోపాలే ఎక్కువగా రాయడం, మాట్లాడడం చేశాడు. ఆయన ప్రధానంగా ఇదొక రాజ్యాంగ హక్కుగా చూడడానికి ఎక్కువగా మొగ్గుచూపేవాడు. ఈ వ్యాసాల్లో కూడా ఆ దృక్పథం కనబడుతోంది. ఆయన రిజర్వేషన్ల పోరాటాన్ని అంబేద్కరిజపు తత్వభూమికకు ఎక్కడా ముడెయ్యలేదు. కాని దాన్ని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల హక్కుగా మాత్రం ప్రచారం చేశాడు. కరపత్రాలు రాశాడు, మీటింగులు పెట్టాడు.

రిజర్వేషన్లు సమాజాన్నంతా సమూలంగా మార్చవుగాని, మార్పుకు కావలసిన మెట్లను మాత్రం కడతాయి. గర్భస్థ మేధావులను అవి సృష్టిస్తాయి. రిజర్వేషన్లను ఒక రాజ్యాంగ హక్కుగా గుర్తించడానికీ, వాటి గురించి నిరంతరంగా రాయడానికీ, మాట్లాడడానికీ ఈ దేశంలో కులవ్యవస్థ మీద ఒక కచ్చితమైన అంచనా ఉండాలి. ఆ అంచనా బాలగోపాల్‌కు ఉండింది. ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి కులవ్యవస్థపై బాలగోపాల్ తీసుకున్నటువంటి స్టాండ్ తీసుకున్నది భారతదేశంలో అతి తక్కువ మంది.

1985-86లో, మళ్ళీ 1990లలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లపై స్టాండ్ తీసుకోవడం ఎంత కష్టమో, సచార్ కమిటీ రిపోర్టు వచ్చాక ముస్లింల రిజర్వేషన్లపై స్టాండ్ తీసుకోవడం కూడా అంతే కష్టమైన సమస్య అయింది. గతంలో ముస్లిం మేధావి వర్గం రిజర్వేష్లను వ్యతిరేకించింది. కాని సచార్ కమిటీ రిపోర్టు వచ్చాక ఆ మేధావి వర్గం క్రమంగా తన స్టాండ్‌ను మార్చుకుంది. అంతకంటే ముఖ్యంగా రంగనాధ్ మిశ్రా కమిషన్ ముస్లింలకు స్పష్టంగా రిజర్వేషన్లను రెకమెండ్ చేశాక, ఆ మతంలో కూడా కుల సమస్య ఉందని గుర్తించక తప్పని స్థితి ముందుకొచ్చింది. బాలగోపాల్ ముస్లిం రిజర్వేషన్లపైన రాసిన వ్యాసంలో వారికి వాటితో ఒనగూడే ప్రయోజనాల గురించి చర్చించాడు. ఐతే ఈనాటికీ ఈ ముస్లిం రిజర్వేషన్ల సమస్య కేంద్ర స్థాయిలోగాని, రాష్ట్రాల స్థాయిలో గాని ఒక కొలిక్కి రాలేదు.

ఈ పుస్తకంలోని బాలగోపాల్ వ్యాసాలు, ఉపన్యాసాలు ముందు తరాలకు బాగా ఉపయోగపడతాయి. సమకాలీన దశలో ఇవి రిజర్వేషన్ల పోరాటాలు చేసే వారికీ ఉపయోగపడతాయి. ముఖ్యంగా ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సమస్య ఇంకా పరిష్కారం కాకుండానే ఉంది. ఆ సమస్యపై కూడా ఈ పుస్తకంలో చర్చ ఉంది. ప్రయివేటు రంగం రిజర్వేషన్లపై ఈనాటికీ ఒక పెద్ద ఉద్యమం చేయాల్సిన అవసర

ముంది. ఈ ఉద్యమానికి పెట్టుబడిదారులు, అగ్రకుల మేధావులు తీవ్రమైన వ్యతిరేకులుగా ఉన్నారు. బాలగోపాల్ అభిప్రాయాలు అగ్రకుల మేధావుల్లో కొంతమంది నైనా మార్చడానికి ఉపయోగపడతాయి. ఆయన నాలుగవ వర్ధంతి సందర్భంగా వస్తున్న ఈ పుస్తకం రిజర్వేషన్ల ఉద్యమాలకి అన్ని విధాలా ఉపయోగపడుతుందని నమ్ముతూ....

**- కంచ ఐలయ్య**

# రిజర్వేషన్లు - (అ)న్యాయ వ్యవస్థ

**బా**లగోపాల్‌గారు న్యాయవాది కాక ముందునుంచే చట్టాల్ని, కోర్టు తీర్పులను, మొత్తంగా న్యాయవ్యవస్థ పని చేస్తున్న తీరును విమర్శనాత్మంగా వ్యాఖ్యానించేవారు. ఆయన తన హక్కుల ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రజల ప్రయోజనాల దృష్ట్యా రాజ్యాంగాన్ని, వివిధ చట్టాలను, ఉన్నత న్యాయస్థానాల తీర్పులను అధ్యయనం చేయడం, విశ్లేషించడం అవసరమని గుర్తించారు. బూర్జువా రాజ్యాంగం, చట్టాలు పాలకవర్గం చేతిలో దోపిడీ సాధనాలని కొట్టిపారేయకుండా ప్రజల దృష్టికోణం నుంచి చట్టాలను విపులంగా చర్చించేవారు. రాజ్యాంగం, చట్టాలు ప్రజల ఉద్యమాల నుంచి పుట్టిన విలువల్ని, ఆకాంక్షలను కొంతమేరకు వ్యక్తీకరిస్తాయని వాదించారు. అంతేకాదు, రాజ్యాంగ విలువల్ని కాపాడడానికి, ప్రజాస్వామిక విలువల్ని విస్తృతపరచడానికి న్యాయవ్యవస్థపై ఒక క్రమపద్ధతిలో విమర్శనాత్మక చర్చ అవసరమని, హక్కుల ఉద్యమ కర్తవ్యాలలో అదొక ముఖ్యమైన అంశమని భావించారు.

ఈ పుస్తకంలో రిజర్వేషన్ల విధానంపై హైకోర్టు, సుప్రీంకోర్టు లాంటి ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన ఎన్నో తీర్పుల్ని బాలగోపాల్‌గారు విశ్లేషించారు. న్యాయవ్యవస్థ అప్రజాస్వామిక వైఖరిని, తప్పుడు ధోరణుల్ని, రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యానాల్ని ఎండగట్టారు. న్యాయవ్యవస్థ కుల, వర్గ స్వభావాన్ని వివరించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో నుంచి, ప్రజల ప్రజాతంత్ర ఆకాంక్షల నుంచి పుట్టిన చారిత్రక పత్రంగా రాజ్యాంగాన్ని అభివర్ణిస్తూ, అలాంటి రాజ్యాంగంలోని విలువల్ని న్యాయవ్యవస్థ తుంగలో తొక్కిందని అభిప్రాయపడ్డారు.

న్యాయవ్యవస్థ, ముఖ్యంగా సుప్రీంకోర్టు మొదటినుంచీ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరి అవలంబించిందని బాలగోపాల్ సోదాహరణంగా వివరించారు. 15(1) లోనే అణగారిన వర్గాలకు తగిన సదుపాయాల్ని, రిజర్వేషన్లను కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానికుందని, కోర్టులు ఈ ఆర్టికల్‌కి వక్రభాష్యం చెప్పాయని అనేక సందర్భాల్లో

చెప్పారు. ఆయన మాటల్లో 'అసమానులను సమానంగా పరిగణించడం వల్ల సమాజంలో అసమానత పటిష్టమవుతుంది తప్ప సమసిపోదు. బలవంతులను, బలహీనులను ఒకేగాటన కట్టడంవల్ల బలవంతుల ఆధిపత్యం ఇంకా పెరుగుతుంది.' ఇది ఒక సాధారణ మనిషికి కూడా అర్థమయ్యేదే కానీ సుప్రీంకోర్టుకి ఈ అవగాహన ఏర్పడటానికి 25 ఏళ్ళు పట్టిందని బాలగోపాల్‌గారు వ్యంగ్యంగా అంటారు.

న్యాయవ్యవస్థలో, ముఖ్యంగా న్యాయమూర్తుల్లో బలపడిన కొన్ని దురభిప్రాయాలు, వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, వారి పరిమితులు కూడా చట్టాల వ్యాఖ్యానంలో కనబడతాయని బాలగోపాల్ నిర్మొహమాటంగా రాశారు. దళితుల, ఆదివాసుల, స్త్రీల హక్కుల విషయంలో వాటి వ్యతిరేకులు చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయని తప్పుడు వాదనలు చేస్తారు. ఆ వాదనల్ని కోర్టులు అంగీకరించి, తీర్పునిస్తాయి. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం, మహిళలకు సంబంధించి గృహహింస, వరకట్న నిషేధం లాంటి చట్టాల విషయంలో ఈ 'దుర్వినియోగం' వాదన మనం తరచూ వింటుంటాం. తీర్పులిచ్చే న్యాయమూర్తులకు చాలా విస్తృతమైన విచక్షణాధికారం వుంటుంది. ఆ అధికారం చాటున వారి వ్యక్తిగత అభిప్రాయాలు, తప్పుడు వ్యాఖ్యానాలు తీర్పులోకి వచ్చేస్తాయని ఆయన వివరించారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో 'విజ్ఞతలేదు, తర్కమూ లేదు' అని బాలగోపాల్ అన్నారు. ఆర్టికల్ 341(2) ప్రకారం రాష్ట్రపతి ప్రకటించిన షెడ్యూల్డు కులాల జాబితాలో పార్లమెంటు ఒక చట్టం చేయడం ద్వారా ఒక కులాన్ని చేర్చవచ్చు లేదా తీసేయవచ్చు. కొత్తగా కులాలను షెడ్యూల్డు కులాల జాబితాలో 'చేర్చటం, తొలగించడం' అన్న స్పష్టమైన మాటలకు సుప్రీంకోర్టు విపరీత అర్థం ఇచ్చి 'రాష్ట్రపతి ఈ జాబితాలో ఏ రకంగా జోక్యం చేసుకున్నా, దానిని కదిలించినా, దానిలో ఉపవర్గాలను గుర్తించినా అది కూడా ఆర్టికల్ 341(2) ప్రకారం చట్టవిరుద్ధమని వర్గీకరణ చట్టాన్ని కొట్టివేసిందని' బాలగోపాల్ వివరించారు. రాజ్యాంగాన్ని తిరగరాయడం తప్ప మరేమీ కాదని బాలగోపాల్ సుప్రీంకోర్టుని ఈ విషయంలో తప్పుపట్టారు.

న్యాయస్థానాలు మితిమీరి అధికారాలు చలాయిస్తున్నాయని అంటూ రిజర్వేషన్‌లు కల్పించిన ప్రతిసారీ సరైన సమాచారం, పరిశోధన లేవు కాబట్టి రిజర్వేషన్ల అమలును ఆపేయాలనడం, క్రీమీలేయర్‌కే రిజర్వేషన్లు దక్కుతున్నాయనడం సరికాదని బాలగోపాల్ అంటారు. 'ఏ సమాచారం ఆధారంగా ప్రతి ఒబిసి కులంలోనూ ఒక ఉన్నత వర్గమే రిజర్వేషన్లు తీసుకుంటున్నదన్న నిర్ణయానికొచ్చి వారిని తొలగించాలని పట్టుబడుతున్నార'ని ఆయన ప్రశ్నించారు.

మన దేశంలో చట్టం అంటే రాజ్యాంగం, వివిధ చట్టాలు, ఉన్నత న్యాయస్థానాల తీర్పులు (ముఖ్యంగా సుప్రీంకోర్టు) కాబట్టి కోర్టు తీర్పులు ప్రజలభాషలో సరళంగా ఉండాలని బాలగోపాల్ అభిప్రాయం. రాజ్యాంగంలో, చట్టాలలో వుండే అస్పష్టత, అసంపూర్ణత, వైరుధ్యాలను వివరించే విధంగా కోర్టు వ్యాఖ్యానాలు వుండాలి తప్ప రాజ్యాంగాన్నే తిరగరాసే విధంగా వుండరాదని బాలగోపాల్ అంటారు. ప్రజా వ్యతిరేక వైఖరితోపాటు న్యాయమూర్తులు ఇంగ్లీషు భాషరాక నాలుగు న్యాయసిద్ధాంత పడికట్టు పదాలతో తీర్పులు రాస్తారు. అవి అస్పష్టంగా, అర్థరహితంగా ఉంటాయి. ఈ తీర్పుల్లో తార్కికత కనిపించకపోవడం మరో లోపం. ముఖ్యంగా న్యాయమూర్తులకి విశాల దృక్పథం లోపించడం వల్ల రాజ్యాంగాన్ని, చట్టాల్ని చాలా పరిమిత అర్థంలో, సంకుచితంగా వ్యాఖ్యానించడం జరుగుతున్నదని బాలగోపాల్ విశ్లేషించారు.

న్యాయవ్యవస్థపైన బాలగోపాల్ విశ్లేషణ, రాజ్యాంగంపై ఆయన వ్యాఖ్యానం Critical Legal Studies అభివృద్ధి చెందడానికి, ప్రజాస్వామిక హక్కుల సాధనలో చట్టాన్ని సాధనంగా చేసుకోవడానికి ఉపయోగపడతాయి. సమాజం - చట్టం సంబంధాలపై Mark Galantar (మార్క్ గాలంటర్) అకడమిక్ రంగంలో చేసిన కృషిని బాలగోపాల్ ఒక హక్కుల కార్యకర్తగా చాలా విస్తృతపరిచారు.

*- **కె. సత్యనారాయణ,** అధ్యాపకులు*
*ఇఎఫ్ఎల్ యూనివర్సిటీ, హైద్రాబాద్.*

# వైకల్యంపై చక్కని విశ్లేషణ

'వికలాంగుల' రిజర్వేషన్లలో వర్గీకరణ అవసరాన్ని తెలుసుకోలేని రాజకీయ నాయకులే కాదు, ఐ.ఎ.ఎస్ అధికారులు సైతం 90 శాతం మంది నేడు పరిపాలనలో భాగం పంచుకుంటున్నారనే విషయాన్ని స్పష్టంగా తెలియజేశారు కె.బాలగోపాల్ తన వ్యాసంలో. 'ఎవరు చూడొచ్చారులే!' అనే ధీమా పాలకుల్లోనూ, అధికారుల్లోనూ ఉండడాన్ని ఆయన నిక్కచ్చిగా దుయ్యబట్టారు.

వివిధరకాల వైకల్యాలు కలిగిన వారినందరినీ ఒకే గాటన కట్టి, 3 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనుకోవడం వల్ల జరిగే అన్యాయం పట్ల అధికారులకు ఏ మాత్రం అవగాహన లేకపోవడం నిజంగా ఒక వింత. జీవోల అమలులో చిత్తశుద్ధి లేదన్నది విస్పష్టం. అసలు వికలాంగులు చేయగల పనులేవి, చేయలేని పనులేవి అనేది సకలాంగులు వాస్తవికంగా నిర్ణయించలేరనేది అక్షర సత్యం. బాలగోపాల్ నిజం చెప్పారు. సంక్షేమ చట్టాలు, సామాజిక న్యాయ విధానాలు అని పిలువబడే హక్కులను తెలిసీ అమలుచేయని అధికారులకు ఏ శిక్షా లేకపోవడం ఒక పెద్ద అనర్థానికి మూలం. దీనికి విరుగుడు కనిపెట్టే వరకూ వికలాంగులకు న్యాయం జరగదు.

అసలు తమ హక్కులేమిటో, ప్రభుత్వాలు తమకు ఇస్తున్న సంక్షేమ పథకాలేమిటో, జీవోలలో ఏం ఉంటున్నదో వికలాంగులకు తెలిసే అవకాశాన్ని వీలైంతవరకూ తొక్కి పట్టడానికే అధికారులు ప్రయత్నిస్తుంటారు. ఒకవేళ వికలాంగుల పట్ల తమ విధి నిర్వహణను చేయదలచుకుంటే దానికి 'ఔదార్యం' అనే పేరు పెడతారు. బాలగోపాల్ ఈ వ్యవహారాన్నంతా తేటతెల్లం చేశారు.

***- కొల్లి నాగేశ్వరరావు***

*వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు*

*'వికలాంగుల పిలుపు' పత్రిక సంపాదకులు*

# రి జ ర్వే ష న్లు

## ప్రజాస్వామిక దృక్పథం



కె. బాలగోపాల్

ఏ హక్కునయినా వ్యతిరేకించ దలచుకుంటే దానిని నేరుగా వ్యతిరేకించడం ఒక పద్ధతయితే దాని 'దుర్వినియోగాన్ని' గుర్తించి చర్చ పెట్టడం రెండవ పద్ధతి. మొదటిది నైతికంగా సాధ్యం కానప్పుడు రెండవ మార్గం ఎంచుకుంటుంటారు. దళితుల, ఆదివాసుల, స్త్రీల హక్కుల విషయం లో వాటి వ్యతిరేకులు ఈ పనే తరచుగా చేస్తుంటారు.

– కె. బాలగోపాల్

# రిజర్వేషన్లు దళితుల ప్రజాస్వామిక హక్కు

మూడు సంవత్సరాల క్రితం ఆంధ్రరాష్ట్రంలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన నడిచింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మురళీధర రావు కమిషన్ సూచనలను అనుసరించి వెనుకబడ్డ కులాలకు విద్యా, ఉద్యోగరంగాలలో రిజర్వేషన్‌ను 25 శాతం నుండి 44 శాతానికి పెంచడానికి నిర్ణయించినప్పుడు దానిని వ్యతిరేకిస్తూ అగ్రకులాలకు చెందిన కొందరు విద్యార్థులు, విద్యావంతులు ఆందోళన నడిపారు. రిజర్వేషన్లు కల్పించడం వల్ల ప్రతిభావంతుల స్థానంలో అసమర్థులు, ప్రతిభలేని వాళ్లు పైకొచ్చి దేశం నాశనం అయిపోతుందని వాదించారు. అగ్రకులాలలోని పేదవాళ్ళకు ఉద్యోగాలు దొరకకుండా పోతాయని అన్నారు. తమ ఆందోళనలో భాగంగా తాము ఎన్నడూ చేయని 'నీచ' వృత్తులను నిరసనగా చేపట్టారు. బూట్లు తుడిచారు. రోడ్లు ఊడ్చారు. మూటలు మోసారు. తమ ప్రచారంలోనూ, ఆందోళనలోనూ అగ్రకుల అహంకారం ధ్వనించకుండా చూడాలన్న మొహమాటం సైతం లేకుండా ప్రవర్తించారు. మామూలుగా ఏ ప్రజా ఆందోళననూ సహించని ప్రభుత్వం ఆ ఉద్యమం పట్ల మటుకు చాలా సహనంతో వ్యవహరించడం అందరికీ కొట్టొచ్చినట్టు కనబడింది. మామూలుగా ఎవరు ఏ పోరాటం చేపట్టినా అందులో తప్పు లెంచడానికి ముందుకొచ్చే పత్రికలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనను మటుకు చాలా సాదరంగా ఆహ్వానించాయి. బాహాటంగా సమర్థించాయి. వాళ్ళు ఎంచుకున్న ఆందోళనా రూపాల సృజనాత్మకతనూ, కళాత్మకతనూ కొనియాడాయి. వాళ్లు చేసిన హింస తమ

కళ్ళకు కనబడనట్టు నటించాయి. ఆందోళనకారులు హైకోర్టులో రిట్ పిటీషన్ వేసి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ సమ్మతం కాదని కొట్టేయించారు. ఒక రిటైర్డు గుమాస్తా పెన్షన్ కోసం కోర్టులో కేసు వేస్తే సుప్రీంకోర్టు దాకా లాగకుండా ఊరుకోని రాష్ట్ర ప్రభుత్వం ఇంత ముఖ్యమైన విషయంలో హైకోర్టు తీర్పును వినమ్రంగా శిరసావహించి ఊరుకుంది. ఆ వినయాన్ని పత్రికలన్నీ కొనియాడాయి.

ఇవ్వాళ ఈ సంఘటనలన్నీ ఒక్కొక్కటి పునరావృతమవుతున్నవి. అయితే మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కావడం వల్ల ఈ సారి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన దేశమంతటా జరుగుతోంది. దాని మీద కేసు సుప్రీంకోర్టులో ఉంది. నవంబర్ నెలలో కేసు వినబోతున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ కేసుకు చాలా ప్రాముఖ్యం ఉండగలదు. 1951లో మొట్టమొదటిసారి చంపకం దొరైరాజన్ కేసులో రిజర్వేషన్లు భారత రాజ్యాంగంలోని 15(1), 29(2) అధికరణాలకు విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించినప్పటి నుండి ఈ విషయం వీధులలోనే కాక కోర్టులలోనూ నలుగుతోంది. ఒక జడ్జీ చెప్పిన అభిప్రాయాలు ఇంకొక జడ్జీ చెప్పకుండా తీర్పులు ఇస్తూ ఉన్నారు. అసలు ఈ విషయంలో సరైన తీర్పు చెప్పడానికి అవసరమైన సామాజికశాస్త్ర పరిజ్ఞానం కానీ, సామర్థ్యంకానీ జడ్జీలకు లేవని జస్టిస్ ఎ.పి.సేన్ మొహమాటం వదిలిపెట్టి అన్నారు. అయినప్పటికీ తీర్పులు ఇస్తూనే ఉన్నారు. చంపకం దొరైరాజన్ కేసు ఫలితంగా పార్లమెంటు మొట్టమొదటి రాజ్యాంగ సవరణను చేపట్టి అధికరణం 15(4)ను రాజ్యాంగానికి చేర్చి 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు' రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగబద్ధం చేసింది. ఆ తరువాత కూడా కోర్టులు రిజర్వేషన్లను సూత్రప్రాయంగా ఆమోదిస్తూ అదే సమయంలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని, వెనుకబడినతనానికి కులం ప్రమాణం కాజాలదనీ ఆంక్షలు పెడుతూ వచ్చాయి. జస్టిస్ డి.ఎ.దేశాయి మాటల్లోనే చెప్పాలంటే కోర్టుల వైఖరిని 'ఊగిసలాటగా' (Dithering & Vacillation) వర్ణించవచ్చు. ఎటొచ్చీ ఈ విమర్శకు జస్టిస్ దేశాయి కూడా మినహాయింపు కాదు. ఇప్పుడు మొత్తంగానే దేశంలో నెలకొన్న అప్రజాస్వామిక వాతావరణంలో సుప్రీంకోర్టు ఒక 'అంతిమ తీర్పు' ఇచ్చే ప్రయత్నం చేయవచ్చు. ఆ తీర్పు దళితులకు అన్యాయం చేయకుండా చూడడం ప్రజాస్వామిక వాదుల కర్తవ్యం.

గతంలో ఆంధ్రలో మనకున్న అనుభవాన్ని బట్టి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు కోర్టు విచారణా సమయం సమీపించే కొద్దీ ఆందోళనను ఉధృతం చేసి కోర్టు మీద చాలా ఒత్తిడి పెడతారని ఊహించవచ్చును. మురళీధరరావు కమిషన్ మీద వేసిన కేసులో వాదోపవాదాలు రాష్ట్ర హైకోర్టులో సాగుతున్నన్ని రోజులు ఆ కేసు వేసిన ఆందోళనకారులు రాష్ట్రమంతటా రాస్తారోకోలు, బంద్‌లు, బస్సుల విధ్వంసం

కొనసాగిస్తూనే వచ్చారు. పత్రికలు ఈ ఆందోళనను రిపోర్టు చేస్తూ ఇక కోర్టే రాష్ట్రాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తూ వచ్చాయి. 'జడ్జీలూ మనుషులే' కాబట్టి ఈ ఒత్తిడి ప్రభావం వాళ్లమీద ఉండక తప్పదు. రిజర్వేషన్లను దళితుల ప్రజాస్వామిక హక్కుగా భావించేవారు ఈ ఒత్తిడిని ఎదుర్కొని భారత రాజ్యాంగానికి పునాదియైన విలువలను నిలబెట్టడంలో భారత ప్రభుత్వానికి గల గురుతర బాధ్యతను గుర్తుచేయాలి. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించేలా చేయడంలో కోర్టుకుగల బాధ్యతను కూడా గుర్తుచేయాలి. ఈ వాదోప వాదాలు కోర్టులలో సాగితే చాలవు. బజార్లలోనూ సాగాలి. సామాజిక సంఘర్షణ శాసనాల రూపమో, జీవోల రూపమో తీసుకున్నప్పుడు ఇటువైపో, అటువైపో రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని కోర్టుకు పోకతప్పదు. సంఘర్షణ రాజ్యాంగ వ్యాఖ్యానాల రూపం తీసుకోక తప్పదు. రాజ్యాంగం తనలో ఇముడ్చుకున్న ఆదర్శాలనూ, అణచివేతనూ, అభ్యుదయ విలువలనూ, అపరిమితమైన అధికారాన్నీ తిరిగి వ్యాఖ్యానించుకుని ఆ విరుద్ధ అంశాల వెనక దాగివున్న సామాజిక సంఘర్షణల కొనసాగింపుగా ప్రస్తుత సంఘర్షణను విశ్లేషించక తప్పదు. అప్పుడు ఆ సంఘర్షణ కోర్టు నాలుగు గోడల మధ్యనే కాక వీధిలోనూ జరగాల్సివుంటుంది. ఆ విషయం రిజర్వేషన్ వ్యతిరేకులు స్పష్టంగా గుర్తించారు. ప్రజాస్వామికవాదులే వెనకబడి వున్నారు.

మండల్ కమిషన్ సిఫారసులను వ్యతిరేకించేవాళ్లు చేస్తున్న వాదనలను భారత రాజ్యాంగం ప్రకటించుకున్న విలువల నేపథ్యంలో పరిశీలిద్దాం. ఉద్యోగాలూ, విద్యాసంస్థలలో సీట్లు మనుషుల సామర్థ్యాన్నీ, ప్రతిభనూ బట్టి ఇవ్వాలని లేకపోతే దేశ భవిష్యత్తు దెబ్బ తింటుందని, ఒకవేళ కొందరికి ప్రత్యేకమైన సదుపాయాలేమైనా కల్పించదలుచుకుంటే అది ఆర్థిక ప్రాతిపదిక మీదనే తప్ప కుల, మత, తదితర సామాజిక అంశాల ప్రాతిపదిక మీద ఉండరాదనీ, ఆ సదుపాయాలు సైతం స్కాలర్‌షిప్పులు, ట్యూషన్‌లు, ఉచిత హాస్టలు వసతి మొదలైన రూపాలలో ఉండాలేగానీ రిజర్వేషన్లు ఇవ్వకూడదనీ మండల్ కమిషన్ వ్యతిరేకులు ప్రధానంగా వాదిస్తున్నారు.

సామర్థ్యం, ప్రతిభ మొదలైన మాటల అర్థం ఏమిటని ప్రస్తుతానికి వెతికే ప్రయత్నం చేయకుండా, రిజర్వేషన్ వ్యతిరేకులు చెబుతున్నదే ఆ మాటల అర్థమని కొద్దిసేపు అనుకుందాం. అట్లా అనుకున్నా ప్రభుత్వ విధానాలకు ఉండవలసిన భూమిక గురించి, సమాజంలోని అసమానతలను అంతం చేయవలసిన కర్తవ్యాన్ని గురించి భారత రాజ్యాంగం ఇచ్చే ఆదేశాలకూ, ఈ వాదనకూ ఏ మాత్రం పొంతనలేదని మొట్టమొదట గుర్తించాలి. ఇవ్వాళ మనం స్వతంత్ర భారతదేశంగా పరిగణిస్తూ ఉన్నది అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడింది. అందులో రాజ్యాధికారం కోసం జరిగిన రాజకీయ పోరాటమే కాక కార్మికులు, రైతులు ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, కులవ్యవస్థకూ, స్త్రీల కుటుంబ బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగిన సామాజిక పోరాటాలు

కూడా ఉన్నాయి. స్వాతంత్ర్యం అంటే తెల్లవాడిని పారద్రోలి నల్లదొరలు గద్దెనెక్కి కూచోవడం అని ప్రజలు ఆనాడు అనుకోలేదు. కుల రహిత సమాజం, స్త్రీ - పురుష సమానత్వం, దున్నేవానికే భూమినిచ్చే భూసంస్కరణలు, కార్మికులకు గౌరవప్రదమైన జీవితం, ఇవీ - ఇంకా అనేక ఆదర్శాలు ఆ పోరాటంలో భాగం అయ్యాయి. ఇవన్నీ సాధించినదే నిజమైన స్వాతంత్ర్యమని ఆనాడు ప్రజలు భావించారు. జాతీయోద్యమ నాయకులంతా ప్రకటించారు. వివేకానందుని నుండి గాంధీదాకా, గాంధీ నుండి కమ్యూనిస్టులదాకా, కమ్యూనిస్టుల నుండి అంబేద్కర్‌దాకా అందరి రచనల నుండీ, ఉపన్యాసాల నుండీ ఈ అభిప్రాయాలను ఉటంకించవచ్చును. స్వతంత్ర భారతం ప్రజలలో కొందరినే ప్రతిభావంతులుగా గుర్తించి వాళ్ళ చేతిలో పదవులు, ఉద్యోగాలు, సాంకేతిక సాధనాలు పెట్టి వాళ్ళ పురోగమనాన్నే దేశప్రగతిగా భావిస్తుందని ఆనాటి జాతీయోద్యమంలో ఏ ఒక్కరూ అనుకోలేదు. అన్ని రకాల అసమానతలకూ నిలయమైన ఈ దేశంలో అసమానతలను పారద్రోలి సమానత్వాన్ని సాధించనిదే ఆ స్వాతంత్ర్యం నిజమైన స్వాతంత్ర్యం కాదని భావించారు. ఇవ్వాళ ఆ విలువలను తిరస్కరించే వాళ్ళు భారత జాతీయోద్యమానికి నిజమైన వారసులు కానే కారు.

ప్రస్తుత సంఘర్షణ భారత ప్రజల సుదీర్ఘమైన పోరాటాల చరిత్ర మనకు అందించిన విలువల వారసత్వాన్ని గురించిన సంఘర్షణ. చరిత్రలో పుట్టి, రాజ్యాంగంలో నిక్షిప్తమైన ఆ విలువలే భారత రాజ్యాంగానికి జీవనాడి వంటివని సుప్రీంకోర్టు పలుమార్లు అని వుంది.

## 1. భారత రాజ్యాంగం - కోర్టులు - రిజర్వేషన్లు

సామాజిక సమానత్వాన్ని గురించి చర్చించేటప్పుడు భారత రాజ్యాంగంలోని అధికరణాలు 38, 46 చాలా ముఖ్యమైనవి.

**38 (1)** : సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం జాతి జీవనంలోని అన్ని వ్యవస్థల లక్షణం అయినటువంటి సమాజాన్ని ప్రయత్నపూర్వకంగా నిర్మించి, సంరక్షించి తద్వారా ప్రజల క్షేమాన్ని పెంపొందించడం ప్రభుత్వం కర్తవ్యం.

**(2)** : ప్రత్యేకించి, స్థితిగతులలోనూ, సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ సమాజం లోని వ్యక్తుల మధ్యనే కాక, వివిధ వృత్తులననుసరించే లేక వివిధ ప్రాంతాలలో నివసించే వర్గాల మధ్య ఉన్న అంతరాలను తొలగించడం ప్రభుత్వం కర్తవ్యం. (ఇందులో రెండవ క్లాజు 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చబడింది.)

**46** : సమాజంలోని బలహీనుల యొక్క, ప్రత్యేకించి, షెడ్యూల్డు కులాల, తెగల యొక్క విద్యా అవసరాలను, ఆర్థిక అవసరాలను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సాధించాలి. వాళ్ళను సామాజిక అన్యాయాల నుండి అన్ని రకాల దోపిడీ నుండి కాపాడాలి.

ఈ రెండు అధికరణాలు ఆదేశిక సూత్రాల జాబితాలో ఉన్నాయి. ఆదేశిక సూత్రాలు దేశ పరిపాలనలో మౌలికమైన పాత్ర నిర్వహిస్తాయనీ, చట్టాలు చేసేటప్పుడు ప్రభుత్వం ఈ సూత్రాలను అనుసరించి చేయాలనీ అధికరణం 37 అంటుంది. రాజ్యాంగం ముందుమాటలో చెప్పుకున్న ఆదర్శాలను సాధించడానికి అనుసరించాల్సిన బాటను ఆదేశిక సూత్రాలు నిర్దేశిస్తాయని సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసు నుండి చెప్తూ వస్తూవుంది. రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీంకోర్టు బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ (1963) కేసులో చెప్పిందని చాలామంది ఉటంకిస్తూ ఉన్నారు కానీ, అదే తీర్పులో రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు అధికరణం 46లోని ఆదేశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిన సంగతి ఎవ్వరూ ఉటంకించరు!

సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించాలనీ, స్థితిగతులలోనూ, సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ ఉన్న అంతరాలను తొలగించాలనీ, షెడ్యూల్డు కులాలు, తెగలతో సహా బలహీన వర్గాల విద్యా, ఆర్థిక అవసరాలను తీర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలనీ రాజ్యాంగం ఇంత స్పష్టం చేసిన తరువాత కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లను ఏమని వ్యతిరేకిస్తారు? ఈ వ్యత్యాసాలు, అంతరాలు ఏర్పడడానికి ఆర్థిక అసమానతలు ఒక కారణమైతే, కులవ్యవస్థ మరొక కారణం కాదా? ఆర్థిక వివక్ష ఒక్కటే దేశంలో పోగొట్టవలసిన వివక్ష అని రాజ్యాంగకర్తలు భావించలేదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అనే కీలకమైన ఆదర్శం రాజ్యాంగం ముందుమాటలోనూ, అధికరణం 38లోనూ కూడా ఉంది. మన చరిత్రలో కేవలం ఆర్థిక అసమానతలు, దోపిడీయే కాక సామాజిక వివక్ష, రాజకీయ వివక్ష కూడా ఉన్నాయన్న గుర్తింపు ఇక్కడ ఉంది. ఈ అన్యాయానికి ప్రధానమైన ప్రాతిపదిక కులవ్యవస్థ అనే విషయం అందరికీ తెలుసును. కానీ గుర్తించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ముఖ్యంగా కోర్టులు సిద్ధంగా లేవు. రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికి పదమూడుసార్లు సుప్రీంకోర్టును కదిలించడం జరిగింది. ఇందులో పన్నెండు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వేసిన కేసుల మీద అప్పీళ్ళు కాగా చివరిది వసంత్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక అనే కేసులో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జీల సలహా కోసం చేసిన అభ్యర్థన (1985). ఈ చివరి అభ్యర్థనలో జస్టిస్ చిన్నపరెడ్డిగారు వెలిబుచ్చిన వివరమైన అభిప్రాయాన్ని మినహాయిస్తే వేరే ఏ ఒక్క కేసులో ఏ ఒక్క న్యాయమూర్తి కూడా మన దేశంలో సామాజిక వెనుకబాటు తనానికి కులవ్యవస్థ ప్రధానమైన కారణం అని ఊగిసలాట లేకుండా ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపించదు.

కులవ్యవస్థ శూద్ర, పంచమ కులాలను సామాజికంగా నీచంగా చూసింది. రాజకీయంగా హక్కులు లేకుండా చేసింది. వాళ్ళు చదువుకోడానికి వీలులేదు. ఆస్తి కలిగి ఉండడానికి వీలులేదు. ఆయుధాలు ధరించడానికి వీలు లేదు. ఉన్నత హోదాగల ఉద్యోగాలు చేయడానికి వీలులేదు. చివరికి గుళ్ళలోకి పోవడానికి కూడా వీలు లేదు. ఈ అన్యాయం అన్ని కాలాలలో ఒకే రకంగా లేకపోయినా హైందవ సామాజిక వ్యవస్థలో ఎప్పుడూ ఉండనే ఉంది. ధర్మశాస్త్రాలూ, పవిత్ర గ్రంథాలూ దీనిని సిద్ధాంతీకరించాయి. ఈ కులవ్యవస్థను నాశనం చేయడం అనేది భారత రాజ్యాంగం ప్రభుత్వానికి ఆదేశించిన కర్తవ్యాలలో ముఖ్యమైనది. ఈ ఆదేశం వెనుక కులవ్యవస్థకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన పోరాటాల చరిత్ర ఉంది. ఏ రాజకీయాధికారం నుంచి శూద్రులను వెలివేసారో ఆ అధికారం కోసం... ఏ ఉద్యోగాలనుండి, హోదానుండి, విద్యనుండి వెలివేసారో వాటికోసం... ఏ దేవుడి సమక్షం నుండి వెలివేసారో ఆ సాన్నిధ్యం కోసం అనేక పోరాటాలు జరిగాయి. వాటి ఫలితంగానూ, చారిత్రక మార్పుల ఫలితంగానూ కులవ్యవస్థ కొంత సడలి శూద్రులకు కొన్ని హక్కులు వచ్చాయి. కొన్ని శూద్ర కులాలకు అగ్రకుల స్థాయి లభించింది. అయితే ఎప్పుడూ మరికొందరు సామాజిక బహిష్కృతులు ఉండనే ఉన్నారు. ఏ ప్రాతిపదిక మీద వారు బహిష్కృతులయ్యారో అదే ప్రాతిపదిక మీద వాళ్ళకు తిరిగి గౌరవప్రదమైన జీవితంలోనికి ప్రవేశం కల్పించడం భారత ప్రజాస్వామ్యం చారిత్రక కర్తవ్యం. ఈ ఆరాటం అధికరణ 38లోనూ, 46లోనూ ఉన్న ఆదేశిక సూత్రాల వెనుక ఉంది. మండల్ కమిషన్ సిఫారసు వెనుక కూడా ఉంది. చరిత్రను మర్చిపోయి ఆర్థిక వివక్ష ఒక్కటే రాజ్యాంగం గుర్తించిన వివక్ష అనడంలో అర్థం లేదు.

ఈ ఆదేశిక సూత్రాలే కాక భారత రాజ్యాంగం కులవివక్షకు వ్యతిరేకంగా ప్రాథమిక హక్కులు కూడా కల్పించింది. విద్యా, ఉద్యోగ రంగాలలో తరతరాలుగా ప్రబలంగా ఉండిన కులవ్యవస్థ ఇక చెల్లదంటూ అధికరణాలు 15(1), 16(1), 29(2)లలో పేర్కొనింది. విచిత్రం ఏమిటంటే కులవివక్షను నిషేధించే ఈ ప్రాథమిక హక్కులు ఇవ్వాళ అగ్రకులాల చేతిలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఒక వాదనగా ఉపయోగపడు తున్నాయి. చట్టం అందరికీ సమానంగా వర్తించాలనీ, అందరికీ సమానమైన సంరక్షణ కల్పించాలనీ చెప్పే అధికరణం 14ను భూస్వాములు భూసంస్కరణలకు వ్యతిరేకంగా వాడుకోలేదా? సమాజంలో బలహీనులకు సహాయపడడానికి ఉద్దేశించిన శాసనాలను వాళ్ళకు వ్యతిరేకంగానే బలవంతులు వాడుకోవడం చరిత్రలో తరచు జరుగుతూనే ఉంటుంది. దేశంలో కులవ్యవస్థ లేకపోతే, అగ్రకులాలు చదువును, రాజ్యాధికారాన్నీ, గౌరవప్రదమైన ఉద్యోగాలను నూటికి 27% కాదు, 50% కాదు, నూటికి 100% తమకే రిజర్వు చేసుకోకపోతే భారత రాజ్యాంగంలో 15(1), 16(1), 29(2) అసలు ఉండేవే

కావు. ఆ సంప్రదాయక రిజర్వేషన్లను సమీప భవిష్యత్తులో నైనా తొలగించాలంటే చదువు నుండి, ఉద్యోగాల నుండి బహిష్కృతులైన వారికి ఆయా రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని శాసనం చేస్తే ఆ శాసనం 15(1), 16(1), 29(2)కు వ్యతిరేకం అని అగ్రకులాలే కోర్టుకు ఎక్కుతున్నారు.

భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు అధికరణం 15లో మూడు క్లాజులే ఉండేవి. అవి

**15 (1)** : పౌరులపట్ల ప్రభుత్వం జాతి, మత, లింగ, కుల, ప్రాంతాల ప్రాతిపదిక మీద వివక్ష పాటించడానికి వీలులేదు.

**(2)** : జాతి, మత, లింగ, కుల, ప్రాంతాల ప్రాతిపదిక మీద పౌరులెవ్వరికీ కూడా -

**(అ)** : దుకాణాలు, హోటళ్ళు, ప్రదర్శన స్థలాల్లోకి ప్రవేశంకానీ;

**(ఆ)** : బావుల, చెరువుల, స్నానస్థలాల, ప్రజావసరాల నిమిత్తం నిర్మించిన బహిరంగ ప్రదేశాల, మొత్తంగానో పాక్షికంగానో ప్రభుత్వం ఖర్చుతో నిర్మించిన బహిరంగ ప్రదేశాల ఉపయోగంగానీ; నిరాకరించడానికి వీలులేదు.

**(3)** : అయితే, స్త్రీలకోసం, పిల్లలకోసం ప్రభుత్వం కల్పించే ప్రత్యేక సదుపాయాలకు ఈ అధికరణం అడ్డురాదు.

అన్నిరకాల వివక్షను పేరుపేరునా పేర్కొని ఈ అధికరణం నిషేధించింది కానీ ఇది ప్రధానంగా కులవ్యవస్థను గురించి మాట్లాడుతోందని 15(2)ను చూస్తేనే అర్థమవుతుంది. అయినా సుప్రీంకోర్టుకు మట్టుకు ఎంత గింజుకున్నా అర్థం కాలేదు. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పులలో భారత సామాజిక వ్యవస్థ యొక్క చరిత్రను గుర్తించ నిరాకరించిందని జస్టిస్ ఇ.ఎస్.వెంకట్రామయ్య వెలిబుచ్చిన అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు.

అధికరణం 16లోని అయిదు క్లాజులలో మూడు మాత్రమే ప్రస్తుత వివాదానికి అవసరం.

**16 (1)** : ఏ ప్రభుత్వ ఉద్యోగం విషయంలోనైనా, పదవి విషయంలోనైనా పౌరులందరికీ సమాన అవకాశాలు ఉండాలి.

**(2)** : పౌరులెవ్వరినీ కూడా జాతి, కుల, మత, లింగ, వంశ, ప్రాంతాల ప్రాతిపదిక మీద ప్రభుత్వ ఉద్యోగాలకు కానీ, పదవులకు కానీ అనర్హులుగా భావించ కూడదు. వివక్ష పాటించకూడదు.

(4) : అయితే ప్రభుత్వ ఉద్యోగాలలోనూ, పదవులలోనూ తగు ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తే దానికి ఈ అధికరణం అడ్డం రాదు.

ఈ అధికరణం కూడా అన్నిరకాల వివక్షనూ పేరుపేరునా పేర్కొన్నా ఉద్యోగాలకు, పదవులకు మనుషులలో కొందరిని అనర్హులుగా భావించింది కులం ప్రాతిపదిక మీద కాబట్టి, ఇది కూడా కులవ్యవస్థ గురించే ప్రధానంగా మాట్లాడుతుంది. 16(4)లో వెనుకబడిన వర్గాలు అని పేర్కొన్నవి కులాలు కాజాలవని ఎవరెంత వాదించినా అవి ప్రధానంగా కులాలేనని మన చరిత్రే చెప్తుంది.

అధికరణం 29లోని రెండవ క్లాజు మాత్రమే ప్రస్తుత వివాదానికి అవసరం.

29 (1) : ప్రభుత్వం నిర్వహించే లేక ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే ఏ విద్యాసంస్థలోనైనా ఒక వ్యక్తికి మతం, జాతి, కులం లేక భాష కారణంగా ప్రవేశం నిరాకరించడానికి వీలులేదు.

శతాబ్దాలుగా కులవివక్షకు గురైన శ్రామిక ప్రజానీకానికి విద్య, ఉద్యోగ రంగాలలో ప్రవేశహక్కు కల్పించడం కోసం ఉద్దేశింపబడ్డ ఈ ప్రాథమిక హక్కులను వాళ్ళ కంటే ఎక్కువగా, వాళ్ళకే వ్యతిరేకంగా వాడుకున్నది అగ్రకులాలే. పూర్తిగా బ్రాహ్మణ ఆధిక్యత చలామణి అయిన మద్రాసు రాష్ట్రంలో బ్రాహ్మణేతరులకు విద్యారంగంలో ప్రవేశం కల్పించడం కోసం రిజర్వేషన్లు కల్పిస్తే అది 15(1)కి, 29(2)కు వ్యతిరేకం అంటూ శ్రీమతి చంపకం దొరైరాజన్ స్వాతంత్ర్యం వచ్చిన కొద్దికాలానికే కోర్టుకెక్కింది. సుప్రీంకోర్టు ఆమె వాదనను అంగీకరించి రిజర్వేషన్‌ను కొట్టేసింది. అప్పుడు భారత పార్లమెంటు 1951లో మొట్టమొదటి రాజ్యాంగ సవరణను తీసుకొచ్చి 15(4)ను భారత రాజ్యాంగానికి చేర్చింది.

15 (4) : షెడ్యూల్డు కులాలు, తెగలు లేక సామాజికంగాను, విద్యాపరంగాను వెనుకబడ్డ వర్గాల పురోగమనం కోసం ప్రభుత్వం ఏమైనా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తే అది ఈ అధికరణానికి విరుద్ధం కాదు.

కులవివక్ష పాటించడానికి వీలులేదని అధికరణం 15(1)లో ఇచ్చిన ప్రాథమిక హక్కు వాస్తవం కావాలంటే ఇన్నాళ్ళూ కులవివక్షకు గురి అవుతూ ఉన్నవారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం అవసరమని కొంచెం ఆలోచిస్తే అర్థమవుతుంది. అంటే 15(4)ను కొత్తగా రాజ్యాంగానికి చేర్చనవసరం లేదనీ, అది 15(1)లో అంతర్లీనంగా ఉండనే ఉందని అనిపిస్తుంది. కాని సుప్రీంకోర్టు ఈ అవగాహనకు ఎదగడానికి పాతికేళ్లు పట్టింది. స్టేట్ ఆఫ్ కేరళ వర్సెస్ ఎన్.ఎమ్.థామస్ (1976) కేసులో జస్టిస్ రే, మాథ్యూ,

ముర్తజా ఫజల్ అలీ, బేగ్, కృష్ణయ్యర్‌లు ఈ అభిప్రాయానికి వచ్చారు. అంతవరకు 15(4) కానీ, 16(4)కానీ ప్రభుత్వానికి రిజర్వేషన్లు కల్పించే అవకాశాన్ని మాత్రమే కల్పిస్తాయనీ, కులవివక్ష పోవాలంటే రిజర్వేషన్లు కల్పించి తీరాలని రాజ్యాంగం చెప్పలేదనీ సుప్రీంకోర్టు భావిస్తూ వచ్చింది.

మొదటి రాజ్యాంగ సవరణ జరిగినప్పటి నుండి రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు రెండు సందేహాలతో కొట్టుమిట్టాడుతోంది. సామాజికంగానూ, విద్యాపరంగానూ వెనకబడ్డ వర్గాలు ఏవని గుర్తించడానికి కులం ఏకైక లేక ప్రధాన ప్రాతిపదిక కాగలదా అనేది ఒక సందేహం. మొత్తం రిజర్వేషన్లకు ఒక గరిష్ట పరిమితి ఉండనక్కరలేదా అనేది రెండో సందేహం. ఈ రెండు సందేహాలకు బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ (1963) కేసులో జస్టిస్ గజేంద్ర గడ్కర్ సమాధానం చెప్పారు. వెనుకబాటుతనాన్ని గుర్తించడానికి కులం కూడా ఒక ప్రమాణం కాగలదు కానీ అదే ఏకైక లేదా ప్రధాన ప్రమాణం కాజాలదని ఆయన అన్నారు. ఆ తరువాత వచ్చినటువంటి చిత్రలేఖ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ (1964) కేసులో జస్టిస్ కోకా సుబ్బారావు మరొకడుగు వెనుకకు వేసి అసలు కులాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే వెనుకబాటుతనాన్ని నిర్ణయించినా అందులో తప్పేమీలేదని తీర్పు చెప్పారు. 15(4)లో వెనుకబడిన వర్గాలు అన్నమాట ప్రయోగించారనీ, కులాన్నే ఉద్దేశించి ఉంటే కులం అనివుండేవారనీ ఆయన అన్నారు. విజ్ఞులైన సుబ్బారావుగారు మొదటి రాజ్యాంగ సవరణ సందర్భంలో 'వెనుకబడ్డ వర్గాలు అనేవి కొన్ని కులాల సముదాయం తప్ప మరేమీ కాదు' అని డా॥ అంబేద్కర్ వెలిబుచ్చిన అభిప్రాయాన్ని పట్టించుకున్నట్టు లేదు.

రిజర్వేషన్లకు గరిష్ట పరిమాణం ఉండనక్కరలేదా అనే ప్రశ్నకు కూడా బాలాజీ కేసులో జస్టిస్ గజేంద్ర గడ్కర్ సమాధానం ఇచ్చినట్లు చెప్తారు. మొత్తం రిజర్వేషన్లు 50% మించి ఉండరాదని ఆయన అన్నాడని ఆనాటి నుండి ఈనాటి దాకా కోర్టులోనూ, కోర్టు బయటా వాదిస్తున్నారు. కానీ నిజానికి ఆయన అంత స్పష్టమైన సమాధానం ఏమీ చెప్పలేదు. తాను చాలా సంశయంతో చెప్తున్నానని అంటూ 'సాధారణ పరిస్థితుల లోనూ, స్థూలంగానూ చెప్పాలంటే ప్రత్యేక సదుపాయాలు 50% మించి ఉండరాదు' అని మాత్రమే ఆయన అన్నారు.

సుప్రీంకోర్టు ఏమన్నా, రాజకీయ నిర్ణయాలు సామాజిక పరిస్థితులకు స్పందించక తప్పదు కాబట్టి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానంగా కులం ప్రాతిపదిక మీదనే రిజర్వేషన్లు కల్పిస్తూ వచ్చాయి. ఏ కులాలు వెనుకబడినవి అని నిర్ణయించడానికి విద్యారంగంలో వెనుకబాటుతనాన్ని, సామాజిక ఆచారాలలో వెనుకబాటుతనాన్ని ప్రధాన ప్రమాణాలుగా తీసుకున్నాయి. సుప్రీంకోర్టు ప్రవచనాలకూ ఈ రాజకీయ ఆచరణకూ మధ్యనున్న

వైరుధ్యాన్ని వాడుకుని అగ్రకులాల వాళ్ళు ఎప్పటికప్పుడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రిట్ పిటీషన్లు వేస్తూ వచ్చారు. 1970 తర్వాతే సుప్రీంకోర్టు తన అవగాహనను కొద్దిగా మార్చుకుంది. వెనుకబాటుతనాన్ని నిర్ణయించడానికి కులమే ఏకైక లేక ప్రధాన ప్రమాణం కాజాలదన్న అభిప్రాయాన్ని ఇప్పటికీ వదులుకోలేదు కానీ వేరే ప్రమాణాల్ని ఉపయోగించి నప్పటికీ కొన్ని కులాలు మొత్తంగా వెనుకబడినవని నిర్ధారిస్తే అప్పుడు కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు కల్పించడంలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు *రాజేంద్రన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాసు* (1968), *స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వర్సెస్ బలరామ్* (1972) కేసులలో అనింది. పెరియకరుప్పన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు (1971) కేసులో మరింత స్పష్టంగా కులం కూడా ఒక వర్గమేనంటూ 'మన దేశంలో సామాజికంగానూ, విద్యాపరం గానూ వెనుకబడిన కులాలు అనేకం ఉన్నాయనేది కాదనలేని వాస్తవం. వాటి ఉనికిని కాదనడం వాస్తవాలను కాదనడం అవుతుంది' అనింది. సామాజిక వెనుకబాటుతనానికి పేదరికం ప్రమాణం కాజాలదంటూ *జానకీప్రసాద్ పరిమూ వర్సెస్ స్టేట్ ఆఫ్ జమ్మూ కాశ్మీర్* కేసులో సుప్రీంకోర్టు ఈ విధంగా వ్యాఖ్యానించింది - 'పేదరికాన్నే ఏకైక ప్రమాణంగా తీసుకొనేట్టయితే భారత జనాభాలో అత్యధిక శాతాన్ని సామాజికంగానూ, విద్యాపరంగాను వెనుకబడినవారుగా గుర్తించవలసి ఉంటుంది. అప్పుడు ఆర్థిక ప్రాతిపదిక మీద కల్పించే రిజర్వేషన్లు సామాజికంగానూ, విద్యాపరంగానూ అభివృద్ధి చెందినవారిగా అందరూ భావించేవారికి కూడా వర్తిస్తాయి. ఇది అసంబద్ధమైన పరిస్థితి'.

రిజర్వేషన్లకు 50% గరిష్ట పరిమితి ఉండాలన్న సూచనను కూడా తరువాత కాలంలో సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. *స్టేట్ ఆఫ్ కేరళ వర్సెస్ ఎన్.ఎమ్. థామస్* కేసులో జస్టిసు రే, బేగ్, ముర్తజా ఫజల్ అలీ, కృష్ణయ్యర్‌లు అటువంటి పరిమితి చెల్లదన్నారు. 'ఒక రాష్ట్రంలో వెనుకబడ్డ తరగతుల జనాభా 80 శాతం వుంటే వాళ్ళకు ఉద్యోగాలలో 80 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంటే అది తప్పవుతుందా' అని జస్టిస్ ఫజల్ అలీ ప్రశ్నించారు. *వసంత్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక* కేసులో తన అభిప్రాయాన్ని చెపుతూ జస్టిస్ చిన్నపరెడ్డి రిజర్వేషన్లకు గరిష్ట పరిమితిని నిర్ణయించే అధికారం కోర్టుకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రిజర్వేషన్లు 40 శాతం, 50 శాతం, 60 శాతం దాటడానికి వీలులేదని నిర్దేశించడానికి కోర్టుకు ఆధారాలేమీ లేవని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడంలో సామర్థ్యం ఉంటే చాలదని, మనం వ్యాఖ్యానిస్తున్న రాజ్యాంగం 20వ శతాబ్దపు మధ్య భాగంలో ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో నుంచి పుట్టిందనీ, ఇంతకంటే ఉన్నతమైన ప్రపంచం కోసం అన్వేషించిన విప్లవాల చేత ప్రభావితమైందనీ, అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలన్న ఆదర్శానికి అది కట్టుబడి ఉందనీ జ్ఞాపకం ఉంచుకోవాలని ఆయన అన్నారు.

## II. ప్రతిభ

ఇకపోతే, రిజర్వేషన్ల వల్ల ప్రతిభ పోతుందన్న వాదనకు వద్దాం. మనది ప్రజాస్వామ్యం అని గర్వించే వాళ్ళు అన్ని విషయాల గురించీ ప్రజాస్వామికంగా ఆలోచించడం నేర్చుకోవాలి. ప్రతిభ గురించి, సామర్థ్యం గురించి కూడా ప్రజాస్వామికంగా ఆలోచించడం నేర్చుకోవాలి. రిజర్వేషన్ల మీద కాలేజీ సీట్లు, ఉద్యోగాలు సంపాదించుకునే వాళ్ళకు ప్రతిభ ఉండదనీ, ప్రతిభగల అగ్రకులాల యువకులకు తత్ఫలితంగా సీట్లు, ఉద్యోగాలు రాకుండా పోయి దేశం నష్టపోతుందనీ వాదిస్తున్నారు. ఈ వాదన ఎక్కడిదాకా పోతూ ఉందంటే అగ్రకులాలకు మాత్రమే ప్రతిభ ఉంటుందని, ఇతరులు చేతకాని వాళ్ళని స్పష్టంగా ధ్వనించడం మొదలైంది. రిజర్వేషన్లు ఎయిడ్స్ అంత ప్రమాదకరమైన వ్యాధి అని, వెనుకబడిన కులాల్లో పుట్టి రిజర్వేషన్లమీద వైద్యులైన వాళ్ళు కాలు తీయమంటే కన్ను తీసేస్తారని, ఇంజనీర్లు వంతెనలు కడితే కూలిపోతాయనీ పోస్టర్లు, ప్లేకార్డులు ప్రదర్శిస్తున్నారు. పత్రికలలో కార్టూన్లు వేస్తున్నారు. మండల్ కమిషన్ సిఫారసుల అమలు జాతి వినాశనానికి నాంది పలుకుతుందని అరుణ్‌శౌరి వంటి మేధావులు అసహ్యకరమైన ప్రచారం చేస్తున్నారు. అగ్రవర్ణాల కుల అహంకారం పట్టం కట్టుకుని నిరాఘాటంగా దేశ రహదారుల మీద ఊరేగుతోంది.

తిట్టుకు తిట్టుతో సమాధానం చెప్పడం తేలికే. 43 ఏళ్ళుగా ఈ దేశాన్ని పరిపాలిస్తున్న వాళ్ళలో అత్యధికులు అగ్రవర్ణాలకు చెందినవాళ్లే. రాజకీయ నాయకులే కాదు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, భూస్వాములు, వైజ్ఞానికులు, బ్యూరోక్రాట్లు, సాంకేతిక నిపుణులు, యావత్ భారత భాగ్య విధాతలు 99 శాతం వాళ్ళే. 43 ఏళ్ళలో వాళ్ళు దేశాన్ని ఎక్కడిదాకా తెచ్చారో చూస్తూనే ఉన్నాం. 50 కోట్ల నిరక్షరాస్యులు, 40 కోట్ల దరిద్రులు, 2 కోట్ల నమోదయిన నిరుద్యోగులు, వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో మాంద్యం, రాజకీయ సామాజిక సంక్షోభం - ఇక్కడిదాకా తెచ్చింది వీళ్ళ 'ప్రతిభ' దేశాన్ని. ఈ ప్రతిభ ఇంకింత రాణించకపోతే మించిపోయిందేమిటో అర్థం కాదు. తప్పుడు వైద్యం చేసే వైద్యుల జాబితా, కూలిపోయిన వంతెనలు కట్టే ఇంజనీర్ల జాబితా తయారు చేస్తే అందులో అంతా అగ్రకులాల వారే ఉంటారనడానికి ఎటువంటి సందేహం అక్కరలేదు.

అయితే ఈ విషయాన్ని కొంచెం లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రతిభను గురించి మాట్లాడుతున్న వాళ్లు ఆ మాటకు ఇస్తున్న నిర్వచనం ఏమిటి? దానిని కొలవడానికి ఉపయోగిస్తున్న ప్రమాణం ఏమిటి? విద్యారంగంలో రాణించడమే ప్రతిభ అని, పరీక్షలలో వచ్చే మార్కులే దానికి కొలమానం అని వీళ్ళ అభిప్రాయం. ఇదే నిజమైనా ఇంటా, బయటా సమానమైన అవకాశాలు కల్పిస్తే దళితులు కూడా వీళ్ళతో సమానంగా రాణించగలరు. ఆ విషయాన్ని పక్కకు పెట్టి ప్రతిభకు వీళ్ళిస్తున్న నిర్వచనాన్ని కొంచెం పరిశీలిద్దాం.

పరీక్షలలో మార్కులు వచ్చే వాళ్ళందరికీ విషయ పరిజ్ఞానం ఉంటుందా? విషయ పరిజ్ఞానం ఉన్నవాళ్ళందరికీ పనిలో సామర్థ్యం ఉంటుందా? ఫస్టు మార్కులు వచ్చిన వైద్యులు, ఇంజనీర్లు తమ వృత్తులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారా? అవునని అనుకోవడమేకాని దీని గురించి ఎవరైనా విషయ సేకరణ చేసారా? సామర్థ్యం ఉన్నా అది సమాజానికి ఉపయోగపడి తీరుతుందా? చాలా సామర్థ్యం ఉన్న వైద్యుడు కంప్యూటరైజ్డ్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లోనో, ఏర్‌కండిషన్డ్ ఫైవ్‌స్టార్ ఆసుపత్రిలోనో పనిచేయవచ్చును. చాలా సామర్థ్యంగల ఇంజనీర్ ధనికుల కోసం అత్యంత ఆధునికమైన బంగళాలు డిజైన్ చేయడంలో తన సామర్థ్యాన్నంతా వినియోగించవచ్చు. చాలా సామర్థ్యంగల వైజ్ఞానికుడు ప్రపంచాన్ని నాశనం చేసే అణ్వాయుధాల తయారీలో తన సామర్థ్యాన్నంతా వినియోగించవచ్చును. అంతేకాదు. వీళ్ళు తమ సామర్థ్యాన్నంతా నీతి బాహ్యమైన పనులలో వెచ్చించవచ్చును. స్మగ్లర్‌లు, లంచగొండ్లు, దొంగ వ్యాపారస్తులు కావచ్చును. ఇవేవీ కాకపోయినా తమ సామర్థ్యాన్ని ఈ దేశ ప్రజల మేలు కోసం వినియోగించాలన్న పట్టింపు లేకుండా డిగ్రీ సంపాదించుకోగానే విదేశాలకు పోవచ్చును. విద్యారంగంలో అత్యధికంగా రాణించే వాళ్లు ఈ పనే చేస్తున్నారు. వీళ్ళ విద్య మీద ఈ దేశ ప్రజలు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఆ ఖర్చు లేకపోతే వీళ్ళ ప్రతిభ అసలు రాణించేది కాదు. కానీ వీళ్ళు ప్రజలకు అందుకు మారుగా ఏమీ ఇవ్వకపోగా ప్రజలకు అందుబాటులో లేని వృత్తులలోనికో విదేశాలకో పోతున్నారు.

మనిషికి ఉండే విలువలను ప్రస్తావించకుండా ప్రతిభను గురించి, సామర్థ్యాన్ని గురించి మాట్లాడడంలో అర్థం లేదు. ప్రజల క్షేమాన్ని గురించి పట్టింపు, పనిలో నిమగ్నత ఉండే వాళ్ళ సామర్థ్యం వల్లనే ప్రజలకు మేలు జరుగుతుంది. అదే సామాజికంగా ఉపయోగకరమైన సామర్థ్యం. ఇవ్వాళ బంగారు పతకాలు పొందుతున్న విద్యార్థులలో ఈ రకమైన విలువలున్నాయా?

మరొక ప్రశ్నకూడా వేసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతిభ ఉన్నవాళ్ళకే ఇవ్వాలంటున్నారు. ప్రతిభకు ఇస్తున్న నిర్వచనాన్ని పక్కకు పెట్టి, ఇది ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలకేనా లేక అన్నిటికి వర్తిస్తుందా? కొడుకుకు ప్రతిభ ఉంటేనే తండ్రి ఆస్తికి వారసుడు అవుతున్నాడా? ప్రతిభ ఉన్నా లేకపోయినా తండ్రి ఆస్తి కొడుకుకే రిజర్వు అయిపోలేదా? భూమిగల వాళ్ళందరికీ వ్యవసాయం చేయడంలో ప్రతిభ ఉందా? సేద్యం చేయడంలో ప్రతిభ ఉన్నవాళ్ళకే భూమి అంతా పంచేస్తామంటే ఒప్పుకుంటారా? చెప్పులు కుట్టేవాళ్ళకే చెప్పుల ఫ్యాక్టరీలు చెందాలనీ, బట్టలు నేసే వాళ్ళకే బట్టల ఫ్యాక్టరీలు చెందాలనీ, మూటలు మోసేవాళ్ళకే గోడౌన్లు చెందాలని చట్టం చేస్తే ఒప్పుకుంటారా? ఆస్తిలో కానీ, ప్రైవేటు సెక్టర్ ఉద్యోగాలలోకానీ, ప్రైవేటు కళాశాలల సీట్లలోకానీ వారసత్వానికి, బంధుత్వాలకు, రికమెండేషన్లకు, 'మావాడు' అనే సామాజిక

సంబంధానికి ఉన్న ప్రాధాన్యం ప్రతిభకు లేదు. దీనివల్ల నూటికి 90 శాతం ప్రయోజనం పొందుతున్నది అగ్రకులాల వాళ్లే. వాళ్ళ యాజమాన్యంలో లేని ప్రభుత్వ ఉద్యోగాలలో తమకు ప్రవేశం కావాలని దళితులు కోరుకుంటే ఇంత దుమారం లేపుతున్నారు. సమాజంలోని అన్ని వనరులనూ ఆక్రమించుకున్న వాళ్ళు ప్రభుత్వ ఉద్యోగాలనే ఈ చిన్న వనరును కూడా దళితులతో పంచుకోవడానికి సిద్ధంగా లేరు. ఆస్తి నుండి ఉద్యోగాల దాకా అన్ని వనరులలోనూ జనాభా ప్రాతిపదిక మీద ప్రవేశం డిమాండ్ చేస్తే ఆకాశమే బద్దలవుతుందో, ప్రళయమే వచ్చేస్తుందో.

ప్రతిభ పోతూవుందని గొంతుచించుకుంటున్నవాళ్ళంతా తమకు ప్రతిభ ఉందనీ, అది తమ స్వంతం అనీ, దానికి గుర్తింపు ఇవ్వడం దేశానికి మంచిదనీ భావిస్తున్నారు. వాళ్ళకు ఏపాటి ప్రతిభవుందో వాళ్ళ వృత్తులలో వాళ్ళు వెలగబెడుతున్న నిర్వాకం తెలుపుతుంది. ఒకవేళ ఉన్నా ఆ ప్రతిభ వాళ్ళ సొంతం కాదు. అది సామాజికమైనది. ఒక వ్యక్తికి గల ప్రతిభ వెనుక మూడువేల సంవత్సరాల చారిత్రక విజయాలు ఉన్నాయి. ఇవ్వాళ తన చుట్టూవున్న కోట్లాది ప్రజల శ్రమ ఉంది. ఆ చారిత్రక విజయాలను అందరికీ సమంగా దక్కనివ్వలేదు. ఈ శ్రమ ఫలాన్నీ దక్కనివ్వడంలేదు. చరిత్ర, నాగరికత కొందరి వారసత్వం అయ్యాయి. కులవ్యవస్థ కొందరిని నాగరికత నుండి బహిష్క రించింది. కొందరికి దాని విజయాలను కట్టబెట్టింది. ఆ సంపదంతా అనుభవించనిదే ఎవ్వడూ 'ప్రతిభావంతుడు' కాలేదు. అగ్రకులాలకు చెందిన వాళ్ళకు చారిత్రక కారణాలవల్ల మూడు సహస్రాబ్దాల సాంస్కృతిక ప్రగతి ఎక్కువగా అందుబాట్లో ఉంది. అది దళితులకు లేదు. చదువుకోడానికి ఆస్తిపరులకుండే అవకాశాలు ఆస్తిహీనులకు లేనట్టే అగ్రకులాలకు ఉండే అవకాశాలు దళితులకు లేవు. తమ 'ప్రతిభ'ను సంపాదించు కొనడంలో తాము కులవ్యవస్థకు ఎంతగా రుణపడి ఉన్నారో రిజర్వేషన్ వ్యతిరేకులకు అర్థం అయినట్టు లేదు. దళితుల శ్రమ ఫలితం అయిన నాగరికతను వాళ్ళకు కాకుండా చేసి, తాము స్వంతం చేసుకుని ఇప్పుడు అదంతా తమ స్వంత ప్రతిభేననుకుంటున్నారు. ఈ అహంభావం వాళ్లు ఎంచుకుంటున్న ఆందోళన రూపాలలోనే వుంది. రోడ్లు ఊడవడం, బూట్లు పాలిష్ చేయడం, మూటలు మోయటం మొదలయినవన్నీ ఆయా వృత్తుల పట్ల న్యూనతాభావంతో చేస్తూన్న పనులే తప్ప వేరే కాదు. అవన్నీ దళితులు చేయవలసిన పనులనీ, రిజర్వేషన్ల వల్ల దళితులు ఇంజనీర్లూ, డాక్టర్లూ అయిపోతే తాము ఈ నీచ వృత్తులు చేపట్టవలసి వస్తుందనీ ఈ చర్యల ద్వారా చెప్తున్నారు. ఈ అహంభావ ప్రదర్శనకు దళితులు రెచ్చిపోతే దానికి బాధ్యులు ఎవరు?

## III. కుల ప్రాతిపదిక - ఆర్థిక ప్రాతిపదిక :

రిజర్వేషన్లకు కుల ప్రాతిపదిక బదులు ఆర్థిక ప్రాతిపదిక ఉండాలనీ, ఏ కులానికి చెందినా పేదవాళ్ళంతా ఒకటేననీ ఒక వాదన ఉంది. సుప్రీంకోర్టు కూడ ఈ అభిప్రాయాన్ని

పదేపదే వ్యక్తం చేసింది. దేశంలోని మేధావులలో అత్యధిక భాగం ఇవ్వాళ ఇదే అభిప్రాయాన్ని కలిగివున్నారు.

కులాన్ని చూడదలచుకోని వాళ్లకు ఇది చాలా ఆకర్షణీయమయిన వాదనగా అనిపిస్తుంది. ఈ వాదన నిజమయితే ఎంతో బాగుండును కూడా. కానీ దురదృష్టవశాత్తూ అది నిజం కాదు. కేవలం ఆర్థిక ప్రాతిపదిక మీదనే రిజర్వేషన్లు కల్పిస్తే సమాజంలో 15 శాతం లోపు ఉన్న అగ్రకులాలు మొత్తం రిజర్వేషన్లను కొట్టేస్తారనడంలో ఎటువంటి సందేహం లేదు.

విద్యకూ, తెల్లబట్టల ఉద్యోగాలకూ పుస్తక విజ్ఞానం ప్రాతిపదిక. పుస్తక విజ్ఞానం సాంస్కృతికమయినది. పుస్తకాలలో మనం నేర్చుకునేది కేవలం విషయ పరిజ్ఞానం కాదు. ఒక సంస్కృతిని, భావవాతావరణాన్ని, ప్రాపంచిక దృక్పథాన్ని, అందులో అంతర్భాగంగా విషయ పరిజ్ఞానాన్ని పొందుతాం. ఇవ్వాళ విద్యారంగంలో చలామణి అవుతున్న సంస్కృతి తరతరాల భారతీయ సంస్కృతి, దానికి కొత్తగా తెచ్చి అతికించుకున్న ఆంగ్లేయ సంస్కృతి. అందుకే పుస్తక విద్య ఈ భారతీయ సంస్కృతికి అసలుసిసలు వారసులయిన బ్రాహ్మణులకూ, బ్రాహ్మణీకరణ చెందిన ఇతర అగ్రకులాలకూ అబ్బినంత సులభంగా ఇతరులకు అబ్బదు. ఇంగ్లిష్ చదువులనూ, తెల్లవాడి సంస్కృతినీ కూడా ఈ కులాల వాళ్లే ముందు ఆశ్రయించారు కాబట్టి కొత్తగా అతికించుకున్న ఆంగ్లేయ సంస్కృతి కూడా వాళ్లకు ఒంటబట్టినంత సులభంగా ఇతరులకు ఒంటబట్టదు. ఉదాహరణకు ఒక భారతీయుడిని అమెరికాకు తీసుకుపోయి స్కూల్లో ప్రవేశపెట్టి స్థానికులతో సమంగా పోటీపడమంటే చాలా కష్టపడతాడు. ఆర్థికంగా వాళ్ళతో సమానమయినా, తనదికాని సంస్కృతిలో, తనదికాని భావ వాతావరణంలో అతను తెల్లవాళ్ళతో సరితూగలేడు. ఈ విషయాన్ని అక్కడున్న భారతీయులు (ఎక్కువగా అగ్రకులాలవాళ్లు) గుర్తించి, తమకు ప్రత్యేక రాయితీలు కావాలని గొడవచేస్తున్నారు. ఇక్కడ మట్టుకు దళితులు రాయితీలు అడగటానికి వీలులేదని, చేతనైతే తమతో సమంగా పోటీపడి గెలవాలనీ రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు.

అసలు విజ్ఞానానికీ, సామర్థ్యానికీ, ప్రతిభకూ ఇస్తున్న నిర్వచనమే చాలా వివక్షతో కూడుకుని ఉంది. ప్రజలకు తమ జీవన విధానాన్ని అనుసరించి అనేక విషయాలను గురించి విజ్ఞానం ఉంటుంది. వ్యవసాయాన్ని గురించి ఎంతో పరిజ్ఞానం లేనిదే రైతు పంటలు పండించలేడు. బట్టలు నేసేవాళ్లు, రంగులు అద్దేవాళ్ళు, కుండలు చేసేవాళ్ళు, కల్లు తీసేవాళ్లు, సహస్ర వృత్తుల ఈ జనానికి ఎంతో విషయ పరిజ్ఞానం ఉంటుంది. అయితే దీనికి విజ్ఞానంగా మన దేశంలో గుర్తింపులేదు. బ్రాహ్మణ సంస్కృతి వీళ్ల శ్రమను నీచంగా చూసినట్టే, వీళ్ల విజ్ఞానాన్నీ తృణీకారభావంతో చూసింది. ఆధునిక కాలంలో

నయినా శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఈ శ్రామిక ప్రజల సాంప్రదాయక విజ్ఞానం నుండి ఆవిర్భవించిందా అంటే లేదు. పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయింది. సంప్రదాయక బ్రాహ్మణ సంస్కృతినీ, పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయిన భావాలనూ, సాంకేతిక విజ్ఞానాన్నీ కలగలిపి మన స్కూళ్ళలోనూ, కాలేజీలలోనూ సిలబస్ తయారు చేసుకున్నాం. ప్రజలకుండే విజ్ఞానానికి ఈ సిలబస్‌లో గుర్తింపులేదు. ఈ సిలబస్ 'విజ్ఞానం'గా గుర్తిస్తున్నదానికి ప్రజల నిత్య జీవితంలో స్థానం లేదు. ఈ రకంగా రూపొందిన విద్యారంగంలో రాణించడాన్ని 'ప్రతిభ' గా గుర్తిస్తే ఆ 'ప్రతిభ' బ్రాహ్మణ సంస్కృతిలోనూ, పాశ్చాత్య సంస్కృతిలోనూ పెరిగిన వాళ్లకు అబ్బినంత సులభంగా ఇతరులకు అబ్బదు. స్కూలు పాఠ్యపుస్తకాలలో నుండి తిక్కన భారతం పద్యాలనూ, కెనడి, అబ్రహాం లింకన్‌ల జీవిత గాథలనూ తొలగించి బట్టల మగ్గాల గురించీ, నాగలి కర్రు గురించీ పాఠ్యాంశాలు పెడితే బ్రాహ్మణుల పిల్లలూ ఆఫీసర్ల ఇళ్ళలోని కాన్వెంట్ సంస్కృతిలో పుట్టిన పిల్లలూ శ్రామిక కులాల పిల్లలతో పోటీపడడానికి ఎంత కష్టపడతారో ఊహించడం కష్టం కాదు. విజ్ఞానానికి ప్రస్తుతం ఇస్తున్న అప్రజాస్వామిక నిర్వచనాన్న యినా తొలగించాలి లేదా ఇదే విజ్ఞానం అనుకుంటే ఆ 'విజ్ఞానం' శ్రామిక కులాల నిత్యజీవితంలోనూ, సంస్కృతిలోనూ భాగం అయ్యేదాకా వాళ్లకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి. ఈ రిజర్వేషన్ల వల్ల అసమర్థులూ, సోమరులూ తయారవుతారనే వాదన కుల అహంకారం నుండి పుట్టినదేగాని వాస్తవం కాదు. రిజర్వేషన్లతో కాలేజీలో ప్రవేశించిన వాళ్లు చాలా మంది కష్టపడి చదివి ఫస్టు ర్యాంక్ సంపాదించుకుంటున్నారు. తమ ఉద్యోగాలలో రాణిస్తున్నారు. అయితే ఒకరిద్దరు ఇట్లా రాణించినంత మాత్రాన సరిపోదు. వాళ్ల జీవితాలకూ, ప్రస్తుత విద్యావిధానానికీ మధ్యనున్న కృత్రిమమయిన అంతరం తొలగిపోయే వరకు రిజర్వేషన్లు ఇవ్వడం అవసరం.

రిజర్వేషన్లకు ఆదాయపరిమితి పెట్టాలనీ లేదా ఒక తరం తరువాత ఇవ్వకూడదనీ ఒక వాదన ఉంది. ఇది పైకి ఆకర్షణీయంగా కనిపిస్తుంది గానీ కొంచెం లోతుగా ఆలోచించడం అవసరం. అసలు దేనికయినా ఆదాయపరిమితి అనేది మన దేశంలో ఆచరణ సాధ్యం కాదు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు తప్ప వేరే ఏ ఆధారం లేనివాళ్ళు, అందులోనూ లంచగొండ్లు కానివాళ్ళు ఎవరయినా ఉంటే వాళ్ళకు మట్టుకే కచ్చితమయిన ఆదాయం ఉంటుంది. వేరే ఎవ్వరికీ ఉండదు. ఒకవేళ ఆదాయపరిమితి ప్రాతిపదిక మీద పేదవాళ్ళకు మాత్రమే ఇచ్చినా తప్పుడు సర్టిఫికేట్లు పెట్టి డబ్బున్న వాళ్ళు వాడుకుంటారు. సామాజికంగానూ విద్యాపరంగానూ వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చిన తరువాత ఆ వెనుకబాటుతనం ఎంతకాలం ఉంటే అంతకాలం ఇవ్వవలసి ఉంటుందనేది విదితమే. '40 ఏళ్లు గడిచాయి కదా, ఒకతరం గడిచింది కదా ఇంకానా'? అని అడుగుతున్నారు. ఆ ప్రశ్న వేసిన వాళ్లనే

అడగాలి - సామాజిక వెనుకబాటుతనం పోయినట్టే అనుకుంటున్నారా? పోకపోతే దానికి బాధ్యులు దళితులా లేక అగ్రకులాలా? ఎవరిని అడగవలసిన ప్రశ్న ఎవరిని అడుగుతున్నారు?

మనం ఒక పోటీ వ్యవస్థలో బ్రతుకుతున్నాం. ఉద్యోగాల కోసం పోటీ, వనరుల కోసం పోటీ, విద్య కోసం పోటీ, ఆస్తి కోసం పోటీ, అధికారం కోసం పోటీ, అన్నిటా పోటీ మన సామాజిక జీవితంలోనికి ప్రవేశించింది. ఈ పోటీలో నిలదొక్కుకొనడానికి బలహీనులకు చేయూత అవసరం. అగ్రకులాలకు చెందిన పేదవాళ్ళకు ఆ కులాలకు చెందిన ఆస్తిపరులూ, అధికారులూ, బలవంతులూ 'మనవాడు' అనే ఆత్మీయతతో ఎంతో కొంత చేయూతనిస్తారు. (అంటే అగ్రకులాలోని పేదలకు సమస్యలే లేవని కాదు, కొంత సహాయం దొరుకుతుందని మాత్రమే మా ఉద్దేశ్యం.) వెనుకబడ్డ కులాలలో కూడా అటువంటి ఒక బలమైన వర్గం ఏర్పడితే ఆ కులాలలోని పేదలకు కొంత సహాయం దొరకగలుగుతుంది. వాళ్ల అవసరాలకు కనీసం రాజకీయాలలో వ్యక్తీకరణ దొరుకుతుంది. ఒక తరానికే రిజర్వేషన్ అనీ, ఆదాయపరిమితి అనీ ఆంక్షలు పెడితే అది ఈ మార్పుకు ఆటంకం కాగలదు.

అగ్రకులాలలో ఒక బలవంతుల వర్గం వాళ్ళ 'ప్రతిభ' వల్ల ఏర్పడలేదు. ఇతరులను దోచుకొనడానికి కావలసిన ఆస్తి ఉంది. రాజకీయాధికారం ఉంది. ఇతరులకు కాకుండా చేసి తామే స్వంతం చేసుకున్న నాగరికత వుంది. కులవ్యవస్థ వీటిని సమకూర్చి పెట్టింది. వీటిని నిలుపుకోవడం కోసం, పెంపుదల చేసుకోవడం కోసం కులాన్ని నిరభ్యంతరంగా వాడుకుంటూనే ఉంటారు. ఎంఎల్ఏ టికెట్టు కోసం కులం, మంత్రి పదవి కోసం కులం, ప్రమోషన్ కోసం కులం - కులాన్ని వాడుకోకుండ వాళ్లు ఆధిపత్యాన్ని సంపాదించుకోలేదు. నిలబెట్టుకోలేదు. వెనుకబడ్డవాళ్లు తమ కులాన్ని ఈ రూపంలో కాక రిజర్వేషన్ల రూపంలో వాడుకుని తమలోనూ ఆర్థికంగా, ఉద్యోగరీత్యా, రాజకీయంగా బలవంతులయిన ఒక వర్గాన్ని తయారు చేసుకుంటామంటే అక్కడ మాత్రం ఒక తరానికే పరిమితం చేస్తామనీ, ఆదాయపరిమితి పెడతామనీ అంటారు. నిజానికి ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన మన కులవ్యవస్థలోని ద్వంద్వనీతిని మొత్తం నగ్నంగా బయటకు తెచ్చింది. ఆస్తిని కూడా ఒక తరానికే పరిమితం చేస్తామనీ, రెండవ తరానికి అది వారసత్వంగా సంక్రమించదనీ, రెండవతరం కష్టపడి మళ్లీ సంపాదించుకోవలసిందేననీ అంటే ఒప్పుకుంటారా? తండ్రి లాయరు, డాక్టరు అయితే ఆ ప్రాక్టీసు కొడుకుకు సంక్రమించదనీ, విడిగా కృషి చేసి సంపాదించుకోవలసిందేననీ అంటే ఒప్పుకుంటారా? కులం లాగా ఆస్తి కూడ పుట్టుకతో సంక్రమిస్తుంది. ఆస్తిలో స్వాభావికంగానే 'రిజర్వేషన్' ఉంది. దానినెందుకు వ్యతిరేకించరు? పుట్టుకతో

సంక్రమించే ఆస్తికి వారసులయ్యే వాళ్లు సోమరులూ, అసమర్థులూ అయి దేశాన్ని నాశనం చేస్తారంటే ఒప్పుకుంటారా? వేల సంవత్సరాలుగా బ్రాహ్మణులు తమకే స్వంతం చేసుకున్న పుస్తక విద్య బ్రాహ్మణ కుటుంబాలకు వారసత్వంగా వచ్చింది. అది వాళ్ళ 'రిజర్వేషన్'. ఇన్ని తరాలయ్యాయి కదా - ఇంక ఆ రిజర్వేషన్ చెల్లదు. ఇక మీదట బ్రాహ్మణ పిల్లలు ఇళ్ళలో పెరగడానికి వీలులేదు. పుట్టగానే హాస్టల్‌లో వేస్తామంటే ఒప్పుకుంటారా? అసలు సమాజంలో ఎన్ని రకాల రిజర్వేషన్లు నడుస్తున్నాయి! ఆస్తి, డబ్బు, రికమెండేషన్, బంధుత్వం, సాంస్కృతిక గుత్తాధిపత్యం - ఇన్ని ఉండగా వీటిలో ఏదీ ఒక తరానికి గానీ పేదవాళ్ళకు మాత్రమే గానీ పరిమితం కాకపోగా, తద్విరుద్ధంగా ఆస్తిపరులను మరింత ఆస్తిపరులుగా చేయడానికి, బలవంతులను మరింత బలవంతులుగా చేయడానికి ఇవి తోడ్పడుతుండగా, ఒక్క కుల రిజర్వేషన్ల మీదే పరిమితులు పెట్టడం దళితులకు మరొక్కసారి అన్యాయం చేయడం కాదా? చరిత్ర క్రమంలో వాళ్ళలోని పేదవాళ్లే వాళ్ళలోని పెత్తందారీ వర్గాన్ని వ్యతిరేకించే రోజువస్తే అప్పుడు ఈ పరిమితులు అర్థవంతం అవుతాయిగానీ, అన్నిరకాల రిజర్వేషన్లనూ తరాల తరబడి అనుభవిస్తూ ఉన్న అగ్రకులాల వాళ్లు వీటిని గురించి మాట్లాడడం సహించరాని ద్వంద్వనీతి అవుతుంది.

## ముగింపు

మన దేశంలో రాజకీయ వాతావరణం రోజురోజుకూ అప్రజాస్వామికంగా తయారవుతూ ఉంది. సంపదనూ అధికారాన్నీ చేజిక్కించుకున్నవాళ్లు మరింత పొందాలని చూస్తున్నారేగాని పేదలతో ఏ మాత్రం పంచుకోవడానికి సిద్ధంగా లేరు. రిజర్వేషన్ల సమస్య వచ్చినప్పుడు అగ్రకులాలోని పేదవాళ్లను గురించి కన్నీళ్లు కారుస్తారు గానీ వాళ్ళతోనూ ఏదీ పంచుకోవడానికి సిద్ధంగా లేరు.

భూసంస్కరణలు, కనీసవేతన చట్టాలు, కార్మిక చట్టాలు, ఇతర సంక్షేమ చట్టాలు మూలన పడిపోయినాయి. వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి స్తంభించినాయి. ఉన్నంతలో దోచుకుంటూ తమ అధికారాన్నీ ఆస్తినీ పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో కులం వాళ్ళకొక బలమయిన సాధనంగా ఉపయోగపడుతూ ఉంది. పార్లమెంట్ నుండి పంచాయతి స్థాయి దాకా అన్ని ఎన్నికలలో, వ్యవసాయ పరపతి సంఘాలలో, మార్కెటింగ్ సొసైటీలలో, ఇంకా ఎన్ని రాజకీయ సంస్థలుంటే అన్నింటిలోనూ తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకోవడానికి కులాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు. కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు, పెట్టుబడిదార్లకు ప్రభుత్వ రుణాలు, వ్యాపారస్తులకు ఎగుమతి దిగుమతి లైసెన్సులూ, బ్రోకర్లకు దళారీతనం చేసే అవకాశాలు ఏవీ కూడా కులాన్ని వాడుకోకుండ రావడంలేదు. ఆర్థిక రాజకీయ రంగాలలో ఆధిపత్యాన్ని

నిలబెట్టడంలో కులం ఈ విధంగా ఒక బలమయిన సాధనంగా తయారయింది. తండ్రులు తమ కులాన్ని వాడుకుని ఈ విధంగా బలపడబట్టే కొడుకులకు అన్ని అవకాశాలూ సమకూరి 'ప్రతిభ' వచ్చింది. ఇవ్వాళ 'ప్రతిభ'ను బ్యానర్లమీద ఎక్కించి ఊరేగుతున్న యువకుల 'ప్రతిభ' కులం ప్రమేయం లేకుండ ఊడిపడలేదు. వాళ్ల తండ్రుల ఆస్తులయినా ఉద్యోగాలయినా వ్యాపారాలయినా రాజకీయ ప్రాబల్యమయినా కులాన్ని వాడుకోకుండ పుట్టలేదు. నిలవలేదు. ఆ కులాలలోని పేదవాళ్లు కూడా ఈ ఆధిపత్యం వల్ల కొంతకాకపోతే కొంత ప్రయోజనం పొందుతుంటారు. తమ కులం వాడు కాంట్రాక్టర్ అయితే మేస్త్రీ పని దొరకవచ్చును. వ్యాపారస్తుడయితే షాపు గుమాస్తా పని దొరకవచ్చును. ఆఫీసర్ అయితే టైపిస్టు ఉద్యోగం దొరకవచ్చును. అగ్రకులాలలో నిరుద్యోగ సమస్య లేదనేది మా అభిమతం కాదు. అయితే కులాన్ని వాడుకుని కొంతమేరకు దానిని ఎదుర్కొనే అవకాశం వాళ్ళకు ఉంటుందనేది వాస్తవం.

దోచుకోవడమే ప్రధానమయిపోయిన రాజకీయాలలో ప్రజలపట్ల అణచివేతే ప్రధాన విధానం. వాళ్లు ఐక్యమై ఉద్యమించిన చోట్ల పోలీసు బలగాలను పెట్టి అణచివేత ప్రయోగిస్తే, వాళ్లు సంఘటితంగా లేని చోట కులపరమయిన దాడులు చేస్తున్నారు. అగ్రకులాలకు చెందిన మధ్యతరగతిని సహితం కదిలించి దళితులపైన ప్రాణాంతకమయిన దాడులు చేయిస్తున్నారు. కారంచేడు నుండి ఈనాటి దాకా అటువంటి ఘటనలు అనేకం చూసాము.

అయితే భౌతికదాడులొక్కటే అణచివేత కాదు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పేదలంతా పైకి రావాలని ఏ ఆదర్శమయితే రాజ్యాంగం చెప్తుందో ఆ పైకి రావడం అనేదానికి అవకాశం లేకుండా చేయడమూ అణచివేతే. భూములూ ఆస్తులూ వ్యాపారాలూ పోనివ్వండి. కనీస జీవనం కూడ వాళ్ళకు దక్కనివ్వడంలేదు. రిజర్వేషన్లు ఇస్తానని చెప్పే ప్రభుత్వం భూసంస్కరణలను గురించి మాట్లాడదు. అడవులలో గిరిజనులకు హక్కులు కల్పించడాన్ని గురించి మాట్లాడదు. కల్లు కాంట్రాక్టుగానీ, చేపల కాంట్రాక్టుగానీ, బంజర్లలోని పంటచెరుకు కొట్టి అమ్ముకునే కాంట్రాక్టుగానీ ఆయా వృత్తులలోవున్న వారికే తప్ప వేరే వాళ్లకు ఇవ్వరాదంటే మాట్లాడదు. వెనుకబడిన ప్రాంతాల వ్యవసాయ అభివృద్ధిని గురించి మాట్లాడదు. తమ వృత్తులను వదిలిపోక తప్పని పరిస్థితి ఏర్పడుతూ ఉన్న చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, పద్మశాలి తదితర కులాల ఉద్యోగ సమస్యను గురించి మాట్లాడదు. కూలివాళ్ల కనీస వేతనాన్ని గురించి మాట్లాడదు. ఇవన్నీ కూడ 'ఎస్.సి, ఎస్.టి, బి.సి' కులాల సమస్యలే. కానీ వీటిని గురించి ఈ ప్రభుత్వాలు మాట్లాడవు. ఈ కులాలలో కొంచెం నోరున్న వాళ్ళ నోళ్లు మూసేయడానికని విద్యా ఉద్యోగరంగాలలో రిజర్వేషన్ల గురించి మట్టుకు ప్రభుత్వం మాట్లాడుతుంది.

అయితే ఈ మాట్లాడటంలో కూడ చిత్తశుద్ధి లేదు. ఎందుకంటే ఉన్న ఉద్యోగాలు ఎంత కొన్ని అయినా ఈ చర్య కులవ్యవస్థ మూలాన్ని తాకుతుంది. అంతటి ప్రజాస్వామిక పరిణామాన్ని తట్టుకునే శక్తి మన రాజకీయ వ్యవస్థకు లేదు. అది అన్ని రకాలగానూ తన ప్రజాస్వామిక స్వభావాన్ని కోల్పోయింది. అందుకనే రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన పట్ల అన్ని పార్టీల ప్రభుత్వాలూ అంత సానుభూతితో వ్యవహరిస్తున్నాయి. వాళ్లు నిరాఘాటంగా బస్సులను విధ్వంసం చేస్తూ హైజాక్ చేస్తూ రోడ్లు ఆపేస్తూ రోడ్లమీద నృత్యనాటికలు వేస్తూ ఆందోళన సాగిస్తున్నారు. వాళ్లకు ఆందోళన చేసే హక్కులేదని మా అభిమతం కాదు. తప్పకుండ ఉంది. కానీ పేదలు చేసే ఏ ఆందోళననూ కొంచెం కూడా సహించని ప్రభుత్వం ఇంతగా వీటిని ప్రోత్సహించడం వింత అనిపించక తప్పదు. పేదలు చేసే ఏ ఆందోళనలోనయినా తప్పులను వెతుకుతూ విమర్శించే పత్రికలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో తాము కూడ భాగం అయిపోవడం వింత అనిపించక తప్పదు. పేదల ఆందోళనలలో ఏ కొద్ది హింస కనిపించినా దానిని ప్రజలంతా నిర్ద్వంద్వంగా ఖండించాలని విన్నపాలు చేసే మేధావులూ, సంపాదకులూ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు బస్సులను పెద్ద సంఖ్యలో విధ్వంసం చేస్తూంటే చూసీ చూడనట్టు ఊరుకోవడం కూడ వింత అనిపించక మానదు. ప్రజా ఉద్యమాల మీద అణచివేత ప్రయోగించవద్దు, వాళ్ల సమస్యలు పరిష్కరించండి అని పౌరహక్కుల సంఘాలు అంటే 'అదిగో! మీరూ తీవ్రవాదులే' అని మామీద ఆరోపణలు చేసేవాళ్లంతా, 'రిజర్వేషన్ వ్యతిరేకులమీద అణచివేత ప్రయోగించవద్దు, చర్చలకు పిలిచి మాట్లాడు' అని విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌కు హెచ్చరిక చేయడమూ వింతగానే అనిపించకమానదు. ఏ సామాజిక విషయానికీ సాధారణంగా స్పందించని ఫైవ్‌స్టార్ న్యాయవాదులయిన సుప్రీంకోర్టు వకీళ్లు తమ కోర్టు ముందే పెండింగ్‌లో ఉన్న రిజర్వేషన్ వ్యతిరేక రిట్ పిటీషన్ల మీద తామే తీర్పు చెపుతూ కోర్టును బహిష్కరించడం అన్నిటికంటే వింతగా అనిపించకమానదు. కులం మన సామాజిక రాజకీయ వ్యవస్థను నిలబెట్టడంలో ఎంత ముఖ్యమయిన పాత్ర నిర్వహిస్తుందో దీనిని బట్టి తెలుసుకోవచ్చును.

రేపు సుప్రీంకోర్టులో జరగబోయే వాదనలలో గతంలో సందిగ్ధంగా వదిలేసిన అంశాలనే మళ్లీ లేవదీస్తారనుకోవడంలో సందేహం అక్కరలేదు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదనేది ఒకటి. దీనిని గురించి గతంలో కూడ కొందరు సుప్రీంకోర్టు జడ్జీలు విభేదించారని చూసాం. రిజర్వేషన్లవల్ల వెనుకబడ్డ కులాలలోని ధనికులే బాగుపడుతున్నారు కాబట్టి ఆదాయపరిమితి పెట్టాలనేది మరొకటి. దురదృష్టవశాత్తు రిజర్వేషన్లకు సూత్రప్రాయంగా అనుకూలంగా ఉన్న న్యాయమూర్తులు సహితం ఈ 'ఆదాయ పరిమితి' అనేదానికి సుముఖంగా ఉన్నట్టు మనకు సుప్రీంకోర్టు తీర్పులను బట్టి తెలుస్తుంది. ఇక్కడ కూడ పైన చెప్పిన విచిత్రమయిన ద్వంద్వనీతి కనబడుతుంది.

మనదేశంలో ప్రభుత్వం 'అభివృద్ధి' పేరుమీద చేపట్టిన ఏ చర్యవల్లనయినా ధనికులే బాగుపడ్డారు. వ్యవసాయరంగంలో హరిత విప్లవం రావడంవల్ల వ్యవసాయదారుల్లో ధనికులు మాత్రమే బాగుపడ్డారు. అయినా దానిని భూస్వాముల ప్రగతి అనలేదు. దేశ ప్రగతి అన్నారు. పారిశ్రామికీకరణ వల్ల పెట్టుబడిదార్లూ కాంట్రాక్టర్లూ మాత్రమే బాగుపడ్డారు. అయినా దానిని కూడా డబ్బున్నవాళ్ల ప్రగతి అనలేదు, దేశప్రగతి అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, పరిశోధనా కేంద్రాలు, విశ్వవిద్యాలయాలు - వీటన్నిటివల్లా డబ్బున్న వాళ్లే బాగుపడ్డారు. కానీ దానినీ దేశ ప్రగతి అనే అన్నారు. మరి బిసిలలో డబ్బున్న వాళ్ళు రిజర్వేషన్లవల్ల బాగుపడితే దానిని మట్టుకు దేశప్రగతిగా ఎందుకు భావించకూడదు? వెనుకబడ్డ కులాలలో ఒక బలమైన వర్గం తయారయి తమ రాజకీయ అధికారాన్నీ సామాజిక పెత్తనాన్నీ సవాలుచేయడాన్ని సహించలేక పెట్టే వాదనలే తప్ప వేరే కాదు ఇవన్నీ. కీలకమయిన రక్షణ, సాంకేతిక రంగాలకు, ఉన్నత విద్యకూ రిజర్వేషన్లు వర్తించవని వి.పి.సింగ్ ప్రకటించిన సవరణ వెనక ఉన్నది కూడ ఈ వైఖరే.

ఈ ఆధిపత్యాన్నీ, దానికి ఆలంబనగా ఉన్న కులవ్యవస్థనూ నిలబెట్టుకోవడం కోసం సమాజంలోని పెత్తందారీ శక్తులు తమ కులాలలోని సామాన్య ప్రజానీకాన్ని రెచ్చగొట్టి రోడ్లమీదికి తీసుకొస్తున్నారు. మీకు ఉద్యోగాలు దొరకవు అని బెదిరించి దళితుల మీదికి ఉసిగొల్పుతున్నారు. నిజానికి ఈ ఆందోళన ఉద్యోగాల గురించి కాదని వాళ్లకు బాగానే తెలుసు. రిజర్వేషన్లు నిరుద్యోగానికి కారణమూ కాదు, పరిష్కారమూ కాదు. ఈ అగ్రకుల ప్రతిభావంతుల పాలనే నిరుద్యోగాన్ని పెంచి పోషించింది. దానికి అన్ని కులాలలోని పేదవాళ్లూ బలి అవుతున్నారు. అయితే ఉన్న కొద్ది ఉద్యోగాల కోసం అందరూ 'సమానంగా' పోటీ పడండి అంటే అది సామాజికంగా బలహీనులయిన వాళ్లకు అన్యాయం అవుతుంది కాబట్టి ఆ బలహీనత పోయేదాకా చేయూత కావాలని అంటున్నాం. అంత మాత్రమే. అగ్రకులాలలోని పేదవాళ్ల మాటకొస్తే, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు ఇచ్చినట్లే తమకు ఆర్థిక ప్రాతిపదిక మీద 10 లేక 15 శాతం రిజర్వేషన్ ఇమ్మని కోరవచ్చును. ఆ కోరికను ప్రజలంతా సమర్థిస్తారు. అందరికి అన్ని రిజర్వేషన్లూ వచ్చిన తరువాత కూడా ఉద్యోగాల సమస్య పరిష్కారం కాలేదని అందరికీ అర్థం అవుతుంది. ఇవ్వాళ 'ప్రతిభ' పోతూవుందని గొడవచేస్తున్న వాళ్లెవరూ అప్పుడు ఆందోళన నడపడానికి ముందుకు రారు. ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో నాయకత్వం వహిస్తున్న వాళ్ళెవ్వరూ ఉద్యోగాలు కావలసిన వాళ్లు కారు. అప్పుడు ఉద్యోగాలు దొరకని పేదవాళ్ళంతా ఒకటయి అందరికి పని కల్పించగల నిజమయిన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం పోరాడవలసి ఉంటుంది. కొందరి కోసం, కొందరు సంపన్నులను మరింత సంపన్నులు చేయడం కోసం, పార్లమెంటరీ రాజకీయాల నుండి ప్లానింగ్ కమిషన్ దాకా, విదేశీ అప్పుల నుండి కులం దాకా... అన్నిటినీ వాడుకుని బలవంతులు మరింత బలపడటం కోసం నడుస్తున్న ప్రస్తుత

అప్రజాస్వామిక వ్యవస్థ స్థానంలో అందరికి నిజమయిన సమానత్వాన్ని ఇవ్వగల వ్యవస్థ రావాలని ఉద్యమించవలసి ఉంటుంది.

**కేంద్రప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్‌సి, ఎస్‌టిలు - బిసిలు (%)**

| | క్లాస్ I | | క్లాస్ II | | క్లాస్ III + క్లాస్ IV | |
|---|---|---|---|---|---|---|
| | SC + ST | BC | SC + ST | BC | SC + ST | BC |
| కేంద్రమంత్రిత్వ శాఖలు | 7.18 | 2.59 | 13.66 | 3.98 | 30.95 | 8.41 |
| కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు | 6.64 | 5.09 | 18.74 | 11.74 | 20.78 | 20.98 |
| పబ్లిక్ సెక్టర్ సంస్థలు | 4.51 | 4.59 | 17.84 | 9.91 | 31.76 | 15.77 |
| **మొత్తం** | **5.68** | **4.69** | **18.18** | **10.63** | **24.40** | **18.98** |

సామాజికంగా ఎస్‌సి, ఎస్‌టిల కంటే బిసిలు కొంత మెరుగయిన స్థితిలో ఉన్నారు. జనాభాలో కూడా చాలా ఎక్కువ ఉన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరంగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు ఉండగా బిసిలకు లేకపోవడం వల్ల, ఏ కేంద్రప్రభుత్వ విభాగంలో చూసినా ఎస్‌సి, ఎస్‌టిలకంటే బిసిలు తక్కువ ఉన్నారు. క్లాస్ I ఉద్యోగాల నుండి క్లాస్ IV దాకా, మంత్రిత్వశాఖల నుండి కార్పొరేషన్లదాకా, అన్నిటిలోనూ ఈ వాస్తవాన్ని చూడవచ్చును. మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయడం అవసరం అని ఈ ఒక్క పట్టికే ఋజువు చేస్తుంది

*ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కృష్ణా జిల్లా శాఖ బుక్‌లెట్‌గా వచ్చింది*
*అక్టోబర్ 1990*

**నోట్** : రాష్ట్రంలో బిసిలకు విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లను 25 శాతం నుండి 44 శాతానికి పెంచాలన్న మురళీధరరావు కమిషన్ సిఫార్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపినపుడు దానికి వ్యతిరేకంగా అగ్రకులాల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ఆందోళన జరిగింది. అప్పటికి రిజర్వేషన్లు హక్కుల సమస్యే అన్న అవగాహన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో ఇంకా ఏర్పడలేదు కాబట్టి బాలగోపాల్ వారి ఆందోళనను వ్యతిరేకిస్తూ, రిజర్వేషన్లను సమర్థిస్తూ 'రిజర్వేషన్ల పైన దాడిని వ్యతిరేకించండి' అనే శీర్షికతో రాసిన వ్యాసాన్ని 'రిజర్వేషన్ల సంరక్షణ వేదిక' పేరు మీద ఒక బుక్‌లెట్‌గా వేశారు. పై వ్యాసంలోని విషయాలన్నీ ఇంచుమించుగా అందులోనూ ఉన్నాయి కాబట్టి దాన్ని ఈ పుస్తకంలో చేర్చలేదు. చదవాలనుకున్నవారు www.balagopal.org లో చూడండి.

# ప్రైవేటు రంగం - రిజర్వేషన్లు - వర్గీకరణ

నిర్వాహకులు నాకు చాలా అన్యాయం చేస్తున్నారు. నేను దొరికాను కదా అని టాపిక్‌లు పెంచుకుంటూ పోతున్నారు. నాకు మొదట చెప్పింది ప్రారంభోపన్యాసం ఇచ్చి వర్గీకరణ గురించి మాట్లాడితే సరిపోతుంది అని. నిన్న ఆల్మట్టి ఒకటి చేర్చారు. ఇప్పుడు ఇవి రెండు చేర్చారు. ఈ మూడు టాపిక్‌లు కలిపి మాట్లాడతాను అనడంలో నా ఉద్దేశ్యం ఏమిటంటే, 1/70 కూడా ఒక రిజర్వేషనే, ఒక రిజర్వేషన్ చట్టమే. ఇతర రిజర్వేషన్ల లాగానే విపరీతమైన ఆవేశాలకు తావిచ్చే చట్టమే. దాని గురించి మాట్లాడితే కొడతాము, తంతాము అనే స్థితిలో రెండుమూడు సార్లు మేము దెబ్బలు కూడా తప్పించుకొన్నటువంటి పరిస్థితి ఉంది. ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో వచ్చినట్టు పేదల మధ్యనే తేడాలు తీసుకువస్తున్నారు అనే వాదన 1/70 విషయంలో కూడా ఉంది. అందువలన అన్నీ కలిపి మాట్లాడటానికి అంతస్సూత్రం ఒకటి ఉంది అన్న ఉద్దేశంతో అలా అన్నాను. అయినా ఇప్పుడు విడిగానే మాట్లాడతాను.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి అనే డిమాండ్ విషయం లో మనకు అభిప్రాయభేదాలు ఉంటాయని నేను అనుకోను. అయితే దానికి సామాజిక ఆమోదం - అంటే ఇది ఒక న్యాయమైన డిమాండ్ అని సమాజాన్ని ఒప్పించడానికి ఏం చేయాలి? ఏ రకమైన వాదన సమాజం ముందు పెట్టాలి అనేది ఆలోచించాలి. ఇది ఒక అంశమైతే - చట్టపరంగా, రాజ్యాంగ పరంగా దానికేమైనా సమస్యలు ఉన్నాయా అనేది రెండవ అంశం. అవి రెండూ

స్పష్టం అయితే ఎట్లా సాధించుకోవాలి అనేది మాలాంటి వాళ్ళు చెప్పటం కంటే ఉద్యమాలు వాటికి కావాల్సిన వ్యూహాలు అవి రూపొందించుకోవటం మంచిది. మేము పౌరహక్కుల సంఘంగా 'ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు' అనే అంశం మీద గతంలో ఒక సదస్సు నిర్వహించాం వరంగల్లులో. దానికి ముందు మా సంస్థ వాళ్లనే కొంత నిజనిర్ధారణ చేయమన్నాం. అంటే ఇప్పుడు ప్రైవేటు రంగంలో ఉన్న సంస్థలలో ఉద్యోగాలు ఎవరు చేస్తున్నారు? ఏ ఉద్యోగాలు ఎవరు చేస్తున్నారు? ఆఫీసర్ల ఉద్యోగాలు ఎవరు చేస్తున్నారు? సెకండ్ ర్యాంకు సూపర్‌వైజర్లు, మేనేజర్లు వగైరా ఉద్యోగాలు ఎవరు చేస్తున్నారు? గుమాస్తాల ఉద్యోగాలు ఎవరు చేస్తున్నారు? అటెండర్లు, స్వీపర్ల ఉద్యోగాలు ఎవరు చేస్తున్నారు? ఈ వివరాలు ముందు సేకరిస్తే అప్పుడు బలమైన వాదన సమాజం ముందు మనం పెట్టగలుగుతాం.

## సొంత పెట్టుబడి ఏమీ ఉండదు

ప్రైవేటు రంగంలో ఏదైతే మనం సహజ క్రమంగా భావిస్తామో, ఆ సహజ క్రమంలోనే ఒక సామాజిక క్రమం ఉంటుంది ఎప్పుడూ. సహజ క్రమంగా భావించే ఆ సామాజిక క్రమంలో వచ్చే ఉద్యోగాలు ఎవరి చేతిలోకి పోతున్నాయి అనే విషయంలో గణాంకాలు సేకరించి మనం సమాజం ముందు పెడితే మన వాదనలో బలముంటుంది అని సేకరించమని చెప్పటం జరిగింది. అయితే సమగ్రంగా విషయ సేకరణ జరగలేదు. కొంతవరకే జరిగింది. అయినా స్పష్టంగానే, మామూలుగా మనం ఊహించే విషయమే గణాంకాలలో చూడగలిగాం. గణాంకాలలో చూడగలిగినప్పుడే బలం ఎక్కువౌస్తుంది. నువ్వు ఊహిస్తున్నావు అనేటట్టు ఉండదు అప్పుడు. దాన్ని కరపత్రంగా వేసి సెమినార్ పెట్టడం జరిగింది. అయితే ఈ గణాంకాలు సేకరించండి, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు డిమాండ్ చేద్దాము అని అన్నప్పుడు మా సభ్యులలోనే కొంతమందికి పైకి చెప్పటానికి మొహమాటపడినా కొన్ని అనుమానాలు, సందేహాలు వచ్చాయి. గవర్నమెంటును అంటే అడుగుతాం, గవర్నమెంటును ఏదైనా అడగొచ్చు కాబట్టి. వాడెవడో సొంత పెట్టుబడితో కంపెనీ పెట్టుకొంటే దాంట్లో కూడా ఉద్యోగాలు వీళ్ళకి, వాళ్ళకి ఇవ్వు అని మనమెట్లాగ అడుగుతాము అని పైకి చెప్పడానికి సిగ్గుపడే సందేహం ఒకటి వాళ్లని పీడించింది, ఏదో సొంత పెళ్ళాన్ని కొడితే మనమెట్లాగ అడుగుతామని అన్నట్టు. ఎప్పుడూ సొంత పెట్టుబడి అనేది మనల్ని గందరగోళంలో పడేసే అవకాశముంది. రేపు వాడు అదే వాదన పెడతాడు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం ఆందోళన చేసినా, అందుకు డిమాండ్ పెట్టినా, పార్లమెంటులో బిల్లు పెట్టినా వాడు ఫస్ట్ ఏమంటాడు అంటే అది నా సొంత పెట్టుబడి అంటాడు. నా సొంత పెట్టుబడి నేను పెట్టుకున్నాను, మీరెట్లా అడుగుతారు నన్ను? గవర్నమెంటు అంటే అది అందరికీ చెందింది కాబట్టి అడగొచ్చు అనే వాదన ముందుకొస్తుంది.

కాబట్టి మొట్టమొదట మనం స్పష్టం చేసుకోవాల్సింది సొంత పెట్టుబడి అనేది ఏమీ లేదు అని. సంపద సామాజికం. ఎంతో మంది ఎన్నో రకాలుగా శ్రమ చేస్తేనే సంపద సృష్టించబడుతుంది. సొంత ఆస్తి వ్యవస్థ ఉండటం వలన మాత్రమే అది కొంతమంది సొంత పెట్టుబడి అయింది. ఇదో పెద్ద సామాజిక క్రమం, చారిత్రక క్రమం. ఆ క్రమం మొత్తంగా ఎప్పుడు పోతుందో అది వేరే సంగతి. కాని, సూత్రప్రాయంగా, తాత్వికంగా చెప్పాలంటే పెట్టుబడి ఎవరి సొంతం కాదు, అది సామాజిక సంపద. ఇవ్వాళ అది నీ సొంతంగా ఉంది, అంతే. దీనిని గుర్తించి అడగడానికి, డిమాండ్ చెయ్యడానికి మొహమాటపడవలసిన అవసరం లేదు. ఒక భావనగా ముందు మనం దాన్ని స్పష్టం చేసుకోవాలి. ఇవ్వాళ ఎవరికో ఒకరికి యాభై కోట్ల ఆస్తి ఉందన్నా, వెయ్యి కోట్ల ఆస్తి ఉందన్నా, బిర్లాలకు, టాటాలకు అంతకంటే ఎక్కువ ఆస్తి ఉందన్నా ఎంత కష్టపడినా ఎవ్వరం సంపాదించగలిగిన ఆస్తి కాదు అది. అన్ని కోట్ల రూపాయలు కొంతమంది చేతిలో పోగుపడటం వెనకాల ఒక పెద్ద చరిత్ర ఉంది.

ఆ చరిత్ర అంతా కూడా సంపదను సృష్టించడం, సృష్టించిన సంపద విభజనకు గురికావడం, పంపిణీ కావడం, ఆ పంపిణీలో అది కొంతమంది చేతులలోకి పోవటం అనే క్రమంలో జరిగింది. సంపద సృష్టి సామాజికం అనేది మనం విశ్వసిస్తే ఆ సంపద నుంచి పుట్టినటువంటి ఈ పెట్టుబడి ఎవరికి ఉపయోగపడాలి? అందరికీ సమానంగా ఉపయోగపడాలి అని డిమాండ్ చెయ్యటంలో అప్పుడు తాత్వికంగా ఇబ్బంది ఏమీ ఉండాల్సిన అవసరం లేదు. ఆచరణలో, రాజకీయాలలో దానిని ఎట్లా సాధించుకోవాలి అనేది వేరే సంగతి.

ప్రైవేట్ కంపెనీల వాళ్ళేమంటారో అనేదాని కంటే కూడా ఈ రిజర్వేషన్లను ప్రతిఘటించదల్చుకున్న టువంటి ప్రైవేటు వ్యాపారస్తులకు, పెట్టుబడిదారులకు మద్దతు ఎక్కడినుంచి వస్తుందో మనం గమనించాలి. ప్రపంచ వాణిజ్య సంస్థలు, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటివోల నుంచి ఈ రిజర్వేషన్లకు చాలా గట్టిగా వ్యతిరేకత వస్తుంది. వాళ్ళ ప్రాపంచిక దృక్పథంలో సంక్షేమం అని పిలవబడే చర్యలన్నీ - అంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం వైపు తీసుకొనే చర్యలన్నీ - కూడా తప్పు, అవి కూడనివి. మార్కెట్ స్వేచ్ఛను, వాణిజ్య స్వేచ్ఛను ఆటంకపరచేవి. వాటిని వ్యతిరేకించాలి అనేది వాళ్ల బలమైనటువంటి ఫిలాసఫీ. వాళ్ళ ఫిలాసఫీ వాళ్ళకు ఉంటే ఉండొచ్చును కానీ, అది మనకు విధానం (పాలసీ) అయిపోతుంది. వాళ్ళ ఫిలాసఫీ మనకు ఆర్థిక, రాజకీయ, సాంఘిక విధానాలుగా మారుతున్నాయి.

ఉదాహరణకు చాలాకాలం పాటు మన దేశంలో బట్టల ఉత్పత్తిలో చేనేత రంగానికి కేటాయింపు ఉండింది. కొన్ని రకాల వస్త్రాలు చేనేత రంగంలో మాత్రమే ఉత్పత్తి కావాలి అని నియమం ఉండేది. కాని ఆచరణలో అదేమీ అమలు కాలేదు.

ఆచరణలో మిల్లులే వాటిని ఉత్పత్తి చేస్తూ పవర్‌లూమ్‌లలో జరిగినట్టుగా చూపిస్తూ ఉన్నాయి. అది వేరే సంగతి. ఇప్పుడు సూత్రబద్ధంగా కూడా ఆ రకమైన కేటాయింపు, వర్గీకరణ ఉండటానికి వీలు లేని పరిస్థితి తీసుకొచ్చారు. ఏ పెట్టుబడి ద్వారైనా, ఏ రకమైన బట్టలు ఉత్పత్తి చేయదల్చుకున్నా వాడికి ఆ స్వేచ్ఛ ఉండాలి. అటువంటి స్వేచ్ఛా వాణిజ్యం ఉన్నప్పుడే అభివృద్ధి వస్తుంది అనే ఫిలాసఫీతో ఆ చిన్న వర్గీకరణను కూడా ప్రపంచ వాణిజ్యసంస్థలు వ్యతిరేకించటం జరుగుతోంది.

అట్లాగే ఉద్యోగాలలో రిజర్వేషన్లు అనేవి ప్రైవేటు రంగంలో కూడా ఇవ్వాలి అని అంటే, ఇన్నాళ్ళు మన సమాజంలో అగ్రకులాలవాళ్ళు పెట్టిన ఆర్గ్యుమెంట్లు ఏవైతే ఉన్నాయో అవే వాదనలు - సామర్థ్యం పేరుతో, ప్రతిభ పేరుతో - ఇవ్వాళ ప్రపంచంలో ఆధిపత్యంలో ఉన్న పెట్టుబడిదారీ ఫిలాసఫీలో భాగంగా వస్తున్నాయి. ప్రతిభకు, సామర్థ్యానికి భంగకరమైన రిజర్వేషన్లు వాణిజ్య స్వేచ్ఛకు, అభివృద్ధికి, పెట్టుబడికి నష్టకరం అనే వాదనతో వాళ్లు దానిని వ్యతిరేకించబోతారు. అంటే ఈ రోజు కుల వ్యతిరేక పోరాటం కూడా ఈ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాన్ని ప్రత్యక్షంగా పరిగణనలోకి తీసుకోకుండా సాగటానికి వీల్లేదనటానికి ఇదొక ఉదాహరణ. ఇట్లా అనేక ఉదాహరణలు, లింకులు మనకు కనిపిస్తాయి. అవన్నీ అట్లా ఉంచి, వాస్తవానికి ప్రైవేట్ రంగంలో ఈ రోజు ఏం జరుగుతూ ఉందనేది - మేము సేకరించిన గణాంకాల ద్వారా అయినా, మీకందరికీ అనుభవంలో తెలిసిన విషయాలైనా - రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. ఒకటి ఏంటంటే ప్రతిభ అని, సామర్థ్యం అని ఏదైతే పిలవబడుతుందో దాన్ని ప్రాతిపదికగా పెట్టుకొని వాళ్లు ఇచ్చే ఉద్యోగాలకు అవసరమైన విద్యను పొందే అవకాశం, దానికి కావాల్సినటువంటి కుటుంబ సంస్కృతీ అవన్నీ ఎవరికైతే అందుబాటులో ఉంటాయో, వాళ్ళకే ఉద్యోగాలు వస్తాయి తప్ప, వేరే వాళ్ళకు రావు. ఇది కొత్తగా చెప్పనవసరం లేదు. రిజర్వేషన్ల సందర్భంలో చేసిన వాదనే ఇది. ఇది ఒక పక్క జరుగుతూనే ఉంటుంది. అయినా మేము మెరిట్ ప్రకారమే తీసుకున్నాం అని వాడు అనగలుగుతాడు. నా కులంలో వాళ్ళను తీసుకోవాలని నేనేమీ అనుకోలేదు, అగ్రకులాలనే తీసుకోవాలని నేనేమీ అనుకోలేదు, ప్రతిభ ప్రకారం, సామర్థ్యం ప్రకారమే పోయాను. నా కంపెనీ బాగుండాలని, నా కంపెనీకి లాభాలు బాగా రావాలని వాళ్ళకి ఉద్యోగాలిచ్చాను అని వాడు అనగలడు. ప్రతిభ, దాని సామాజిక మూలం, ప్రతిభకు కావాల్సిన విద్య ఏ రకమైన విద్య, ఆ రకమైన విద్య పొందటానికి అవకాశాలు ఏ రకమైన అవకాశాలు, అవి ఎవరికి అందుబాటులో ఉన్నాయి అనే చర్చ నాకు అనవసరం; నాకు కావాల్సింది నా ఎకౌంట్లు, పెట్టుబడి పెరగడం, లాభాలు రావడం అని వాడు అనగలడు.

ఇది పైకి పెట్టే వాదన. దీంట్లో కొంత వాస్తవం కూడా ఉంటుంది. పైకి పెట్టని వాదన ఏమిటీ అంటే తన కంపెనీలో పెట్టుబడి ఎవరు పెడుతున్నారో వాళ్ళంతా తమ బంధువులు, తమ మిత్రులు, తమ కులానికి చెందిన వాళ్ళకు, తమ ఆశ్రితులకు ఉద్యోగాలు ఇవ్వటం జరుగుతుంది. ఇది రెండు రకాలుగా కూడా జరుగుతుంది. మామూలు క్రమంలోనే సామర్థ్యం అనే పేరు మీద జరిగే ఎంపిక - ఆ సామర్థ్యం యొక్క నిర్వచనమే సామాజికం కావడం వల్ల, సామాజిక వ్యవస్థ నుంచి వచ్చిన వక్రీకరణలు దానిలో ఉండటం వల్ల - దళితులకు, వెనుకబడిన కులాలకు, స్త్రీలకు అన్యాయం చేస్తుంది ఒక పక్క. రెండో పక్క ఎంపికలోనే తమ వాళ్లకు ఇవ్వటం కూడా జరుగుతూ ఉంటుంది.

## చాతుర్వర్ణం రీప్రొడ్యూసవుతోంది

ఈ రకంగా ఎవరు ఉద్యోగాలు చేస్తున్నారు అని గాని మనం చూస్తే - హైదరాబాద్‌లో మేము ఒక కాలేజీ తీసుకుంటే, 25 మంది లెక్చరర్లు ఉంటే 23 మంది బ్రాహ్మణులు ఉన్నారు. మళ్ళీ కాలేజీ రెడ్లది. ఆయన అనగలడు నేను రెడ్లకు ఇవ్వలేదు కదా అని. నేను సామర్థ్యం ప్రకారమే ఇచ్చాను, నేను ప్రతిభ ఉన్న వాళ్ళకే ఇచ్చాను, డిస్టింక్షన్ వచ్చిన వాళ్ళకే ఇచ్చాను అని అనగలడు. ఆ డిస్టింక్షన్‌కు, ఆ ప్రతిభకు, ఆ సామర్థ్యానికి, ఆ డిగ్రీలకు, ఆ డిగ్రీల వెనకున్నటువంటి విద్య, దానికి కావలసినటువంటి అవకాశాలు, ఇవన్నీ కూడా ఎవరికి అందుబాటులోకి వస్తున్నాయంటే ప్రధానంగా బ్రాహ్మణులకు, తరువాత మిగిలిన అగ్రకులాలకు. అందువల్ల ఆటోమాటిక్‌గా సెలక్షన్ వచ్చేస్తుంది. ఒకప్పుడు మన కాలేజీలలో, యూనివర్సిటీలలో అంతా బ్రాహ్మణులే ఉండేవాళ్ళు. కాలక్రమంలో ఇతర కులాల వాళ్ళు రావటం అనేది ప్రారంభం అయ్యింది.

ఇంకొక కంపెనీ తీసుకోండి. కృష్ణా జిల్లా కమ్మ వాళ్ళు హైదరాబాదులో పెట్టిన కంపెనీ అది. 105 మంది ఉద్యోగులలో 101 మంది కమ్మవాళ్ళు. నేను కంపెనీ పేర్లు కూడా చెప్పగలను. ఇప్పుడు నా దగ్గర లేదు కాని, కాగితం చూసి చెప్పగలను. కొంత సామర్థ్యం కావచ్చు. కొంత చదువుకున్నారు, బిటెక్ చేశారు, ఎంటెక్ చేశారు, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ చేశారు - అట్లాగూడ కావచ్చు. కొంత మా వాళ్ళు, మా వాళ్ల బంధువులని ఇచ్చింది కూడా కావచ్చు. రకరకాలుగా కావచ్చు. పెట్టినవాడిది ఆ కులమే, అక్కడ డామినేషన్ కూడా ఆ కులమే కాబట్టి. మరో ఉదాహరణ వరంగల్‌లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ ఉంది. పి.వి.నరసింహారావుగారి సొంత బంధువు దాన్ని నడుపుతాడు. అతని పేరు లక్ష్మీకాంత రావు. దాంట్లో మొత్తం డేటా సేకరించాం. మాకు పరిచయస్తులు లెక్చరర్స్‌గా పని చేస్తున్నారు కాబట్టి అది సాధ్యమైంది. మొత్తం డేటా సేకరిస్తే చాతుర్వర్ణం కరెక్ట్‌గా

రీప్రొడ్యూస్ అయ్యింది ఆ కాలేజీలో అనేది అర్థమైంది. చాతుర్వర్ణం ప్రకారం, మనుధర్మం ప్రకారం ఆ కాలేజీలో ఎంపిక చెయ్యాలి అని ఎవరూ అనుకోలేదు. వాళ్ళేదో ఆటో మెటిక్‌గా చేస్తున్నాం అనుకున్నారు. మేం పెట్టుకున్నటువంటి రూల్స్ ప్రకారమే సామర్థ్యం, ప్రతిభ, మార్కులు, ఇంటర్వ్యూ బాగా చెయ్యడం - వాటి ప్రకారమే చేస్తున్నామని వాళ్లు అనుకుంటున్నారు. అయినా ఆటోమాటిక్‌గా చాతుర్వర్ణం రీప్రొడ్యూస్ అయింది. ప్రొఫెసర్స్‌లో ఎక్కువమంది బ్రాహ్మణులు ఉన్నారు. రీడర్‌లు, లెక్చరర్‌లు దగ్గరికి వచ్చేటప్పటికి కమ్మ, రెడ్డి కులాలు కొంచెం పెరిగినాయి. గుమాస్తాలుగా బిసిలు ఉన్నారు. అటెండరులు, స్వీపర్లు అంతా ఎస్‌సిలు. అంటే మనకి సహజ క్రమంగా కనిపించేది ఎంత ఆటోమాటిక్‌గా సామాజిక క్రమంగా ఉంటుందనేదానికి బ్రహ్మాండమైన ఉదాహరణ ఇది. అది చిన్న కాలేజీ కాదు. పెద్ద కాలేజీ కాబట్టి మంచి శాంపుల్ కూడా.

మనం జోక్యం చేసుకోకపోతే, అడ్డుపడకపోతే సామాజిక వ్యవస్థలోని అన్ని అసమానతలూ సహజ క్రమంలో రీప్రొడ్యూస్ అవుతాయి. ఇది ఎప్పుడైనా జరుగుతూ ఉంటుందిగానీ పెట్టుబడిదారీ వ్యవస్థకు, పెట్టుబడిదారీ లాజిక్‌కు ఈ లక్షణం ప్రత్యేకంగా ఉంటుంది. పెట్టుబడిదారీ లాజిక్ ఏం చెబుతుందంటే వీలైనంత ఎక్కువగా పెట్టుబడి పోగవ్వాలని. వీలైనంత ఎక్కువగా పెట్టుబడి పోగవ్వాలంటే అప్పటికే ఆ సమాజంలో అగ్రభాగాన ఎవరు ఉంటారో వాళ్లనే ఎక్కువగా అది తన అవసరాలకు తీసుకోవాల్సి ఉంటుంది. ఉద్యోగులుగా అయినా సరే, పెట్టుబడిదారులుగా అయినా సరే, మేనేజర్‌లుగా అయినా సరే, ఇంకే రకంగా అయినా సరే. అప్పటికి ఆ సమాజంలో ఏ నైపుణ్యాలు అయితే ప్రతిభావంతమైనవిగా భావించబడుతూ ఉంటాయో, ఆ స్కిల్స్‌కి అది పెద్ద పీట వేస్తుంది. లేదా తాను ఏ కొత్త స్కిల్స్‌నైతే పెంచాలని అనుకుంటుందో వాటిని అప్పటికే ఆ సమాజంలో చదువులో, విద్యారంగంలో, టెక్నాలజీలో ఎవరైతే నిపుణులుగా ఉంటారో వాళ్ళకే అది నేర్పిస్తుంది. కాపిటల్ అనేది ఆటోమాటిక్‌గా సామాజిక అసమానతల్ని రీప్రొడ్యూస్ చేస్తుంది. ఉదాహరణకు ఆధునీకరణ పేరు మీద కొత్త కొత్త యంత్రాలు, కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చినపుడు ఏం జరుగు తుందో చాలా స్టడీస్ ఉన్నాయి.

ఒక ఫ్యాక్టరీలో మొదటి తరంలో ఎవరు ఉన్నా కాలక్రమంలో కింది కులాల వాళ్ళు, అణగారిన సామాజిక వర్గాలకు చెందినటువంటి వాళ్ళు ఉద్యోగాలలోకి రావటం ప్రారంభం అవుతుంది. నేర్చుకుంటూ వస్తారు మెల్లగా. ఐటిఐ చదివో, నేరుగా యంత్రాల మీద పని నేర్చుకుంటూనో ఉద్యోగాలలోకి ప్రవేశిస్తారు. అలాగే స్త్రీలు కొంతమంది ఉద్యోగాలలోకి వస్తారు కాలక్రమంలో. అకస్మాత్తుగా ఒకరోజు దాని యజమాని ఏం చేస్తాడు అంటే కంపెనీ సిక్ అయిందని బిఐఎఫ్ఆర్‌కు అప్లికేషను పెట్టుకుంటాడు. ఫ్యాక్టరీని మళ్లా నడపాలంటే ఆధునీకరించాలంటాడు. కొత్త మెషినరీ తెచ్చుకోవాలి

అంటాడు. ఆ మెషిన్ అమెరికాలో మాత్రమే ఉంది అంటాడు. అప్పు మంజూరు చేయించుకుంటాడు. ఆ తర్వాత మెషినరీ తెచ్చుకుంటాడు. తర్వాత రెండేళ్ళకు చూడండి మీరు, దాని ఉద్యోగపటం (job profile) మొత్తం తలక్రిందులు అయిపోతుంది. మెల్లగా అయినా 30, 40 ఏళ్ళ కాలక్రమంలో ఉద్యోగాలలోకి ప్రవేశించగలిగిన అణగారిన సెక్షన్స్‌కు చెందినవారు, స్త్రీలూ అక్కడ్నించి తప్పుకోవాల్సి వస్తుంది. కొత్త టెక్నాలజీ వచ్చిన తర్వాత మొత్తం తలక్రిందులు అయిపోతుంది. మరి ఆ టెక్నాలజీ మీద కులం రాసి ఉందా? అది అమెరికాలో తయారయిన టెక్నాలజీ. మనువు తయారుచేయలేదు. కాని ఆ టెక్నాలజీ స్వభావమేమిటంటే మెరిట్, స్కిల్స్, అత్యాధునిక పరిజ్ఞానం ఎవరికి అందుబాటులో ఉంటాయో, వారే ఉద్యోగాలు పొందగలుగుతారు. చాలా స్టడీస్ చెప్పేది ఏంటంటే మొట్ట మొదట స్త్రీల మీద దెబ్బ పడుతుంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఎక్కడ వచ్చినా ముందుగా ఆడవాళ్ళకు ఉద్యోగాలు పోతాయి. తర్వాత ఏం జరుగుతుంది అంటే అంతంత మాత్రం స్కిల్స్, అంతంత మాత్రం చదువు ఉన్నటువంటి వర్గాలు, సాంఘికంగా కింది కులాలకు చెందినటువంటి వాళ్ళు క్రమంగా బయటకు పోతారు. అసలే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు లేవు, సామాజిక వ్యవస్థను అది రీప్రొడ్యూస్ చేస్తుంది అని బాధ పడుతుంటే ఈ ఆధునీకరణ అనేది అదనంగా వచ్చి కూర్చుంది. ఇవాళ ఆధునీకరణ పేరిట అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకోవటం జరుగుతున్నది. అది అదనంగా ఏం చేస్తుంది అంటే సామాజికంగా ఇప్పటికే బలంగా ఉన్న వాళ్ళకి మరింతగా పెద్దపీట వేస్తుంది. ఇవాళ దీనికి కావలసినన్ని ఉదాహరణలు, స్టడీస్ కూడా ఉన్నాయి.

## ప్రభుత్వంలో ఉద్యోగాలేవీ?

అయితే దురదృష్టం ఏమిటంటే ఒక ప్రక్క రిజర్వేషన్‌లకు సంబంధించిన ఆలోచన, ఒక ఆలోచనగా పుట్టి, రిజర్వేషన్‌లు అవసరమైనటువంటి దళిత, వెనుకబడిన కులాలు గాని, స్త్రీలు గాని కొంతవరకు దాన్ని ఒక హక్కుగా అర్థం చేసుకొని ఉద్యమాలు చేస్తున్న తరుణంలో, వాళ్ళలో చదువుకున్న వాళ్ళు, రాజకీయంగా చైతన్యవంతమైన వాళ్ళు ముందుకు వచ్చి మరింత పెద్ద ఉద్యమంగా దాన్ని ముందుకు తీసుకుపోతున్న తరుణంలో ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు లేకుండా పోయాయి. 1953లో ఒక రకమైన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు, 1990 నాటికి మండల్ కమిషన్ కేసులో పూర్తిగా భిన్నమైన తీర్పు ఈయక తప్పని పరిస్థితి కల్పించేంతగా వారి వైఖరిలో మార్పు తీసుకుని వచ్చేటప్పటికీ ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు లేకుండా పోయాయి. ప్రభుత్వ రంగంలోని రిజర్వేషన్లను అమలు చేయించుకోవటం కోసం కొత్త కొత్త సెక్షన్స్ ముందుకు వచ్చి ఉద్యమాలు, పోరాటాలు చేసి సామాజిక ఆమోదం పొందాయి. సమాజంలో మొదట ఇష్టపడని వాళ్లచేత కూడా ఒప్పుకుంటాములే అని అనిపించేసరికి, ఇదంతా సాధించు

కునేసరికి రిజర్వేషన్‌లు ఇచ్చే పబ్లిక్ సెక్టారే లేకుండా పోయింది. మొత్తం ప్రైవేటు సెక్టార్ ఆక్రమించుకుంటూ వచ్చింది - ఆర్థిక రంగాన్ని గాని, ఇతర సేవా రంగాలను గాని. తిరిగి మన సాంఘిక జీవితం మళ్ళీ చాతుర్వర్ణం నమూనాలోకి వెళ్లకూడదు అంటే - నూటికి నూరుశాతం అలా అవుతుందని నేను కూడా అనడం లేదు గాని, ఆ విధంగా తిరోగమనం చెందకుండా ఉండాలంటే - ఇప్పటివరకు సాధించుకున్న వాటిని, సమాన అవకాశాలను ఏ మేరకు ముందుకు తీసుకువెళ్లటం జరిగిందో వాటిని ఆ మాత్రమైనా కాపాడుకోవాలి. అందుకోసం ప్రైవేటు రంగంలో కూడా ఇవ్వాళ పబ్లిక్ సెక్టార్‌లో ఇస్తున్న మోతాదులో రిజర్వేషన్‌ల కోసం మొదట డిమాండ్ చెయ్యాలి. పెంచుకోవటం కాని, ఇతర మార్పులు కాని అది తదుపరి చర్యగా ఉంటుంది. ఇవాళ ఇది చాలా పెద్ద అవసరం.

దీనికి చాలా సమస్యలు ఉన్నాయి. మొదట చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయేమో చూద్దాం. నిజానికి తక్కువ సమస్యలు ఉండేది అక్కడే. ఎక్కువ సమస్యలు సాంఘికంగా ఉన్నాయి. ఉద్యమ అవకాశాల్లో ఉన్నాయి. అన్నింటినీ మించి నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ పేరు మీద ఇవాళ ప్రపంచ పెట్టుబడిదారీ ప్రాపంచిక దృక్పథం దేన్నయితే ప్రమోట్ చేస్తోందో దాంట్లో ఇంకా చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి. రాజ్యాంగానికి వచ్చేటప్పటికి మీలో చాలామందికి తెలుసు భారత రాజ్యాంగంలో రిజర్వేషన్‌లకు అవకాశాలు ప్రాథమిక హక్కుల జాబితాలోకీ ఆర్టికల్ 15, 16 ద్వారా వచ్చాయి. 16లో మొదట్లోనే పెట్టారు. ఏమని అంటే any backward class of citizens - ఇక్కడ backward class అంటే ఇవ్వాళ మన అర్థంలో backward caste అనుకోనక్కర్లేదు. రాజ్యాంగం రాసినప్పుడు వెనుకబడి ఉన్నవాళ్ళు. అది ఎస్‌సిలు కావొచ్చు, ఎస్‌టిలు కావొచ్చు, స్త్రీలు కావొచ్చు, ఎవరైనా కావొచ్చు -, any backward class of citizens which is not sufficiently represented in public employment అన్నారు. పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ అంటే ప్రభుత్వ ఉద్యోగాలే. ఆర్టికల్ 16లో ప్రత్యక్షంగా ప్రభుత్వ ఉద్యోగాల గురించే ప్రస్తావించటం జరిగింది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు పొందాలంటే ఆర్టికల్ 16 క్లాజు 4లో మార్పు చేయాలి. అక్కడ మార్పు రావాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ఆర్టికల్ 15లో అది లేదు. ఆ విషయం తర్వాత చెప్తాను. కులం రీత్యాగాని, ఇతరత్రా గాని వెనకబడి, ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వాళ్ళందరికీ రిజర్వేషన్ సౌకర్యం ఇవ్వాలనేది ఆర్టికల్ 16 క్లాజ్ 4 సారాంశం. మామూలు అర్థంలో చెప్పాలంటే జనాభాలో వాళ్లు ఎంత మంది ఉన్నారో అంతమందికి అక్కడ ఉద్యోగాలు లేవు కనుక ఇవ్వాలని. చాలా సింపుల్ క్రైటీరియా. ఆ దామాషాలో లేనటువంటి వాళ్ళకు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించవచ్చు

అనేది ఆర్టికల్ 16 క్లాజ్ 4లో రాజ్యాంగం రాసినప్పుడే ఉంది. ఐతే అది ప్రభుత్వరంగ ఉద్యోగాలకు మాత్రమే పరిమితం అయ్యింది.

ఆర్టికల్ 15 ఇంకొంచెం జనరల్ ఆర్టికల్. ఆర్టికల్ 15 క్లాజ్ 1 ఏమంటుందంటే కేవలం ప్రభుత్వమే కాదు ఎవ్వరూ కూడా సమాజంలోని ఏ విషయంలో కూడా జాతి, లింగం, కులం, ప్రాంతం, పుట్టిన స్థలం - ఈ ప్రాతిపదిక మీద వివక్ష పాటించటానికి వీల్లేదు అని. అటువంటి వివక్షను సమాజం పాటిస్తుంటే ఏం చెయ్యాలో అందులో ఏమీ చెప్పలేదు గాని క్లాజ్ 3లో ఏం చెప్పారంటే స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేకమైన సదుపాయాలు ఏవైనా కల్పించవచ్చు అని మాత్రం చెప్పారు. కులం ప్రస్తావన తీసుకురాలేదు రాజ్యాంగంలో. అయినా మద్రాస్ ప్రభుత్వం కులం ప్రాతిపదికగా రిజర్వేషన్ కల్పించింది. అదెలాగంటే మద్రాస్‌లో ముందు నుంచి కూడా పెరియార్ ప్రభావంతో బ్రాహ్మణీయ ఆధిపత్యానికి, కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఆలోచనలు, ఉద్యమాలు బలంగా ఉన్నాయి. అక్కడ రిజర్వేషన్‌లు ఎప్పటినుంచో వస్తూ ఉన్నాయి. రాజ్యాంగం రాకముందు నుంచి కూడా. అక్కడ ఏం చేసారు అంటే - ఆర్టికల్ 15 క్లాజ్ 1 లో కులం, ప్రాంతం, లింగం ప్రాతిపదిక మీద వివక్ష పాటించటానికి వీల్లేదు అని ఉంది గాని మన సామాజిక వ్యవస్థలో ఆ వివక్ష చాలా ఉంది కాబట్టి దాన్ని సరిదిద్దడానికి రిజర్వేషన్ కల్పిస్తాం అని చెప్పి మెడికల్ కాలేజీ సీట్స్‌లో అనుకుంటా మొదట ఆ పని చేశారు. దాన్ని సవాల్ చేస్తూ కోర్టుకి ఎవరు పోయారు అంటే ఒక బ్రాహ్మణ స్త్రీ పోయింది. చంపకం దొరైరాజన్ అని చెప్పి ఆమె కోర్టుకి పోయింది. ఆమె దేన్ని వాడుకుంది అంటే ఆర్టికల్ 15 క్లాజ్ 1నే వాడుకుంది. 'కులం, ప్రాంతం, లింగం ప్రాతిపదిక మీద వివక్ష పాటించడానికి వీల్లేదు అని చెప్పినప్పుడు బ్రాహ్మణులకు ఇవ్వకుండా వేరే వాళ్ళకు రిజర్వేషన్ ఇస్తే ఎట్లా? అది అన్యాయం కాదా, రాజ్యాంగ విరుద్ధం కాదా' అని అమె కోర్టుకు పోయింది.

మన రాజ్యాంగంలో ఉన్న అన్ని ప్రాథమిక హక్కులూ అణచివేయబడ్డ వర్గాలకు ఉద్దేశించినవైతే వాటిని మొట్టమొదట వాడుకుంది ఆధిపత్య వర్గాలే. ఆ తర్వాతే నేర్చుకున్నారు అణచివేతకు గురైన వర్గాలు తాము కూడా వాడుకోవచ్చు వాటిని అని, అది కూడా లేట్‌గా. చట్టం అందర్నీ సమానంగా కాపాడాలి అంటే దాన్ని ఫస్ట్ భూస్వాములే వాడుకున్నారు. మా జాగిర్ అంతా తీసుకుంటే ఎట్లా అన్నారు వాళ్ళు. అలాగే జాగిర్దారీ రద్దు రాజ్యాంగ విరుద్ధం అన్నారు వాళ్ళు. అలాగే కుల వివక్ష పాటించటానికి వీల్లేదు అంటే మరి మాకు రిజర్వేషన్‌లు ఇయ్యకుండా వాళ్ళకు మాత్రమే ఇస్తే ఎట్లా అని బ్రాహ్మణులు కోర్టుకు పోయారు. చంపకం దొరైరాజన్ కేసులో కోర్టు కూడా కరెక్టే కదా, రిజర్వేషన్‌లు రాజ్యాంగానికి విరుద్ధం అని కొట్టేసింది. అప్పుడు మొట్టమొదటి

రాజ్యాంగ సవరణగా ఆర్టికల్ 15కు క్లాజ్ 4 చేర్చి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నటువంటి - క్లాసెస్ అనే మాట వాడారు - వర్గాలకు ప్రత్యేక సదుపాయాలు ఏవైనా కల్పిస్తే, అవి రిజర్వేషన్‌లు కావచ్చు, స్కాలర్‌షిప్‌లు కావచ్చు, ఫ్రీగా పుస్తకాల సరఫరా కావచ్చు, ఏదైనా కావచ్చు - కేవలం రిజర్వేషన్లు మాత్రమే అనుకోవాల్సిన అవసరం లేదు, ఏ రూపంలో అయినా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తే అది రాజ్యాంగానికి విరుద్ధం కాదు. అంటే మొదట చెప్పిన వివక్షకు అది విరుద్ధం కాదు అని స్పష్టంగా పేర్కొన్నారు. దీని మీద తరవాత చాలా కేసులు నడిచాయి.

## ముఖ్యమైన మూడు అంశాలు

ఇవ్వాళ మనకు ముఖ్యమైనటువంటి మూడు అంశాలు ఏమిటి అంటే మొదటిది - రిజర్వేషన్‌లు ఇవ్వటానికి కులాన్ని ప్రాతిపదికగా వాడవచ్చునా? అంటే సామాజికంగా, విద్యాపరంగా ఒక కులం వెనుకబడి ఉందా లేదా అని చూడవచ్చునా? ఈ చర్చ కోర్టులలో పదే పదే వచ్చింది. రెండవది - ఇవాళ మన వర్గీకరణకు కూడా అవసరమైనటువంటి చర్చ ఏమిటంటే ఏదో ఒక కేటగిరిలో వెనుకబడిన వాళ్ళు, మరీ వెనుకబడిన వాళ్ళు అనే ఉప వర్గీకరణ చేయవచ్చునా? మూడవది - మొత్తం రిజర్వేషన్లు ఎంత ఉండవచ్చు, 50 శాతం కంటే ఎక్కువ ఉండవచ్చునా, ఉండకూడదా? మొదటి రాజ్యాంగ సవరణ తరవాత ఈ మూడు చర్చలు సుప్రీంకోర్టులో 1953 నుంచి బాలాజీ కేసు దగ్గరనుంచి వస్తూనే ఉన్నాయి. కులాన్ని ప్రాతిపదికగా చేసుకొని వెనుకబాటుతనాన్ని నిర్వచించవచ్చునా అనే మొదటి ప్రశ్నకు బాలాజీ కేసులో సుప్రీంకోర్టు నిర్వచించటానికి వీల్లేదు అని అనింది. తరవాత మార్చుకుంటూ వచ్చారు అవగాహన. మండల్ కమిషన్ కేసులో తుది తీర్పు ఇస్తూ ఒక కులం మొత్తంగా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉంటే కులాన్ని వాడుకోవటం తప్పేమీ లేదు, అప్పుడు కులం ప్రాతిపదికగా రిజర్వేషన్లు ఇవ్వొచ్చు అని తీర్పు ఇచ్చారు. ఇవాళ అది స్థిరపడ్డ నిర్ణయం (settled fact). దీనికి అనుకూలంగా అనేక కోర్టు తీర్పులు వచ్చి ఉన్నాయి. అన్నిట్లోకి ఉత్తమమైనది మన చిన్నపరెడ్డిగారు ఇచ్చిన తీర్పు.

*వసంతకుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక* కేసును కర్ణాటక గవర్నమెంట్ సుప్రీంకోర్టుకు ఒపీనియన్ కోసం రెఫర్ చేసినపుడు ఆయన తన అభిప్రాయం బాగా రాసారు. భారతదేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండటం అనేదానికి ఎక్కడి నుంచి నువ్వు కొలత మొదలుపెట్టాలి అంటే కులంతోనే మొదలుపెట్టాలి అని చిన్నపరెడ్డి గారు చాలా వివరంగా రాసుకుంటూ వచ్చారు. భారతదేశ చరిత్ర అట్లాంటిది. ఈ చరిత్ర మనుషుల్ని సామాజికంగా, విద్యాపరంగా తక్కువగా చూసింది కులం ప్రకారం గానే. ధర్మశాస్త్రాలు చదివినా, సామాజిక ఆచరణ తెలుసుకున్నా ఎవరైనా ఏ ప్రాతిపదిక

మీద సామాజికంగా, విద్యాపరంగా వెనకబడి ఉన్నారు అంటే ప్రధానంగా కులం ప్రాతిపదిక మీదనే. ఇతర విషయాలు దానికి తరువాత వచ్చి చేరిన విషయాలు. కాబట్టి ఇవాళ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారిని గుర్తించడానికి మనం అమూర్తం(abstract)గా ఏదో కాన్సెప్ట్ పెట్టుకుంటే ప్రయోజనం లేదు. ఆ విషయాన్ని భారతదేశ చరిత్ర నుంచే మొదలుపెట్టి ఆలోచించాలి. ఈ చరిత్రలో కులమే ప్రధానపాత్ర నిర్వహించింది మనుషులు సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండటానికి. అందువల్ల దానినే ప్రాతిపదిక చేసుకోవాలి అని చిన్నపరెడ్డిగారు రాశారు. మేము ఆ తీర్పుని చాలా ఏళ్ల కిందే తెలుగులో అచ్చు వేశాం. బహుశా కాపీలు ఇప్పుడు లేకపోవచ్చు. ఇప్పుడు అది స్థిరపడ్డ నిర్ణయంగా మనం భావించవచ్చు.

రెండవది ఉప వర్గీకరణ చేయవచ్చునా? వెనుకబడిన కులాలు అని రిజర్వేషన్ ఇచ్చినప్పుడు మళ్లీ దాంట్లో ఉప వర్గీకరణ చేయడం కరెక్టా అనేది రెండవ అంశం. ఇది కూడా మొట్టమొదట 1953లో బాలాజీ కేసులో సుప్రీంకోర్టు చేయడానికి వీల్లేదు అని చెప్పింది. తరవాత తరవాత వచ్చినటువంటి కేసుల్లో చెయ్యవచ్చు తప్పేమీలేదు అంది. ప్రభుత్వ ఉద్యోగాలలో ఎవరికైతే తగినంతగా ప్రాతినిధ్యం లేదో వాళ్ళకు ఇయ్యాలి అన్న తర్వాత ఆ తగినంత ప్రాతినిధ్యం అన్నదాంట్లో అసలే లేనివాళ్ళు, కొంచెం ఉన్నవాళ్ళు అన్న తేడా ఉన్నప్పుడు వర్గీకరించడం తప్పేమీ లేదు అని కూడా తరువాత కోర్టులు తీర్పు ఇస్తూ వచ్చాయి. మన ఆంధ్రప్రదేశ్‌లో బి.సిలలో ఎబిసిడి వర్గీకరణ ఉంది. దీనిమీద ఎవరూ కోర్టుకి కూడా పోయినట్లు లేరు. ఆ వర్గీకరణను అందరూ ఆమోదించారు కూడా. అది ఇతర రాష్ట్రాలలో మాత్రం కోర్టుకు వెళ్లింది. ఆ సందర్భంగానే సుప్రీంకోర్టు పై తీర్పు ఇచ్చింది. కొందరు అందుకోలేకపోతున్నారు, కొందరు అందుకోగలుగుతున్నారు అనుకున్నప్పుడు, వెనకబడిన, మరింత వెనకబడిన అని విభజించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఇవాళ అదీ ఒక సెటిల్డ్ ఫాక్ట్.

మూడవది ఇప్పటికీ నా దృష్టిలో అహేతుకంగా మిగిలిపోయింది ఏమిటంటే మొత్తం రిజర్వేషన్‌లు ఎంత ఉండవచ్చు అనేది. మొదట్నించి 50 శాతం మించటానికి వీల్లేదు మొత్తం రిజర్వేషన్‌లు అని సుప్రీంకోర్టు ఏ రాజ్యాంగపరమైనటువంటి ఆర్గ్యుమెంట్ లేకుండానే అంటూ వస్తోంది. రెండు కేసులలో, కేరళ నుంచి వచ్చినటు వంటి ఎం.ఎస్.థామస్ కేసులో, కర్ణాటక నుంచి వచ్చిన వసంతకుమార్ కేసులో మాత్రమే జడ్జీలు ఎందుకు 50 శాతం అప్పర్ లిమిట్ ఉండాలి, ఉండవలసిన అవసరం ఏముంది, ఎంత రిజర్వేషన్ అవసరమో అంత రిజర్వేషన్ ఇవ్వొచ్చు అన్నారు. అవసరం ఎంత అనేది సాంఘికంగా, విద్యాపరంగా ఎంతమంది వెనుకబడి ఉన్నారు అనే దానిమీద ఆధారపడి ఉంటుంది తప్ప 50 శాతం అనే లిమిట్ ఎందుకు పెట్టాలి అన్నారు. కాని మండల్ కమిషన్ కేసులో కూడా సుప్రీంకోర్టు - అంటే అది ఫుల్‌బెంచ్, 9 మంది

జడ్జీలు కూర్చునే బెంచ్ - మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి మించటానికి వీల్లేదంది. అయితే మీరు పంచాయతీరాజ్ తీసుకుంటే, పంచాయతీరాజ్ చట్టం తరవాత వచ్చినటువంటి ఎన్నికల్లో పెట్టిన  రిజర్వేషన్‌లు దాదాపు 70 శాతం ఉంటాయి. ఎస్‌సిలకు, బిసిలకు, ఎస్‌టిలకు, మహిళలకు, ఓపెన్ కోటాలో మళ్లీ మహిళలకు అన్నీ కలిపితే మొత్తం రిజర్వేషన్‌లు 70 శాతం ఉన్నాయి. దానిని ఎవరూ రాజ్యాంగ విరుద్ధం అనలేదు.  పంచాయతీ పదవులకు లేని అభ్యంతరం విద్య, ఉద్యోగాల్లో ఎందుకు ఉండాలి? విద్య, ఉద్యోగ రంగాల్లో 50 శాతానికే పరిమితం కావాలి అన్న సుప్రీంకోర్టు తీర్పుకి అర్థమేమీ లేదు అని నేను అనుకుంటున్నాను. అయినా సుప్రీంకోర్టు తీర్పుల్ని పార్లమెంట్‌లో సవరణ తీసుకువచ్చి మార్చవచ్చు. సుప్రీంకోర్టులో కూడా అంతకంటే పెద్ద బెంచ్ దీనిని పునఃపరిశీలన చేయవచ్చు. కాబట్టి మనం ఈ విషయంలో ఒక ఆందోళన, ఉద్యమం చేయటం అనేది చాలా అవసరం.

ఇదట్లా ఉంచి మనం ప్రైవేట్ రంగానికి వస్తే నేను ఆర్టికల్ 15,16 అని చెప్పాను. ఆర్టికల్ 16లో పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ అనే మాట వాడారు. ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత ప్రాతినిధ్యం లేనివాళ్ళకు అనే మాట వాడారు. కాని ఆర్టికల్ 15లో అది లేదు. 15(1)లో వివక్ష పాటించటానికి వీల్లేదు అని అంటే ప్రభుత్వం పాటించ టానికి వీల్లేదు  అని మాత్రమే కాదు. ఎవ్వరూ పాటించటానికి వీల్లేదు. ఒక మనిషిగా కులం ప్రాతిపదిక మీద గానీ, పుట్టుక ప్రాతిపదిక మీద గానీ, స్త్రీ పురుషులు అనే ప్రాతిపదిక మీద గానీ, ప్రాంతం ప్రాతిపదిక మీద గానీ, జాతి ప్రాతిపదిక మీద గానీ ఏ రకమైన వివక్షకు నేను గురికాకూడదు. అది నా హక్కు అన్నప్పుడు ఆ వివక్షకు నన్ను ఎవరు గురి చేస్తున్నారనే ప్రశ్న తలెత్తదు. మరి ఆర్టికల్ 15(4)లో ఏం చెప్పారు? సాంఘికంగా, విద్యాపరంగా వెనకబడి ఉన్నవాళ్లకు సదుపాయాలు కల్పించవచ్చు అన్నారు. అయితే ప్రభుత్వ రంగంలో అన్లేదు దాంట్లో కూడా. అలాగని ప్రభుత్వ రంగంలో మాత్రమే అని కూడా అనలేదు. అనకపోగా సాంఘికంగా, విద్యాపరంగా వెనకబడి ఉన్న వాళ్ళకు ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చు అని ఆర్టికల్ 15(4)లో చెప్పింది ఆర్టికల్ 15(1)లో చెప్పినటువంటి సమానత్వానికి మినహాయింపు కాదు, ఇది దాంట్లో భాగమే అని కూడా సుప్రీంకోర్టు తరువాత వ్యాఖ్యానం మార్చుకుంటూ వచ్చింది. అంటే అందర్నీ సమానంగా చూడాలి అనే దానికి మినహాయింపుగా వెనకబడి ఉన్న వాళ్ళకు రిజర్వేషన్లు కల్పించవచ్చు అని చెప్పడం లేదు. వెనకబడి ఉన్నవాళ్ళకు రిజర్వేషన్లు కల్పించవచ్చు అనేది అందర్నీ సమానంగా చూడాలి అనేదాంట్లో భాగమే, దానికి మినహాయింపు కాదు అని కూడా సుప్రీంకోర్టు తర్వాత వ్యాఖ్యానం ఇచ్చింది. మనం ఇవన్నీ కలిపిగానీ చూసుకుంటే ఈ రోజు మనకు ఏమి అర్థమవుతుంది అంటే కులపరంగా, లింగపరంగా, భాషాపరంగా, ప్రాంతపరంగా, జాతిపరంగా వివక్షకు ఎవ్వరూ గురికావడానికి వీల్లేదు అనే దాంట్లో

అంతర్భాగంగానే, వివక్షకు గురి అవుతూ ఉన్నవాళ్ళకు ప్రత్యేక సదుపాయాలు కల్పించ వచ్చు అని. ఇక్కడ ప్రభుత్వమా, ప్రైవేటా అనే దానికేం సంబంధం లేదు. అందువల్ల ఈ కోణం నుండి చూసినప్పుడు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఇవ్వడానికి అడ్డుపడే చట్టమేదీ రాజ్యాంగంలో లేదనేది స్పష్టం. మొత్తంగా ఉన్నటువంటి సమస్యల్లో ఇది సులభమైన సమస్య.

## ఆర్థిక వ్యవస్థే అసలు సమస్య

వేరే సమస్యలు ఎక్కడ ఉన్నాయి మనకు అంటే సమాజంలో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థలో ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉండే ప్రత్యేకమైన రూపాల్లో ఉన్నాయి. ఇవ్వాళ పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్జాతీయంగా ఉంది. దాంట్లో భాగంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను కూడా పునఃరూపొందించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు కావాలి అనే ఆందోళన ఎట్లా చెయ్యాలి? అసలు ప్రైవేటురంగంలో ఈ రోజు ఉద్యోగులుగా ఉన్నటువంటి వాళ్ళు ప్రభుత్వ రంగంలో ఉన్న హక్కులు మాకూ కావాలి అని ఆందోళన చేయటానికే భయపడు తున్నారు. అంతే కాదు. నిన్నమొన్నటి దాకా ప్రైవేటు రంగంలో ఉన్న హక్కుల్ని కూడా ఈ రోజు లేకుండా చేసేస్తుంటే వాటిని మాకు తిరిగి కల్పించండి, అమలు చేయండి అని మాట్లాడటానికి కూడా ఇవ్వాళ భయపడుతున్నారు. ఎందుకంటే ఆందోళన చేస్తే ఉద్యోగాలు పోతాయని భయం. ఆ తర్వాత ఏ కోర్టుకుపోయినా ఉద్యోగం తిరిగి తెచ్చుకోవడం చాలా కష్టం. ఏదో ఈ ఉద్యోగం చేస్తుంటే 500 రూపాయలో, 1000 రూపాయలో, 1500 రూపాయలో వస్తుంది. ఇది కూడా మానుకొని బయటకుపోతే నా పరిస్థితి ఏమిటి అని భయపడే పరిస్థితి ప్రైవేటు రంగంలో ఈరోజు ఉంది. అటువంటప్పుడు ప్రైవేటు రంగం రిజర్వేషన్లు పాటించాలని ఆందోళన చేయటం ఎంత కష్టం!

పైగా ఈ రోజు ప్రైవేటు రంగం ఎట్లా ఉంది మన దేశంలో. పెద్ద కంపెనీలయితే, ఒక్కొక్క కంపెనీలో కొన్ని వేల ఉద్యోగాలు ఉండే కంపెనీలయితే కొంత స్థిరత్వం ఉంటుంది. ఇప్పుడు వస్తున్నటువంటి ప్రైవేటీకరణ అట్లాంటిది కాదు. చాలా భారీ టెక్నాలజీతో వస్తున్న పరిశ్రమలు ఇవి. వీటిల్లో 200 మంది, 250 మంది, 300 మంది మాత్రమే ప్రధాన ఉద్యోగులుగా ఉంటారు. తమ కంపెనీకి అనుబంధంగా జరగాల్సిన అన్ని విషయాలు కూడా కాంట్రాక్టుకి ఇచ్చేసి పనిచేయించుకుంటారు. కాంట్రాక్టు తీసుకునే వాళ్ళు 30 మంది, 40 మంది కూలివాళ్ళని పెట్టుకొని పని చేయించుకుంటారు. ఆ వర్క్ అయిపోయిన తరవాత దాన్ని మూసేస్తాడు. వేరే వర్క్ తీసుకున్నప్పుడు మళ్ళీ 30 మంది కూలివాళ్ళను తీసుకుంటాడు. అంటే వీళ్ళకి భరోసా లేదు, భద్రత లేదు. ఈ

పరిస్థితులలో మనం ఆ తీసుకునే వాళ్ళకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు పాటించాలి అని ఆందోళన చేయటం చాలా కష్టం. అసాధ్యం కాదు కాని చాలా కష్టం. ఇప్పటివరకు కార్మిక ఉద్యమానికి అలవాటులేని కొత్త వ్యూహాలు, పద్ధతులు అనుసరించాల్సిన అవసరం ఉంటుంది. ఇది చాలా సీరియస్‌గా ఆలోచించాల్సిన విషయం. ఎందుకంటే క్రమంగా గవర్నమెంటు శాఖల బాధ్యతల్ని కూడా ఒక్కొక్కటిగా ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయత్నం చేస్తూ పోతున్నారు. ఇప్పటికే టెలీకమ్యూనికేషను, పోస్టలు శాఖల్లో కొన్ని కొన్ని భాగాలను ప్రైవేటైజ్ చేసుకుంటూ పోతున్నారు. రైల్వేలలో క్యాటరింగ్ ఇప్పుడు చాలావరకు ప్రైవేటు అయిపోయింది. టిక్కెట్ల అమ్మకం ప్రైవేటు చెయ్య బోతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఇంకా రాలేదు కాని ఉత్తరాదిలో ఏం చేస్తున్నారంటే మెయిన్ బుకింగ్ కౌంటర్ ఒకటి మాత్రమే రైల్వేస్టేషన్ దగ్గర ఉంటుంది. టిక్కెట్లు మీరు టౌన్‌లో చాలాచోట్ల కొనుక్కోవచ్చు. వాడికి టిక్కెట్లు వీళ్ళు టోకుగా ఇచ్చేస్తారు. వాడు అమ్ముకుంటూ ఉంటాడు. ఆ బుకింగ్ క్లర్క్‌కి ఆ ఉద్యోగం ఎక్కడ నుంచి వస్తుంది? అది ప్రైవేట్‌గా వస్తున్న ఉద్యోగం. ఇవ్వాళ్టిలాగా రైల్వే బుకింగ్ క్లర్క్ ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టుకొని, రిజర్వేషన్లు అమలు చేయించుకుని ఉద్యోగం తెచ్చుకునే అవకాశం పోతుంది. కేవలం ఫ్యాక్టరీ కార్మికులే కాకుండా ఉద్యోగ రంగంలో కూడా ప్రైవేటీకరణ పెరిగేకొద్దీ ఎక్కడివి అక్కడ విడగొట్టేస్తే ఏం చేయగలం? మొత్తం రైల్వేని ఒక టాటాకో, బిర్లాకో అప్పగించేస్తే - అందులో ఇంకా వేలాదిమంది, లక్షలాది మంది కార్మికులుంటే అప్పుడు పోరాడి ఏమైనా సాధించుకోవచ్చేమో. కానీ అట్లా చెయ్యకుండా టిక్కెట్ల బుకింగ్ ఒకడికి, అది కూడా విశాఖపట్నంలో ఒకడికి, విజయ నగరంలో ఇంకొకడికి, రిజర్వేషన్లు ఒకడికి, క్యాటరింగ్ మరొకడికి ఇట్లా వాళ్ల డివైడ్ చేసుకుంటూ పోతే రైల్వే కార్మికులు అనేవాళ్ళు ఇక్కడ కొంతమంది, అక్కడ కొంతమంది ఉంటే పోరాటం అనేది - కార్మికుల హక్కుల కోసమైనా, రిజర్వేషన్ల కోసమైనా - చేయడం చాలా కష్టతరమైనటువంటి విషయం. ఇది ఒక అంశం.

## పెట్టుబడిదారీ లాజిక్

రెండో అంశం ఏమిటంటే ప్రభుత్వం రేపు ఒక చట్టం చేస్తుంది అనుకొందాం. ఒక బిల్లు పాస్ చేస్తుంది పార్లమెంట్‌లో అనుకుందాం. ఇవ్వాళ ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు ఇచ్చేటప్పుడు రిజర్వేషన్లు ఏ రకంగా పాటిస్తున్నారో, అదే రకంగా ప్రైవేట్ రంగంలోనూ పాటించి తీరాలి అని చట్టం చేసిందనుకోండి. దీన్ని అమలు చేయటం వల్ల నాకు నష్టం వస్తుంది, నష్టం వస్తే నేను నడపలేను, నేను కంపెనీని మూసేసి పోతాను అని ఏ పెట్టుబడిదారుడైనా అంటే చట్టం ఏమీ చేయలేదు. 'నాకు నష్టం వస్తుంది, మూసేస్తా' అన్న కంపెనీని తెరవాల్సిందే అనటం చట్టానికి సాధ్యం కాదు. ఏ

కోర్టుకూ సాధ్యం కాదు. ప్రభుత్వానికీ సాధ్యం కాదు. ఇది మనకు కార్మిక ఉద్యమంలో తరచుగా వచ్చే అనుభవమే. వాడి ఆఖరి అస్త్రం అదే. అప్పుడు నీ బిఐఎఫ్ఆర్ ఏమీ చేయలేదు, ఎవరూ ఏమీ చెయ్యలేరు. సిక్ అనే మాట వాడకుండా, నష్టాలు అనే మాట వాడకుండా, వాడు తెరచి పెట్టుకున్నంత కాలమే మనం ఏ పోరాటం అయినా చెయ్యగలుగుతాము అనేది - అది ప్రైవేటు రంగమైనా, పబ్లిక్ రంగమైనా - మనకు తెలిసిన వాస్తవం. నష్టాలొచ్చిన కంపెనీని నడపాలనడం పెట్టుబడిదారీ లాజిక్‌కే వ్యతిరేకం అవుతుంది. లాభాలుంటేనే ఏ ప్రైవేటు కంపెనీ అయినా నడుస్తుంది. దీనిని ఏ రకంగా ఎదుర్కోవాలి? చట్టానికి విరుద్ధంగా మూసేసి వెళ్లిపోయిన వాడిని శిక్షించటానికి ఏ రకమైన చట్టం ఈ రోజు లేదు. పార్లమెంటులో కానీ, అసెంబ్లీలో కానీ పాస్ అయిన ఒక చట్టానికి విరుద్ధంగా ఒక కంపెనీని మూసేస్తే దానికి ఒక పెనాల్టీ, ఒక పనిష్‌మెంట్ పెట్టి దాన్ని అమలు చెయ్యగలిగినప్పుడే రిజర్వేషన్లు కూడా అమలు చేయటం సాధ్యం అవుతుందేమో. ఇవ్వాళ అంతర్జాతీయంగా ఉన్నటువంటి ప్రబలమైన వాతావరణం ఎలాంటిది? ప్రైవేటీకరణ వాతావరణం. అన్ని రకాల సమానత్వ ఆకాంక్షలకు, సాంఘిక సంక్షేమానికి విరుద్ధమైన వాతావరణం. అది చౌక బియ్యం దుకాణాల దగ్గర మొదలుపెట్టి, చేనేత రంగానికి, చేతివృత్తుల రంగానికి, చిన్నతరహా పరిశ్రమలకు ఇచ్చే కొన్ని కేటాయింపులను, బ్యాంకులు రుణాలు ఇవ్వటంలో రైతులకు, చిన్న పారిశ్రామిక వేత్తలకు, స్మాల్ స్కేల్ సెక్టార్‌కు ఇచ్చే ప్రాధాన్యాన్ని - వీటన్నిటిని వ్యతిరేకిస్తూ వస్తున్నాయి ఇవ్వాళ అంతర్జాతీయంగా ప్రబలంగా ఉన్నటువంటి ఈ వాణిజ్య సంస్థలు. ఆ ఒత్తిడిని తట్టుకొని మనం ఇక్కడ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధించుకోవాలి.

ఇదంతా ఎందుకోసం చెప్తున్నాను అంటే, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్‌ని మనం ఒప్పుకుంటాం, ఒప్పుకోవాలి. దానికి రాజ్యాంగపరంగా ఏ సమస్య లేదు అనేది నేను స్పష్టంగా చెప్పగలను. దానిమీద ఎవరైనా చర్చకు రాదలచుకున్నా నేను సిద్ధమే. అయితే ప్రాక్టికల్‌గా, పొలిటికల్ స్ట్రగుల్‌గా దానికున్నటు వంటి ఆటంకాలు ఎంత ప్రబలంగా ఉన్నాయో మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. విడివిడిగా ఇక్కడ, అక్కడ మాటలు కాదు, చాలా బలమైన ఉద్యమం దీనికి అవసరం. ఏ రకమైన ప్రొటెక్షనిజం ఉండటానికి వీల్లేదనేది ఇవ్వాళ అంతర్జాతీయ వాణిజ్య సంస్థల ఒత్తిడి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) అనేది మొన్న మొన్ననే పుట్టింది. దాని స్వభావం ఇంకా మనకు పూర్తిగా తెలియదు కాని, రేపు తెలుసుకో బోతాము. ప్రధానంగా వాళ్ళేమి చేస్తున్నారంటే అంతర్జాతీయ వాణిజ్యంలోని ఒడిదుడుకుల పేరు మీద ఒక దేశంలోని అంతర్గత సాంఘిక, ఆర్థిక విధానాలను వాళ్ళు శాసిస్తున్నారు. ఆ ఒడిదుడుకులు మన దేశానికి ఎప్పుడూ ఉండేవే. మనకు బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ సమస్య ఎప్పుడూ ఉంది. ఎందుకంటే అంతర్జాతీయ

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో మనది ఒక వెనుకబడిన పెట్టుబడిదారీ వ్యవస్థ కాబట్టి మనకు ఎప్పుడు కూడా బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ సమస్యలు ఉంటాయి. దానివల్ల మనం విదేశీ మారక ద్రవ్యం కోసం నిత్యం అప్పులకు పోతూ ఉంటాం. అప్పుడు వాళ్ళేమంటారు అంటే, మీకు ఈ ఇంబాలెన్స్ పోవాలి అంటే మీ అంతర్గత విధానాలలో లోపాలు ఉన్నాయి, వాటిని మీరు మార్చుకోవాలి అంటారు. దాంట్లో ఒకటి వాళ్లేం అంటారు అంటే ఏ రకమైన 'రక్షణలు' కల్పించడానికి వీల్లేదని. వాళ్ళ లాజిక్‌లో రిజర్వేషన్లు ఒక ప్రొటెక్షనిజం.

వాళ్లు ఏ రిజర్వేషన్లయితే ప్రొటెక్షనిజం అంటున్నారో వాటినే మనం ఒక ప్రజాస్వామిక హక్కు అనుకుంటున్నాం. ప్రొటెక్షనిజం ఉండటానికి వీల్లేదు అని చాలా బలంగా వాళ్లు ఒత్తిడి పెడతారు. పెడుతున్నారు. ఇంకా పెడతారు. మనవాళ్ళు గాట్, డంకెల్ ప్రతిపాదనల మీద సంతకం చేసినప్పుడు ఒప్పుకున్న అనేక విషయాలను ఇంకా అమలు చేయటం లేదు. ఎందుకంటే ఈ దేశంలో ఇంకా ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి. ఓట్ల కోసం వాళ్లు ఇంకా జనం దగ్గరకు రావాలి కాబట్టి. ఆ అవసరం తీరిపోయినా, చంద్రబాబునాయుడు ఎంత సుస్థిరంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాననుకుంటున్నాడో, అట్లా ఢిల్లీలో ఎవరైనా వస్తే చాలా మార్పులు రాబోతాయి. ఈ నేపథ్యంలో మనం ఈ రోజు - అంటే పెట్టుబడిదారీ వ్యవస్థకు ఇంటర్నల్‌గా ఉండే లాజిక్‌కు, ఇవ్వాళ ప్రపంచ వ్యాప్తంగా అమలులో ఉన్న ఈ లాజిక్‌కు వ్యతిరేకంగా - ఈ డిమాండ్‌తో ముందుకు వస్తున్నాము. అందువల్ల పిడిఎస్‌యుకు గానీ, ఇక్కడ ఉన్న అనేక సంస్థల సభ్యులు, ప్రతినిధులకు గానీ నేను చెప్పేదేమిటంటే దీనికి చాలా బలమైనటువంటి ఐక్య ఉద్యమం అవసరం. మొట్టమొదట ఈ దేశంలో అధికారం కోసం పోటీపడుతున్న ప్రతి ఒక్క రాజకీయ పార్టీని కమిట్ చేయించాలి దీనికి. అదొక మెట్టు. ఇవ్వాళ జనతాదళ్ వాళ్ళు ఒక్కరే నాకు తెలిసి మొన్నటి వాళ్ళ పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో కమిట్ అయ్యారు ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు ఇస్తామని. అధికారంలోకి వచ్చాక వాళ్లు కూడా దాని ఊసు పొరపాటున కూడా ఎత్తటం లేదనుకోండి. అయినా మ్యానిఫెస్టో వరకైనా వాళ్లు ఒక్కరే కమిట్ అయ్యారు. మిగిలిన వాళ్ళని కూడా మనం కమిట్ చేయించాలి. మ్యానిఫెస్టోలోనూ కమిట్ చేయించాలి, ఆచరణలో కూడా దాని ఊసు ఎత్తేఅంత బలంగా వాళ్ళ మీద ఒత్తిడి మనం పెట్టగలగాలి.

దాని కోసం సమాజంలో చాలా బలమైనటువంటి ఒక చర్చ, ఒక సంవాదం, ప్రజల సమీకరణ, ఉద్యమం జరగాల్సిన అవసరం ఉంది. దీనికి అన్నిటికన్నా ముందు చాలా బలంగా ముందుకు వస్తున్న పెట్టుబడిదారీ లాజిక్ అనేదాన్ని మనం కౌంటర్ చేయాల్సిన అవసరం ఉంది. ఈ లాజిక్ పదేళ్ళ క్రితం ఇంత బలంగా లేదు. సంక్షేమం

కల్పించాలి అని అడిగినప్పుడు దానివల్ల లాభాలు పోతాయి కాబట్టి నువ్వు కల్పించటానికి వీల్లేదు అని పదేళ్ళ క్రితం అనడానికి ఎవరూ ధైర్యం చేసేవాళ్ళు కాదు. తరతరాలుగా ఎవరినైతే వెనకవేసి ఉంచారో వాళ్లు ముందుకు రావటానికి హక్కులు కల్పించాలి అని అంటే ఈ సమానత్వం సాధించుకుంటూ కూర్చుంటే మన ఉత్పత్తి పెరగదు. కాబట్టి ముందు ఉత్పత్తి పెంచుకుందాం. మళ్లా కావాలంటే అందరం పంచుకుందాం అని జవాబు చెప్పటానికి పదేళ్ళ క్రితం భయపడే వాళ్లు, వెనకాడేవాళ్ళు. ఇవ్వాళ ఈ జవాబులన్నీ బాహాటంగా చెప్తున్నారు. ఇవ్వాళ ఇవే భావజాలంగా, పాలక సిద్ధాంతంగా, సమాజంలో చాలామంది ఆమోదించే సిద్ధాంతంగా తయారవుతున్నాయి. దీనిపై మనం సిద్ధాంతపరంగా పోరాడాలి. ఈ భావజాలాన్ని ఎదుర్కోవాలి. తాత్వికంగా ఎదుర్కోవాలి. తార్కికంగా ఎదుర్కోవాలి. ఇందుకోసం రాజకీయ పార్టీల మీద ఒత్తిడి చాలా పెట్టాలి. ఇది చాలా పెద్ద కృషి. దీంట్లో ప్రజాస్వామిక ప్రగతిని కోరేవాళ్ళందరూ కూడా భాగం కావాల్సిన అవసరం చాలా ఉందనేది నేను ప్రధానంగా చెప్పదల్చుకున్న విషయం.

## వర్గీకరణ

రెండవది ఈ రిజర్వేషన్ల వర్గీకరణ అనేటువంటి అంశం. ఇవ్వాళ మనకు చర్చ దళితులలో మాలలు అందుకున్నట్టుగా మాదిగలు రిజర్వేషన్లను అందుకోలేక పోతున్నారు అని కదా! మొత్తంగా ఎస్‌సిలకి మీరు ఇంత కోటా ఇచ్చారు - 14 శాతమో, 15 శాతమో. కొన్ని రాష్ట్రాల్లో కొంచం ఎక్కువ, తక్కువ. అయితే దళితుల్లో ఏ కులం వాళ్లు ఆ ఉద్యోగాలకు పోగలుగుతున్నారు అంటే ఒక కులం వాళ్ళే ఎక్కువగా పోగలుగుతున్నారు. మిగిలిన వాళ్ళు తక్కువగా పోగలుగుతున్నారు. అందువల్ల మా వాటా మాకు వేరు చేసి ఇచ్చేయండి అని చెప్పి ఇవ్వాళ మాదిగలు అడుగుతున్నారు. ఇది ప్రాథమికంగా ఒక ప్రజాస్వామిక డిమాండ్‌గానే మేము భావిస్తున్నాం. పౌరహక్కుల సంఘం భావిస్తున్నది. వ్యక్తిగా నేను కూడా భావిస్తున్నాను. దీని గురించి చర్చ జరగాలి. ఇక్కడ మొట్టమొదట గుర్తించాల్సిన విషయం ఏమంటే ఎంఆర్‌పిఎస్ వాళ్ళు పెట్టిన ఈ డిమాండ్ కొత్తగా ఈ రోజు పుట్టిన డిమాండ్ కాదు. ఇది ఎస్‌సి రిజర్వేషన్లలో మాత్రమే వచ్చిన డిమాండ్ కూడా కాదు. ఒక సెక్షన్‌ను, ఒక వర్గాన్ని, ఒక భాగాన్ని వెనుకబడిన వాళ్ళుగా గుర్తించి రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత దాంట్లోనే కొంతమంది చైతన్యవంతులు అయినప్పుడు, మా వాటా సంగతి ఏంటీ, మొత్తాన్నీ ఒకటిగా చూసినప్పుడు మేం నష్టపోతున్నాం కదా, మాకు విడిగా ఇవ్వండి అని అడగడం అనేది చాలాకాలం నుంచే జరుగుతూ వస్తోంది. నేను ఇంతకుముందు చెప్పినట్లుగా 1953లోనే అప్పటి మైసూర్ రాష్ట్ర ప్రభుత్వం - అప్పుడు కర్ణాటక రాష్ట్రం లేదు, మైసూరు రాష్ట్రమే ఉండేది - వెనుకబడిన కులాల్లో మొదటిసారిగా కొంచెం వెనుకబడిన కులాలు, మరీ వెనుకబడిన

కులాలు అని వేరు చేసింది. ఎందుకోసం వేరు చేసారు అంటే మైసూరు రాష్ట్రంలో మన దేవగౌడగారి కులమైన వొక్కళిగ కులం, మరో కులమైన లింగాయత్‌లు కూడా వెనకబడిన కులం కిందే లెక్క అప్పుడు. ఇప్పుడు కాదనుకోండి. వాళ్ళతో పాటు చాకలివాళ్ళు, మంగలివాళ్ళు అందరూ కూడా దీంట్లోనే ఉంటే రిజర్వేషన్లు అన్నీ దేవగౌడలకే పోతున్నాయి, మాకు దొరకట్లేదు అనేటటువంటి వాదన ముందుకురావడం తో బి.సి రిజర్వేషన్లను రెండుగా - కొంచెం వెనకబడిన కులాలు, మరీ వెనకబడిన కులాలు అని - విభజించారు.

ఆ వర్గీకరణ సుప్రీంకోర్టు దాకా పోతే అట్లా వేరు చెయ్యటానికి వీల్లేదు అని సుప్రీంకోర్టు కొట్టేసింది. అయితే అప్పుడు అసలు కులపరంగా రిజర్వేషన్లే తప్పు అని కొట్టేసింది కాబట్టి వాళ్లసలు ఈ వర్గీకరణ విషయంలోకి ఎందుకు పోయారో నాకు అర్థంకావడం లేదు. కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు ఇవ్వడమే తప్పు అనిన తరువాత దాంట్లో మరీ వెనకబడిన కులాలు, కొంచెం వెనకబడిన కులాలు అనే ఉప వర్గీకరణ కరెక్టా, తప్పా అనే చర్చలోకి సుప్రీంకోర్టు ఎందుకు పోయిందో కాని, ఆ చర్చలోకి కూడా పోయి అది తప్పు అని కొట్టేసింది. ఆ తర్వాత చాలా మారుతూ వచ్చి, ఇవ్వాళ ఇన్ ప్రిన్సిపుల్ అంటే సూత్రబద్ధంగా ఆ ఉపవర్గీకరణ కూడా కరెక్టే అని తీర్పు ఇచ్చింది. అయితే వాస్తవంగా అక్కడ అంత తేడా ఉందా? లేదా? రేషనల్ నెక్సస్ నిజంగా ఉంటే మాత్రమే ఇట్ ఈజ్ వ్యాలిడ్ అంటే అర్థవమైనదే అని చెప్పి కోర్టు తర్వాత తీర్పులు ఇస్తూ వచ్చింది. మన రాష్ట్రంలో వెనుకబడిన కులాల రిజర్వేషన్‌లలో ఎబిసిడి వర్గీకరణ జరిగింది. అది చాలావరకు శాస్త్రీయంగానే జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది బాగుందని ఇతర రాష్ట్రాలు కూడా ఆ రకమైన ఉపవర్గీకరణ చేసుకుంటాము అంటున్నాయి. బీహార్, యుపి మొదలైన ఉత్తరాది రాష్ట్రాలలో ఈ రకమైన చర్చలు సాగుతున్నాయి. అక్కడ యాదవులు, కుర్మీలు, కొయరీలు వంటి వాళ్ళు మాత్రమే గవర్నమెంట్ ఉద్యోగాలు పొందే స్థాయికి వచ్చారు. మొత్తం బిసిలలో వీళ్ళు పొందినంత ప్రయోజనం వేరే వాళ్ళు పొందలేకపోతున్నారు. దాంతో వర్గీకరణ డిమాండ్ అక్కడ కూడా ముందుకు వస్తోంది. అట్లాగే స్త్రీల విషయంలోను.

ఇవ్వాళ పంచాయతీరాజ్ ఎన్నికలలో ఎస్‌సి రిజర్వేషన్‌లో మూడవవంతు స్త్రీలకు ఇచ్చారు. అది కూడా ఒక వర్గీకరణే. బిసి రిజర్వేషన్‌లలో మళ్ళీ మూడవవంతు స్త్రీలకు ఇచ్చారు. అదీ ఒక వర్గీకరణే. ఎస్‌టి రిజర్వేషన్‌లో మళ్ళీ మూడవవంతు స్త్రీలకు ఇచ్చారు. అది కూడా ఒక వర్గీకరణే. అది కూడా ఏ ప్రాతిపదికన జరిగింది? ఎస్‌సిలకు ఇంత రిజర్వేషన్ అని అంటే అన్నీ మగవాళ్ళే తీసుకుంటున్నారు. స్త్రీలు ఎవరూ సర్పంచ్‌లు కాలేకపోతున్నారు. ఎంపిటిసిలు కాలేకపోతున్నారు. కాబట్టి ఏం చెయ్యాలి? నిజానికి జనాభాలో స్త్రీలు సగం ఉన్నారు కాబట్టి సగం ఇయ్యాలి. సరే ఫస్టు స్టెప్‌గా 33 శాతం

అన్నారు. దాన్నెవరూ ప్రశ్నించలేదు. ఎందుకు ప్రశ్నించలేదంటే వాస్తవంగానే రాజకీయాలలో ఇచ్చే రిజర్వేషన్‌లు అన్నీ ఆ కులాల మగవాళ్ళే తీసుకుంటున్నారు కనుక. ఉద్యోగాలలో కంటే రాజకీయాల్లో ఇది ఎక్కువగా జరుగుతోంది. మరి ఆడవాళ్లకు సాధికారత రావడం ఎలా? అధికారం, ఆ అధికారాన్ని చెలాయించటం వలన వచ్చేటటు వంటి ప్రయోజనాలు, తమను తాము అభివృద్ధి చేసుకునే అవకాశాలు ఇవన్నీ ఎలా రావాలి? అధికారం చెలాయించటం వలన ఎంత ప్రయోజనం వస్తుంది అనేది వేరే ప్రశ్న. కాని ఒక మనిషిని శ్రమ విభజనలో నువ్వు దీనికే కట్టుబడి ఉండాలి అని నిర్దేశించడం చాలా అన్యాయం. నువ్వు సర్పంచ్ కావటానికి వీలులేదు. నువ్వు వంట మాత్రమే చేయాలి. పిల్లల్ని కని పెంచుతూ ఉండాలి. నువ్వు తల్లివి, నువ్వు భార్యవి అనే ఆ శ్రమ విభజనే తప్పు. సర్పంచ్ అయితే ఆమె ఏం సాధిస్తుంది? సర్పంచ్‌కు ఏం అధికారాలు ఉన్నాయి అంటుంటారు. మరి నువ్వు మాత్రం సర్పంచ్ ఎందుక్కావాలి? ప్రతి మనిషీ - మనిషికి సాధ్యమయ్యే అన్ని పనులు చేసే అవకాశాన్ని కలిగి ఉండాలి. అది ఒక ప్రాథమికమైనటువంటి మానవ హక్కు. కాబట్టి ఆ రకమైనటువంటి వర్గీకరణ జరిగింది. ఆ వర్గీకరణను ఎవరూ వ్యతిరేకించలేదు.

## వికలాంగుల్లోనూ వర్గీకరణ డిమాండ్

ఇవాళ వికలాంగులలో ఒక డిమాండ్ ముందుకు వస్తున్నది. ఒక సంవత్సరం కింద హైదరాబాద్‌లో వాళ్ళు ధర్నా చేశారు. వారికి 3 శాతం రిజర్వేషన్ ఉంది ఉద్యో గాలలో, విద్యారంగంలో. వికలాంగులలో మూడు రకాలవాళ్ళు ఉన్నారు. అంధులు, మూగ-చెవిటివారు, కాళ్లూ చేతుల వైకల్యం ఉన్నవాళ్లు. ఈ ముగ్గురిలో అంధులకు, మూగ-చెవిటివాళ్ళకు ఉన్నటువంటి వైకల్యం ఎక్కువ. ముఖ్యంగా విద్య విషయంలో. అందువల్ల మూడో కేటగిరీకి చెందిన వికలాంగులే ఎక్కువగా ఉద్యోగాలు పొందు తున్నారు. వాళ్ళు చెప్పేంతవరకు మాకు తెలియదు ఆ సంగతి. వాళ్లిప్పుడు ధర్నా చేస్తున్నారు. మన వెంకటేశ్వర్లు ఉన్నాడనుకోండి, ఈయనతో సమానంగా ఒక కళ్ళులేని అతను, నోరులేని అతను, చెవులులేని అతను ఎట్లా పోటీపడతాడు? పోటీ పడలేరు కదా. ఈయనకే వస్తుంది. ఎందుకంటే ఇవ్వాళ మెరిట్ అని, సామర్థ్యం అని ఏదైతే పిలవబడుతుందో, దానికి ఏదైతే ప్రమాణంగా ఉందో, ఆ ప్రమాణాలు పొందటంలో ఈయనకు అంత ఇబ్బంది లేదు. కళ్ళులేని వాళ్ళకు, చెవులులేని వాళ్ళకు, నోరులేని వాళ్ళకు ఎక్కువ ఇబ్బంది. వాళ్ళు పుస్తకాలు చదవలేరు, పంతులుగారి పాఠం వినలేరు. అందుకే వాళ్ళేమి అడుగుతున్నారు అంటే ఈ మూడు శాతాన్ని ముగ్గురికీ ఒక్కొక్క శాతంగా వేరు చేసి ఇవ్వండి అంటున్నారు. అప్పుడే మాకు న్యాయం జరుగు తుంది అంటున్నారు. ఇది అహేతుకం కాదు కదా!

నష్టపోయిన వాళ్ళు మాట్లాడేంతవరకు వేరే ఎవరికీ విషయం అర్థం కాదు. వాళ్ళు చెప్తేనే కదా అర్థమయ్యేది. ఐదేళ్ళ కింద, పదేళ్ళ కింద కులం అనేది ఇంత పెద్ద సమస్యని మాకు తెలియదు. తెలియదు అంటే దళితులు మాట్లాడలేదు కాబట్టి, నేను బ్రాహ్మణ కులంలో పుట్టాను కాబట్టి కులం పెద్ద సమస్య అని నేననుకోలేదు. అదేదో ఉపరితల సమస్య అని అనుకున్నా. వాళ్ళు మాట్లాడడం మొదలుపెట్టాక అర్థం చేసుకున్నాం. మనందరి ఇళ్ళల్లో స్త్రీలు ఉంటారు కదా. మనందరికీ చెల్లెళ్ళు ఉంటారు, అక్కలు ఉంటారు, అమ్మలుంటారు, వదినలుంటారు, భార్యలుంటారు. వాళ్ల సమస్య ఏందనేది వాళ్లు చెప్పేంతవరకు మనకు అర్థం కాలేదు. మనమే వాళ్ళ సమస్య అని వాళ్ళు చెప్పేంతవరకు మనకు అర్థం కాలేదు. అట్లా నేను గుడ్డివాడిని కాదు, అవిటి వాడిని కాదు, చెవిటివాడిని కాదు, మరి నాకెట్లా అర్థం కావాలి వాళ్ళలో ఎవరు ఎక్కువ పొందగలుగుతున్నారు, ఎవరు ఎక్కువ పొందలేకపోతున్నారని. ఆ గుడ్డివాళ్ళే ధర్నా చేసి ఇక్కడ ఒక పౌరహక్కుల సంఘం ఉందంట, గుడ్డివాళ్లు పౌరులు కాదా, మీరు వస్తారా రారా మా దగ్గరికి అంటే అప్పుడు మేము వాళ్ళ దగ్గరికి పోతే, వాళ్ళు చెబితే మాకు అర్థం అయ్యింది. ఆ తరువాత లెక్కలు తీస్తే వికలాంగుల రిజర్వేషన్‌లో అవిటి వాళ్ళే ఎక్కువ వాటా పొందగలుగుతున్నారని మాకు స్పష్టంగా అర్థమైంది. వాళ్ళు చెప్పినాక కారణం కూడా స్పష్టంగా అర్థమవుతుంది మనకు. ఇప్పుడు వాళ్ళు తమ ముగ్గురికీ ఒక్కొక్కశాతంగా వేరు చేసి ఇవ్వండి అంటున్నారు. అది న్యాయమైన డిమాండే అని నేను అనుకుంటున్నాను. అయితే ఇది ఇంకా పెద్ద ఆందోళనగా ముందుకు రాలేదు కాబట్టి సమాజంలో చర్చ కాలేదు. లేకపోతే అది కూడా పెద్ద చర్చ అయి ఉండేది.

## ఆదివాసులలోనూ....

అట్లాగే ఆదివాసులలో. ఇది ఈ రోజు తెలంగాణ జిల్లాల్లో మొదలయింది. ఇతర ప్రాంతాలలో కూడా రావచ్చు. తెలంగాణ జిల్లాల్లో లంబాడా, గోండు, కోయ ప్రధానమైనటువంటి ఆదివాసీ తెగలు. ఇవి కాక నాయకకోళ్ళు అని, కోలాములు అని, ఖమ్మం జిల్లాలో కొండరెడ్లు అని వేరే తెగలు కూడా ఉన్నాయి. ఎక్కువగా ఎస్‌టి రిజర్వేషన్ ఎవరు పొందగలుగుతున్నారు అంటే లంబాడాలు పొందగలుగుతున్నారు. మీరు ఏ కాలేజీకైనా పోండి, ఏ ఆఫీసుకైనా పోండి, ఎక్కడికైనా పోండి ఎక్కువభాగం ఎస్‌టి రిజర్వేషన్లు లంబాడాలకే వస్తున్నాయి. ఇక్కడున్న మన కిషన్‌గారు కూడా తప్పకుండా ఒప్పుకుంటారని నేననుకుంటున్నాను. ఇది చాలాకాలంగా సాగుతోంది. ఇది జరగడానికి కారణం లంబాడాలు కావాలని ద్రోహం చేసి కోయ వాళ్ళను, గోండు వాళ్ళను మోసం చేశారని కాదు. ఒక్కొక్కరి జీవన విధానంలో తేడాలుంటాయి. లంబాడాలు ముందునుంచి కూడా అడవి కంటే మైదాన ప్రాంతాలలో ఎక్కువ ఉన్నారు. గోండ్లు, కోయలు ఎక్కువగా అడవిలో ఉన్నారు. లంబాడాల జీవన విధానంలో

మొదటనుంచి కూడా వాళ్ళకు మారకంతో పరిచయం ఉంది. అంటే వ్యాపారంతో వాళ్ళకు పరిచయం ఉంది. మొఘల్ ప్రభువులు దక్కన్‌కు సైన్యాలను పంపిన రోజుల నుంచే ఆ సైన్యానికి ఈ పక్క, ఆ పక్క ప్రయాణిస్తూ వాళ్ళకు తిండిగింజలు అమ్మె వ్యాపారం చేసిన వాళ్ళు బంజారాలు. 400 ఏళ్ళ కిందటి సంగతది. ఆ బంజారాల కొనసాగింపే ఇవ్వాళ మనం లంబాడాలు అని పిలుస్తున్నవాళ్లు. రాయలసీమలో వాళ్లను సుగాలీలు అంటారు. మారకంతో పరిచయం ఉన్నవాళ్ళు కనక ఆధునిక మారకపు వ్యవస్థలో కూడా వీళ్ళు సులభంగా పైకి పోగలుగుతారు.

మైదాన ప్రాంతాలలో బతికేవాళ్ళకు మైదాన ప్రాంతాల సంస్కృతి, దాంట్లో భాగంగా ఉండే విద్య, పుస్తకాలు, పుస్తక చదువు - ఇవన్నీ కూడా తొందరగా ఒంటబడతాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో చాలా వెనుకబడినటువంటి చెంచు తెగ ఉంది. నల్లమల అడవుల్లో, మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలో బతుకుతారు వీళ్ళు. వీళ్ళకోసం మన్ననూరు అనే ఊళ్ళో ఒక ఐ.టి.ఐ పెట్టారు. అక్కడ చెంచులు చాలామంది ఉన్నారు కాబట్టి చెంచుల పిల్లవాళ్ళు చదువుకొని కనీసం టెక్నీషియన్‌లు అవుతారని దాన్ని అక్కడ పెట్టారు. అయితే చెంచుల కోసమే అని పెడితే సమస్య వచ్చేది కాదు. మేము ఒక సంవత్సరం పోతే అక్కడ ఉన్న 105 సీట్లలో 101 మంది లంబాడాలు ఉన్నారు. నలుగురే చెంచులు ఉన్నారు. లంబాడాలేమీ ద్రోహం చేసి, మోసం చేసి ప్రవేశం సంపాదించుకోలేదు. ఎస్‌టి రిజర్వేషన్‌లో అప్లయ్ చేశారు. సీటు వచ్చింది. చెంచులకు అప్లయ్ చెయ్యాలనే తెలియదు. అప్లికేషన్లు పెట్టుకున్నా క్వాలిఫికేషన్లు సరిగా ఉండవు. ఎందుకంటే వాళ్ళు అడవుల్లో బతుకుతారు. వాళ్ళకు వ్యవసాయమే సరిగ్గా తెలియదు ఇంకా. చెంచుల్లో కొద్దిమందే వ్యవసాయం చేస్తారు. మిగిలిన వారు ఇప్పటికి కూడా కట్టె కొట్టుకొని అమ్ముకొని బతుకుతారు. తెలంగాణలో గోండ్లు, కోయలు మరీ అంత వెనుకబడి లేరు. వ్యవసాయం బాగానే చేస్తారు. కానీ లంబాడాలతో పోలిస్తే వెనకబడి ఉన్నారు. వాళ్లు వర్గీకరణ డిమాండ్ చేస్తున్నారు. రాజకీయాలలో ఈ డిమాండ్ ఏమవుతుంది అంటే ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఎస్‌టికి రిజర్వ్ అయితే - అది టీడీపీ అయినా, కాంగ్రెస్ అయినా, ఎవ్వరైనా - గతంలో లంబాడాలకు ఇచ్చేదాన్ని ఇప్పుడు కోయలకివ్వటం మొదలుపెట్టారు, గోండ్లకు ఇవ్వటం మొదలుపెట్టారు. ఇవ్వాళ గిరిజన సంక్షేమమంత్రి నగేష్‌గారు గోండు. చాలాకాలం భీంరావు అని, రాంరావు అని ఉండేవాళ్ళు. అదిలాబాద్ జిల్లాలో లంబాడాల తర్వాత రాజకీయాల్లోకి మొట్టమొదట వచ్చినటువంటి వారు గోండ్లు. వరంగల్‌లో జగన్‌నాయక్, రవీంద్రనాయక్ ఉండేవాళ్ళు ఇదివరకు. ఇవ్వాళ మొట్టమొదటిసారిగా వేరే ఒక ఆయన వచ్చాడు. ఆయన కోయ. రాజకీయాలలో ఈ విధమైన ఒత్తిడి పెట్టి సాధించుకోగలుగు తున్నారు. అదే విధంగా ఇవాళ ఉద్యోగాలలో, విద్యారంగంలో రిజర్వేషన్లు కావాలి అనే డిమాండ్ ముందు

కొస్తోంది. ఆ వర్గీకరణ కోసం మొన్ననే కోయ విద్యార్థి సంఘం ఒక తీర్మానం పాస్ చేసింది. ఆ తీర్మానం కాపీ కూడా మాకు ఇచ్చారు. ఆ ఉద్యమం కూడా ముందుకు రాబోతోంది. ఎందుకు చెప్తున్నానంటే ఈ మాట - ఎంఆర్‌పిఎస్ డిమాండ్ మీద మన రాష్ట్రంలో చాలా ఆవేశపూరితంగా చర్చ జరుగుతున్నది. అదేమీ మొట్టమొదటి సారి వచ్చింది కాదు. పైగా ఎస్‌సిలలో మాత్రమే వచ్చినటువంటి చర్చ కూడా కాదు.

## ద్రోహం అనొద్దు

రిజర్వేషన్లు కల్పించేటపుడు ఒక కేటగిరీని మొట్టమొదటగా గుర్తించడం జరుగుతుంది. వాళ్ళకు ఇవ్వటం జరుగుతుంది. దాంట్లో ఉపవర్గాలు తాము కొంత చైతన్యపరులై ఆలోచనాపరులైనప్పుడు, మాకు సమానంగా రావడం లేదే అనుకున్నప్పుడు మాకూ రావాలి అని డిమాండ్ చేయటం న్యాయమే. ఎంఆర్‌పిఎస్ వాళ్ళకు మేం చెప్పిందీ, బహిరంగ సభల్లో చెప్తుందీ కూడా ఏమిటంటే మాలవాళ్ళు ద్రోహం చేసి దీన్ని పొందారు అనే పద్ధతిలో ఆర్గ్యుమెంట్ పెట్టడం కరెక్ట్ కాదు అని. అట్లానే కోయలు, గోండ్లు కూడా లంబాడాలు మాకు ద్రోహం చేసి తీసుకున్నారనటం న్యాయం కాదు. అందరికీ కలిపి ఇచ్చిన రిజర్వేషన్లు అవి. ఇప్పుడు మా వాటా మాకిచ్చేయండి, మనం స్నేహితుల్లా కలిసి బ్రతుకుదాం అనే పద్ధతిలో డిమాండ్ పెట్టండి. అది న్యాయంగా ఉంటుంది. అది వాళ్ళకిచ్చే సలహా అయినప్పటికీ మౌలికంగా ఈ డిమాండ్ న్యాయమైనది అనే భావించటం జరుగుతోంది. ఒక ఆర్గ్యుమెంట్ ఏం వస్తోంది అని అంటే అసలు నిజంగా అంత అసమానత ఉందా అని. ఇక్కడ విశాఖపట్నంలోనే చర్చించినప్పుడు ఇద్దరు ముగ్గురు ఆ మాట అన్నారు. తర్వాత ఈ విషయమై సెక్రటేరియట్‌లో మన మాధవరావుగారు, అర్జునరావుగారు - అంటే మాలకులానికి చెందినటువంటి ఐ.ఏ.ఎస్ ఆఫీసర్లని కలిసి మాట్లాడినప్పుడు వాళ్ళూ ఉందనే అన్నారు. వాస్తవంగానే ఉంది తేడా, లేకుండా ఏమీ పోలేదు. ఒక కులం వాళ్ళు ఎక్కువ రాగలుగుతున్నారు, వేరే వాళ్ళు అందుకోలేకపోతున్నారు కాబట్టి వాళ్ళది సకారణమైన డిమాండే. వర్గీకరణ ఏ రూపంలో జరగాలా అనేదానిపై ఇవ్వాళ ఒక కమిషన్ ఉంది. దానికి సంబంధించి ఎంఆర్‌పిఎస్ వాళ్ళు పెట్టేటటువంటి ప్రతిపాదన ఎ,బి,సి,డి అని నాలుగుగా విభజించాలని. మాల కులం ఒకటి, మాల రిలేటెడ్ ఒకటి, మాదిగ ఒకటి, మాదిగ రిలేటెడ్ ఒకటి అని పెట్టారు. నేననుకోవడం అట్లా చేస్తే ఏమవుతుంది అంటే జనాభా రీత్యా తక్కువగా ఉన్నవాళ్ళకి అందటం చాలా కష్టం. మాల, మాదిగ కాకుండా మిగిలిన ఎస్‌సి కులాలు జనాభా రీత్యా చాలా తక్కువ. వాళ్ళకు మీరు సపరేట్ చేసేస్తే ఏమవుతుంది అంటే రోస్టర్‌లో వాళ్ళ పాయింట్ రావటం చాలా ఆలస్యమవుతుంది. అందువల్ల అట్లా చెయ్యకుండా రెండుగా మాత్రమే విభజించి - అందుకోగలగుతున్నవాళ్ళు, అందుకోలేకపోతున్న వాళ్ళు, ఎ,బిలని రెండుగా డివైడ్ చేసి ఉమ్మడి రోస్టర్

పెడితేనే, రోస్టర్‌లో వాళ్ళ పాయింట్ అనేది రావడం సాధ్యం అవుతుంది. లేకపోతే ఇక్కడున్న రెల్లి కులం కానీ, తెలంగాణలో నేతకాని, మన్నెపు ఇటువంటి కులాల వాళ్ళకు, జనాభా తక్కువగా ఉండటం వల్ల 100 ఉద్యోగాలలో ఒక్క ఉద్యోగం మాత్రమే, 99వ ఉద్యోగం వాళ్ళకు ఉండొచ్చు. ఆ తర్వాత మళ్ళా 198వ ఉద్యోగం వాళ్ళకు ఉంటుంది. ఈ మధ్యలో వాళ్ళకు ఎప్పుడూ పాయింట్ అందదు. అట్లా చేయకుండా ఉంటే బావుంటుందని నా ఉద్దేశం. అయినా అవి ఏ రూపంలో జరగాలి అనే చర్చకు సంబంధించినటువంటి విషయాలు. ప్రిన్సిపుల్‌కి సంబంధించినవి కావు. ప్రిన్సిపుల్ మాత్రం వాస్తవంగానే రిజర్వేషన్లు అందుకోవటంలో తేడా ఉంది కాబట్టి - గ్రామీణ సమాజంలో కూడా ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనేటటువంటి భావన ఉంది కాబట్టి ఆ వర్గీకరణ, అట్లాగే వికలాంగుల వర్గీకరణ, అట్లాగే ప్రతి రిజర్వేషన్ కేటగిరీలో స్త్రీలకు సపరేట్ వర్గీకరణ, అట్లాగే గిరిజన తెగల్లో వర్గీకరణ అన్నీ న్యాయమైనవే.

ఇట్లా ఎంత దూరం చీల్చుకుంటూ పోతాం అనే ప్రశ్న చాలాసార్లు వస్తుంది. కొత్తగా ఏ ఉద్యమం ముందుకు వచ్చినా ఇట్లా ఎంత దూరం పోతారు మీరు అనే ప్రశ్న ఎప్పుడూ వస్తుంది. రిజర్వేషన్‌ల చర్చ మొదలైనప్పుడే ఇట్లా ఎంత దూరం పోతారు మీరు, ఎంతకని చీలుస్తారు కార్మికవర్గాన్ని, పేద ప్రజానీకాన్ని అని వచ్చింది. స్త్రీలు మాట్లాడటం మొదలు పెట్టినప్పుడు ఇట్లా ఎంత దూరం పోతారు మీరు, ఎన్ని కుటుంబాలను నాశనం చేస్తారు మీరు అని వచ్చింది. ఇప్పటికీ వస్తూనే ఉంది ఈ ఆర్గ్యుమెంట్. ఎంత దూరం పోతారనేది మొదట మనం ఈ ఉద్యమాలని రానిచ్చి, వాటిని ఆహ్వానించి, చర్చించి ఆ క్రమంలోనే తేల్చుకుందాం. ముందే గిరిగీసి పెట్టొద్దు అనేది మా విజ్ఞప్తి. అందరూ బాధ్యతాయుతంగా ఉండాలి - ఉద్యమాలను చేసే వాళ్ళైనా, ఉద్యమాలను పరిశీలించే వాళ్ళైనా, విమర్శించే వాళ్ళైనా. ముందుగానే గిరిగీస్తే ఏమవుతుంది అంటే మనకు విషయం పూర్తిగా అర్థం కాకముందే గిరిగీసేస్తాం. ముందుగానే గీత గీసేసి మహిళా ఉద్యమం ఇది దాటిపోవద్దు, రిజర్వేషన్ల ఉద్యమం ఇది దాటిపోవద్దు అని మాట్లాడితే మనకు విషయం పూర్తిగా అర్థం కాకముందే, సానుభూతి పూర్తిగా ఏర్పడక ముందే గిరిగీసిన వాళ్ళం అవుతాం. అట్లా కాకుండా ఇది కూడా న్యాయమైన కోరిక అనే విషయం మన చైతన్యంలో భాగం అయిపోయిన తరవాత, బాధ్యతాయుతంగా ఆలోచించినప్పుడు, అప్పుడు గిరిగీసుకోవటానికి మనకు అవకాశం ఉంటుంది. అట్లాకాకపోతే కొత్తగా ఏ ఉద్యమం ముందుకు వచ్చినా ఎంత దూరం పోతారు అనే ప్రశ్న వస్తుంది. ఇవ్వాళ ప్రత్యేక తెలంగాణ, ప్రత్యేక రాయలసీమ అని అంటే అప్పుడే చాలా జోకులు, వెక్కిరింతలు కూడా వస్తున్నాయి. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ అంటున్నారు, రేపు కరీంనగర్ కంటే వరంగల్ వెనకబడింది, అవి కూడా ప్రత్యేక వరంగల్, ప్రత్యేక కరీంనగర్ అయిపోతాయా అంటే అవుతాయో, కాదో,

అంత దూరం పోవాలో, పోవద్దో ఇప్పుడే పెట్టొద్దు ఆ గీత. ఆ చర్చ ఇప్పుడే తీసుకురావటం కరెక్ట్ కాదు. ప్రస్తుతం ఉద్యమం ముందుకు వచ్చింది. వాస్తవంగా వెనుకబాటుతనం ఉందా లేదా? వివక్ష ఉందా లేదా? చూద్దాం. ఆ చర్చించే క్రమంలో ఎంత దూరం పోతాం అనేది నిర్ణయించుకుందాం. బాధ్యత అనేది ఇక్కడ ప్రధానమైన అంశం. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉండేటట్లయితే ఎంత దూరం పోతాం అనేది నిర్ణయం కావటం సాధ్యమవుతుంది. అన్ని రకాల సెక్షనల్ ఉద్యమాలు - ఒక వెనకబడ్డటువంటి ప్రాంతంగాని, కులం గాని, వర్గం గాని, స్త్రీలుగాని - వాళ్ళ హక్కుల కోసం నడిచే ఉద్యమాల విషయంలో, వాళ్ళు, ఇతరులు కూడా దీన్ని పాటిస్తే బాగుంటుందనేది మా సలహా. నేను ఇక్కడితో ఆపేసి ఈ రెండు విషయాల మీద మీరు ప్రశ్నలు ఏమన్నా అడిగితే జవాబు చెప్తాను. తరువాత 1/70 గురించి మాట్లాడతాను.

## ప్రశ్నలు - జవాబులు

ప్రశ్న : ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టుబడిదారీ వ్యవస్థ లాజిక్‌కే వ్యతిరేకం కదా. రిజర్వేషన్లు ఇవ్వాలని బలవంతంగా చట్టం చేసే బదులు రిజర్వేషన్లు ఇచ్చే ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహించవచ్చు కదా?

జవాబు : ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని బలవంతంగా చట్టం చేసే బదులు వాళ్ళకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాయితీలు ఇవ్వవచ్చు కదా అన్నారు. అది కొంతవరకు అట్రాక్టివ్ ఆర్గ్యుమెంటే కాని ఇప్పుడు గవర్నమెంట్ పబ్లిక్ సెక్టార్‌ను ఎందుకు నడపలేకుండా ఉన్నామంటే డబ్బులు లేవని అంటూ ఉంది. అంటే డబ్బులు లేకనే పబ్లిక్ సెక్టార్ నడపలేకుండా ఉన్నాం అన్నప్పుడు, ప్రైవేటీకరించి, ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్ల కోసం రాయితీలు, పైసలు వాళ్ళకు ఇవ్వాలి అని అంటే దానికి ప్రభుత్వం సిద్ధపడుతుంది అని నేను అనుకోను. మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థే అమానుషమైనది. అయితే అది ఇవ్వాళ ఉంది. దాని లాజిక్‌ను స్టెప్ బై స్టెప్ మనం కౌంటర్ చేసుకుంటూ రావాలి. దాంట్లో ఒక అంశం తప్పనిసరిగా నువ్వు సామాజిక న్యాయం అన్నదాన్ని గుర్తించాలి. ప్రైవేటు పెట్టుబడితో పెట్టినా సరే రిజర్వేషన్లు కల్పించాలి, కార్మికుల హక్కులను గుర్తించాలి. సంఘాలు పెట్టుకునే హక్కుని గుర్తించాలి. లాకౌట్, లే ఆఫ్, రిట్రెంచ్‌మెంట్ - వీటి విషయంలో అంతా నీ ఇష్టం కాదు, హైర్ అండ్ ఫైర్ ఉండటానికి వీలులేదు. ఇవన్నీ కూడా పెట్టుబడిదారీ లాజిక్ మీద పరిమితులు పెడతాయి. ఉద్యోగులను తీసుకుంటే తీసుకుంటాం, తీసేస్తే తీసేస్తాం. ఇది పెట్టుబడి దారీ లాజిక్‌కి అవసరం. ఇష్టం లేకపోతే మూసేస్తాను, ఇష్టం ఉంటే నడుపుతాను. ఇదీ పెట్టుబడిదారీ లాజిక్‌కి అవసరం. ధరల మీద ఏ రకమైన అదుపు పాటించను. ఇది కూడా పెట్టుబడిదారీ లాజిక్‌కి అవసరం. వీటన్నింటి మీద మనం పరిమితులు పెట్టుకుంటూ వస్తున్నాం చాలాకాలంగా.

పారిశ్రామిక వివాదాల చట్టంలో సెక్షన్ 25కు ఉపక్లాజ్‌లు చాలా కలిపారు. ఏమని? రిట్రెంచ్‌మెంట్ గానీ, లే ఆఫ్ గానీ, లాకౌట్ గానీ నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యటానికి వీల్లేదు, గవర్నమెంట్ పర్మిషన్ తీసుకోవాలి అని. పెట్టుబడిదారీ లాజిక్ మీద అదొక నిర్బంధం. అట్లా ఆ లాజిక్‌ను కౌంటర్ చేస్తూ రిజర్వేషన్లు కూడా పెట్టాలి అన్నది తీసుకురావటం కష్టమేమీకాదు. ఇప్పటివరకు లేదు కాబట్టి కొత్తగా అనిపిస్తుంది. అంతే. 100 శాతం పెట్టుబడిదారీ లాజిక్ ఇవ్వాళేమీ అమలు కావట్లేదు. చాలా సామాజిక నియంత్రణ దానిమీద ఉంటూ వస్తున్నది. పెట్టుబడి గుత్తాధిపత్యం మీద నియంత్రణ ఉంది, విదేశీ పెట్టుబడి ఎంత దామాషాలో ఉండొచ్చో ఫెరా కింద నియంత్రణ ఉండేది. లేబర్ చట్టం కొంత నియంత్రణ పెట్టింది. అట్లా మనం రిజర్వేషన్‌ల ద్వారా కూడా వాళ్లమీద నియంత్రణ పెట్టొచ్చు. అక్కడ సమస్య లేదు.

సమస్య ఎక్కడ అంటే అసలు గతంలో ఉన్నటువంటి నియంత్రణ కూడా ఉండటానికి వీల్లేదు, మొత్తం తీసెయ్యాలి అని ఇవ్వాళ అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిడి అసలు సమస్య. అటువంటి నేపథ్యంలో కొత్త నియంత్రణ మనం పెట్టగలమా అనేది సమస్య. ఎప్పటికప్పుడు వీలైనంత ఎక్కువగా పెట్టుబడి సంచయం జరగాలన్న లాజిక్‌కు రిజర్వేషన్‌లు వ్యతిరేకం కదా అంటే ఆ లాజిక్‌కు వ్యతిరేకం అయిన అనేక అంశాలు ఇప్పటికే అమలు అవుతున్నాయి. కార్మికుల హక్కుల అమలు అవుతున్నాయి. యూనియన్‌లు పెట్టుకునే హక్కు అమలవుతున్నది. సమ్మె చేసే హక్కు అమలవుతున్నది. ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్‌లో సెక్షన్ 25 ఎన్,ఓ,ఎంలు అమలవుతున్నాయి. ఎంఆర్‌టీపి యాక్ట్ అమలయింది. ఫెరా యాక్ట్ అమలయింది. కంపల్సరీగా 8.33 శాతం బోనస్ ఇవ్వాలి అన్నటువంటి రూల్ కూడా అమలవుతున్నది. ఇవన్నీ పెట్టుబడిదారీ లాజిక్‌కి వ్యతిరేకమే. కాబట్టి రిజర్వేషన్ కూడా అమలు కావచ్చు. కాబట్టి సమస్య ఎక్కడా అంటే ఇప్పటిదాకా అమలవుతున్న ఈ అన్ని రకాల నియంత్రణలూ తీసెయ్యాలి, వాటిల్లో ఏదీ ఉండటానికి వీల్లేదు అన్నటువంటి వాతావరణంలో మనం ఈ డిమాండ్ పెడుతున్నాం. అక్కడ మనకు అదనంగా సమస్య వస్తున్నది.

ప్రశ్న : ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమల్లో పర్మనెంట్ పనులు కూడా కాంట్రాక్టు పద్ధతిలో చేయించుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ ఎట్లా సాధ్యపడుతుంది?

జవాబు : ఇప్పుడు చెప్తూ వచ్చిన సమస్యలలో అది ఒకటి. మనం డిమాండ్ ఒక నేపథ్యంలో పెడుతున్నాము. ఒక పర్మనెంట్ లేబర్ ఫోర్స్ లేకుండా మొత్తం పనిని కాంట్రాక్టు పద్ధతిలో చేయించుకొనేటటువంటి పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమల్లో పర్మనెంట్‌గా అవసరమైన పనుల్ని కాంట్రాక్టు పద్ధతిలో చేయించుకోవచ్చునా అంటే,

చేయించుకోకూడదు అని కోర్టులు చెప్తున్నాయి. కాని వాళ్ళు దానిని పర్మనెంట్ పని కాదని, టెంపరరీగా అవసరమైనది అని చూపించుకుంటూ వస్తున్నారు. అప్పుడప్పుడు కోర్టులు ఒక రకంగా తీర్పు ఇస్తే, అప్పుడప్పుడు ఇంకొక రకంగా తీర్పు ఇస్తాయి. పరిస్థితి అది. మీరు అడిగిన ప్రశ్న వాస్తవమైనదే. అందుకే క్లిష్టమైన పరిస్థితుల్లో మనం ఈ డిమాండ్ పెడుతున్నాం అని చెప్పాను. అందువల్ల ఈ డిమాండ్ సాధించుకోవాలి అంటే చాలా బలమైన రాజకీయ సంకల్పం మనం కలిగించగలగాలి - పార్టీలలో కాని, ప్రజల్లో కాని, ఉద్యమాలలో కాని. దానికి చాలా కృషి చేయవలసిన అవసరం ఉంటుంది.

ప్రశ్న : గోదావరి జిల్లాల్లో బిసిలుగా ఉన్న అగ్నికుల క్షత్రియులను ఎస్‌టిలలో చేర్చాలి అనే డిమాండ్ సహేతుకమేనా?

జవాబు : అగ్నికుల క్షత్రియులు శ్రీకాకుళంలో కూడా ఉన్నట్టున్నారు. కోస్తా జిల్లాల్లో గోదావరి తీరం నుండి పైకి ఉన్నట్టున్నారు. అన్నిచోట్ల ఒకేరకంగా లేరు అనేది నా అభిప్రాయం కూడా నేను చూసిన మేరకు. కాట్రేనికోనలో అంటే గోదావరి లంకల్లో చూస్తే చాలావరకు ఆదివాసీ లక్షణాలు కన్పిస్తాయి వాళ్ళలో. శ్రీకాకుళం తీరంలో చూస్తే అంతగా కనిపించవు. ఎస్‌టిలలో చేర్చాలి అన్న డిమాండ్ మనం ఆమోదించాలా లేదా అంటే వాళ్ళ జీవన విధానం ఆదివాసీ జీవన విధానంగా మనం గుర్తించాలా లేదా అనేదాన్ని బట్టి ఉంటుంది. దానికి కొంత అధ్యయనం కావాలి. నేను చూసినంతమేరకు తూర్పుగోదావరి జిల్లా లంకల్లో ఉన్నవాళ్ళకు ఆదివాసీ లక్షణాలు చాలా కనిపిస్తాయి. మొన్న తుఫానులో ఎక్కువగా చనిపోయింది వాళ్ళే. అయితే నేను అనేది ఏమిటంటే అదనంగా సదుపాయాలు కావాలి అని డిమాండ్ చెయ్యటానికి ఎస్‌టిలలో చేర్చండి అని పెట్టవలసిన అవసరం లేదేమో. అది కూడా ఆలోచించాలి. రజకుల్ని ఎస్‌సిలలో చేర్చాలి అనే డిమాండ్ చాలాకాలంగా పెడుతూ వస్తున్నారు. అంటరానితనం అనేది రజకుల విషయంలో ఇక్కడ లేదు. బీహార్‌లో ఉంది కాబట్టి బీహార్‌లో రజకులు అంటరాని కులం. ఎస్‌సి కిందకి వస్తారు వాళ్లు. ఇక్కడ అది లేదు. తక్కువ కులంగా చూస్తారు. అది వేరే సంగతి. కాని అంటరానితనం అనే ఆ ప్రత్యేకమైనటువంటి ప్రతిబంధకం ఎవరికైతే ఉందో వాళ్ళను మాత్రమే ఎస్‌సిలుగా గుర్తించటం అనేది ఒక ప్రిన్సిపుల్. దానికి కట్టుబడి ఉంటూ వేరే ఏదైనా బిసి కులం ఇంకా అదనంగా సదుపాయాలు కావాలి అంటే మా వెనకబాటుతనం దృష్ట్యా మాకు అదనంగా సదుపాయాలు ఇవ్వమని డిమాండ్ చెయ్యటం న్యాయం అవుతుంది తప్ప మమ్మల్ని ఎస్‌సిలలో పెట్టండి, ఎస్‌టిలలోపెట్టండి అంటే ఒక ప్రిన్సిపుల్‌ని మనం చెరిపేస్తున్నాం, అది దీర్ఘకాలికంగా నష్టం చేస్తుందేమో కొంచెం ఆలోచించాలి. ఆ ప్రిన్సిపుల్‌ను మనం చెరిపేస్తే అది వేరే రకాలుగా నష్టం చేస్తుంది. దానికి బదులు మేము బిసిలలో కూడా

బాగా వెనుకబడి ఉన్నాం కాబట్టి, మాకు అదనంగా ఫెసిలిటీస్ ఇవ్వండి అని డిమాండ్ పెట్టడం న్యాయంగా ఉంటుందేమో కొంచెం ఆలోచిస్తే బాగుంటుంది.

ప్రశ్న : చట్టసభల్లో బిసిలకు కూడా రిజర్వేషన్ ఇస్తే బహుజనులకు అధికారం వస్తుంది గదా! రిజర్వేషన్లు కొన్ని కులాలకే కాకుండా అన్ని కులాలకు జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చెయ్యాలి. దీనిపై మీ అభిప్రాయం.

జవాబు : మొదటిది కరెక్టు. బహుశా త్వరలో రావచ్చు కూడా. ఇప్పుడు ఎట్లయితే పంచాయితీరాజ్ వ్యవస్థలో పెట్టారో, పార్లమెంట్, అసెంబ్లీలో కూడా రావచ్చు. బహుశా రాబోయే దశాబ్దంలోపల వెనకబడిన కులాలకు కూడా రిజర్వేషన్లు వస్తాయని నేను అనుకుంటున్నాను. అది న్యాయమైనదే. అన్ని కులాలకు అన్ని రంగాలలో రిజర్వేషన్లు ఏర్పాటు చెయ్యాలి. చెయ్యొచ్చు. అయితే కులం జనాభాను బట్టి చెయ్యడం కంటే ఇతర ఆదాయ మార్గాలు అసలే లేనివాళ్లకు ఎక్కువ రిజర్వేషన్లు ఇచ్చి, ఆదాయ మార్గాలు ఉన్నవాళ్ళకు వాళ్ళ జనాభా ప్రాతిపదిక కంటే కూడా తక్కువగా ఇవ్వాలి. వాళ్ళను ఉద్యోగరంగం నుంచి బయటకు పంపించే మార్గం ఏదన్నా ఉంటే ఇంకా బెటర్‌గా ఉంటుంది. ఎందుకంటే ఆదాయానికి ఉద్యోగం ఒక్కటే మార్గం కాదు కదా. వేరే మార్గాలు చాలా ఉంటాయి. ఇతర ఆదాయ మార్గాలు ఉండే కులాలు, లేని కులాలు అనే తేడా పాటించొచ్చు. దళితులకు వేరే ఆదాయ మార్గాలుండటం చాలా కష్టం, ఆస్తి ఉండేవాళ్ళు కొద్దిమందే ఉంటారు. అప్పుడు వాళ్ళకు దామాషా కంటే ఇంకా ఎక్కువ రిజర్వేషన్లు కల్పించవచ్చు. అవి ఉండేవాళ్ళకు ఇంకా తక్కువ కూడా చెయ్యొచ్చు. అవన్నీ ఒక దీర్ఘకాలిక ప్రక్రియలో రావాల్సిన విషయాలు అనుకోండి.

ప్రశ్న : ఎస్‌సి, బిసిలలో క్రీమిలేయర్‌కు కూడా రిజర్వేషన్లు ఉండటం సరయిన దేనా? అలాగే హరిజన క్రైస్తవులను ఎస్‌సిలలో చేర్చమని వచ్చిన డిమాండ్ సరయినదేనా?

జవాబు : సుప్రీంకోర్టు మండల్ కమిషన్ తీర్పులో క్రీమీలేయర్‌ను చట్టబద్ధం చేసి కూర్చుంది. మొత్తంగా అన్ని కులాలలోను క్రీమీలేయర్‌ను ఐడెంటిఫై చేయమంది. ఆ కులాల్లో కొంతమందిని ఐడెంటిఫై చేసి, వాళ్ళకు రిజర్వేషన్లు వర్తించవు, వీళ్ళను రిజర్వేషన్ల నుంచి తొలగించాలి అంటే ఏదో ఒక క్రైటీరియా పాటించాలి. ఏ క్రైటీరియా అనేది వాళ్ళు చెప్పలేదు. ఊరికే ఐడెంటిఫై చెయ్యమన్నారు రాష్ట్రాలను. ఎట్లా ఐడెంటిఫై చేస్తారో మీరు చెయ్యండి, ఒకసారి ఉద్యోగాలు వచ్చిన వాళ్ళు అనా, వేరే ఆదాయాలు ఉన్నవాళ్ళు అనా, ఆస్తులు ఉన్నవాళ్ళు అనా ఏ ప్రాతిపదికన చేయాలి? నేననుకునేది ఏమిటంటే అన్ని కులాలకు కలిపి ఒకే ఒక క్రైటీరియాను పెట్టి క్రీమీలేయర్‌ను నిర్వచించడం నష్టం చేస్తుంది అనుకుంటున్నాను నేను. ఇప్పటికీ రిజర్వేషన్ కోటాను

అందుకోలేనటువంటి కులాలు చాలా ఉన్నాయి. భర్తీ కాకుండా ఉండిపోయే కోటా కూడా చాలా కులాలకు సంబంధించి ఉంది. ఎస్‌సిలకు చాలావరకు అదే జరుగుతున్నది. బిసిలలో కూడా కిందిస్థాయిలో ఉన్న కులాలకు అదే జరుగుతున్నది. అటువంటప్పుడు అప్పటికే పొందినవాళ్ళను తీసేస్తామూ అంటే అసలే ఎవ్వరూ అందుకోలేని పరిస్థితి వస్తుంది. కాబట్టి వీళ్ళు ఐడెంటిఫై అంటూ చెయ్యదల్చుకుంటే జనరల్ ప్రిన్సిపుల్‌గా క్రీమీలేయర్ అన్నదాన్ని ఆమోదించకుండా, ఏ కులాల్లో అయితే తమ కోటాను అందుకొనే స్థాయికి వాళ్ళు రాగలుగుతున్నారో ఆ కులాలలో మాత్రమే ఒకసారి పొందినవాళ్ళకు మళ్ళీ ఇవ్వకూడదు అనో, లేదా ఇతరత్రా సమాన క్వాలిఫికేషన్ ఉన్నవాళ్ళు పోటీకి వస్తే దాంట్లో తల్లిదండ్రులు రిజర్వేషన్లు పొందనివాళ్ళు అయితే వాళ్ళకు ప్రిఫెరెన్స్ ఇవ్వాలనో, ఈ రకమైన క్రైటీరియాను ఏదన్నా కావాలంటే పెట్టుకోవచ్చు.

అంతే తప్ప జనరల్‌గా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు అందరికీ కలిపి క్రీమీలేయర్ డెఫినిషన్ ఒకటి పెట్టేస్తే మొత్తంగా అందుకోలేకపోతున్న కులాలు అసలే అందుకోలేని పరిస్థితిలో పడతాయి. అది సరైనది కాదు. తెలంగాణలో కొన్ని కులాలు నేను చెప్పగలుగుతాను, బహుశా మీ ప్రాంతంలో కొన్ని కులాలు మీరు చెప్పగలుగుతారు. ఆ కులాలకు పెట్టినటువంటి కోటాతో సమానంగా, ఇంకా చెప్పాలంటే ఎక్కువగా కూడా పోటీకి రాగలుగుతున్నారు. అటువంటి కులాలకు కావాలంటే - ఒకసారి పొందిన వాళ్ళకు ఇవ్వద్దు అనో, దాంట్లో ఇతరత్రా ఆస్తులు ఉండేవాళ్ళకు ఇవ్వద్దనో ఆ రకమైన తేడా ఏదన్నా పెట్టవచ్చును. ఇతరత్రా సమాన అర్హతలుండేవాళ్ళు పోటీకి వచ్చినప్పుడు వాళ్ళల్లో రిజర్వేషన్ పొందిన కుటుంబం ఏది, పొందని కుటుంబం ఏది అనే తేడాలు చూసి ఉద్యోగాలు ఇవ్వాలని పెట్టవచ్చును. దాంట్లో ఇబ్బంది లేదు కానీ, సుప్రీంకోర్టు చేసినటువంటి పని మాత్రం సరయినది కాదని నేననుకుంటున్నాను. మొత్తంగా క్రీమీలేయర్‌కు ఒక క్రైటీరియా పెట్టడం సరయినది కాదేమో.

ఇక దళిత క్రైస్తవులను ఎస్‌సిలలో చేర్చమనే డిమాండ్ విషయం - ఇక్కడ సమస్య ఏమిటంటే గ్రామీణ ప్రాంతాలలో దళిత క్రైస్తవులు చాలాచోట్ల ఏ రకంగానూ దళితుల కంటే భిన్నంగా లేరు. కారంచేడు, చుండూరు లాంటి ఘటనలలో చచ్చిపోయినవాళ్ళంతా క్రైస్తవులే. వాళ్ళైనా, ఆ రకంగా దాడులకు గురయ్యే వేరెవరైనా క్రైస్తవులుగా పరిగణింపబడడం లేదు. వాళ్ళు దళితులుగానే పరిగణింపబడుతున్నారు, దళితులుగానే బతుకుతున్నారు, దాడికి గురవుతున్నారు. పట్టణ ప్రాంతాలలో ఉన్న దళిత క్రైస్తవులలో కొంతమంది మాత్రమే కొంత అడ్వాన్స్ కాగలిగారు. కాబట్టి నేననుకుంటాను జనరల్ డిమాండ్‌గా అది కరక్టే. కాని దాంట్లో మళ్ళీ వర్గీకరణ జరగాల్సిన అవసరం ఉంటుంది బహుశా. అది ఏ ప్రాతిపదిక మీద జరగాలి? పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు అనా? చదువుకున్న వాళ్ళు, చదువుకోని వాళ్ళు అనా? ఏదో ఒక ప్రాతిపదిక మీద

కొంత వర్గీకరణ అవసరం అవుతుంది. ఆ వర్గీకరణ చేసి ఎస్‌సిలలో చేర్చితే అప్పుడు సహజంగానే జనాభా పెరుగుతుంది కాబట్టి మొత్తం రిజర్వేషన్ కోటా కూడా పెంచటం అవసరం అవుతుంది. అటువంటి ఆలోచన దృష్టిలో పెట్టుకునే పనయితే అది న్యాయమైన డిమాండే అని నేననుకుంటున్నాను.

ప్రశ్న : పదిరికుప్పం, కారంచేడులలో దళితులపై జరిగిన దాడిని దళితులు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఘటించటంతో దళితులను చీల్చటానికి పాలకవర్గాలు చేస్తున్న సామాజిక కుట్రే ఎంఆర్‌పిఎస్ అనుకుంటున్నాను. విభజన చేస్తే ఎస్‌టిలలో కూడా చెయ్యాలి కదా?

జవాబు : గిరిజనులలో కూడా జరగాలనేది నా అభిప్రాయమని ఇంతకుముందే చెప్పాను. డిమాండ్ కూడా ముందుకు వస్తున్నది. ఎంఆర్‌పిఎస్ ఉద్యమం బిజెపి, తెలుగుదేశం వాళ్ళు మొదలుపెట్టిన ఉద్యమం కాదు. అది మనకు తెలుసు. ఈ ఉద్యమం పుట్టింది మాదిగ కులస్తులలోనే. వాళ్ళే డిమాండ్ ముందుకు తీసుకొచ్చారు. వాళ్ళకు ఏ సామాజిక కుట్ర ఆపాదించటం సాధ్యం కాదు. బిజెపి వాళ్ళు, తెలుగుదేశం వాళ్ళు సపోర్టు చెయ్యటంలో కుట్ర ఉంటే ఉండవచ్చును. ఏ ఉద్యమాన్ని వాళ్ళు ఎందుకు సపోర్టు చేస్తారు అనంటే - ఈ రోజు అన్ని పార్టీలు తెలంగాణ జిల్లాలలో నక్సలైట్లను సపోర్టు చేస్తున్నాయి. నక్సలైట్లకు అనుకూలంగా మాట్లాడడం అన్ని పార్టీలకు అలవాటయిపోయింది తెలంగాణ జిల్లాల్లో. దానికి వాళ్ళ కారణాలు వాళ్ళకు ఉన్నాయి. సపోర్టు చేయడమనేది ఒక అవకాశవాదం అనుకోండి, భయం అనుకోండి, ఏదయినా అనుకోండి. వాళ్ళు ఎందుకు సపోర్టు చేస్తున్నారు అనేది కాకుండా ముందుకు వచ్చిన డిమాండ్ న్యాయమైనదా కాదా అన్నది మనకు ప్రాతిపదిక కావాలి సపోర్టు చెయ్యటానికైనా, వ్యతిరేకించటానికైనా. ఎస్‌సిలలో అసమానత్వం లేదు, వెనుకబడి పోవటానికి చారిత్రక నేపథ్యం ఏమీ లేదు అనేది నాకు తెలిసిన ప్రాంతాల వరకైతే వాస్తవం కాదు. అసమానత్వం ఉంది.

నాకు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలతో సుమారుగా పరిచయం ఉంది, రాయలసీమతో కూడా. మాదిగలను ఇతర దళిత కులస్తులు తమకంటే తక్కువగా చూడటం ఉంది. ఉద్యోగాలు పొందటంలోనూ అసమానత్వం ఉంది. హరిజన అనే మాట కామన్ యూసేజ్‌లో మాల అయినా, మాదిగ అయినా అన్ని దళిత కులాలు అనే అర్థంలో ఉపయోగిస్తారు. కానీ వరంగల్‌లో మాదిగలను మాత్రమే హరిజనులు అంటారు. మాలవాళ్ళు తమను తాము హరిజనులు అని అనుకోరు. నీ కులం ఏందీ అంటే హరిజన అంటారు. హరిజన అంటే మాలా మాదిగా అని అడిగితే హరిజన అని చెప్పినాక మళ్ళా మాలా మాదిగా అని అడుగుతావు నువ్వు అని అంటారు వరంగల్‌లో.

మాదిగలు మాత్రమే హరిజనులుగా తమను తాము భావించుకుంటారు. వేరే వాళ్ళు కూడా అదే భావిస్తారు. కాబట్టి తేడా ఉంది. ఉత్తరాంధ్ర గురించి నేను చెప్పలేను. ఇతర ప్రాంతాలలో కూడా తప్పనిసరిగా ఆ తేడా ఉంది. ఉద్యోగాలలో సమానంగా అందుకుంటున్నారా, అందుకోలేకపోతున్నారా అనేదాని గురించి అందుకే ప్రత్యేకంగా మాధవరావు గారితో మాట్లాడాను. ఆయన కూడా వాస్తవంగా తేడా ఉంది అని అన్నాడు. ఎంఆర్‌పిఎస్ వాళ్ళు పబ్లిక్ మీటింగులలో కూడా తిడుతున్న ఐఏఎస్ ఆఫీసర్లలో మాధవరావుగారు ఒకరు. ఆయన చాలా బాధపడుతున్నారు ఆ విషయంలో. నన్ను అనవసరంగా తిడుతున్నారు, మొదటనుంచి కూడా ఈ రెండు కులాలు కలిసి ఉండాలి, కలిసి హక్కులు పొందాలి అని కోరుకున్న వాళ్ళలో నేను ఒకడిని అంటారు ఆయన. తన కూతుళ్ళు ఇద్దరినీ కూడా ఆయన మాదిగ కులస్తులకే ఇచ్చి పెళ్ళి చేసినట్టున్నారు. ఇది గుర్తించకుండా నన్ను తిడుతున్నారు అనవసరంగా వీళ్ళు అని ఆయన బాధపడుతూ ఉంటాడు. అసమానత్వం ఉంది అని ఆయన లాంటివాళ్ళే గుర్తించినప్పుడు మనం దీనిని సామాజిక కుట్రగా అనుకోవడం సరయినది కాదని నా అభిప్రాయం.

ప్రశ్న : క్రైస్తవ, ముస్లిం సంస్థలు మైనారిటీలకు న్యాయం చేకూర్చకుండా వ్యాపార సంస్థలుగా మారుతున్నాయి. కొన్ని మత సంస్థలు విదేశీ నిధులను తమ సొంతానికి వాడుకుంటూ మైనారిటీ హక్కులను కాలరాస్తున్నాయి. దీనిపైన మీ అభిప్రాయం తెలియచేయగలరు.

జవాబు : రాజ్యాంగంలో మైనారిటీలకు రెండు రకాల హక్కులున్నాయి. ఒకటి - తమ మతపరమైనటువంటి వ్యవహారాలను తామే నిర్వహించుకునే హక్కు. రెండవది - తమ మతానికి చెందిన ప్రజలకోసం విద్యాసంస్థలు నిర్వహించుకునే సదుపాయం. ఈ రెండు వేరు వేరు హక్కులు వారికి ఉన్నాయి. బహుశా మీ ప్రస్తావన మతపరమైన వ్యవహారాల గురించి కాదనుకుంటా. తమ వాళ్ళ అభివృద్ధి కోసం విద్యాసంస్థలను నిర్వహించుకోవడం అనే రెండవ హక్కు గురించి అయి ఉంటుంది. దానికి రాజ్యాంగం ఏమి చెప్తుందంటే కేవలం మైనారిటీల కోసం విద్యాసంస్థలు అనేవి పెట్టకూడదు. ఇతరులకు కూడా వాటిలో సీట్లు ఇవ్వాలని చెప్తుంది.

వాస్తవానికి ఏం జరుగుతూ ఉందంటే మైనారిటీల విద్య కోసం, వాళ్ళలో విద్యావ్యాప్తి కోసం, వాళ్ళను బాగుచేయడం కోసమని చెప్పి పెట్టిన అనేక సంస్థలు పూర్తిగా వ్యాపార సంస్థలుగా మారిపోవడమనేది జరుగుతూ ఉంది. హైదరాబాద్‌లో ముస్లిం ప్రజానీకానికి చెందినటువంటి కొన్ని వ్యాపారసంస్థలు ఉన్నాయి. వాళ్ళు పెట్టిన మెడికల్ కాలేజీలలో, ఇంజనీరింగ్ కాలేజీలలో సీట్లు వాళ్ళ ముస్లింలకు ఇవ్వడం లేదు. అంతా డబ్బులున్న రెడ్డి, కమ్మ కులస్తులే కొనుక్కుంటున్నారు. ప్రైవేట్ కాలేజీలలో డొనేషన్ కట్టాలి కదా. ముస్లింల దగ్గర డబ్బులు లేవు. డొనేషన్లు అగ్రకులాల వాళ్ళే

కడుతున్నారు. వాళ్ళే సీట్లు తెచ్చుకుంటూ ఉన్నారు. అయితే దీని అర్థం ఆ మైనారిటీలు తమ విద్యావ్యాప్తికి, తమ విద్యా అవసరాలకు సంస్థలు పెట్టుకోవచ్చు అనే హక్కును తీసేయాలని కాదు. అవి వాస్తవంగా మైనారిటీలకు ఉపయోగపడేటట్లు చూడాలి. అట్లా ఉపయోగపడేటట్లు చూడటానికి ప్రత్యేకమైన మార్పులు తీసుకురావాల్సి ఉందని నేను అనుకుంటున్నాను. ఉదాహరణకు మైనారిటీల పేరు మీద నడిచే సంస్థలలో సగం సీట్లు కచ్చితంగా మైనారిటీలకే ఇవ్వాలి. ఇప్పుడు రాజ్యాంగంలో రివర్స్ ఉంది. అన్నీ మైనారిటీలకే ఇచ్చుకుంటారేమోనన్న ఉద్దేశంతో పరాయి మతస్తులకు సీటు నిరాకరించడానికి వీలు లేదని రాజ్యాంగంలో ఉంది. అప్పుడు అట్లా ఆలోచించారు. ముస్లింలు, క్రైస్తవులు అనే పేరుతో పెట్టుకుని వాళ్ల వాళ్లకే సీట్లు ఇచ్చుకుంటారేమో, విద్యా సంస్థలలో వేరే వాళ్ళను నిరాకరించడం కరెక్టు కాదు కాబట్టి వేరే వాళ్లకు కూడా సీట్లు ఇవ్వాలి అని రాశారు. ఇవ్వాళ పరిస్థితి ఏమయిపోయిందంటే వేరే వాళ్ళకు మాత్రమే కాదు వీళ్లకు కూడా ఇవ్వాలి అని చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. ఎందుకంటే క్రైస్తవులకు, ముస్లింలకు పైసలు లేవు కాబట్టి. సగం సీట్లు కచ్చితంగా మైనారిటీలకే ఇవ్వాలి అని చెప్పి ఒక సవరణ తీసుకొస్తే బాగుంటుందని నేను అనుకుంటున్నాను.

అట్లాగే అక్కడ పనిచేసే ఉద్యోగులను ఎక్స్ప్లాయిట్ చెయ్యడం విపరీతంగా జరుగుతున్నది. ఎందుకంటే వాళ్ళ మేనేజ్మెంట్ రూల్స్, ప్రొసీజర్స్ ఎట్లా ఉంటాయనే దాంట్లో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా, చేసుకోకూడదా అని చాలా కేసులు నడిచాయి. చాలా గందరగోళమైన తీర్పులు వచ్చాయి. మొత్తం మీద ఏమిటంటే కొంత పర్యవేక్షణ యూనివర్సిటీ చేయవచ్చుగానీ, బేసిక్గా మేనేజ్మెంట్లో యూనివర్సిటీ కూడా జోక్యం చేసుకోవడానికి వీలులేదు అని చెప్పి కోర్టులు తీర్పులు ఇచ్చి ఉన్నాయి. దాంతో వాళ్ళు మైనారిటీ సంస్థలను ఇష్టారాజ్యంగా పరిపాలన చేస్తున్నారు. మాది మైనారిటీ సంస్థ కాబట్టి మా ఉద్యోగులను మేము ఎక్స్ప్లాయిట్ చేసుకుంటాము. వాళ్లకు మేము 500, 600 జీతాలిచ్చి చెప్పిచ్చుకుంటాము, అది మా హక్కు అనడం మొదలుపెడుతున్నారు. దీనిమీద కొన్ని కేసులలో కోర్టులు అట్లా కుదరదు, కనీసం కనీస వేతన చట్టం పాటించాలి, ట్రేడ్ యూనియన్కు సంబంధించినటువంటి హక్కులను మీరు గౌరవించాలి అని చెప్పాయి. మైనారిటీ సంస్థ కాబట్టి మైనారిటీలకు చెందిన వాళ్లనే అక్కడ లెక్చరర్లుగా, టీచర్లుగా నియమించుకొని, తక్కువ జీతాలు ఇస్తూ వాళ్ళని ఎక్స్ప్లాయిట్ చెయ్యటం కూడా మైనారిటీ హక్కేనంటే ఎట్లా? అట్లా అయిపోయింది. అట్లా చెయ్యడానికి వీలు లేదని కొన్ని తీర్పులు వచ్చాయి. కానీ ఇంకా అది పూర్తిగా క్లారిఫై కాలేదు.

దీనిని క్లారిఫై చేస్తూ ఒక చట్టం గానీ, రాజ్యాంగ సవరణ గానీ రావాల్సిన అవసరం ఉందనే ఫీలింగ్ నాకు కూడా ఉంది - ముఖ్యంగా కొన్ని మైనారిటీ సంస్థలు

చూసిన తరువాత. ఒకటి,  అవి ఉద్దేశించింది మైనారిటీలలోని ధనవంతులు ఇంకా ధనవంతులు అవడానికి, విద్యా వ్యాపారం చేయడం కోసం కాదు. అవి మైనారిటీల విద్యా వ్యాప్తికోసం ఉద్దేశించబడ్డాయి. కాబట్టి నువ్వు ప్రైవేటు సంస్థగా పెట్టుకుంటే పెట్టుకో గానీ సగం సీట్లు కచ్చితంగా ఆ మైనారిటీలకే ఇవ్వాలి అనేదొకటి పెట్టాలి. అలాగే ఉద్యోగులకు సంబంధించినటువంటి నియమాలు, మేనేజ్‌మెంట్ ఏ రకంగా వాళ్లతో వ్యవహరిస్తుందనే విషయంలో తప్పనిసరిగా కోర్టులకు జోక్యం చేసుకునే పూర్తి అధికారం ఉండాలి. ఇతర విషయాలలో ఎట్లాగూ ఉంటుంది. ఎందుకంటే ఉద్యోగుల హక్కులను హరిస్తూ ఇది మైనారిటీ హక్కు అంటే కుదరదు. ఆ మార్పు కూడా అవసరం.

ప్రశ్న : రిజర్వేషన్ల వర్గీకరణ ఏ విధంగా జరగాలి? లిడ్ క్యాప్ గురించి మాకు తెలియజేయండి.

జవాబు :  లిడ్ క్యాప్‌ను త్వరలో మూసేస్తారనుకుంటాను. లిడ్ క్యాప్ ఒకటి ఉంది కాబట్టి మాదిగలకు ఆదాయ అవకాశం ఉంది అనే వాదనకు కూడా అవకాశం మిగలకపోవచ్చు. వీకర్ సెక్షన్ కార్పొరేషన్ అని వికలాంగులకు సంబంధించిన కార్పొరేషన్ ఒకటుంది. అది చాలాకాలంగా ఏంచేస్తూ వస్తున్నదంటే - క్రచెస్, బ్రెయిలీ పుస్తకాలు, హియరింగ్ ఎయిడ్స్ లాంటివి ఫ్రీగా సరఫరా చేస్తూ వచ్చింది. అది ఒక మోడల్ సంస్థగా కూడా దేశవ్యాప్తంగా పేరు పొందింది. శంకరన్‌గారు ఐఏఎస్ ఆఫీసర్‌గా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నప్పుడు దానిని మొదలుపెట్టారు. ఇప్పుడు అది మూతబడే స్థితికి వచ్చింది. ఎందుకు మూత వేస్తామన్నారంటే 698 మందికి ఉద్యోగాలు ఇచ్చారంట దాంట్లో. వికలాంగులకే ఉద్యోగాలు ఇస్తారు దాంట్లో. ఎందుకోసమంటే వాళ్ళయితే కొంత సానుభూతి ఫీలయి పని బాగా చేస్తారని. వాళ్లు చేస్తూ వస్తున్నారు. కానీ ఏమయిందంటే పది వేలు, ఇరవై వేలు లంచం తీసుకుని ఉద్యోగాలు ఇస్తూ వచ్చారు. అట్లా ఉద్యోగులు 698 మంది అయ్యారు. ఇప్పుడు గవర్నమెంట్ ఏమంటుందంటే మీ జీతాలకే మీ బడ్జెట్ మొత్తం అయిపోతుంది, కాబట్టి మూసేస్తు న్నాను అంటోంది. అయితే మేము ఏమి చెయ్యాలి అంటే మీరు అక్రమంగా ఉద్యోగాలు సంపాదించు కున్నారు అంటోంది. అక్రమంగా మేము సంపాదించుకోవడం ఏమిటి, వాడు పది వేలు తీసుకుని ఉద్యోగం ఇస్తాను అంటే పదివేలు ఇచ్చి ఉద్యోగం తీసుకున్నాం మేము అని వాళ్ళు అన్నారు. ఆ పది వేలు తీసుకున్న వాడిని ఏమీ చెయ్యవు నువ్వు. వాడీపాటికి సెక్రటరీ అయినాడో, చీఫ్ సెక్రటరీ అయినాడో మాకు తెలియదు. వీళ్ళకు మాత్రం మీరు అక్రమంగా సంపాదించుకున్నారు కాబట్టి తీసేస్తున్నా మని చెప్పి కార్పొరేషన్ మూసేస్తున్నారు. వాళ్లు పాపం హైదరాబాదులో చాలాకాలంగా టెంట్ వేసుకుని కూర్చున్నారు. ఇట్లా వెల్ఫేర్‌కు సంబంధించిన ఒక్కొక్కటి మూసేసే మార్గంలో ప్రభుత్వం ఇవ్వాళ ఉంది.

ప్రశ్న : అగ్రకులాలలోని పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ సరయినదేనా?

జవాబు : సాంఘికంగా, విద్యాపరంగా వెనకబడి ఉండటం అనేదాని కిందికి వాళ్లు రారు. ఆర్టికల్ 15 క్లాజు 4 కింద గానీ, ఆర్టికల్ 16 క్లాజు 4 కింద గానీ ఇచ్చే రిజర్వేషన్లు అగ్రకులాలలో పేదలకు ఇవ్వటం కరెక్టు కాదు. నేననుకుంటాను అగ్రకులాలలో పేదవాళ్ళకు సహాయం చేయదల్చుకుంటే ఆర్థిక సహాయం చెయ్యటమే కరెక్టుగా ఉంటుంది. 15(4) కింద, 16(4) కింద ఆ రిజర్వేషను చెల్లదు. ఎందుకంటే అగ్రకులాలలో పేదవాళ్ళు సాంఘికంగా, విద్యాపరంగా వెనకబడిన వాళ్ళేమీ కారు. కూటికి పేదనైనా కులానికి పేదను కాను అనే అభిప్రాయం ఎట్లాగూ బలంగా సమాజంలో ఉంది కాబట్టి ఎకనామిక్‌గా హెల్ప్ చెయ్యొచ్చు. తప్పులేదు.

ప్రశ్న : కొంతమంది ఎస్‌సి, ఎస్‌టి దొంగ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభుత్వం తెలిసి కూడా వారిపైన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనిపైన మీ విశ్లేషణ?

జవాబు : విశ్లేషణ ఏముంటుంది. ఏ హక్కులనైనా దుర్వినియోగం చేసేవాళ్లు దుర్వినియోగం చేస్తారు. ముఖ్యంగా ఎస్‌టి సర్టిఫికేట్లు విపరీతంగా దుర్వినియోగం అవుతున్నాయనేది వాస్తవం. రెడ్లయితే కొండరెడ్డి అనీ, కాపు అయితే కొండకాపు అనీ ఈ రకంగా పెట్టుకొని రిజర్వేషన్లు వాడుకోవడం జరుగుతూ ఉంది. తెలిసినప్పుడు మనం బయటకు తీసుకువచ్చి, సరయిన కంప్లయింట్ ఇచ్చి చొరవగా దానిని ఆపగలిగితే మంచిది. అంతకంటే ఏం చెప్పగలుగుతాము? లేదా గిరిజనులకే ఇట్లా దొంగ సర్టిఫికేట్లు తీసుకునే అవకాశమిచ్చే మీ తెగల పేర్లను మీరే మార్చుకోండి అని చెప్పాలేమో. వాళ్లు తమ తెగల పేర్లను కోయతూర్ భాషలో పెట్టుకుంటే ఈ ఇబ్బంది లేకుండా ఉంటుం దేమో. అప్పుడు బహుశా వీళ్ళకు దొంగ సర్టిఫికేట్‌లకు అవకాశం లేకుండా పోతుంది.

ప్రశ్న : విద్యా ఉద్యోగ రిజర్వేషన్లలో ఎస్‌టిలు లేని చోట ఎస్‌సిలతో ఆ సీట్లు భర్తీ చేయవచ్చునా? చేయకూడదా?

జవాబు : చేయకూడదు.

ప్రశ్న : ప్రైవేటు సంస్థలలో పని చేసే టీచర్లు వెట్టిచాకిరీకి గురవుతున్నారు. వాటిపై మీ అభిప్రాయం?

జవాబు : అభిప్రాయం ఏముంటుంది, వెట్టిచాకిరీ గురించి ఒకే అభిప్రాయం ఉంటుంది. ఒకప్పుడు బతకలేక బడిపంతులు అన్నా, బడిపంతుళ్ళు బాగానే బతుకు తున్నారు అని తరువాత అనుకున్నారు, మళ్లీ బతకలేక బడిపంతులే అయిపోయింది. సంవత్సరన్నర కింద హైదరాబాద్‌లో ఒక ఎంఎల్ఎ ఒక మీటింగ్‌లో మాట్లాడుతూ

టీచర్లకు కనీస వేతనాల చట్టం ఒకటి చేయాలనుకుంటున్నాం అని చెప్పి సీరియస్‌గానే అన్నాడు. ఇంతవరకు కూలివాళ్లకు, వ్యవసాయ కూలీలకు, వీళ్ళకు వాళ్ళకు కనీస వేతన చట్టాలున్నాయి గానీ టీచర్లకు లేదు. మొట్టమొదటిసారిగా టీచర్లకు కూడా కనీస వేతనాల చట్టం చేయాల్సిన పరిస్థితి వచ్చినట్టుంది.

ప్రశ్న : పేదవర్గాల నుండే చిన్న ఎంట్రప్రెన్యూర్స్‌ను తయారు చేసే నిమిత్తం ఒక కన్సార్టియం ఏర్పాటు చేసి సెంట్రల్ గవర్నమెంట్ మరియు స్టేట్ గవర్నమెంట్ సంస్థలు నిత్యం ఉపయోగించే వస్తువులనే ఉత్పత్తి చేయించి, వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసే ప్రక్రియ ఎలా ఉంటుంది? ఈ బైబ్యాక్ పాలసీ ద్వారా మార్కెట్‌లో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది కదా?

జవాబు : చేస్తే బాగానే ఉంటుంది. కాని గవర్నమెంటు ఏమీ చెయ్యదల్చు కోలేదు కదా. ఎన్నైనా చెయ్యొచ్చు. ఇప్పుడు మన రాష్ట్రంలో 26 వేల స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ సిక్ అయి ఉన్నాయి. వాళ్ళలో చాలామంది ఏం డిమాండు చేస్తున్నారంటే మేము ఉత్పత్తి చేసేవాటిని మేము మార్కెట్ చేసుకోలేకపోతున్నాము. చిన్న కంపెనీలకు మార్కెటింగ్ ప్రాబ్లెమే మేజర్ ప్రాబ్లెమ్. సరే ఫైనాన్స్ కూడా ప్రాబ్లమే గానీ దానికి ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉంది, వీళ్లూ వాళ్లూ ఏవో ఇస్తారు, ఎపిఐఐడిసి ఉంది, కొంత ఇస్తారు. మార్కెటింగే మాకు ఎక్కువ ప్రాబ్లెమ్ కాబట్టి గవర్నమెంట్ ఒక మార్కెటింగ్ వ్యవస్థ నెలకొల్పి మా దగ్గర కొనుగోలు చేసి అమ్మాలి అంటున్నారు. అది ఒక పరిష్కారం అవుతుంది. న్యాయమైన పరిష్కారం అవుతుంది. కానీ చెయ్యడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఫైనాన్స్‌కు ఎట్లాగూ పబ్లిక్ సెక్టార్‌వే కొన్ని ఫైనాన్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి, వాళ్లు ఫైనాన్సింగ్ చేస్తున్నారు కొంతవరకు. మార్కెటింగ్ విషయంలో మీరిచ్చిన సూచన బాగానే ఉంటుంది గానీ గవర్నమెంటు సంసిద్ధత అయితే చూపడం లేదు.

ప్రశ్న : సాంఘికంగా, విద్యాపరంగా ఎస్‌సిలను బ్యాక్‌వర్డ్, మోర్ బ్యాక్‌వర్డ్ అని రెండుగా వర్గీకరిస్తే మాల మాదిగలు రెండూ ఒకే గ్రూపులోకి వచ్చే అవకాశం ఉందా? లేదా?

జవాబు : వాస్తవంగా తమ జనాభా దామాషాలో మాదిగలు అందుకోలేక పోయినట్లయితే - మాదిగలు అందుకోలేకపోతున్నారనే అనుకుంటున్నాము అందరమూ - ఈ ప్రమాదం లేదు. అట్లా కాకపోతే ఒకే గ్రూపులోకి వచ్చేటట్లయితే ప్రాబ్లెమే లేదు. ప్రాబ్లెమ్ ఉందని గదా సొల్యూషన్ గురించి ఆలోచిస్తున్నది. ఇద్దరూ అందుకుంటున్నా రనుకుంటే సమస్య ఏముంది?

ప్రశ్న : దేశ ఆర్థిక వ్యవస్థను ప్రైవేటు లాభానికి వదిలిపెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాబట్టి, మొత్తంగా ప్రైవేటురంగం ఉండకూడదని డిమాండ్ చెయ్యాలి కానీ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు డిమాండ్ చేయడం అంటే ప్రైవేటురంగాన్ని సమర్థించడమే కదా?

జవాబు : టోటల్‌గా మారాలి అని డిమాండ్ చేసేటప్పుడు దాంట్లో కొద్దికొద్దిగా మార్పులు, సంస్కరణలకోసం ఫైట్ చెయ్యటం కూడా టోటల్‌గా మార్చడంలో భాగమే అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అసలే ఉండకూడదు, అది మంచిది కాదు అని నమ్మే సోషలిస్టులే పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుల హక్కుల కోసం చాలా కాలంగా పోరాటాలు చేస్తూ వస్తున్నారు. ఎందుకు చేస్తూ వస్తున్నారు? అసలు పెట్టుబడి దారీ వ్యవస్థే ఉండకూడదు అని చెప్పేవాళ్లు పెట్టుబడిదారీ వ్యవస్థ లోపల కార్మికులకు జీతం ఎంత ఇవ్వాలి; వాళ్లు ట్రేడ్ యూనియన్లు పెట్టుకోవచ్చా, పెట్టుకోకూడదా - ఈ స్ట్రగుల్ అంతా ఎందుకు చేస్తున్నారు అంటే ఈ స్ట్రగుల్ పెట్టుబడిదారీ లాజిక్‌ను బలహీన పరుస్తుంది. దాని లాజిక్‌నే ఎక్స్‌పోజ్ చేస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రైవేటు లాభానికి వదిలిపెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాబట్టి అది ఉండకూడదు అనే డిమాండ్‌లో భాగమే ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు డిమాండ్ చేయడం. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రైవేటు లాభానికి వదిలిపెట్టడం అన్నదానికుండే లాజిక్‌ను వ్యతిరేకించేటటువంటి డిమాండ్లే ఇవన్నీ కూడా. నువ్వు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలి అంటే దానికి వాడు కౌంటర్‌గా ఏమంటాడు? నాకు లాభం ఎక్కడినుంచి వస్తుంది రిజర్వేషన్లు ఇస్తే అంటాడు. నువ్వు కార్మికులకు హక్కులు ఇవ్వాలి అంటే నేను కార్మికులకు హక్కులు ఇస్తే నాకు లాభం ఎక్కడ నుంచి వస్తుంది అంటాడు. నువ్వు మూసేసే ముందు గవర్నమెంటు పర్మిషన్ తీసుకోవాలి అంటే నాకు లాభం రాకపోతే నేను పర్మిషన్ ఎందుకు తీసుకోవాలి అంటాడు. అంటే - ఇది మొత్తం కూడా ప్రైవేటు పెట్టుబడి లాజిక్‌కూ, సామాజిక న్యాయం అనే డిమాండ్‌కూ మధ్య ఒక సంవాదం. ఈ సంవాదం ద్వారా ఏం చేయగలుగుతామంటే ప్రైవేటు పెట్టుబడి యొక్క ప్రైవేటు లాభాలు అనే తర్కాన్ని మనం బలహీనపర్చ గలుగుతాము. దానిని ఎక్స్‌పోజ్ చేయగలుగుతాము, దాని పట్ల ఒక వ్యతిరేకత సమాజంలో కలిగించగలుగుతాము. క్రమంగా బలహీనపర్చడం ద్వారా దానిని అధిగమించగల పరిస్థితులను మనం ఏర్పాటు చేసుకోగలుగుతాము. ఈ విషయంలో నైనా అంతే, వేరే ఏ విషయంలోనైనా అంతే. మీరు ఇంతకుముందు అడిగారు, ఈ విద్యా విధానమే బాగాలేదనుకున్నప్పుడు ఈ విద్య కావాలి అనుకోవడం, అది ప్రైవేటు రంగమా, ప్రభుత్వ రంగమా అని మాట్లాడడం ఎందుకు అని. ఈ ప్రపంచాన్ని మార్చాలి అని అనుకొనే వాళ్లు ఇప్పటివరకు ప్రపంచ నాగరికత సంపాదించుకున్న ఆలోచనలను ముందుగా తాము తెలుసుకోవాలి కదా. తాము తెలుసుకుంటూ ఈ ప్రపంచాన్ని మార్చాలి. ఆ తెలుసుకోవడానికి విద్య ఒక అవసరం.

అయినా మనకు నేర్పిస్తున్న విద్య అంతా పనికి రానిదేమీ కాదు. మొత్తంగా విద్యా విధానం అశాస్త్రీయంగా ఉందీ అంటే నేర్పిస్తున్న విషయాలు అన్నీ పనికిరానివని కాదు కదా. ఆ అశాస్త్రీయమైన వ్యవస్థలో భాగంగానే మనం ప్రపంచ నాగరికత నేర్చుకున్న విషయాలు నేర్చుకుంటూ ఉంటాము. నేర్చుకొని ఒక రకమైన జ్ఞాన సంపన్నులమై ఈ వ్యవస్థను మార్చటానికి మనం ముందుకు పోగలుగుతాము. అట్లే ఇదైనా. పెట్టుబడి యొక్క లాజిక్‌ను ఎక్స్‌పోజ్ చెయ్యటానికి, ఆ లాజిక్ ఎంత సంఘ వ్యతిరేకమూ, ఎంత ప్రజా వ్యతిరేకమూ, అది ఎట్లా దళితులకు వ్యతిరేకమూ, ఎట్లా స్త్రీలకు వ్యతిరేకమూ, ఎట్లా కార్మికులకు వ్యతిరేకమూ అనేది ఎక్స్‌పోజ్ చేసే క్రమంలో దానిని బలహీన పరుస్తాం. దానికోసం ఈ పాక్షికమైన డిమాండ్లు అన్నీ పెట్టుకుంటూ మనం స్ట్రగుల్ చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న : మాదిగ దండోరా అంబేద్కర్‌ను పక్కకు పెట్టి జగజ్జీవన్‌రామ్‌ను ముందుకు తీసుకువస్తున్నది. దానిపట్ల మీ వైఖరి ఏమిటో తెలియజేయగలరు.

జవాబు : జగజ్జీవన్‌రామ్‌ను వాళ్లు గౌరవిస్తే మాకేమీ అభ్యంతరం లేదు గాని అంబేద్కర్‌ను పక్కన పెట్టడం కరెక్టు కాదు. అంబేద్కర్ ఒక కులం లేదా ఒక వర్గం నాయకుడు కాడు. నిజానికి నిన్న నేను మాట్లాడుతూ అన్నట్లు ఆయనను కేవలం దళిత నాయకుడిగా చూడటం కూడా సరి అయినది కాదు. ఆయన చాలా విశాలమైనటువంటి ప్రాపంచిక దృక్పథం ఉన్న రాడికల్ డెమోక్రాట్. అట్లా చూడవలసిన అవసరం ఉంది. అది పోయి ఇప్పుడు ఆయనను దళిత నాయకుడిగా చూస్తున్నాము. కనీసం దళిత నాయకుడిగా కూడా చూడకుండా ఒక కులం నాయకుడిగా మాత్రమే చూసి పక్కన పెట్టడమనేది చాలా తప్పు. ఈ విషయం మేము ఎంఆర్‌పిఎస్ వాళ్లకు చెప్పాం కూడా. మీరు జగజ్జీవన్‌రామ్ విగ్రహం పెడితే మాకు అభ్యంతరం లేదు కానీ అంబేద్కర్ ఫోటో తీసెయ్యొద్దు, అది కరెక్టు కాదు అని.

ప్రశ్న : ఎస్‌సిలకు ఇంత పర్సెంట్ రిజర్వేషన్లు అని ప్రభుత్వం నిర్ణయించింది కదా. ఆ పర్సెంట్ మొత్తం ఇంప్లిమెంట్ చేసినప్పుడు నిజంగా ఆ కులం పూర్తిగా లబ్ధి పొందకపోతే అప్పుడు విభజించడం సమంజసం కదా! అట్లా కాకుండా 8 పర్సెంట్ కూడా ఇంప్లిమెంట్ చేయకముందే విభజిస్తే ఆ 8 పర్సెంట్‌లోనే మీలో మీరు తన్నుకోండని ప్రభుత్వం పరోక్షంగా కలహం సృష్టించడమే కదా!

జవాబు : ఇంప్లిమెంటేషన్ పూర్తిగా కాకపోవడానికి గల కారణాలు మనం బయటకు తీయాలి, పూర్తి ఇంప్లిమెంటేషన్ కోసం ఫైట్ చెయ్యాలి, స్ట్రగుల్ చెయ్యాలి. అంటే ఇక్కడ ఏమవుతుందీ అంటే పూర్తిగా రిజర్వేషన్లు ఎవ్వరూ అందుకోలేకపోతున్నారు. ఆ అందుకోలేకపోవడంలో కూడా కొంతమంది కొంతవరకైనా రాగలుగుతున్నారు. మిగిలిన వాళ్లు ఆ మేరకు కూడా రాలేకపోతున్నారు. అందువలన డివిజన్ అడుగు

తున్నారు. అంటే పూర్తిగా అందుకోవడానికి కావాల్సిన పరిస్థితులు కల్పించాలి, పూర్తిగా అందుకోలేకపోవడానికి ఏవైతే ప్రతిబంధకాలు ఉన్నాయో వాటిని తొలగించాలి. ఆ ఉద్యమం వేరు, ఆ డిమాండ్ వేరు. అదీ చేద్దాం. వద్దని కాదు. తప్పనిసరిగా అందరూ చేయాల్సిందే. ఎప్పుడైతే ఎంఆర్‌పిఎస్ వాళ్ల డిమాండ్ న్యాయమైనదని ఒప్పుకుంటున్నామో అప్పుడు వాళ్ళను కూడా దీనిలోకి ఆహ్వానిద్దాం. మొత్తంగా రిజర్వేషన్లు అనేది ఇంప్లిమెంటేషన్ జరగాలి, జరగడం లేదు. దానికి గల కారణాలు వెలికి తీసి మనం ఫైట్ చెయ్యాలి. దానికోసం ఇది ఆగనవసరం లేదు, దీనికోసం అది ఆగనవసరం లేదు. అది అర్థం చేసుకోమని కోరుతున్నాం.

ప్రశ్న : ప్రభుత్వం, ప్రైవేటు రంగాలు రెండూ కలిసి స్థాపించిన వాటిలో రిజర్వేషన్లు వర్తిస్తాయా? గవర్నమెంటు వాటా వరకు వర్తిస్తాయా?

జవాబు : పబ్లిక్ సెక్టార్ కార్పొరేషన్‌గా గుర్తింపు ఉంటే వర్తిస్తాయి. పబ్లిక్ సెక్టార్ కార్పొరేషన్ అంటే ప్రధానంగా గవర్నమెంటు కంట్రోల్‌లో ఉన్న కార్పొరేషన్ అని. అట్లయితేనే వర్తిస్తాయి. లేకపోతే వర్తించవు. వర్తిస్తే టోటల్‌గా వర్తిస్తాయి. దాంట్లో ప్రభుత్వం వాటా వరకే అనేదేమీ ఉండదు.

ప్రశ్న : ప్రైవేటు సెక్టార్‌లో రిజర్వేషన్‌కు ఒక ఆర్గ్యుమెంటుగా ప్రైవేటు కంపెనీలలో ఉండేది ఎక్కువగా పబ్లిక్ ఫైనాన్సే కదా - ప్రభుత్వ బ్యాంకుల పెట్టుబడి, ఎల్‌ఐసీ పెట్టుబడి, ఇండస్ట్రియల్ బ్యాంకుల పెట్టుబడే కదా - ఆ రకంగా కూడా అడగొచ్చు కదా?

జవాబు : అట్లానూ అడగొచ్చు. తప్పేమీ లేదు. అందులో ఒక సమస్య ఏమిటంటే రాబోయే రోజులలో ఆ పెట్టుబడి తగ్గిపోయి మల్టీనేషనల్ కంపెనీల పెట్టుబడి పెరిగింది అనుకోండి. అప్పుడు ఈ ఆర్గ్యుమెంటుకు విలువ లేకుండా పోయే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల ఇంకొంచెం ఫండమెంటల్‌గా పోయి సంపద ఎవరి స్వంత ఆస్తి కాదు అనే ఆర్గ్యుమెంటు పెడదాము.

*విశాఖపట్నంలో పిడిఎస్‌యు నిర్వహించిన*
*'రాజ్యం-సంక్షేమం' సెమినార్‌లో ఇచ్చిన ఉపన్యాసం*
*మే 1996*

# వర్గీకరణ మళ్లీ మొదటికి

చంద్రబాబునాయుడు ప్రభుత్వం షెడ్యూల్డు కులాల వర్గీకరణ కోసం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌ను రాష్ట్ర గవర్నర్ రంగరాజన్ రాష్ట్రపతికి పంపించడంతో వర్గీకరణ కథ మళ్లీ మొదటికొచ్చింది. నాకెందుకు పంపారు? దీనితో నాకేం పని? అని రాష్ట్రపతి దానిని వెనక్కి పంపిస్తే తప్ప వర్గీకరణ ఇప్పట్లో జరగదు. మాదిగ కులస్తులు ఇన్నాళ్లు చేసిన ఉద్యమం ఇప్పట్లో ఫలితాన్ని అందు కోదు.

గవర్నర్ నిర్లక్ష్యం ఆశ్చర్యకరమైనది, అనవసరమైనది.

ఆయన ఎవరి సలహా మేరకు ఈ పని చేశారో ఆయనే చెప్పాలి. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో గవర్నర్ ఈ పని చేయవచ్చునని రాజ్యాంగంలోని ఆర్టికల్ 213(1) అంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్ ఏదైనా కేంద్ర చట్టానికి వ్యతిరేక మైనా లేక రాష్ట్రానికీ, కేంద్రానికీ కూడ చట్టం చేసే అధికారం ఉన్న విషయానికి సంబంధించినదయినా లేక హైకోర్టు అధికారాలను కుదించి వేసేదయినా గవర్నర్ ఈ పని చేయవచ్చు. ఈ ఆర్డినెన్స్‌కు ఆ లక్షణాలేవీ లేవు. వర్గీకరణ గురించి ఇప్పటికి చట్టమేదీ లేదు. అది రాజ్యాంగంలోని 'కన్‌కరెంట్ లిస్టు'(ఉమ్మడి జాబితా)లో లేదు. అది హైకోర్టు అధికారాలను ఏ మాత్రం కుదించదు.

నిజమే! గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇదే విషయంపైన జారీ చేసిన ఆర్డినెన్స్‌ను మన రాష్ట్ర హైకోర్టు కొట్టేస్తూ, షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ కోటాను వర్గీకరించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని చెప్పింది. కానీ అది హైకోర్టు అభిప్రాయం మాత్రమే.

రాజ్యాంగ శాసనం కాదు. పైగా హైకోర్టు చాలా కృత్రిమమైన తర్కంతో ప్రతిపాదించిన అభిప్రాయం. దానిని గవర్నర్ రాజ్యాంగ శాసనంతో సమానంగా భావించి ఆర్డినెన్స్‌ను రాష్ట్రపతి పరిశీలనకు పంపించడం పూర్తిగా అనవసరమైన చర్య. దాని బదులు ఆయన దానిపైన సంతకం చేసి జారీ చేసి ఉంటే మాలమహానాడు ఎట్లాగూ కోర్టుకెక్కి ఉండేది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో వ్యక్తం చేసిన అభిప్రాయం ఎంతవరకు సమంజసమనేది ఏదో ఒక రోజు న్యాయస్థానాలలోనే తేలి ఉండేది. ఎంత కాలం పట్టినా దానికొక ముగింపు ఉండేది. కానీ ఇప్పుడు రాష్ట్రపతి ఈ ఆర్డినెన్స్‌కు సమ్మతించడానికి కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించదలచుకుంటే, దేశమంతటా ఇదే సమస్య ఉత్పన్నం అవుతుందన్న భయంతో కేంద్ర ప్రభుత్వం సమ్మతించదు. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా సమ్మతించడానికి రాష్ట్రపతి బహుశా తటపటా యించవచ్చు.

దళితులలో అంతర్గత న్యాయం రాజ్యాంగ నియమాలలోనూ, కోర్టు తీర్పుల లోనూ ఇరుక్కొని ఉండనవసరం లేదు. సామాజిక సమస్యలు సామాజికంగా పరిష్కారమై ఆ తరువాత చట్టం రూపం తీసుకుంటే ఆ పరిష్కారం సహజంగానూ స్థిరంగానూ ఉంటుంది. అంతవరకు చట్టం కావాలని బలహీనులయినవారు డిమాండ్ చేయడం తప్పని నా అభిమతం కాదు. పరిష్కారం కోసం పెట్టే ఒత్తిడిలో ఆ డిమాండ్ కూడ భాగమే. పైగా రాజ్యానికి సంక్షేమ బాధ్యత కూడ ఉంది కాబట్టి సంక్షేమం కొరవడిన వారు ప్రభుత్వం తమకు అనుకూలంగా చట్టం చేయమని కోరడంలోనూ తప్పులేదు.

అయినప్పటికీ సమస్యకు సామాజిక పరిష్కారాన్ని అన్వేషించడం అవసరం. ఇది విజయవంతమైతే ప్రభుత్వం చేసే చట్టం ఆటంకాల నెదుర్కోదు. చట్టం చూపించే పరిష్కారం సామాజికంగా ఆమోదం పొందుతుంది. పరిష్కారం స్థిరంగా, నిలకడగా ఉంటుంది.

మన రాష్ట్రంలోని షెడ్యూల్డు కులాల వర్గీకరణ విషయంలో ఈ సామాజిక పరిష్కారం కోసం ప్రయత్నమే జరగలేదు. షెడ్యూల్డు కులాలలో సాపేక్షంగా వెనుకబడిన వారు తమ వాటా తాము కోరుకోవడం న్యాయమని సాపేక్షంగా ముందున్నవారు సూత్రప్రాయంగా ఒప్పుకొని ఉంటే, దళితుల ఐక్యత దెబ్బతినకుండా వర్గీకరణ ఏ విధంగా చేయాలన్న ఆలోచన ఇరుపక్షాలూ చేసి ఉండవచ్చును. దళితుల ఐక్యతకు నష్టం జరగకుండా వెనుకబడిన వారికి న్యాయం జరిగి ఉండేది.

ఈ వైఫల్యానికి ఎవరు బాధ్యులని ఇక్కడ నేను ఏకరువు పెట్టవలసిన అవసరం లేదు. ఒక రకంగా ప్రజా ఉద్యమాలలో ఉన్నవారందరమూ బాధ్యులమే. దళిత ఉద్యమ నాయకత్వం కొంచెం ఎక్కువ బాధ్యత స్వీకరించవలసి ఉంటుందేమో.

ఈ వైఫల్యం ఫలితంగా దళితులు ఒకరికొకరు దూరం కావడం, ఒకరి కార్యక్రమాలకొకరు హాజరు కాకుండ ఉండడం, వర్గీకరణ కోరుకున్న వారిని అవతలి వర్గం తెలుగుదేశం ఏజెంట్లని నిందించడం, వాళ్లు వీళ్లను నయా బ్రాహ్మణులు అనీ, తమ ప్రధాన శత్రువులనీ నిందించడం జరిగింది. పెత్తందారీ కులాలకిది చాలా ధైర్యం ఇచ్చింది. 'అసలు రిజర్వేషన్లు మొత్తంగా తీసేస్తే పోలేదా?' అనడానికి వాళ్లు సాహసిస్తారు. 'రిజర్వేషన్ల వల్ల వచ్చేది చీలికేనని మేం ఎప్పుడో చెప్పాం' అని తెగించి అంటున్నారు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. మాదిగ తదితర వెనుకబడిన దళిత కులాలకు రిజర్వేషన్ల విషయంలో న్యాయం చేకూర్చే వర్గీకరణ డిమాండ్‌ను అందరూ ఆమోదించి, ఇతర విషయాలలో దళితులందరూ ఉమ్మడిగా చేయవలసిన పోరాటాలకు అవసరమైన ఐక్యతను నిలబెట్టడం కోసం కృషి చేయవలసి ఉంది. ఐక్యంగా చేయవలసిన పోరాటాలు చాలా ఉన్నాయి. అంటరానితనానికి వ్యతిరేకంగానే కాదు. రిజర్వేషన్ల సక్రమమైన అమలు కోసం మాత్రమే కాదు. విద్యా ఆరోగ్య హక్కుల కోసం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, భూమి కోసం, ప్రకృతి వనరులపైన హక్కు కోసం పోరాటాలు చేయవలసి ఉంది.

ఈ అవసరాన్ని గుర్తించడానికి సంకుచిత ప్రయోజనాలను, పరిమితులను అధిగమించే దూరదృష్టి కావాలి. విశాల దృక్పథం కావాలి. అది ఉందా లేదా అని తర్కించుకుని కూర్చోవడానికిది సమయం కాదు. మనం ప్రయత్నం చేస్తే తప్ప పరిస్థితులు మారవు.

*ప్రజాతంత్ర*
*15 నవంబర్ 1998*

# ఆదివాసీ హక్కులకు గండ్లు

నోరున్నవాళ్లకు జరిగే చిన్న చిన్న అన్యాయాలు సహితం బాగా ప్రచారం అవుతూంటాయి. కానీ నోరు లేని వాళ్లకు ఎంత పెద్ద అన్యాయం జరిగినా అది కనీసం వార్త కూడా కాదు.

ఆదివాసులలో విద్యను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో 1986లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. ఆదివాసీ (అంటే ఏజెన్సీ) ప్రాంతంలో ఉన్న స్కూళ్లన్నిటి లోనూ ఉపాధ్యాయుల పోస్టులు ఆదివాసులకే ఇవ్వాలని ఈ జీవో చెప్తుంది.

దీని వల్ల రెండు లక్ష్యాలు సాధించాలని ప్రభుత్వం ఉద్దేశించి నట్టుంది. ఒకటి టీచర్లు స్థానిక ఆదివాసులే అయితే అక్కడే ఉండడానికి అభ్యంతరం చెప్పరు. ఇతరులకు ఏజెన్సీలో పోస్టింగ్ వేస్తే బయటికి బదిలీ చేయించుకునే పైరవీతోనే కాలమంతా గడుపుతారు.  ఆదివాసీ ఉపాధ్యాయులు కొంతమేరకైనా తమ వారి బాగోగులు కోరుకుంటారు కాబట్టి కొంచెం శ్రద్ధగా చదువు చెప్పే అవకాశం కూడా ఉంది. అవసరమైనప్పుడు తమ భాషలో (ఒక  ప్రత్యేకమైన భాష ఉన్న తెగలయితే) బోధించగలరు. తమవారే ఉపాధ్యాయులు కావడం ఆదివాసీ పిల్లలకు సహితం మానసిక స్థయిర్యాన్నీ, చదువుకోవడానికి ప్రోత్సాహాన్నీ ఇస్తుంది.

రెండవ లక్ష్యమేమిటంటే చదువుకున్న ఆదివాసులకు ఉద్యోగాలు దొరకడం చదువుకోవడానికి ప్రోత్సాహం ఇస్తుంది. ఆదివాసులకు ఉద్యోగరంగాలలో ఉన్న 6 శాతం రిజర్వేషన్ వల్ల కొద్దిమందికి మాత్రమే ఉద్యోగాలు దొరకగలవు. ఆ కొద్ది ఉద్యోగాలు ఏజెన్సీ బయట బతికే ఆదివాసీ తెగలు తీసేసుకుంటున్నాయి. ఉద్యోగాలు

దొరకని చదువుపట్ల ఏజెన్సీలోని ఆదివాసులకు పెద్దగా ఆసక్తి ఉండదు. కనీసం స్థానికంగా టీచరు పోస్టులయినా దొరుకుతాయన్న నమ్మకం ఉండడం ప్రోత్సాహకరంగా పని చేస్తుంది.

జీవో బాగానే ఉందిగానీ టిటిసి పూర్తి చేసిన ఆదివాసులు తగు సంఖ్యలో లేకపోతే ఏం చేయాలన్న ప్రశ్న వస్తుంది. దానికి జవాబుగా 10వ తరగతి దాకా చదువుకున్న ఆదివాసులెవరికయినా టీచర్ పోస్టులు ఇయ్యవచ్చుననీ, ఆ తరువాత వారిని డెప్యుటేషన్ మీద పంపించి పూర్తి చేయించవచ్చుననీ ప్రభుత్వం నియమం పెట్టింది. హైస్కూల్ టీచర్ల విషయంలో అది సాధ్యం కాకపోవచ్చును కాబట్టి అక్కడ మట్టుకు అర్హత గల ఆదివాసీ అభ్యర్థులు దొరికే దాకా తాత్కాలికంగా ఆదివాసీ యేతరులను నియమించ వచ్చుననీ, అర్హత గలవారు దొరకగానే వీరిని తొలగించాలనీ ప్రభుత్వం మరొక జీవో జారీ చేసింది.

ఈ 'తాత్కాలికం' అనే దానిని పర్మనెంట్ చేసుకోవడానికి గిరిజనేతర ఉపాధ్యాయులు చేసిన ప్రయత్నాల గురించి, అందుకోసం న్యాయస్థానాలను వాడుకున్న వైనాన్ని గురించి చెప్పుకోవడానికి ఇది సందర్భం కాదు కాని అసలుకే మోసం తీసుకురావడానికి స్వయంగా అధికారులే చేస్తున్న ప్రయత్నాల గురించి మాత్రం ఇక్కడ మాట్లాడుకోవాలి. నిజానికి ఏజెన్సీలో ఆదివాసులకే ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వాలన్న నియమం వల్ల ఆదివాసులలో ఒక కొత్తతరం ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలోనే ముందుకొచ్చారు. దీనివల్ల ప్రభుత్వం దృష్టిలో ఉన్న పై రెండు లక్ష్యాలే కాక మరొక ముఖ్యమైన సామాజిక లక్ష్యం కూడ నెరవేరింది.

రిజర్వేషన్లు పొందే అణగారిన కులాలలో, ఆదివాసులలో 'క్రీమీలేయర్' గురించి మాట్లాడేటప్పుడు చాలామంది అర్థం చేసుకోని ఒక విషయం ఏమిటంటే, ఆ కులానికి లేక తెగకు ప్రత్యేకమైన పరిస్థితుల గురించి మాట్లాడడానికి, వారి ఆకాంక్షలను వ్యక్తం చేయడానికి ఒక ప్రాతినిధ్య వర్గంగా కూడా రిజర్వేషన్లు పొందినవారు మాత్రమే ఉపయోగపడగలరు అని. వారందరూ అన్ని సందర్భాలలోనూ తమ తోటివారి క్షేమాన్ని గురించి నిబద్ధతతో ఆలోచించకపోవచ్చు. తమ స్వంత బాగు చూసుకొని సంతృప్తి చెందే బాపతు చాలామంది ఉండవచ్చు. అయినప్పటికీ సామాజికంగా అత్యవసరమైన ఈ పాత్రను తొలితరం లబ్దిదారులు ఏదో ఒక మేరకు నిర్వహిస్తారనేది గుర్తించవలసిన విషయం. వాళ్లందరినీ టోకుగా తమ వ్యక్తిగత ప్రయోజనాలు మాత్రమే చూసుకొని తమ ప్రజలనుండి వేరు పడిపోయే 'క్రీమీలేయర్'గా చూడటం పెత్తందారీ కులాల దృక్కోణానికి చెందిన వైఖరి.

ఈ ప్రయోగానికి గండి కొట్టే ప్రయత్నం అధికారులే చేస్తున్నారన్నాను కదా. గత సంవత్సరం విశాఖపట్నం జిల్లాలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా పాఠశాల ఉపాధ్యాయులను ఎంపిక చేసినప్పుడు ఏజెన్సీ వెలుపల ఉన్న స్కూళ్లతోబాటు ఏజెన్సీలోని స్కూళ్ళను

కూడ కలిపేసి పై జీవోకు పూర్తి విరుద్ధంగా ఉమ్మడిగా ఎంపిక చేశారు. దానితో ఏజెన్సీలోని పాఠశాలలలోని 883 ఉపాధ్యాయ పోస్టులకూ గిరిజనేతరులే ఎంపిక అయ్యారు!

అదృష్టమో దురదృష్టమో గానీ వారిలో చాలామంది మారుమూల గిరిజన గూడేలలో పనిచేయడానికి ఇష్టపడకపోవడం వల్ల అందులో 300 చిల్లర పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. 534 పోస్టులలో మాత్రం గిరిజనేతరులు ఉపాధ్యాయులుగా చేరారు.

ఉపాధ్యాయుల నియామకం కేవలం విద్యాశాఖ ద్వారా జరిగేటట్టయితే తాము చేసిన తప్పిదానికి ఉండే సామాజిక పర్యవసానం అర్థం కాక చేసారని అనుకోవచ్చు. కానీ ఉపాధ్యాయుల నియామకం జరిగేది జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో. వీరికి గిరిజన సంక్షేమాన్ని చూసుకునే బాధ్యత కూడా ఉంది. అయినప్పటికీ ఇది జరిగిందంటే చట్టాలలో ఆదివాసులకు అనుకూలమయిన అంశాలు కొన్ని ఉన్నా, రాజకీయాలలోనే కాక అధికార యంత్రాంగంలోనూ ఆదివాసీయేతరుల ప్రయోజనాల ప్రాబల్యం చాలా ఉండడం దానికి కారణం. వేరే ఎక్కడయినా ఒక వర్గానికి రిజర్వ్ చేయబడిన పోస్టులు 883 వేరే వాళ్లకిస్తే ఎంత గొడవ జరిగేదో! కానీ విశాఖపట్నంలో ఆదివాసులకు జరిగిన ఈ అన్యాయం నిశ్శబ్దంగా జరిగిపోయింది.

ఆదివాసులలోని అంతో ఇంతో చదువుకున్నవారు సహితం మౌనంగా ఉండి పోయారు. కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఇది జరిగింది కాబట్టి చట్టం మారిందేమో అనుకున్నా రంట. కానీ ఈ అక్రమమయిన ఎంపికలు జరిగిన కొన్నాళ్లకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ ఏదో పనిమీద విశాఖపట్నం వచ్చి ఈ విషయం తెలుసుకొని బాహాటంగానే తప్పు పట్టడంతో చట్టమేమీ మారలేదనీ, తమకు అన్యాయం జరిగిందనీ ఆదివాసులకు అర్థం అయింది. విశాఖపట్నంలోనే కాక వరంగల్‌లో కూడా ఇదే జరిగిందని ఇప్పుడు తెలుస్తున్నది.

చట్టాలలో ఉన్న సంక్షేమం వాస్తవంలో అందకుండా చేయడానికి సమాజంలో చాలా ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఆ సంక్షేమం పొందేవారికి నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేనంత కాలం ఇది సాగుతుంది. ఇప్పుడు ఏజెన్సీలో నియమించిన గిరిజనేతర ఉపాధ్యాయులను బయటికి బదిలీ చేసి ఏజెన్సీలో ఖాళీలను ఆదివాసీ విద్యావంతులతో నింపడం ఒక్కటే పరిష్కార మార్గం. ఆ పని చేస్తామని నోటిమాటగా ప్రభుత్వ అధికార్లు అంటున్నారు. కాని నిజంగా చేస్తారా?

*ప్రజాతంత్ర*
*16 మే 1999*

# రిజర్వేషన్లు : సుప్రీంకోర్టు రాజకీయాలు

రిజర్వేషన్ల మీద సుప్రీంకోర్టు ఈ మధ్యకాలంలో ఇస్తున్న తీర్పులను వివరంగా పరిశీలించవలసిందేగానీ న్యాయశాస్త్ర సిద్ధాంత చర్చలోకి పోకుండా కూడా అందరికీ సులభంగా అర్థమయ్యే విషయాలు కొన్ని ఉన్నాయి.

సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించే అధికారం ప్రభుత్వానికుందని భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 15(4) అంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉందని ఆర్టికల్ 16(4) అంటుంది.

ఇది ప్రభుత్వానికి ఉండే అధికారం మాత్రమేనా లేక ఆ ప్రజల హక్కా అన్న ప్రశ్న మన న్యాయస్థానాలను చాలాకాలం పట్టి పీడించింది. మొదట్లో ఇది ప్రభుత్వానికి రాజ్యాంగమిచ్చిన అధికారమే తప్ప ఎవరి హక్కూ కాదని సుప్రీంకోర్టు అనింది. అంటే రిజర్వేషన్లు ప్రభుత్వం ఇస్తే వారు తీసుకోవలసిందే తప్ప ఇమ్మని డిమాండ్ చేసే అధికారం ఎవ్వరికీ లేదని అర్థం.

కాని కాలక్రమంలో సుప్రీంకోర్టు ఈ విషయంలో తన వైఖరిని మార్చుకునింది. 1970ల తరువాత, రిజర్వేషన్లు కల్పించడం 'అందరినీ సమానంగా చూడాలి' అన్న సమానతా సూత్రానికి మినహాయింపు కాదనీ, దానిలో భాగమేననీ సుప్రీంకోర్టు గుర్తించింది. 1992లో మండల్ కమిషన్ పైన ఇచ్చిన తీర్పులో 9 మంది జడ్జీల బెంచి ఈ విషయాన్ని బాగా విశదీకరించి చెప్పింది. అయితే మండల్ కమిషన్ తీర్పు ఇచ్చేనాటికి రిజర్వేషన్లన్నీ బడుగు

వర్గాలలోని ధనవంతులు లేక బలవంతులే తీసేసుకుంటున్నారన్న అభిప్రాయం సుప్రీంకోర్టులో బలపడింది. ఇది నిజానికి బయట తరచుగా వినిపించే మాటే. ఏ హక్కునయినా వ్యతిరేకించదలచుకుంటే దానిని నేరుగా వ్యతిరేకించడం ఒక పద్ధతయితే దాని 'దుర్వినియోగాన్ని' గుర్తించి చర్చ పెట్టడం రెండవ పద్ధతి. మొదటిది నైతికంగా సాధ్యం కానప్పుడు రెండవ మార్గం ఎంచుకుంటుంటారు. దళితుల, ఆదివాసుల, స్త్రీల హక్కుల విషయంలో వాటి వ్యతిరేకులు ఈ పనే తరచుగా చేస్తుంటారు.

రిజర్వేషన్లు దళితులలో (లేక బిసిలలో, లేక ఆదివాసులలో, లేక స్త్రీలలో) అప్పటికే డబ్బులున్న వాళ్లకో లేక అప్పటికే అభివృద్ధి చెందిన వారికో అందుతున్నాయనీ, కాబట్టి వారిని రిజర్వేషన్ల పరిధినుండి తొలగించాలనీ వీరు వాదిస్తుంటారు. ఇక్కడ కనీసం నాలుగు విషయాలు గుర్తుపెట్టుకోవాలి. అభివృద్ధి చెందిన వారే మళ్లీ అభివృద్ధి చెందుతున్నారనేది నిజమేనని రుజువుచేసిన వారెవ్వరూ లేరు. రెండు, అది నిజమే ననుకున్నా వారికి రిజర్వేషన్లు లేకుండా చేస్తే అసలు బడుగు ప్రజలలో ఎవ్వరూ రిజర్వేషన్లు అందుకోలేకపోవచ్చు. మూడు, ఇప్పటికే ప్రయోజనం పొందినవారే మళ్లీ పొందడం వల్ల ఆయా వర్గాలలోని ఇతర ప్రజలు పైకి రాలేకుండా పోయినట్లయితేనే అది నిజమైన సమస్య అవుతుందిగానీ పెత్తందారీ కులాలకు చెందిన వారి కడుపు మంటను వారి సమస్యగా చూపించడంలో అర్థం లేదు. నాలుగు, బలహీన వర్గాలలో కొందరు పైకి రావడం కేవలం వారి వ్యక్తిగత అభివృద్ధేననుకోనక్కర లేదు. అది ఒక మేరకు ఆ వర్గాలలోని ఇతరులకు కూడా ప్రయోజనం కల్పిస్తుంది. మొదట పైకి వచ్చిన వారందరూ నిస్వార్థపరులు కాకపోవచ్చును. తమ స్వంతం మాత్రమే చూసు కుంటు న్నారన్న అభియోగం వారిపైన తరచుగానే వేయడం వింటున్నాం. అయినప్పటికీ ఏదో ఒక మేరకు వారు ఆ వర్గాలకు చెందిన ఇతర ప్రజల అభివృద్ధికి చేయూత నివ్వగలుగు తున్నారు.

ఇవేవీ లెక్కలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు మండల్ కమిషన్ తీర్పులో రిజర్వేషన్ పొందే వర్గాల 'క్రీమీలేయర్'ను గుర్తించి దానిని రిజర్వేషన్ల పరిధి నుండి తొలగించాలని ప్రకటించింది.

ఆ తరువాత రెండు విచిత్రమైన పరిణామాలు జరిగాయి. రిజర్వేషన్లు పొందడం ఒక హక్కు అన్న అభిప్రాయం నుండి సుప్రీంకోర్టు ఒక్కడుగు వెనక్కివేసి, రిజర్వేషన్లు ఇవ్వడం ప్రభుత్వ అధికారం మాత్రమే తప్ప 'మాకు ఇయ్యవలసిందేనని' ఎవ్వరూ డిమాండ్ చేయడానికి వీలులేదని ఈ సంవత్సరం అయిదుగురు జడ్జీల ధర్మాసనం ప్రకటించింది. కానీ 'క్రీమీలేయర్'ను గుర్తించి తొలగించడం మాత్రం ప్రభుత్వ ఇష్టాయిష్టా

లతో నిమిత్తం లేని విషయమనీ, ఆ పని ప్రభుత్వం తప్పనిసరిగా చేయవలసిందేననీ ఇంకొక కేసులో ఇద్దరు జడ్జీల బెంచి అనింది!

నిజానికి ఈ అభిప్రాయాల తప్పొప్పుల సంగతి అటుంచి ఇవి ప్రభుత్వ పాలనా విధానాలకు సంబంధించిన విషయాలు. న్యాయస్థానాలు విధాన రచన చేయజాలవు. ప్రభుత్వ విధాన రచన రాజ్యాంగం పరిధిలో ఉందా లేదా అని చెప్పడం వరకే న్యాయస్థానాల పని. వేరే సందర్భంలో ప్రజలేవయినా మౌలిక హక్కుల కల్పనకు ఆదేశాలిమ్మని ఇవే న్యాయస్థానాలను ఆశ్రయిస్తే, అది 'విధాన సంబంధమైన విషయం' అని న్యాయస్థానాలు కొట్టిపారేస్తుంటాయి. కానీ రిజర్వేషన్ల పట్ల పెత్తందారీ కులాలలో ఉన్న వ్యతిరేకతను దేశపాలనా విధానంలో భాగం చేయడానికి మాత్రం తమకున్న అధికారాన్ని వినియోగించుకోవడానికి న్యాయస్థానాలు వెనకాడడం లేదు. ఈ మధ్య కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని దళిత, బిసి కులాలలో 'క్రీమీలేయర్' అనేది లేదని చెపితే అటువంటి ఉపవర్గాన్ని గుర్తించి తీరవలసిందేనని సుప్రీంకోర్టు తీర్పు జారీ చేయడం దీనికొక ఉదాహరణ. పైగా ఈ తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేకమైన వ్యాఖ్య కూడా చేసింది. 'ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు' రిజర్వేషన్లు కల్పించాలని ఆర్టికల్ 16(4) అంటుంది కదా, 'క్రీమీలేయర్'ను రిజర్వేషన్ పరిధి నుండి తొలగించి వేస్తే ఆ వర్గం తగిన ప్రాతినిధ్యం పొందలేక పోవచ్చునేమోనంటే 'అయినా ఫరవాలేదు, తీసేయాల్సిందే'ననింది!

రిజర్వేషన్లు ఒక హక్కుగా అడగడానికి వీలు లేదనీ, ఇస్తే తీసుకోవలసిందేననీ అయిదుగురు జడ్జీల బెంచి అనడం కూడా ఈ కోణం నుండి అభిశంసనీయమే. 9 మంది న్యాయమూర్తులు తీర్పు ఇచ్చిన మండల్ కమిషన్ కేసులో రిజర్వేషన్లు ఒక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ అభిప్రాయాన్ని అంతకంటే ఎక్కువ మంది న్యాయమూర్తుల బెంచి మాత్రమే తిరగదోడగలదు. వేరే విషయంలో కోర్టే ఆ మాట అంటుంది. కానీ ఈ విషయానికొచ్చేసరికి 5 మంది న్యాయమూర్తుల బెంచి ఆ అధికారం తనకుందనుకునింది!

*ప్రజాతంత్ర*
*26 డిసెంబర్ 1999*

# ఎవరు చూడొచ్చారులే!

వాళ్లకు కనిపించదు కాబట్టి ఏమీ తెలియదనుకుంటున్నారో, లేకపోతే సకలేంద్రియాలూ ఉన్నవాళ్లను మోసం చేసి సాగించుకోగా లేనిది గుడ్డివాళ్లొక లెక్కా అనుకుంటున్నారో తెలియదుగానీ - రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఒకటి, పార్లమెంటు చేసిన చట్టమొకటి ఉంటూండగా మన రాష్ట్రంలో కంటిచూపు లేనివారికి ఉద్యోగాల విషయంలో జరుగుతున్న అన్యాయం మాత్రం చాలా బాధాకరమైనది.

అంగవైకల్యంలో స్థూలంగా మూడు రకాలను చట్టాలు గుర్తిస్తు న్నాయి. మామూలు పరిభాషలో చెప్పాలంటే గుడ్డి, చెవుడు, కుంటి - మూడు రకాల వైకల్యం గల వారికీ కలిపి 3 శాతం రిజర్వేషను ఉద్యోగరంగంలో 1966 నుండి మన రాష్ట్రంలో ఉంది. కానీ స్థూలంగా చేసే ఏ వర్గీకరణ అయినా తన లోపల అసమాన తలను దాచిపెడుతుంది. 'వికలాంగులు' అనే వర్గీకరణ కూడ మూడు వర్గాల పేరు మీద ఒక వర్గానికే - కాళ్లు చేతులు అనే అంగాలలో వైకల్యం ఉన్నవారికే - ఎక్కువ ప్రయోజనాలు కల్పించింది.

ఇది గమనించి కాబోలు 1988లో కేంద్ర ప్రభుత్వం ఆ 3 శాతాన్ని మూడు వర్గాలకు సమానంగా పంచాలని సూచించింది. మన రాష్ట్ర ప్రభుత్వం ఆ సూచనను ఆమోదించి ఆ మేరకు 1991లో జీవో జారీచేసింది. ఒక్కొక్క రకమైన అంగవైకల్యం వల్ల కొన్ని పనులు చేయడం అసాధ్యం అవుతుంది కాబట్టి అటువంటి ఉద్యోగాలకు మాత్రం ఈ వర్గీకరణ వర్తించదని చెప్పారు. ఒక్కొక్క ప్రభుత్వశాఖ ఏ రకమైన పనులు ఏ కోవకు చెందిన వికలాంగులకు

ఇవ్వడం సాధ్యపడదో తెలియజేస్తే, రాష్ట్ర ప్రభుత్వం నియమించే ఒక 'ఇంటర్ డిపార్ట్‌మెంటల్' కమిటీ ఆ అభిప్రాయాన్ని పరిశీలించి సంపూర్ణంగా గానీ, పాక్షికంగా గానీ మినహాయింపు ఇస్తుందని జీవోలో పేర్కొన్నారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే అటువంటి ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ ఒకటి ఈ తొమ్మిదేళ్లలో ఏర్పడిన దాఖలాలు లేవు. కంటిచూపు లేనివారు, చెవులు వినిపించనివారు, చేతులు, కాళ్లులేని అవిటివారు చేయలేని పనులు ఫలాన అని ఏ ప్రభుత్వ శాఖా జాబితా తయారుచేయలేదు. అటువంటిదాన్ని తయారుచేయడం, ప్రకటించడం అవసరం. ఎందుకంటే అన్ని అంగాలూ సరిగ్గా ఉన్నవారు వికలాంగులు చేయగల పనులేవి, చేయలేని పనులేవి అనేది వాస్తవికంగా నిర్ణయించగలరనుకోవడం భ్రమ. అన్నీ ఉండి తాము అన్ని పనులూ ఇంత అస్తవ్యస్తంగా చేస్తున్నప్పుడు లేనివారేం చేస్తారు లెమ్మనుకుంటారు. అందువల్ల వారి అభిప్రాయాన్ని ప్రకటించడం, వికలాంగులు దానికి జవాబు చెప్పడం, ఆ అభిప్రాయాలను సవరించడం అవసరం. ఆ విధంగానే వికలాంగులయినవారు నిజంగా చేయలేని పనులేవి - లేదా ఏ పని ఏ మేరకు చేయలేరు - అనేది తేలుతుంది.

మన ప్రభుత్వ శాఖలు ఆ పనిచేయవు. తమ అభిప్రాయాన్ని మనసులో దాచుకుని, ఉద్యోగాల కోసం ప్రకటనలిచ్చినప్పుడు మాత్రం ఆ అభిప్రాయాల ప్రకారం రిజర్వేషన్లు నిరాకరిస్తుంటారు. ఇది మౌనంగా జరిగిపోతుంది. ఉదాహరణకు ఈ సంవత్సరం అధ్యాపకుల ఎంపికలో కంటిచూపు లేనివారు చదువు చెప్పలేరని కంటి చూపు ఉన్నవాళ్ళు నిర్ణయించి, వాళ్లకు ఇయ్యవలసిన మూడవ వంతు ఇవ్వలేదు. ఇది అన్యాయమని కోర్టుకుపోతే జడ్జీల అభిప్రాయం కూడా అదే కాబట్టి 'చూద్దాం లెండి' అని పక్కన పెడుతున్నారు. 'గుడ్డివాళ్లు చదువు చెప్పగలరా!' అని రేపు వాళ్లు ప్రభుత్వాన్ని అడగబోతారు. సర్వజ్ఞులయిన ఐఏఎస్ అధికార్లు ఏయే చదువులు వాళ్ళు చెప్పలేరో నిర్ణయిస్తారు. ఆ నిర్ణయం అసంబద్ధమని కళ్లులేని వాళ్ల తరపున ఫీజు కోసం వాదించే కళ్లున్న లాయర్లు రుజువు చేయాలి. ఇదంతా గడిచి ఏ అయిదేళ్ల తరువాతో ఒక తీర్పు వచ్చేసరికి ఇంక ప్రభుత్వరంగంలో ఉద్యోగాలుండవు. ప్రైవేట్‌రంగం ఏ వికలాంగులకూ ఉద్యోగాలివ్వదు.

సామాజిక న్యాయం కోసం చేసే ఏ చట్టాలూ ఎందుకు అమలు కావని చాలా మంది అడుగుతుంటారు. వాటికి ఎవరో స్వార్థపరులు అడ్డం పడనవసరం లేదు. వాటిని అమలు చేయవలసినవారే వాటిని న్యాయమైనవిగా అనుకోరు. ఓట్ల కోసమో, తప్పుడు ఔదార్యం వల్లనో, గురి తప్పిన కారుణ్యం వల్లనో ఉనికిలోకి వచ్చిన తెలివితక్కువ నియమాలుగా వాటిని భావిస్తారు.

చట్టాలను, పాలనా విధానాలను అమలు చేసేవారు కుంటివాళ్ళు కారు, గుడ్డివాళ్ళు కారు, మాలవాళ్ళు కారు, మాదిగవాళ్లు కారు, ఆడవాళ్లు కారు, ఆదివాసులు కారు, ఆకలెరిగిన వారు కాదు. ఒకవేళ ఎప్పుడైనా అయినా ఇప్పుడా విషయం జ్ఞాపకం ఉన్నవారు కారు. కానీ వారే ఈ సమాజానికి సంబంధించిన 'ప్రధాన స్రవంతి.' దీనికి వెలుపల ఉండే వాళ్ళ ఒత్తిడి వల్ల 'సామాజిక న్యాయం' అనే భావం, దానికి సంబంధించిన చట్టాలు ఉనికిలోకి వచ్చినా ఆ భావన పట్ల ఏ మాత్రం సానుభూతి లేనివారు వాటిని అమలు చేయాలి కాబట్టి అవి అమలు కావడం సులభం కాదు. చట్టాలను అమలు చేయని అధికార్లను నియంత్రించవలసిన న్యాయస్థానాలలో ఆసీనులయిన న్యాయమూర్తులు కూడా అదే ప్రధాన స్రవంతికి చెందినవారు కాబట్టి ఒక కాంట్రాక్టరుకు టెండర్ నోటిఫికేషన్‌లో అన్యాయం జరిగిందంటే గంటల తరబడి వాదనలు విని అర్జెంట్‌గా ఆర్డర్లు జారీ చేసే న్యాయమూర్తులు గుడ్డివాళ్లు కోర్టుకొచ్చి ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ తమకు అన్యాయం చేసిందంటే వంకరనవ్వు నవ్వి చూద్దాం లెమ్మంటారు.

ఈ వంకర నవ్వు నవ్వేవాళ్లు - జడ్జిలు, ఐఎఎస్ అధికారులు, ఇతర పెద్ద మనుషులు - తాము అన్యాయం చేస్తున్నామనుకోరు సరికదా, పాక్షిక ప్రయోజనాల దాడి నుండి సార్వత్రిక ప్రయోజనాలను కాపాడుతున్నామనుకుంటారు. ఇవ్వాల్టి పరిభాషలో చెప్పాలంటే దారితప్పిన ఔదార్యం నుండి అభివృద్ధిని కాపాడుతున్నామను కుంటారు. 'ఔదార్యం' అనేది హక్కులను ఇచ్చేవాళ్ల కోణం నుండి చూసే మాట అనిగానీ, అది చట్టం రూపం తీసుకునిందంటేనే దానిని 'అభివృద్ధి'లో అంతర్భాగంగా నిర్వచిస్తున్నట్టని గానీ వారు భావించరు.

అందువల్ల చట్టాలలోని హక్కులనేకం ఆచరణలో భాగం కావు. కాకుండ చేసిన వారికి ఏ శిక్షా లేనంత కాలం - ఏ కష్టమూ రానంతకాలం - ఈ పరిస్థితి మారదు. 'సంక్షేమ చట్టాలు' 'సామాజిక న్యాయ విధానాలు' అని పిలువబడే హక్కులను తెలిసీ అమలు చేయని అధికారులకు ఏ నష్టమూ జరగదు. దానిని కనీసం 'మిస్‌కాండక్ట్'గా గుర్తిస్తేనయినా కొంత ఒళ్లు దగ్గర పెట్టుకుని వ్యవహరించేవారేమో గానీ వంద రూపాయలు లంచం తీసుకున్న అధికారికి వచ్చే ఇబ్బంది సహితం జీవితాంతం రిజర్వేషన్లు అమలుచేయని అధికారికి రాదు. తన డిపార్ట్‌మెంట్‌లో 'క్లాస్ ఫోర్' ఉద్యోగులను ఏళ్ల తరబడి ఎన్ఎంఆర్‌లుగా ఉంచేసిన అధికారికి రాదు. వంద రూపాయలు లంచం తీసుకోవడం వల్ల సమాజానికి జరిగే నష్టమెంతో గానీ, వీరి వైఖరి వల్ల వేలాదిమంది హక్కులుండీ లేని వారవుతారు. అయినా వీరు మాత్రం తమ పదవుల నిచ్చెన మెట్లెక్కి పైకి పోతూనే ఉంటారు. దీనికి విరుగుడు కనిపెట్టనిదే సామాజిక న్యాయం చట్టాలలోకి ఎక్కినా సామాజిక ఆచరణలో భాగం కాదు.

*ప్రజాతంత్ర*

*12 నవంబర్ 2000*

# గచ్చిబౌలిలో మండల్ కమిషన్

మండల్ కమిషన్ గురించి పెత్తందారీ కులాల వాళ్లంతా ఎంత గగ్గోలు పెట్టారో మనకు బాగానే జ్ఞాపకం ఉంది. 'మండల్' అనేది ఆనాటి నుండి అసమర్థతను ప్రోత్సహించడానికీ, దేశాన్ని చీల్చడానికీ, పాక్షిక ప్రయోజనాల కోసం సార్వత్రిక ప్రయోజనాలను తాకట్టు పెట్టడానికీ పర్యాయపదంగా ఉంది.

ఎంత గొడవ పెట్టినా వారు రాజకీయంగా ఓడిపోక తప్పలేదు. కోర్టుకు పోయారు గానీ అక్కడ కూడా (కొన్ని ఒడిదుడుకులతో) సాంఘిక న్యాయానిదే విజయం అయింది. 'క్రీమీలేయర్'ను తొలగించాలని సుప్రీంకోర్టు నిర్విచక్షణగా చెప్పినప్పటికీ మొత్తం మీద రిజర్వేషన్లకు సంబంధించిన అనేక అంశాలలో అభినందించ దగ్గ సూత్రీకరణలే చేసింది.

కానీ ఆఖరి అస్త్రం బ్రాహ్మణీయ శక్తుల చేతులలో మిగిలే ఉంది. వారు మండల్ కమిషన్ ద్వారా వచ్చిన రిజర్వేషన్ల అమలుకు అడ్డం పడ్డారు. విధాన నిర్ణయాలు చేసే రాజకీయ నాయకుల వ్యక్తిగత ఇష్టాయిష్టాలు ఎట్లాగున్నా వారు ఏదో ఒక మేరకు సమాజంలో మెజారిటీ ప్రజల ఒత్తిడికి లొంగక తప్పదు. ఆ నిర్ణయాల రాజ్యాంగబద్ధతను బేరీజువేసే న్యాయమూర్తుల వ్యక్తిగత అభిప్రాయాలు ఎట్లాగున్నా వారు ఏదో ఒక మేరకు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తలొగ్గక తప్పదు. ఏ ఒత్తిడి లేనిది కార్యనిర్వాహకశాఖకే. బ్యూరోక్రసీకి ప్రజల అభిప్రాయాలు పట్టించుకోవాల్సిన అగత్యం లేదు. రాజ్యాంగమంటే గౌరవం లేదు. 'కోర్టు ధిక్కారం' అంటూ న్యాయమూర్తులు అప్పుడప్పుడు వారిపైన కన్నెర్ర చేస్తుంటారుగానీ, అంతకంటే ఎక్కువేమీ చేయరని వారికి తెలుసును.

ముఖ్యంగా, విద్యారంగంలోని మేధోబ్యూరోక్రాట్లు తాము దేనికీ జవాబుదార్లు కాని ఘనులమనుకుంటారు. వారికి సాంఘిక న్యాయమనే విలువ పట్ల ఉన్న చులకన భావం విద్యారంగానికొక పీడగా మారింది. ప్రభుత్వ విధానాలకూ రాజ్యాంగ సూత్రాలకూ భిన్నంగా నిర్ణయాలు తీసుకునే అధికారం తమకు లేదని వాళ్లు ఒప్పుకోరు. అవి అలగాజనం పెట్టే ఒత్తిడివల్ల అహేతుకమైన రూపం తీసుకున్నాయనీ హేతుబద్ధమైన ప్రయోజనాల రక్షణ చేయడం తమబోటి నిష్కామకర్ములయిన బుద్ధి జీవులకే చెల్లుననీ అనుకుంటారు.

విద్యా రంగంలో మండల్ కమిషన్‌కు పట్టిన గతి దీనికొక ఉదాహరణ. జాతి ప్రయోజనాన్ని పట్టించుకోకుండా అడిగిన వాళ్లందరికీ రిజర్వేషన్లు ఇచ్చేస్తున్నారనీ, చేతకాని వాళ్లంతా రాజకీయ నాయకుల ఓట్ల దౌర్బల్యాన్ని అడ్డం పెట్టుకుని పైకి ఎగబాకి దేశాన్ని నాశనం చేస్తున్నారనీ వాపోయేవాళ్లు - విద్యారంగాన్ని ఏలే బ్రాహ్మణీయ బ్యూరోక్రాట్లు ఆ ఒక్క రంగాన్ని మాత్రం ఆ ఉపద్రవం నుండి కాపాడారని చెప్తే సంతోషిస్తారేమో.

మండల్ కమిషన్ సిఫారసులను అనుసరించి కేంద్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొన్ని సవరణలతో ఆమోదించిన తరువాత, కేంద్ర ప్రభుత్వం 1993 సెప్టెంబర్ 8న ఒక ఆర్డర్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం కిందనున్న అన్ని పోస్టులలోనూ సర్వీసులలోనూ 27 శాతం బిసిలకు రిజర్వు చేయాలని దీని సారాంశం.

ఏడేళ్లు గడిచినా దేశంలోని ఏ ఒక్క కేంద్ర విశ్వవిద్యాలయంలోనూ ఇది అమలు కావడం లేదని ఈ వ్యాసం సారాంశం....

వేరే ఎవరికీ ఆ ఆర్డర్ భావమేమిటన్న సందేహం రాలేదుగానీ విద్యావేత్తలకి మొదట్లోనే సందేహం వచ్చిందంట. ఏమని సందేహమంటే, ఈ రిజర్వేషన్ ఉన్నతస్థాయి విద్యాసంస్థలకు కూడా వర్తిస్తుందా అని. ఏదైనా ఒక పత్రంలో సందిగ్ధానికి తావు ఉంటే సందేహం రావచ్చును గానీ ఏ సందిగ్ధానికీ తావులేని స్పష్టమైన భాషలో ఉన్న బిసి రిజర్వేషన్ ఆర్డర్ గురించి సందేహమెందుకు రావాలి?

ఏమయితేనేం వచ్చింది. దానికి కేంద్ర ప్రభుత్వం జవాబు కూడా ఇచ్చింది. ఈ రకమైన సందేహం కొంతమంది వ్యక్తం చేస్తున్నారని చెప్తూ, కేంద్ర ప్రభుత్వం కిందనున్న సంస్థలే కాబట్టి వాటికి కూడా 1993 సెప్టెంబర్ 8 నాటి రిజర్వేషన్ ఆర్డర్ వర్తిస్తుందని చెప్తూ 1994 డిసెంబర్ 13న ఒక సర్క్యులర్ జారీ చేసింది.

అక్కడితో సందేహం తీరాలి కానీ అది సందేహమయితేగా తీరడానికి? అది అభ్యంతరం. అందువల్ల అది తీరదు. కేంద్ర ప్రభుత్వం విషయాన్ని స్పష్టం చేసిన తరువాత కూడా విద్యారంగ బ్యూరోక్రాట్లు కేంద్ర విద్యాసంస్థలలో బిసి రిజర్వేషన్‌ను

అమలు చేయకుండా తప్పించుకున్న వైనాన్ని తెలుసుకోవాలంటే గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు.

ఆ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బిసి కులస్తులు పెట్టిన ఒత్తిడి ఫలితంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి బిసిలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడం జరుగుతుందని 1994 జూన్ 23న హైదరాబాద్ యూనివర్సిటీ పాలనా మండలి ఒక తీర్మానం చేసింది. ఆ విషయాన్ని ఆగస్టు 2న నోటిపై చేసింది కూడా.

కానీ మళ్లీ ఏ కారణంగానో 'సందేహం' తలెత్తినట్టుంది. 1994 నవంబర్ 26న హైదరాబాద్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ యు.జి.సికి ఒక ఉత్తరం రాసి తమ సందేహాన్ని తీర్చమన్నాడు. ఇటువంటి సందేహాలను దృష్టిలో ఉంచుకునే, అదే సంవత్సరం డిసెంబర్ 13న కేంద్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ జారీ చేసిన సంగతి పైన చూశాం. కానీ హైదరాబాద్ విశ్వవిద్యాలయం పాలనా మండలి దానిని పట్టించుకోదలచుకోలేదు. యు.జి.సి చేసే విధాన నిర్ణయాలు తమకు శిరోధార్యం కాబట్టి యు.జి.సి నుండి జవాబు రావాలని పట్టుబట్టారు. శంఖంలో పోస్తే తప్ప అది తీర్థం కాదని నమ్మే సంస్కృతికి వారసులు కదా మరి!

యు.జి.సి ప్రవర్తన ఇంకా విచిత్రంగా ఉంది. నిజానికి రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్న తరువాత దానితో విభేదించే అధికారం యు.జి.సికి లేదు. జాతీయ విధానాలకు సంబంధించిన ఏ విషయంలోనైనా యు.జి.సి కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఆదేశాలకు లోబడి వ్యవహరించాలని యు.జి.సి చట్టంలోని సెక్షన్ 20 అంటుంది. అయినప్పటికీ 1994 డిసెంబర్ 13న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను యు.జి.సి పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏ విషయం తేల్చి చెప్పేదాకా వేచి చూడమనీ, ఆ లోపల లెక్చరర్ పోస్టులు నింపవద్దనీ హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 1995 ఆగస్ట్ 3న ఉత్తరం రాసింది!

అయితే లెక్చరర్ పోస్టులు నింపకుండా ఉంటే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుంది. కాబట్టి హైదరాబాద్ యూనివర్సిటీ యు.జి.సి జారీ చేసిన 'స్టే'ని లెక్క చేయకుండా లెక్చరర్ పోస్టులు నింపుతూనే ఉంది. మరి బి.సి రిజర్వేషన్ మాట ఏమిటని ఎవరైనా అడిగితే మళ్లీ యు.జి.సికి ఒక ఉత్తరం రాస్తుంది. యు.జి.సి పాత పద్ధతిలోనే 'కేంద్రం నిర్ణయం కోసం నేను ఎదురుచూస్తున్నాను. నువ్వు కూడా ఎదురుచూడు' అంటుంది. ఆరేళ్ల కింద కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సందేహాలనే ప్రస్తావిస్తూ ప్రకటించిన నిర్ణయం 'ఇంకా రాలేదు, ఇంకా రాలేదు' అంటూ హైదరాబాద్ విశ్వవిద్యాలయం పెద్దలూ, యు.జి.సి పెద్దలూ దాని కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఈ లోపల 'తమ వారికి' ఉద్యోగాలు కట్టబెడుతూనే ఉన్నారు. వారు 'ప్రతిభావంతులు' కదా మరి!

కిందటి సంవత్సరం హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఒకేసారి 52 లెక్చరర్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఎప్పటిలాగే అందులో బి.సిలకు రిజర్వేషన్ లేదని చూసి ఇ.వెంకటేశు, మురళి అనే ఇద్దరు బిసి విద్యార్థులు, యూనివర్సిటీ బిసి ఉద్యోగుల సంఘం హైకోర్టులో కేసు వేశారు. పైన వివరించిన విషయాలన్నీ హైకోర్టుకు చెప్పారు. 1994లోనే కేంద్రం స్పష్టం చేసిన తరువాత యు.జి.సి ఇంకా తన అభిప్రాయం యూనివర్సిటీకి తెలియజెప్పకుండా దాటవేయడంలో అర్థం లేదంటూ, నాలుగు వారాలలో మీ సూచన హైదరాబాద్ యూనివర్సిటీకి తెలియజేయమని' హైకోర్టు యు.జి.సికి ఈ సంవత్సరం జులై 7న ఆర్డర్ జారీ చేసింది. నాలుగు వారాలంటే ఒక నెల. కాని మూడు నెలలు అయినా యు.జి.సి నుండి ఉలుకూపలుకూ లేకపోయేసరికి ఏమయిందని హైకోర్టు యు.జి.సిని అడుగగా, మళ్లీ కేంద్ర ప్రభుత్వానికి రాశాననీ వారి నుండి జవాబు రావాలనీ యు.జి.సి చైర్మన్ అన్నారు. వారి వైఖరిని అర్థం చేసుకున్న హైకోర్టు ఆ మహానుభావుడిని డిసెంబర్ 28న హైదరాబాద్ వచ్చి తన ముఖం చూపించమని శాసించింది.

వస్తాడో రాడో, కొత్తగా ఏం సంజాయిషీ వండుకొస్తాడో వేచి చూడవలసిందే. కానీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన ఆదేశాలు సహితం అమలుకావడం చాలా కష్టమన్న అభిప్రాయాన్ని ప్రకటించటానికి మనం ఇంకా వేచి చూడవలసిన అవసరం ఎంత మాత్రం లేదు.

*బి.సి గర్జన*
*జనవరి 2001*

# ఈ ఆధునిక అగ్రహారాలను చూడండి

సైన్సు, టెక్నాలజీలలో నైపుణ్యం ఉన్నవారి అహంకారం స్వల్పం కాదు. వాళ్లను సామాజిక ప్రాముఖ్యం గల నిర్ణయాలు చేయమని అడిగితే అందులో తమకు తెలియని విషయమేమైనా ఉందేమోనన్న అనుమానాన్ని సైతం దగ్గరకు రానివ్వరు. అందు వల్లనే సామాజిక ప్రాముఖ్యం గల ఏ నిర్ణయాన్నీ సైంటిస్టులకు వదిలి పెట్టకూడదు.

వైజ్ఞానిక సంస్థలలో రిజర్వేషన్ల అమలుకు పట్టిన గతి చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. రిజర్వేషన్ల గురించి రాజ్యాంగం ఏమంటుందో వాళ్లకు అనవసరం. రిజర్వేషన్లకు సంబంధించిన అన్ని కోణాలనూ పరిశీలించి చట్టాన్ని ప్రకటించడం కోసం ఏర్పాటు చేసిన 9 మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం మండల్ కమిషన్ కేసులో ఏమన్నదో వారికి అనవసరం. వాళ్ళకున్న సంకుచితమైన వైజ్ఞానిక పరిధిలో వారు ఏర్పరచుకున్న అభిప్రాయాలే సర్వం అని వారు భావిస్తారు. అవే సత్యమని భావిస్తారు. ఇది ఎక్కడైనా సైంటిస్టులతో ఉండే సమస్యే కావచ్చును. కానీ భారతదేశంలో సైంటిస్టులు అత్యధికంగా బ్రాహ్మణులు కావడం వల్ల ఆ వర్గానికి ఉండే దృష్టి లోపం చాలా ప్రగాఢమయినది.

అత్యధిక భాగం వైజ్ఞానిక, సాంకేతిక సంస్థలలో అసలు రిజర్వేషన్లే అమలు కావు. మండల్ కమిషన్ సిఫారసులపైన ఆధారపడ్డ కేంద్ర ప్రభుత్వ ఆదేశం రాజ్యాంగ బద్ధమేనని 9 మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ప్రకటించి ఎనిమిదేళ్లు గడిచినా ఏ ఒక్క కేంద్ర ప్రభుత్వరంగ వైజ్ఞానిక సంస్థలోనూ బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వటం

లేదు. ఏమీ ఎందుకూ అని వారిని అడగడానికి వీలులేదు. 'ప్రతిభ'కు తప్ప వేరే దేనికీ వైజ్ఞానిక సంస్థలలో చోటు లేదని వారి గట్టి అభిప్రాయం.

ఈ రకమైన వాదనలో 'ప్రతిభ' అనే మాటకు ఉండే అర్థాల గురించి, అర్థచ్ఛాయల గురించి సామాజిక శాస్త్రవేత్తలే కాదు, సుప్రీంకోర్టు జడ్జీలు సహితం చేసిన నిశితమైన వ్యాఖ్యలు వారికి అక్కరలేదు. మన దేశంలో ఐఐటిలు సాంకేతిక విద్యా సంస్థలలో మేటి. అవి ప్రస్తుతం ఆరు ఉన్నాయి. దళితులకూ, ఆదివాసులకూ సీట్లలో రిజర్వేషన్ కల్పించాలని వారికెవరో చెప్పినట్టున్నారు. వారు ఇవ్వడానికి పూనుకున్నారు.

ఏ విధంగానంటే దళితులకు ఇచ్చే 15% రిజర్వేషన్‌లోనే దళితులందరూ సీట్లు పొందాలి. ఒకవేళ అభ్యర్థులందరిలోకీ ఒక దళిత అభ్యర్థికే ఎక్కువ మార్కులు వచ్చినా సరే, ఆ దళిత అభ్యర్థి దళితులకు ఇచ్చే 15% సీట్లనుండే తన సీటు పొందాలి. ఆదివాసీ అభ్యర్థులయినా అంతే. అత్యంత 'ప్రతిభావంతులయిన' ఆదివాసులు సహితం ఆదివాసులకిచ్చే 7.5% సీట్లలోనే సీటు పొందాలి.

రిజర్వేషన్లు ఇమ్మంటే అంటరానితనం పాటిస్తున్నారేమిటని వారిని అడగవద్దు. చాలా గొప్ప పని చేస్తున్నామనుకుంటున్నారు వారు. అహంకారంతో వాళ్ల కళ్లు ఎంత పూర్తిగా మూసుకుపోయాయంటే వాళ్లు దళిత విద్యార్థులనే కాదు, వారి అప్లికేషన్ ఫారంలను కూడా అంటరానివిగా భావిస్తున్నారు. ఒకే అప్లికేషన్ ఫారంలో దళితులూ సవర్ణులూ అప్లై చేయడానికి వీలు లేదు. ఎవరి ఫారంలు వారివి. ఆ ఫారంను దళితులు తెల్లరంగు కవర్‌లో పెట్టి పోస్టు చేయాలి. సవర్ణుల కవరు గోధుమ రంగులో ఉంటుంది. ఆ విధంగా వేరువేరు అప్లికేషన్ ఫారంలు తెప్పించుకుని వేరువేరు మెరిట్ లిస్టులు తయారు చేస్తారు. దళిత అభ్యర్థులు వారి లిస్టు నుండి, వారి కోటా మేరకు మాత్రమే సీట్లు పొందాలి. ఆదివాసులయినా అంతే.

ఎక్కడో మారుమూల గ్రామాలలో దళిత విద్యార్థులకు వేరే క్లాస్ రూంలు పెట్టారనీ వేరే బెంచీల మీద కూర్చోమంటున్నారనీ అప్పుడప్పుడు పత్రికలలో చదివి ఇంకా ఇంతటి అనాగరికత ఉందా అని ఆశ్చర్యపోతుంటాం. ఆగ్రహం చెందుతుంటాం. కానీ అత్యంత ప్రతిభావంతులయిన సైంటిస్టులు పరిపాలించే అత్యంత నాగరికమైన ఐఐటిలు దళిత అభ్యర్థుల అప్లికేషన్లు వేరే వాళ్ల అప్లికేషన్లతో కలవకుండా వేరుగా ఉంచుతున్నాయనీ, ఒకరి 'మెరిట్‌లిస్టు' వేరేవారి 'మెరిట్‌లిస్టు'తో కలవకుండా వేరుగా ఉంచుతున్నాయనీ ఎంతమందికి తెలుసు? రిజర్వేషన్లు కల్పించే పద్ధతి ఇది కాదని ఏ కొంచెం ఇంగితం ఉన్నవారికైనా తెలిసే ఉండాలి. కానీ ఐఐటి మేధావులకు మాత్రం తెలియదు.

నిజానికిది తెలియకపోవడం కూడా కాదు. రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా వైజ్ఞానిక సంస్థలలో ప్రవేశార్హత లేనివారికి ఆ అవకాశం అందిస్తున్నామని ఈ సంస్థల పాలక వర్గాలు భావిస్తాయి. ఈ అర్హత వారు నమ్మే 'మెరిట్' కూడా కాదు. కులమే ఆ అర్హత. అది లేని కులాలకు రిజర్వేషన్లు కల్పించి, ఆ మేరకు మాత్రమే వారిని రానిస్తారు. ఆ విధంగా వారిని రానివ్వడం తమ గొప్పతనానికీ ఔదార్యానికీ నిదర్శనమని వారు భావిస్తారు. కాబట్టి ఇది ఎంత దుర్మార్గమైన వైఖరో వారికి అర్థం కాదు.

మరి దళితులూ, ఆదివాసులూ ఐఐటిలలో సవర్ణ హిందువులతో పోటీపడి సీట్లు పొందడానికి వీలే లేదా? ఉంది - తాము దళితులమన్న సంగతి, ఆదివాసులమన్న సంగతి తొక్కిపెట్టి పోటీలో పాల్గొనాలి. అంటే ఒకవేళ నెగ్గకపోతే రిజర్వేషన్ పొందే అవకాశాన్ని విడిచిపెట్టుకుని పోటీకి సిద్ధం కావాలి. కులం పేరు చెప్పడానికి ఖాళీలేని జనరల్ అప్లికేషన్ ఫారం నింపి గోధుమ రంగు కవర్‌లో పెట్టి పంపించాలి. అప్పుడు అందరితో పాటు పోటీ పడవచ్చు. కానీ ఓడిపోతే మాత్రం రిజర్వేషన్ అడగడానికి వీలులేదు.

'ఇది నిజంగానే జరుగుతున్నదా?' అని చాలామంది ఆశ్చర్యపోవచ్చును. కానీ మండల్ కమిషన్ వచ్చి ఎనిమిదేళ్లు గడిచినా కూడ ఈ ఐఐటిలు బిసిలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం లేదని గుర్తు చేసుకుంటే ఇందులో అంతగా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. బిసి రిజర్వేషన్ల దాకా ఎందుకు - విద్యార్థుల ఎంపికలో పైన చెప్పినట్టు ఒక వక్రమైన పద్ధతిలోనైనా ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్ కల్పిస్తుండవచ్చును గానీ అధ్యాపకులలో ఎస్‌సి, ఎస్‌టిలు దాదాపు మృగ్యమనే చెప్పుకోవాలి. దళితులు, బిసిల దాకా ఎందుకు, బ్రాహ్మణేతర అగ్రకులాలు సహితం ఐఐటిలలోనూ ఇతర కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలలోనూ ఎక్కువ కనిపించరు.

మద్రాసులో ఐఐటిని 'అయ్యంగార్, అయ్యర్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్) టెక్నాలజీ' అని ద్రవిడ ఉద్యమకారులు పిలుస్తారంటే ఆ పేరు ఊరికే రాలేదు మరి! దేశంలో అగ్రహారాలు ఇంకా ఎక్కడైనా మిగిలి ఉన్నాయంటే అది ఉన్నత (సాంకేతిక) విద్యా రంగంలోనే అనేది ఆధునికతను అపహాస్యం చేసే విషయం కావచ్చును గానీ అది సత్యమే.

*ప్రజాతంత్ర*
*16 అక్టోబర్ 2001*

# విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కాపాడుకుందాం

సంక్షేమ బాధ్యతలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలు ఒక్క మాట అంటే చాలు, దానికి కార్యరూపం ఇవ్వడానికి మన ప్రభుత్వాలు తొందరపడతా యనడానికి ఒక ఉదాహరణను కిందటిసారి ప్రస్తావించాను. అడవులలోని 'చొరబాటుదార్ల' గెంటివేత గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేంద్ర అటవీ శాఖను ప్రశ్నించినదే తడవుగా, ఆదివాసులతో సహా అందరినీ ఫలాన తేదీ లోపల రిజర్వ్ ఫారెస్టు నుండి గెంటివేయాలని దేశ ప్రధాన ఫారెస్టు కన్సర్వేటర్ సర్క్యులర్ జారీ చేసాడు.

అటువంటి మరొక ఉదాహరణ మన రాష్ట్ర ప్రభుత్వం చల్లగా జారీ చేసిన జీవో నెం. 75 (విద్యాశాఖ), తేదీ 18 అక్టోబర్ 2002. ప్రభుత్వం నుండి ఎయిడ్ పొందే సంస్థలతో సహా ఏ ప్రైవేట్ విద్యా సంస్థా అధ్యాపకుల నియామకంలో రిజర్వేషన్లు పాటించ నవసరం లేదని ఈ జీవో సారాంశం.

అంతకు ముందు ఆం.ప్ర. విద్యాసంస్థల (ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల వ్యవస్థాపన, గుర్తింపు, నిర్వహణ, నియంత్రణ) రూల్స్, 1993లోని రూల్ 12(6) ప్రకారం ప్రభుత్వ పాఠశాలల లాగ ప్రైవేట్ పాఠశాలలు కూడా అధ్యాపకుల నియామకంలో రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు పాటించాలని ఉండింది. దీనివల్ల తమ వారికి ఉద్యోగా లిచ్చుకునే మహదావకాశం తగ్గిపోయిందనీ, విద్యాసంస్థలు నెలకొల్పేది అందుకోసమేగా అని బాధపడిన ప్రైవేట్ విద్యాసంస్థ వారెవరో ఈ రూల్ 12(6) చెల్లదంటూ హైకోర్టు కెక్కారు.

వారి అదృష్టం కొద్దీ, మన దురదృష్టం కొద్దీ అప్పట్లో మన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో సత్యబ్రత సిన్హా అనే పెద్దమనిషి ఉండేవాడు. ఈయన పదవీ కాలంలో మన రాష్ట్రంలో సంక్షేమ చట్టాలకూ, ప్రభుత్వ సంక్షేమ బాధ్యతకూ ఎంత నష్టం చేయాలో అంతా చేసి పోయాడు. వాటిలో ఒకటి రూల్ 12(6) లోని రోస్టర్ నియామకం.

జడ్జీలు చట్టాన్ని అనుసరించి తీర్పులు చెప్తారు కదా, ఒక జడ్జీ ప్రభుత్వ సంక్షేమ బాధ్యతలకు అన్యాయం చేయడం ఏమిటి అంటారేమో, చట్టాలను వ్యాఖ్యానించే టప్పుడు న్యాయమూర్తులకు చాలా విస్తృతమైన విచక్షణాధికారం ఉంటుంది. దాని చాటున వారి వ్యక్తిగత అభిప్రాయాలను తీర్పులలోకి తరచుగా చొప్పిస్తుంటారు. ఇది ప్రతీ రోజూ జరుగుతూనే ఉంటుంది. అయితే బయట దీని గురించి చర్చ జరగదు. దానికి మూడు కారణాలున్నాయి. కోర్టు తీర్పులు సాంకేతికమైన చట్ట పరిభాషలో ఉంటాయి కాబట్టి అందులో తమకు అంతుబట్టని గొప్ప జ్ఞానం ఏదో వుందని పామర జనం జంకుతారు. న్యాయమూర్తులను విమర్శిస్తే కోర్టు ధిక్కారం అవుతుందేమోనన్న భయం రెండవ కారణం. అన్నీ తెలిసి సత్యం బహిర్గతం చేసే స్థితిలో వున్న లాయర్లు జడ్జీలను ఏమైనా అంటే తమ వ్యాపారం దెబ్బతింటుందని (లాయర్లు చేసేది వ్యాపారమే కాబట్టి) భయపడడం మూడవ కారణం.

సత్యబ్రత సిన్హా గారికి సంక్షేమం, సమానత్వం మొదలయిన రాజ్యాంగ విలువ లంటే గౌరవం లేదు. ఆ అగౌరవం ఆయన మన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇచ్చిన అన్ని తీర్పులలోనూ కన్పిస్తుంది. ఎవ్వరికీ రిజర్వేషన్లు ఇవ్వడానికే వీలులేదని ప్రకటించే అవకాశం ఉంటే ప్రకటించేవాడే గానీ అది సాధ్యం కాదు కాబట్టి రిజర్వేషన్లు ప్రభుత్వరంగానికి మాత్రమే వర్తిస్తాయని ప్రకటించి రూల్ 12(6) చెల్లదని ఆయన అన్నాడు.

ఆ తీర్పు న్యాయ సిద్ధాంతపరంగా తప్పని రుజువు చేయవచ్చును గానీ చేయడానికిది సందర్భం కాదు. అయితే దానిని అధిగమించి ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కల్పించదల్చుకుంటే ప్రభుత్వానికి వేరే మార్గం లేకపోతే ఆం.ప్ర. విద్యా చట్టానికి తగు సవరణలు చేసినట్టయితే సరిపోయేది. దాని బదులు సిన్హాగారి తీర్పును మన రాష్ట్ర ప్రభుత్వం సవినయంగా శిరసావహించి జీవో నెం. 75 జారీ చేసింది. అదే ప్రజా వ్యతిరేకమైన ఏదయినా చట్టాన్ని లేక జీవోను హైకోర్టు కొట్టేసి ఉంటే దానికి ప్రాణం పోయడానికి ఏం చేయాలో అన్నీ చేద్దురు. ఈ వినయమంతా ప్రజా అనుకూల స్వభావం గల తీర్పుల అమలు విషయంలోనే.

మన రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నది ఒక్క విద్యా సంస్థలలోనే అన్నది అందరూ ఎరిగిన విషయమే. విద్యారంగం నుండి ప్రభుత్వం క్రమంగా పక్కకు తప్పుకునే

కొద్దీ ఈ అవకాశాలు ప్రైవేట్ విద్యారంగంలోనే మిగిలి ఉంటాయి. అక్కడ రిజర్వేషన్లు లేనట్టయితే విద్యావంతులయిన దళిత, బిసి, ఆదివాసీ యువకులకు ఉద్యోగ అవకాశాలు బాగా తగ్గిపోతాయి. కనీసం ఎయిడెడ్ విద్యా సంస్థలలోనయినా రిజర్వేషన్ కల్పించే అధికారాన్ని చట్ట సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తనకు తాను కల్పించుకోవటం ఉచితంగా ఉండేది.

ఇప్పుడు దళిత సంఘాలు కొంచెం గొడవ చేసేసరికి జీవో 75ను పక్కన పెట్టాలని కేబినెట్ నిర్ణయించిందని వార్తలొస్తున్నాయి. అయితే పక్కన పెట్టి ఏం చేస్తారు? హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా రిజర్వేషన్లు అమలు చేయలేరు కదా? చేయమని ప్రైవేట్ విద్యా సంస్థలను ఆదేశించినా వారు సమ్మతించరు కదా?

ఆం.ప్ర. విద్యా చట్టాన్ని (ఎడ్యుకేషన్ అక్ట్) సవరించి ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయించే అధికారం ప్రభుత్వానికి కల్పించడం హైకోర్టు తీర్పును అధిగమించడానికి అవసరం. లేదా హైకోర్టు తీర్పుపైన సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసినట్టు చెప్తున్న అప్పీలును త్వరగా తెమల్చవచ్చు. విద్యాచట్టం ప్రైవేట్ విద్యా సంస్థలపైన రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే విస్తృతమైన నియంత్రణాధికారాలు ఇచ్చింది. అవి చెల్లుతాయని కోర్టులు తీర్పులిచ్చి ఉన్నాయి. రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులున్న మైనారిటీ విద్యాసంస్థలు సహితం, ప్రభుత్వం నుండి ఎయిడ్ పొందేటట్ట యితే సమాజ హితం కోరి ప్రభుత్వం జారీ చేసే నియమాలకు లోబడి నడచుకోవాలని సుప్రీంకోర్టు చెప్పివుంది. కాబట్టి రిజర్వేషన్లు కల్పించాలనీ రోస్టర్ ప్రకారం అధ్యాపకుల నియామకాలు జరపాలనీ వారిని ఆదేశించే అధికారాన్ని ఆ చట్టంలో చేర్చినట్టయితే ఆ సవరణ చెల్లుబాటు కాకుండా పోదు.

సంక్షేమానికి సంబంధించిన ఒక్కొక్క హక్కునూ మనం మౌనంగా కోల్పోతున్నాం. ఉద్యమాలు స్తబ్దంగా, బలహీనంగా ఉండడం ప్రభుత్వానికి గొప్ప అవకాశాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఏ కారణంగానయితేనేం జీవో 75ను పక్కన పెట్టాలని ప్రభుత్వమే నిర్ణ యించింది కాబట్టి, అది చాలదనీ విద్యా చట్టాన్ని సవరించి రూల్ 12(6)కు చట్టంలోనే చోటు కల్పించాలనీ డిమాండ్ చేస్తూ బలమైన ఉద్యమం చేపట్టవలసిన అవసరం ఉంది. ఇదేదో దళిత సంఘాల బాధ్యత అనుకుని వారికే వదిలేయకుండ ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలన్నీ దీని కోసం నడుం కడతాయని ఆశిద్దాం.

*ప్రజాతంత్ర*
*11 నవంబర్ 2002*

# 'రీసర్చ్'లో రిజర్వేషన్లు తీసేయడం ఏం న్యాయం?

దేశంలోని విశ్వవిద్యాలయాలు ఎం.ఫిల్, పిహెచ్.డి కోర్సుల అడ్మిషన్లలో ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లు పాటించనక్కరలేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి.) ఈ మధ్యనే ఒక సర్క్యులర్ జారీ చేసింది. యు.జి.సి చేసే విధానపరమైన నిర్ణయాలు అన్ని విశ్వవిద్యాలయాలకూ శిరోధార్యం కాబట్టి ఇది చాలా ప్రాముఖ్యం గల నిర్ణయం. వేలాది దళిత ఆదివాసీ యువకుల భవితవ్యం మీద దుష్ప్రభావం వేసే నిర్ణయం.

సామాజిక న్యాయాన్యాయాల సంగతి కొంచెం సేపు పక్కనపెట్టి, ఇటువంటి నిర్ణయం తీసుకునే అధికారం యు.జి.సికి ఉందా అన్న ప్రశ్న వేసుకోవాలి. యు.జి.సికి ఉండే అధికారాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చట్టం చెప్తుంది. ఆ సంస్థకు విద్యా ప్రమాణాలను, అధ్యాపకుల నియామకానికి సంబంధించిన ప్రమాణాలను నిర్ధారించే అధికారం చాలానే ఉంది. అయితే విద్యారంగానికి సంబంధించిన విషయా లలో ప్రభుత్వం నిర్ణ యించిన 'జాతీయ విధానాల'కు లోబడి యు.జి.సి వ్యవహరించాలని ఆ చట్టంలోని సెక్షన్ 20 అంటుంది.

ఎస్సి, ఎస్టి రిజర్వేషన్లు యాభై సంవత్సరాలుగా ప్రభుత్వ జాతీయ విధానంలో భాగంగా ఉన్నాయి. ఆ విషయంలో మార్పేమీ లేక పోగా, ఈ మధ్యకాలంలో స్త్రీలకు, బిసిలకు కూడా రిజర్వేషన్లు కల్పించడం ఒక జాతీయ విధానం అయింది. మండల్ కమిషన్ సూచనల ఫలితంగా బిసిలకు కల్పించిన రిజర్వేషన్లు ఉన్నత విద్యా సంస్థలకు కూడా వర్తిస్తాయా అన్న సందేహం వ్యక్తం కాగా, 1994లో కేంద్ర ప్రభుత్వం వర్తిస్తాయనే చెప్తూ సర్క్యులర్ జారీ చేసింది.

రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో ప్రకటించింది. ఒక్క ప్రమోషన్లలో రిజర్వేషన్‌ను మాత్రమే రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కొట్టేయగా, అన్ని పార్టీలు ఏకగ్రీవంగా అంగీకారాని కొచ్చి రాజ్యాంగాన్ని సవరించి ప్రమోషన్లలో రిజర్వేషన్లను కూడా రాజ్యాంగబద్ధం చేసాయి.

ఇంత సంపూర్ణంగా ఒక జాతీయ విధానంగా ఉన్న రిజర్వేషన్లను కాదంటూ సర్క్యులర్ జారీచేసే అధికారం యు.జి.సికి ఎక్కడిది? పైగా, ఇదొక ప్రముఖమైన సామాజిక విషయమన్న స్పృహ కూడా లేకుండా ఏదో అతి చిన్న విషయమయినట్టు నాలుగు లైన్ల సర్క్యులర్‌ను యథాలాపంగా పంపించడంలోని అహంకారాన్ని ఏమనాలి?

సమానులను చట్టం అసమానంగా చూడడం రాజ్యాంగ విరుద్ధమని రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 అంటుంది. అసమానులను చట్టం సమానులుగా చూడడం కూడా అదే అధికరణం కింద రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ రాజ్యాంగ ప్రమాణాలు తమకు వర్తించవని యు.జి.సి అధినేతలు భావిస్తున్నారా?

చట్టం సంగతి అటుంచి విధానపరంగా ఆలోచిస్తే, 50 ఏళ్లుగా జాతీయ విధానాలుగా గుర్తింపు పొందిన వాటి పట్ల ఈ రోజు అధికార స్థానాలలో ఉన్నవాళ్లలో పెరిగిన వ్యతిరేక భావనే నిజానికి ఈ నిర్ణయం వెనుక ఉందనడంలో సందేహం లేదు. ఆ అధికారం వారికి చట్టంలో లేకపోతే వారు చట్టాన్నే ఖాతరు చేయరు. కోర్టులలో తీర్పులిచ్చేది ఎప్పటికప్పుడు న్యాయమూర్తుల స్థానంలో కూర్చున్న వారే కాబట్టి, ఈ వ్యతిరేక భావన గలవాళ్లు ఆ స్థానాలలో కూర్చునేకొద్దీ అదే న్యాయస్థానం అభిప్రాయం అవుతుంది. రాజకీయ నాయకులకు ఓట్లు కావాలి కాబట్టి ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోక తప్పదు. అందువల్ల రాజకీయ పార్టీలు చేసే విధాన నిర్ణయాలలో ఇటువంటి మార్పులు రావడానికి కొంత సమయం పడుతుంది. అయినప్పటికీ అది అసంభవమనుకుంటే పొరబాటే.

రాజ్యాంగం రాసుకున్నప్పుడు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయాన్ని దేశ లక్ష్యంగా ప్రకటించుకున్నాం. ఇప్పుడు ఆ లక్ష్యమే ఒక పనికిమాలిన సెంటిమెంట్‌గా చాలామందికి కనిపిస్తున్నది. దాని స్థానంలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని దేశ లక్ష్యంగా నిలబెట్టాలన్నది ప్రస్తుత ప్రయత్నం. సామాజిక న్యాయం కావాలంటే ఇప్పటిదాకా అవకాశాలు నిరాకరించబడినవారికి అవకాశాలు అందియ్యాలి. వేగవంతమయిన ఆర్థిక పెరుగుదల లక్ష్యమయితే ఇప్పటికే అవకాశాలు ఉన్నవారికే మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. వారే వాటిని 'సమర్థంగా' వాడుకోగలుగుతారు. అర్థశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే 'వాల్యు-అడిషన్' అప్పుడే ఎక్కువ ఉంటుంది.

ఈ రకమైన ఆలోచనల ఫలితమే యు.జి.సి. సర్క్యులర్. ప్రజాకాంక్షల నుండి పుట్టిన విధానాలను కార్యాలయాలలో కూర్చున్న కొద్దిమంది 'నిపుణులు' ఇష్టమొచ్చినట్టు మార్చడానికి వీలులేదు. రాజ్యాంగం నుండి సంక్రమించిన బాధ్యతల వెలుగులో ఉన్నత విద్యా ప్రమాణాలు, విద్యావ్యవస్థ ప్రమాణాలు నిర్ణయించమని యు.జి.సి అధికారులకు ఉద్యోగాలిచ్చారే గానీ తమ బుద్ధికి తోచిన విధానాలు రూపొందించమని కాదు. ఇప్పటికే సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులను ప్రోత్సహించే పేరుమీద ఉన్నత విద్యలో ఒక భాగాన్ని పేదలకు దూరం చేశారు. రీసర్చ్‌లో రిజర్వేషన్లు తీసేసి దళితులకూ, ఆదివాసులకూ పరిశోధనావకాశాలు కూడా దూరం చేస్తున్నారు. ఒక దళిత మేధావి వర్గం ఎదగకుండ అడ్డుపడడానికి ఇది పెత్తందారీ కులాలకు చెందిన అధికారులు చేస్తున్న కుట్ర అని దళిత ఉద్యమకారులు ఆరోపిస్తున్నారంటే ఆశ్చర్యమేముంది?

*నీహార్ ఆన్‌లైన్.కామ్*
*2002*

# ముస్లింలకు రిజర్వేషన్లు సబబే

ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాలలో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 33ను వెనక్కి తీసుకోవాలంటూ కొన్ని వర్గాల వారు ఆందోళన చేస్తున్నారు. బిజెపివారు బహిరంగంగా అల్లరిచేయగా, ఇతరులు తగుస్థాయిలో అదే డిమాండ్ చేస్తున్నారు.

ఈ వ్యతిరేకత ఎంతవరకు సబబు అనేది చర్చించుకోవలసిన విషయం. సామాజిక వాస్తవాలేమిటి, రాజ్యాంగమేమంటుంది, న్యాయస్థానాలు ఏమన్నాయి మొదలయిన విషయాలు అందరం తెలుసుకోవాలి. విషయాలు తెలుసుకోకపోతే ఆవేశానికి కొట్టుకు పోయే ప్రమాదం ఉంది.

సామాజిక వాస్తవాల గురించి పెద్దగా వివాదం లేదు. జీవో 33ను వ్యతిరేకిస్తున్న వారెవ్వరూ ముస్లింలలో వెనుకబాటుతనం లేదని అనడం లేదు. హైకోర్టులో వేసిన కేసులలో సహితం ముస్లింలు అభివృద్ధి చెందిపోయారు కదా, వారికి రిజర్వేషన్లు ఎందుకు అని ఏ ఒక్కరూ అనలేదు. ముస్లింలలో ఉందని ప్రభుత్వం చెప్తున్న వెనుకబాటుతనం నిజంగానే ఉందని అందరూ ఒప్పుకుంటు న్నారు. అయినప్పటికీ వారికి రిజర్వేషన్లు ఇయ్యొద్దని వారి వాదన.

జీవో 33కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన గురించి తెలుసుకోవలసిన మొట్టమొదటి విషయం ఇది. మరయితే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? మతం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదనీ, అది సామాజికంగా హాని కరమనీ, సమాజాన్ని నిలువునా చీలుస్తుందనీ అంటున్నారు.

రాజ్యాంగం సంగతి మొదట చెప్పుకుందాం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చుననీ, ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు ఆ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇయ్యవచ్చుననీ రాజ్యాంగం అంటుంది.

ఒక కులం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నట్టయితే ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్లు ఇయ్యడంలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు నలభై ఏళ్ళుగా అనేక తీర్పులలో అనింది. ఈ కేసులన్నీ బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని సవాలుచేస్తూ అగ్రకులాలు వేసినవే. అప్పుడూ వారు ఇదే వాదన చేశారు. ఈ రోజు మతం పేరుమీద చేస్తున్న వాదన ఆ రోజు కులం పేరు మీద చేశారు. కులం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదన్నారు. దానికి సుప్రీంకోర్టు ఏం సమాధానం చెప్పిందంటే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న కులానికి రిజర్వేషన్లు కల్పించడం 'కులం' ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చినట్టు కాదనింది. ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా గుర్తించి దానికి రిజర్వేషన్ ఇస్తున్నారే తప్ప కులానికి రిజర్వేషన్ ఇవ్వడం లేదనింది.

ఏదయినా ఒక ప్రజాసమూహం వెనుకబడి ఉన్నట్టయితే వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. ఆ సమూహం ఒక కులం కావచ్చు, ఒక ప్రాంతవాసులు కావచ్చు, ఒక భాష మాట్లాడేవారు కావచ్చు. దీని అర్థం కులానికో, ప్రాంతానికో, భాషకో రిజర్వేషన్ ఇచ్చినట్టు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మాట అంటూ, 'ఒకవేళ ముస్లింలు వెనుకబడి ఉన్నారని ఒక రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినట్టయితే ముస్లింలకు రిజర్వేషన్ ఇయ్యవచ్చు' అని కూడా మండల్ కమిషన్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం అనింది. మన రాష్ట్రంలో ముస్లింలు వెనుకబడి ఉన్నారన్న వాస్తవాన్ని ఎవరూ కాదననప్పుడు 'రాజ్యాంగం ఒప్పుకోదు' అన్న వాదన చెల్లదని దీనిని బట్టి స్పష్టం అవుతున్నది.

ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడం సమాజాన్ని నిలువునా చీల్చడమేనన్న వాదనను ఏ విధంగా అర్థం చేసుకోవాలి? హిందువులు, ముస్లింలు అన్న చీలిక మన సమాజంలో చాలా కాలంగా ఉంది. దానికి చారిత్రక, రాజకీయ కారణాలున్నాయి. ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్ల పట్ల హిందువులు కోపగించుకున్నట్టయితే ఈ ఎడం మరింత పెరుగుతుంది గానీ, సహృదయంగా అర్థం చేసుకుంటే ఎందుకు పెరుగుతుంది?

సహృదయంగా ఎందుకు స్పందించాలి అని అడుగుతారేమో! దీనికి జవాబు క్లుప్తంగానే అయినా జీవో 33లో ప్రభుత్వమే చెప్పింది. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 30 శాతం కాగా ముస్లింలలో 65 శాతం, రాష్ట్రంలో నిరక్షరాస్యత 56 శాతం కాగా ముస్లింలలో 82 శాతం. ముస్లిం స్త్రీలలోనయితే 96 శాతం. రాష్ట్ర జనాభాలో

ముస్లింలు 8.5 శాతం ఉన్నారుగానీ ప్రభుత్వ ఉద్యోగాలలో అందులో సగం కూడా లేరు. అత్యధికులు అసంఘటిత రంగంలోని చిన్న వృత్తులలో మగ్గుతున్నారు. పాన్‌షాపులు, చాయ్ దుకాణాలు, పూలు, పళ్ళ దుకాణాలు, రేడియో రిపేర్, వాచ్ రిపేర్ షాపులు పెట్టుకుని బతుకుతున్నారు. మెకానిక్ షెడ్‌లలో, హోటళ్ళలో పని చేస్తున్నారు. గ్రామీణ చేతివృత్తుల రంగంలో ఉన్నారు.

ఇటువంటి ప్రజా సమూహానికి రిజర్వేషన్లు ఇస్తే ఇతర ప్రజలు సానుభూతితో ఎందుకు అర్థం చేసుకోకూడదు? చేసుకున్నట్టయితే సమాజంలో చీలిక ఎందుకు పెరుగుతుంది? అయినా ముస్లిమేతరులు సానుభూతితో అర్థం చేసుకోరని ప్రకటించ డానికి ఈ పిడికెడు మంది ఆందోళనకారులకు ఎవరు అధికారం ఇచ్చారు?

ముస్లింలకు 5శాతం రిజర్వేషన్ ఇచ్చినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటిపోతుందనేది దానిని వ్యతిరేకిస్తున్నవారు చెప్తున్న మరొక కారణం. మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటడానికి వీలులేదని సుప్రీంకోర్టు చెప్పిందని వారు అంటున్నారు.

ఇదెంతవరకు నిజం?

మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించవచ్చునా లేదా అన్న విషయంలో సుప్రీంకోర్టు జడ్జీలు గడచిన 50 ఏళ్లలో తలా ఒక అభిప్రాయం వ్యక్తం చేశారు. వెనుక బాటుతనం ఎంత ఉంటే రిజర్వేషన్ అంత ఉంటుంది - దానికి సీలింగ్ ఏమిటి అన్నవారూ ఉన్నారు. మొత్తం రిజర్వేషన్ ఎట్టి పరిస్థితిలోనూ 50 శాతం మించడానికి వీలులేదన్నవారూ ఉన్నారు. ప్రస్తుతం శిరోధార్యంగా ఉన్నది మండల్ కమిషన్ కేసులో మెజారిటీ తరఫున తీర్పు ప్రకటించిన జస్టిస్ జీవన్‌రెడ్డి అభిప్రాయం. అదేమిటంటే, వెనుకబడిన వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్ మొత్తం 50 శాతం మించకూడదన్నది ఒక స్థూలమయిన నియమం. దానికి ప్రత్యేక పరిస్థితులలో మినహాయింపులుండగలవు. అంతేకాక, వెనుకబడిన వర్గమన్న కారణంగా కాక వేరే కారణాల వల్ల ఇచ్చే రిజర్వేషన్‌కు ఈ '50 శాతం సీలింగ్' వర్తించదు. ముల్కీ తరహా లోకల్ రిజర్వేషన్లు, స్త్రీలకు ఇచ్చే 33.3 శాతం రిజర్వేషను, వికలాంగులకిచ్చే 3 శాతం రిజర్వేషను, ఎన్.సి.సి కోటా, స్పోర్ట్స్ కోటా మొదలైనవి ఈ సీలింగ్‌కు వెలుపల ఉంటాయి.

'50 శాతం సీలింగ్' వర్తించేది ఎస్.సి, ఎస్.టి, బి.సి రిజర్వేషన్లకే. అవి మూడు కలిపి ప్రస్తుతం 46 శాతం ఉన్నాయి. ముస్లింలను బి.సిలలో చేర్చి 5 శాతం రిజర్వేషన్ ఇస్తే ఇది 51 శాతం అవుతుంది. అంటే 'స్థూలమైన' పరిమితిని మించి ఒక శాతం మాత్రమే అవుతుంది. ఆ ఇంత కూడా మించవద్దనుకుంటే 5 శాతాన్ని 4 శాతానికి తగ్గిస్తూ జీవో 33ను సవరించవచ్చును. అప్పుడు దానిని వ్యతిరేకిస్తున్నవారు తమ వ్యతిరేకతను మానుకుంటారా? ముస్లింలలో (ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో)

ధనికవర్గం కూడా ఒకటి ఉన్నదనీ, ముస్లింల పేరుమీద ఇచ్చే రిజర్వేషన్ యావత్తూ వారే తన్నుకు పోతారనీ కూడా వాదిస్తున్నారు. బి.సి రిజర్వేషన్ విషయంలో అగ్రకులాల వారు ఇదే అభ్యంతరం వ్యక్తంచేయగా, మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఏమనిందంటే ప్రతీ బి.సి కులంలోనూ 'క్రీమీలేయర్'ను గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి వారిని తొలగించాలని. ముస్లింలను ఇప్పుడు ఒక బి.సి వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇస్తున్నారు కాబట్టి అది జీవో 33కు కూడా వర్తిస్తుంది. మన రాష్ట్రంలో 'క్రీమీలేయర్' గుర్తింపుకు ప్రమాణాలింకా ప్రభుత్వం రూపొందించలేదు. ఏ ప్రమాణాలు రూపొందించినా అవి ముస్లింలకు కూడా వర్తిస్తాయి. కాబట్టి నిజాం మనవలే రిజర్వేషన్ మొత్తం కొట్టేస్తారని ఆందోళన చెందనక్కరలేదు.

ఇవికాక వేరే సాంకేతిక కారణాలు కూడా చెప్తున్నారు. వాటికి సామాజిక ప్రాముఖ్యం గానీ, రాజ్యాంగపరమైన ప్రాముఖ్యంగానీ ఏమీ లేదు కాబట్టి వాటినిక్కడ చర్చించనక్కరలేదు. ఒకవేళ ఏదో ఒక సాంకేతిక కారణం వల్ల జీవో 33 చెల్లదని రేపు హైకోర్టు తప్పుపట్టినా దానిని సవరించి మళ్లీ జారీ చేయవచ్చు. అంతే తప్ప జీవో 33 చెల్లదనడానికి సామాజిక కారణంగానీ, రాజ్యాంగపరమైన అవరోధంగానీ ఏమీ లేదు.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ముస్లింలకూ ఇస్లాంకూ సంబంధించిన విషయాలను హేతుబద్ధంగా, స్థిమితమైన మనస్సుతో చర్చించడం సాధ్యంకాని కలుషిత వాతావరణం దేశంలో నెలకొని ఉంది. దీనికి బాధ్యులెవరు అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతంగానీ దీనిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నవారెవరో స్పష్టంగానే చూస్తున్నాం.

ఈ వాతావరణం కారణంగా ముస్లింల ప్రస్తావన వచ్చినప్పుడు మన సైకిల్‌కు గాలికొట్టే అహమ్మదు, మన వీధి చివర చాయ్ అమ్మే బాషా, మన పక్కింట్లో కసువు ఊడ్చే సుల్తాన్‌బీ జ్ఞాపకం రారు. ఒసామాబిన్ లాడెన్‌ను తలచుకుంటాం, జైష్-ఇ-మహమ్మద్‌ను, లష్కర్-ఇ-తయ్యబాను తలచుకుంటాం. దీనికి తగ్గట్టు స్పందిస్తాం. అప్పుడు ముస్లింలకు ప్రభుత్వం ఏ మేలు చేయజూసినా అది భయంకరమైన తప్పిదంగా కనిపిస్తుంది.

అమానవీయమైన ఈ మానసిక స్థితిని అధిగమించాలేగానీ జీవో 33లో తప్పేమీ లేదనీ, అది నిజానికి సామాజిక న్యాయానికి చాలా అవసరమైన చర్య అనీ గుర్తించడానికి ఎంతోసేపు పట్టదు.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*
*5 ఆగస్టు 2004*

ఎ.బి.సి.డి.పైన సుప్రీంకోర్టు తీర్పు

# విజ్ఞత లేదు, తర్కమూ లేదు

షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ వర్గీకరణ చెల్లదంటూ అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం *[ఇ.వి. చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, (2005) 1 SCC 394]* ఇచ్చిన తీర్పు మీద దీర్ఘమైన సమీక్ష రాయనవసరం లేదు. ఒక తీర్పులో గట్టి తర్కమున్నా, లోతయిన విజ్ఞత ఉన్నా దానిని వివరంగా సమీక్షించే అవసరం ఉంటుంది. అది అంగీకార పూర్వకమయిన సమీక్ష అయినా, అనంగీకార పూర్వకమయినదయినా అటువంటి సమీక్ష న్యాయ సిద్ధాంతాన్ని గురించీ, దానికీ సమాజానికీ ఉన్న సంబంధాన్ని గురించీ మనకు ఎంతో కొంత నేర్పగలదు. కానీ తర్కమూ విజ్ఞతా రెండూ లేని తీర్పును దీర్ఘంగా సమీక్షించడం వల్ల నేర్చుకునేదేమీ ఉండదు. కాగితాలు వృథా చేయడం తప్ప జరిగేదీ ఒరిగేదీ ఏమీ ఉండదు.

ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డు కులాల మధ్య అంతరాలేవీ లేవని గానీ, అభివృద్ధిలోనూ, సాంఘిక ప్రతిపత్తిలోనూ అందరూ సమానంగా ఉన్నారని గానీ సుప్రీంకోర్టు అనలేదు. అంటే, ఏ వాస్తవ పరిస్థితిని ఆసరా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టిందో ఆ పరిస్థితి వాస్తవం కాదని సుప్రీంకోర్టు అనలేదు. అయినప్పటికీ వర్గీకరణ చెల్లదని చెప్పింది.

అదీ విశేషం.

వర్గీకరణ చేపట్టే అధికారం రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదనీ, కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందనీ అని ఊరుకోలేదు. రాష్ట్రంలోగానీ, కేంద్రంలో గానీ ఎవరూ వర్గీకరణ చేయడానికి

వీలులేదని కూడా అనింది. షెడ్యూల్డు కులాలలో అంతర్గత భేదాలు ఉంటే ఉండవచ్చు. ఉండవని కాదు. వాటిని ప్రభుత్వం గుర్తిస్తే గుర్తించవచ్చు. గుర్తించడానికి వీలులేదని కాదు. కానీ ఏమీ చేయడానికి మాత్రం వీలులేదు. కేంద్ర ప్రభుత్వమూ ఏమీ చేయడానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వమూ ఏమీ చేయడానికి లేదు.

ఇదీ సుప్రీంకోర్టు తీర్పు సారాంశం.

జస్టిస్ చిన్నపరెడ్డిగారు అప్పుడెప్పుడో ఒక తీర్పులో సుప్రీంకోర్టును ఎందుకు అత్యున్నత న్యాయస్థానం అంటారో వివరిస్తూ, 'దాని విజ్ఞత అత్యుత్తమం కాబట్టి దానిని అత్యున్నత న్యాయస్థానం అనరు. అది అత్యున్నత న్యాయస్థానం కాబట్టే దాని విజ్ఞత అత్యుత్తమం 'అంటార'ని అన్నారు. అంటే సుప్రీంకోర్టు ప్రకటించే న్యాయం మీద అప్పీల్ లేదు కాబట్టే అది తుది న్యాయం. వేరే ఏ అర్థంలోనూ కాదని ఆయన భావం. ఇటువంటి తీర్పులు చదివినప్పుడు అది ఎంత సరయిన వ్యాఖ్యో కదా అనిపిస్తుంది.

ఇంతకూ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసింది? ఏం చేసిందని సుప్రీంకోర్టు భావించింది?

భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల జాబితాను ఆర్టికల్స్ 341, 342లను అనుసరించి రాష్ట్రపతి అన్ని రాష్ట్రాల గవర్నర్‌లను సంప్రదించి ప్రకటిస్తారు. ఒక్కొక్క రాష్ట్రానికి రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టిల జాబితా ఉంటుంది. ఒకసారి రాష్ట్రపతి (గవర్నర్‌ను సంప్రదించి) ఈ జాబితాను ప్రకటించిన తరువాత దానిలో ఏదైనా ఒక కులాన్ని చేర్చే అధికారం గానీ, తీసేసే అధికారం గానీ రాష్ట్రపతికి లేదు, గవర్నర్‌కూ లేదు. పార్లమెంటుకు మాత్రమే ఉంది. ప్రకటించేది రాష్ట్రపతే అయినప్పుడు సవరించే అధికారం రాష్ట్రపతికే ఎందుకివ్వకూడదు అన్న చర్చ రాజ్యాంగ సభలో వచ్చినప్పుడు అంబేద్కర్ ఏమన్నాడంటే సవరించే అధికారం రాష్ట్రపతి చేతిలో పెడితే అది రాజకీయ దుర్వినియోగానికి దారితీస్తుందని. పార్లమెంటులో రాజకీయాలుండవని ఆయన ఉద్దేశ్యం కాదు. రాష్ట్రపతి పాలకపార్టీ మనిషిగా వ్యవహరించబోతాడని ఆయన ఆనాడే ఊహించినట్టున్నాడు. కాబట్టి షెడ్యూల్డు కులాల లేక తెగల జాబితాలో చేర్పులు, తీసివేతలు చేసే అధికారం రాష్ట్రపతి చేతిలో పెడితే పాలకపార్టీల ఇష్టానుసారం ఆ జాబితా మారే ప్రమాదం ఉంటుంది. పార్లమెంటులోనూ పాలకపార్టీకి మెజారిటీ ఉంటుంది గానీ పార్లమెంటులో ప్రతిపక్షమూ ఉంటుంది. వారి అభిప్రాయాలను వినవలసిన అగత్యమూ ఉంటుంది. అక్కడ జరిగే చర్చ బయటి ప్రపంచానికి తెలిసే అవకాశమూ ఉంటుంది.

ఇదీ షెడ్యూల్డు కులాల, తెగల జాబితా రూపకల్పన, సవరణల సంగతి. రాష్ట్రపతి ప్రకటించి, పార్లమెంటుకు మాత్రమే సవరించే అధికారం ఉన్న ఈ ఎస్‌సి,

ఎస్‌టి జాబితాను ఇతర సంస్థలన్నీ ఉన్నదున్నట్టు స్వీకరించవలసిందే. ఒక రాష్ట్ర ప్రభుత్వం, ఒక విశ్వవిద్యాలయం, ఒక ప్రభుత్వరంగ సంస్థ, ఒక మునిసిపాలిటీ ఎస్‌సిలకు గానీ, ఎస్‌టిలకుగానీ రిజర్వేషన్లు ఇయ్యదలచుకున్నా, స్కాలర్‌షిప్పులు ఇయ్యదలచుకున్నా, ఇతర ప్రోత్సాహకాలు ఇయ్యదలచుకున్నా ఈ జాబితాల ప్రకారమే ఇయ్యాలి. ఏ రాష్ట్ర ప్రభుత్వానికైనా తన రాష్ట్రానికి సంబంధించిన కులాన్నో లేక తెగనో చేర్చాలనో, తీసివేయాలనో అనిపిస్తే కేంద్ర ప్రభుత్వానికి తెలిపి, వారిని ఒప్పించి పార్లమెంటులో చట్టం చేయించి ఆ పని చేయాలి.

ఇప్పుడు సుప్రీంకోర్టు ఏమంటుందంటే, షెడ్యూల్డు కులాల లేక తెగల జాబితాలో ఒక కులాన్నో, తెగనో చేర్చే అధికారం లేక తీసివేసే అధికారం మాత్రమే కాదు, జాబితాను ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తూ ఆ జాబితాలో ఉన్న కులాలకు ఇచ్చే ప్రత్యేక హక్కులను హేతుబద్ధంగా వర్గీకరించే అధికారం కూడా పార్లమెంటుకు మాత్రమే ఉందని.

ఇది సబబేనా?

ఒకసారి ఎస్‌సి లేక ఎస్‌టి జాబితాను ప్రకటించిన తరువాత ఆ జాబితాలోని కులాలకు లేక తెగలకు ప్రత్యేక అవకాశాలు, హక్కులు, సదుపాయాలు కల్పించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే కాదు, ప్రతీ ప్రభుత్వ సంస్థకు, ప్రతీ స్థానిక సంస్థకు, ప్రతీ పబ్లిక్ సెక్టార్ సంస్థకూ ఉంది. దానికి వారు పార్లమెంటు అనుమతి తీసుకోనక్కర లేదు. ఉదాహరణకు మీ ఊరి మునిసిపాలిటీ వారు మంచినీటి వసతికి కేటాయించిన డబ్బులలో 30 శాతం దళిత కుటుంబాలకు నీటి కనెక్షన్లనివ్వడానికి ఖర్చుపెట్టాలని నిర్ణయించుకోవచ్చు. అందుకోసం రాష్ట్రానికి సంబంధించిన 59 ఎస్‌సి కులాలనూ ఎస్‌సి కులాలుగా స్వీకరించాలంతే. ఆ విషయంలో ఎస్‌సి జాబితాను అతిక్రమించ కుండా ఉన్నంతకాలం, ఆ నిర్ణయం తీసుకోవడానికి మునిసిపాలిటీకి పార్లమెంటు అనుమతి గానీ, ఎవరి అనుమతిగానీ అక్కరలేదు.

మీది విశాఖపట్నం అనుకోండి. మీ ఊరిలోని దళితులందరికన్నా రెల్లీలు ఎక్కువ వెనుకబడి ఉన్నారని మీ మునిసిపాలిటీ భావించిందనుకోండి. దళిత కుటుంబాల మంచినీటి ఏర్పాట్ల కోసం ఖర్చు పెట్టదలచుకున్న 30 శాతంలో 20 శాతం మీ మునిసిపాలిటీ వారు రెల్లీల కోసం ఖర్చుపెట్టి మిగిలిన పదిశాతం ఇతర దళిత కుటుంబాల కోసం ఖర్చుపెట్టాలని నిర్ణయించుకున్నారనుకోండి. ఆ స్వేచ్ఛ మీ మునిసి పాలిటీకి ఉంటుందా ఉండదా?

మునిసిపాలిటీ నిధుల గురించి రేపెప్పుడయినా కేసు కోర్టుకెక్కితే సుప్రీంకోర్టు ఏమంటుందో గానీ విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో ఆ స్వేచ్ఛ మునిసిపాలిటీకీ,

జిల్లాపరిషత్‌కే కాదు, పార్లమెంటొక చట్టం చేసేదాకా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు సహితం లేదని ఇప్పుడు అనింది. నిజానికి పైన ఇచ్చిన ఉదాహరణలో రెల్లీలు మరీ వెనుకబడి ఉన్నారని చెప్పి, దళిత కుటుంబాల నీటి కనెక్షన్ల కోసం కేటాయించిన నిధులలో కొంచెం ఎక్కువ వారికి కేటాయించినట్లు చెప్పాను. మన రాష్ట్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్ల వర్గీకరణలో అలాంటిది సహితం లేదు. రెల్లీలకూ, మాదిగలకూ వారి దామాషా కంటె ఎక్కువ ఇచ్చే ఆలోచన చేయలేదు. ఎవరి వాటా వారికిచ్చే ఆలోచన మాత్రమే చేసింది.

ఇది చెల్లదనడంలో సుప్రీంకోర్టు అనుసరించిన తర్కం ఏమిటి? ఆర్టికల్ 341(2) ఏమంటుందంటే, రాష్ట్రపతి ప్రకటించిన షెడ్యూల్డు కులాల జాబితాలో పార్లమెంటు ఒక చట్టం చేయడం ద్వారా ఒక కులాన్ని లేక కులంలో భాగాన్ని చేర్చవచ్చు, తీసేయవచ్చు. ఈ విధంగా తప్ప వేరే ఏ విధంగానూ రాష్ట్రపతి జారీచేసిన జాబితాను మార్చడానికి వీలులేదు. ఇక్కడ జాబితాను మార్చడం అంటే అందులో ఒక కులాన్ని చేర్చడం లేక తీసివేయడం అని మాత్రమే అర్థం. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ ఫలితంగా ఆ జాబితాలో కొత్తగా ఒక్క కులమూ ప్రవేశించలేదు, ఒక్క కులమూ బయటకు పోలేదు. అన్ని ఎస్‌సి కులాలకూ కలిపి ఇచ్చిన రిజర్వేషన్‌ను నాలుగుగా విడగొట్టి జాబితాలోని నాలుగు ఉపవర్గాలకు ఎవరి కోటా వారికి ఇవ్వడం జరిగిందంతే.

ఇది ఆర్టికల్ 341(2) ప్రకారం పార్లమెంటుకు మాత్రమే ఉండే అధికారం అని సుప్రీంకోర్టు ఏ విధంగా అనింది? 341(2)లో లేని మాటలు చేర్చి, రాష్ట్రపతి ప్రకటించిన జాబితాలో ఏ రకంగా జోక్యం చేసుకున్నా, దానిని కదిలించినా, దానిలో ఉపవర్గాలను గుర్తించినా అది కూడా ఆర్టికల్ 341(2)లోని నిషేధానికి గురి అవుతుందని అనింది. కులాలను ఆ జాబితాలోకి 'చేర్చడం, తొలగించడం' అన్న స్పష్టమైన మాటలకు ఇంతటి విపరీత అర్థం ఎక్కడ నుండి వచ్చింది? సుప్రీంకోర్టయినా ఏ కోర్టయినా చట్టాన్నీ, రాజ్యాంగాన్నీ వ్యాఖ్యానిస్తాయి తప్ప తిరగరాయవని న్యాయసిద్ధాంతం అంటుంది. తిరగరాసే అధికారం ప్రజలు ఎన్నుకునే శాసనసభలకు మాత్రమే ఉండడం ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఉండే ఆరోగ్యకరమైన లక్షణాలలో ఒకటి. ఆ మాటే సుప్రీంకోర్టు వేరే సందర్భాలలో అంటూ ఉంటుంది. కానీ తానే ఇప్పుడు ఆర్టికల్ 341(2)ను పూర్తిగా తిరగరాసింది.

ఒక చట్టం అస్పష్టంగానో, అసంపూర్ణంగానో ఉన్నప్పుడు దానిని వ్యాఖ్యానించే క్రమంలో కోర్టులు ఆ ఖాళీని పూరించవచ్చు. ఆ విధంగా కోర్టులు కూడా కొంతమేరకు శాసనాధికారం చలాయిస్తుంటాయి. కానీ ఆర్టికల్ 341(2)లో ఎటువంటి అస్పష్టతా లేదు. శాసనకర్తలు వాడిన భాషలో అస్పష్టత ఏదీ లేనప్పుడు దానిలో మార్పులూ

చేర్పులూ చేసే అధికారం న్యాయస్థానాలకు లేదనేది అందరూ అంగీకరించే న్యాయ సిద్ధాంత సూత్రం. అటువంటప్పుడు ఆర్టికల్ 341(2)కు విపరీత అర్థం కల్పించే అధికారం సుప్రీంకోర్టుకు ఎవరిచ్చారు?

ఇక్కడితో ఆగిపోయి ఉన్నా ఒక రకం. లేని పెత్తనం చలాయించిందని సుప్రీంకోర్టును విమర్శించినా, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరణ సాధించుకునే అవకాశం ఇంకా మిగిలి ఉందని సర్దుకుపోదుము.

కానీ పార్లమెంటుకు మాత్రమే ఆ అధికారం ఉందని చెప్పిన తరువాత, పార్లమెంటుకు కూడా ఆ అధికారం లేదని ప్రకటించింది రాజ్యాంగ ధర్మాసనం. ఎందుకంట? షెడ్యూల్డు కులాలు అనేది ఒక అవిభాజ్యమైన (హోమోజెనస్) వర్గమంట. అని ఎవరు చెప్పారు? రాజ్యాంగమే చెప్పిందట.

రాజ్యాంగం అంతమాటేం అనలేదు. రాష్ట్రపతి ఒక్కొక్క రాష్ట్రానికీ సంబంధించి ఆ రాష్ట్ర గవర్నర్‌ను సంప్రదించి ఏ కులాలు లేక తెగలు లేక జాతులు లేక కులాలలో తెగలలో జాతులలో భాగాలు షెడ్యూల్డు కులాలుగా పరిగణించబడతాయో నిర్ణయించి ప్రకటిస్తాడు. అవే షెడ్యూల్డు కులాలు అని రాజ్యాంగం ఆర్టికల్ 341(1)లో అంటుంది.

ఈ నిర్వచనం చదవగానే మొదట స్ఫురించేది దానిలోని బహుళత్వం. కొన్ని కులాలు, తెగలు, జాతులు, వాటి శకలాలు కలిసి 'షెడ్యూల్డు కులాలు' అవుతాయి. అదొక అవిభాజ్యమైన వర్గం అన్న భావం ఈ నిర్వచనంలో ఎక్కడుంది? అయిదుగురు జడ్జీలకు కనిపించింది మరి.

ఏ విధంగా?

రాజ్యాంగం రాకముందు అవి వేరు వేరు కులాలు అయి ఉండవచ్చు. ఇప్పటికీ సాంఘికంగా వేరు వేరు కులాలే కావచ్చు. అయితే ఆ కులాలన్నీ చాలా అణగారి ఉన్నాయని గుర్తించి, ప్రత్యేకమైన ప్రభుత్వ అండ వారికి అవసరమని గుర్తించి వాటినన్నిటినీ కలిపి 'షెడ్యూల్డు కులాలు' అని ఎప్పుడయితే రాజ్యాంగం పేరు పెట్టిందో అప్పుడిక రాజ్యాంగానికి సంబంధించినంతవరకు అవన్నీ కలిసి ఒకే వర్గం అయిపోయి నట్టే, అవిభాజ్యం అయిపోయినట్టేనని వాదించడం ద్వారా అది సాధ్యం అయింది. ఎప్పుడయితే ఆ కులాలన్నీ (రాజ్యాంగానికి సంబంధించినంతవరకు) తమ ప్రత్యేకతలన్నీ కోల్పోయి ఒకే అవిభాజ్యమైన వర్గం అయిపోయాయో ఇక అప్పట్నించి రాజ్యాంగం నుండి సంక్రమించే అధికారం చలాయించే వారెవ్వరూ ఆ కులాలలో ఒకరెక్కువ ఒకరు తక్కువ, ఒకరు మరీ వెనుకబడి ఉన్నారు, ఒకరి స్థితి కొంచెం ఫరవాలేదు అని వర్గీకరించడానికి వీలులేదని దీనినుండి నిర్ధారించారు.

1976లో ఇచ్చిన ఒక తీర్పులో జస్టిస్ కృష్ణయ్యర్ చేసిన వ్యాఖ్య భావాన్ని మార్చేసి, కృష్ణయ్యర్ కూడా ఇదే అన్నాడు అన్నారు ఈ అయిదుగురు న్యాయకోవిదులు. 'షెడ్యూల్డు కులాలు అనేది ఒక కులం కాదు. అది కొన్ని కులాల, తెగల, జాతుల, వాటి శకలాల సముదాయం. వీరు చాలా అణగారి ఉన్నారనీ వీరికి భారీగా ప్రభుత్వ సహాయం అవసరం అనీ గుర్తించి ఈ కులాలు, తెగలు, జాతులు, వాటి శకలాలన్నిటినీ ఒక సముదాయంగా గుర్తించగా ఏర్పడిందే షెడ్యూల్డు కులాలు అనే జాబితా' అని జస్టిస్ కృష్ణయ్యర్ అన్నారు. 'కాబట్టి షెడ్యూల్డు కులాలు అనేది ఒక అవిభాజ్యమైన వర్గం' అని అయిదుగురు జడ్జీలు వ్యాఖ్యానించారు. అది ఎంత విజ్ఞత గల వ్యాఖ్యో మీరే నిర్ణయించండి.

నిజానికి, ఒక వెనుకబడిన సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించిన తరువాత ఆ రిజర్వేషన్లు ఆ వర్గంలోని వారందరూ సంపూర్ణంగా అందుకోవడం కోసం ఆ వర్గాన్ని వెనుకబడినవారు, మరీ వెనుకబడినవారు అని వర్గీకరించవచ్చునా అన్న ప్రశ్న ఇవాళ కొత్తగా కోర్టు ముందుకొస్తున్నది కాదు. మన రాష్ట్రంలో బిసిలను ఎబిసిడిలుగా విభజించడం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు 1972లోనే ప్రకటించింది. బిసిలకు వర్తించేది ఎస్‌సిలకు వర్తిస్తుందా అన్న సందేహానికి ఆస్కారం లేకుండ మండల్ కమిషన్ కేసు *(ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా)*ను విచారించిన తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం అటువంటి వర్గీకరణ ఎస్‌సిలలో చేసినా తప్పు లేదనింది. మండల్ కమిషన్ కేసుకున్న ప్రత్యేకత ఏమిటంటే, ఆ కమిషన్ రిపోర్టు ఆధారంగా బిసిలకు ఇచ్చిన రిజర్వేషన్ చెల్లుతుందా అన్నది ఆ కేసు వేసినవారు లేవదీసిన ప్రశ్న కాగా, దానిని విచారించిన ధర్మాసనం 'రిజర్వేషన్ల విషయంలో పదే పదే తలెత్తుతున్న అన్ని ప్రశ్నలకూ జవాబు చెప్పదలచుకున్నాం' అని ప్రకటించి, 14 ప్రశ్నలు వేసుకుని, అన్నిటి గురించీ వాదనలు విని తీర్పు ప్రకటించింది. ఆ 14లో అయిదవ ప్రశ్న వర్గీకరణకు సంబంధించినది. సహేతుకమయితే వర్గీకరణ చేయవచ్చునని ఆ ధర్మాసనం చెప్పింది. ఆ కేసు బిసి రిజర్వేషన్ల కేసు కాబట్టి ఆ అభిప్రాయం బిసి రిజర్వేషన్లకే వర్తిస్తుందని వాదించడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే ఆ ధర్మాసనం ఉద్దేశ్యపూర్వకంగానే రిజర్వేషన్లకు సంబంధించిన 'అన్ని ప్రశ్నలకూ' జవాబు చెప్పడానికి పూనుకుంది. మామూలుగా, పెద్ద ధర్మాసనం తీర్పుకు చిన్న ధర్మాసనం కట్టుబడి ఉంటుందనేది న్యాయవ్యవస్థ క్రమశిక్షణలో అనుల్లంఘనీయమైన నియమం. ఈ కేసులో సుప్రీంకోర్టు దానిని కూడా అతిక్రమించింది.

షెడ్యూల్డు కులాలన్నీ నిజంగానే ఒకే స్థాయిలో, ఒకే అభివృద్ధి దశలో ఉన్నాయని గానీ, ఆ కులాల మధ్య హెచ్చుతగ్గులు లేవని గానీ సుప్రీంకోర్టు భావించలేదని మొదట్లో చెప్పిన విషయం మరొకసారి జ్ఞాపకం చేయాలి. ఆ విధంగా భావించి ఉంటే, దానికి కనీసం వారికి సంతృప్తినిచ్చే ఆధారాలు ఉండి ఉంటే, తక్కిన అభిప్రాయాలను క్షమించి

ఉండవచ్చునేమో కానీ అసమానతలనూ, అంతరాలనూ ఒప్పుకుంటూనే వాటి గురించి ఏమీ చేయడానికి వీలులేదనే వైఖరిని క్షమించడం కష్టం. పైగా రాజ్యాంగం అవకాశం ఇవ్వదనడం విడ్డూరం కూడా. భారత రాజ్యాంగంలో లోపాలు చాలానే ఉన్నాయి గానీ ఒక అన్యాయాన్ని గుర్తించిన తరువాత, అది అన్యాయమేనని అందరూ అంగీకరించిన తరువాత, దాని పరిష్కారానికి ఏ అవకాశమూ రాజ్యాంగంలో లేదనడం, దానికి అన్యాయమని పేరు పెట్టడాన్నే రాజ్యాంగం ఒప్పుకోదనడం భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్న వారెవరూ అంగీకరించగల విషయం కాదు. రాజ్యాంగం కల్పించే అవకాశం రాజకీయంగా ఎంతయినా కష్టతరం కావచ్చు. అది వేరే సంగతి. కానీ ఫలానా అసమానతను చూడడానికే వీలులేదని భారత రాజ్యాంగం అంటుందంటే ఒప్పుకోవడం కష్టం (జాతుల స్వయం నిర్ణయాధికార కాంక్ష ఒక్కటే దీనికి మినహాయింపు).

వివిధ షెడ్యూల్డు కులాలు రిజర్వేషన్లను ఒకే దామాషాలో అందుకోలేకపోతున్నాయనేది అందరూ ఒప్పుకుంటున్న వాస్తవం. సంస్కృతిలో, ఆచారాలలో కూడా షెడ్యూల్డు కులాలలో నిచ్చెన మెట్ల అంతరాలు ఉన్న మాట వాస్తవం. రిజర్వేషన్లలో ఎవరి వాటా వారికిచ్చేయడం ఈ స్థితిని కొంతవరకు మెరుగుపరచగలదనేది నిర్వివాదం. అయినప్పటికీ రాజ్యాంగం షెడ్యూల్డు కులాలను అవిభాజ్యమైన వర్గంగా గుర్తించింది కాబట్టి ఆచరణాత్మకమైన ఈ (పాక్షిక) పరిష్కారం రాజ్యాంగం పరిధిలో సాధ్యం కాదనేది భారత రాజ్యాంగానికున్న స్వాభావికమైన తర్కానికి అతికే అభిప్రాయమయితే కాదు. అయిదుగురు సుప్రీంకోర్టు జడ్జీలు ఏకగ్రీవంగా ప్రకటించినంత మాత్రాన అయిపోదు.

అంతా అయిన తరువాత, దళితుల లోపలి అసమానతల గురించి ఏమీ అనకపోతే బాగుండదనుకున్నారో ఏమో, అయిదుగురు జడ్జీలలో ఒకరయిన జస్టిస్ సత్యబ్రత సిన్హాగారు రెల్లీల గురించి ప్రస్తావించి 'ఆ కులానికి చెందిన వారెవ్వరూ ఇంజనీరింగ్ లేక మెడికల్ కాలేజీలలో సీట్లు పొందలేదు. వాళ్లకు ఇంజనీరింగ్ కాలేజీలలో, మెడికల్ కాలేజీలలో రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ఏం ప్రయోజనం?' అన్నారు. 'వాళ్లకు స్కాలర్‌షిప్పులు, హాస్టళ్ళు, స్పెషల్ కోచింగ్' ఇవ్వాలన్నారు. ఇవ్వాల్సిందే. స్కాలర్ షిప్‌లు, హాస్టళ్ళయితే ఇస్తున్నారు కూడా. కానీ వాటిని ఉపయోగించుకుని కొంచెం మంచి మార్కులు తెచ్చుకున్నా వృత్తివిద్యా కోర్సులలో సీట్లు రావు. ఎస్‌సి కోటాలో కూడా రావు. అప్పుడేం చేయాలి? మొట్టమొదట శూద్ర కులాలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నప్పుడు బ్రాహ్మణులు ఇవే మాటలన్నారు. స్కాలర్‌షిప్పులివ్వండి, స్పెషల్ కోచింగ్ ఇవ్వండి, రిజర్వేషన్లు వద్దు అన్నారు. బిసిలకు రిజర్వేషన్లివ్వాలని మండల్ కమిషన్ సూచించినప్పుడు బ్రాహ్మణ - శూద్ర అగ్రకులాల వారు ఇదే అన్నారు. స్కాలర్ షిప్పులివ్వండి, హాస్టళ్లు నెలకొల్పండి, రిజర్వేషన్లు వద్దు అన్నారు. ప్రతీసారీ కోర్టులే అవన్నీ వేరు, రిజర్వేషన్లు వేరు, దేని అవసరం దానిదే, దేని పాత్ర దానిదే అంటూ

తీర్పులిచ్చాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు 'రెల్లీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఏం ప్రయోజనం? కోచింగ్ ఇవ్వండి, స్కాలర్‌షిప్పులివ్వండి' అంటున్నది. భూమి గుండ్రంగా తిరిగి మొదటికొచ్చినట్టుంది.

ఈ తిరోగమనం జస్టిస్ సిన్హాగారి నోట వెలువడడం ఉచితమే. ఆయన మన హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి సుప్రీంకోర్టుకు పోయారు. రాజ్యాంగంలో ఉండే సామాజిక న్యాయస్ఫూర్తి పట్ల ఆయనకు ఏ మాత్రం ఏకీభావం లేదనేది ఆయన తీర్పులెరిగిన వారికి కొత్త కాదు. ఈ మధ్యనే వేరొక తీర్పులో ఆయన ప్రపంచీకరణను ప్రస్తావిస్తూ, ప్రపంచంలో వీస్తున్న గాలులను కోర్టులు చూడడానికి నిరాకరించకూడదనీ, పాతకాలపు ఆలోచనలను పట్టుకుని వేళ్లాడకూడదనీ అన్నారు. సామాజిక న్యాయం కూడా ఒక పాతకాలపు ఆలోచనే మరి.

*మానవహక్కుల వేదిక బులెటిన్ - 7*
*మే 2005*

సమాన విద్యావకాశాలకు

# సుప్రీంకోర్టు కూడా ఆటంకమైతే ఎలా?

ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇవ్వనక్కరలేదంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా ఆగ్రహానికీ, అలజడికీ దారి తీసింది.

ఆ ఆగ్రహాన్నీ, అలజడినీ చూసిన దేశ ప్రధాన న్యాయమూర్తి అలిగి, 'మా ధర్మం మేము నిర్వర్తిస్తున్నాం. మీకు మా తీర్పులు నచ్చకపోతే కోర్టులను మూసేసి మీ ఇష్టం వచ్చినట్టు పరిపాలించుకోండి' అన్న సంగతి కూడా పత్రికలలో చూశాం. 'అయినా మేం ఏమన్నామని మా మీద ఇంత కోపం? ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే దానికి చట్టం చేయండి అన్నామంతే. మీరు చట్టం చేయలేక కోర్టులను ఆడిపోసుకోవడం ఎందుకు?' అని కూడ దేశ ప్రధాన న్యాయమూర్తి అన్నట్టు పత్రికలలో వచ్చింది.

ప్రధాన న్యాయమూర్తిగారు ఈ ప్రవచనాలు మౌఖికంగా అన్నవే తప్ప ఏ తీర్పులోనూ భాగం కాదు కాబట్టి పత్రికలలో ప్రచురించినవే ఆయన వాడిన మాటలా అని కచ్చితంగా చెప్పలేము గానీ రెండు విషయాలు మాత్రం కచ్చితంగా చెప్పగలం. పాలనా వ్యవస్థ మీద, చట్ట సభల మీద న్యాయస్థానాలు తమకు సందర్భోచితం అని తోచినప్పుడు తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం చాలా కాలంగా చూస్తూనే ఉన్నాం. బూటాసింగ్ వ్యవహారంలో గవర్నర్ల వ్యవస్థ గురించి కూడ సుప్రీంకోర్టు నిక్కచ్చిగా వ్యాఖ్యానించడం చూశాం. మరి న్యాయస్థానాల తీరును సందర్భోచితం అని తోచినప్పుడు అంతే తీవ్రంగా విమర్శించే స్వేచ్ఛ చట్టసభలకూ పాలనా యంత్రాంగానికీ

ఎందుకు ఉండదు? ఈ వ్యవస్థలలో ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదే. ఇక ప్రజల మాటకొస్తే, రాజ్యాంగానికి మూలం ప్రజలే కాబట్టి మూడు వ్యవస్థలనూ స్వేచ్ఛగా విమర్శించే హక్కు ప్రజలకెందుకు ఉండదు?

రెండు, 'మేం ఏమన్నాం' అంటూ దేశ ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన వివరణ నిజమే అయితే చాలా దురదృష్టకరమని భావించవలసి ఉంటుంది. ఆయన తెలిసీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని భావించవలసి ఉంటుంది. ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకూ, స్త్రీలకూ, వికలాంగులకూ రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం కోరుకున్నట్టయితే దానికొక చట్టం చేయవలసి ఉంటుంది అని మాత్రమే సుప్రీంకోర్టు అని ఉంటే ఎవరికయినా ఎందుకు కోపం వస్తుంది? ఏ ప్రైవేట్ వ్యాపారం పైన అయినా ఏ ఆంక్షలయినా ప్రభుత్వం పెట్టదలచుకుంటే అది చట్టం ద్వారా చేయవలసిందేనని రాజ్యాంగాన్ని ఎరిగిన వారందరికీ తెలుసును. ఈ మాటే సుప్రీంకోర్టు అని ఉంటే కోపాలెందుకొస్తాయి? సుప్రీంకోర్టు అనింది అది కాదు. ప్రభుత్వం నుండి 'ఎయిడ్' (నిధులు) పొందని ప్రైవేట్ విద్యా సంస్థలు రిజర్వేషన్లు పాటించనక్కర లేదనీ, వారు పాటించాలనడం రాజ్యాంగ విరుద్ధమనీ అనింది.

'ఎయిడ్ (ప్రభుత్వ నిధులు) పొందని ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు ప్రభుత్వం సూచించిన వారికి సీట్లు ఇవ్వాలనడం గానీ, రిజర్వేషన్ విధానాన్ని పాటించాలనడం గానీ వారి హక్కులపైన, స్వయంప్రతిపత్తి పైన తీవ్రమైన దాడి.'

'దీని అర్థం ఆ సీట్లను ప్రభుత్వం జాతీయం చేసిందని. ప్రైవేట్ విద్యా సంస్థలలో సీట్లను జాతీయం చేయడం చెల్లదని ఈ కోర్టు ఎప్పుడో స్పష్టం చేసింది.'

'వృత్తి విద్యాసంస్థలు నెలకొల్పడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం వద్ద లేవు. అలాంటప్పుడు మెరుగైన వృత్తి విద్య కల్పించడానికి ప్రైవేట్ రంగంలో ముందుకొచ్చిన వారు ప్రభుత్వ రిజర్వేషన్ విధానాన్ని అనుసరించి ప్రతిభ తక్కువ ఉన్న విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని బలవంతం చేయడం తగదు.'

ఇవీ సుప్రీంకోర్టు మొన్న *(ఇనాందార్ వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో)* అన్న మాటలు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అయినట్టయితే, దానికొక చట్టం చేస్తే ఎంత, చేయకపోతే ఎంత?

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు నిజంగా రాజ్యాంగ విరుద్ధమా అన్న ప్రశ్నను పక్కన పెడదాం. నిజానికి ఏ వ్యాపారం మీదనయినా ప్రజా సామాన్యం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహేతుకమైన పరిమితులు విధించవచ్చునని రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(6) చెప్తుంది. 'ప్రజాసామాన్యం ప్రయోజనాలు' అనేది చాలా విస్తృతమైన

ప్రయోగమనీ, రాజ్యాంగ ఆదేశిక సూత్రాల అమలు కూడా దాని కిందికి వస్తుందనీ సుప్రీంకోర్టు పలుమార్లు వ్యాఖ్యానించింది. సామాజిక న్యాయం రాజ్యాంగ ఆదేశిక సూత్రాల సారాంశం కాబట్టి సామాజిక న్యాయం కోసం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం ఒక చట్టం చేస్తే అది తప్పక రాజ్యాంగబద్ధమే అవుతుంది.

అదట్లాగుంచి, తప్పో ఒప్పో తన అభిప్రాయం ప్రకటించడానికి సుప్రీంకోర్టు ఎంచుకున్న పద్ధతి సరయినదా? నిజమే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్న చట్టమేదీ ప్రభుత్వం ఇప్పటి దాకా చేయలేదు. చట్టం చేసి ఉంటే, దానినెవరయినా సవాలు చేసి ఉంటే, రిజర్వేషన్ పొందవలసిన వర్గాలు కూడా ఆ వ్యాజ్యంలో భాగమై తన తరఫున న్యాయవాదులను పెట్టుకుని ఉందురు. అప్పుడు అందరి అభిప్రాయాలూ విని సుప్రీంకోర్టు తన అభిప్రాయం ప్రకటించి ఉంటే, ఆ అభిప్రాయంతో ఏకీభవించినా, లేకున్నా అత్యున్నత న్యాయస్థానం ఒక పద్ధతి ప్రకారం నడుచుకుందని అందుము.

ఇప్పుడది ఏదీ లేదే! 'ఎయిడ్' పొందని ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలపైన ప్రభుత్వానికి ఉండే అజమాయిషీ ఎంత అనే అంశం మీద వ్యాజ్యం సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. 2002లో 11 మంది న్యాయమూర్తుల ధర్మాసనం దాని మీద తీర్పు ఇచ్చింది. (దీనిని *టిఎంఏ పాయ్ కేసు* అంటారు). ఆ తీర్పులో కొన్ని ముఖ్యమైన విషయాలు అస్పష్టంగా ఉన్నాయని సుప్రీంకోర్టుకే అనిపించడం వల్ల ఆ అస్పష్టమైన వాక్యాలను స్పష్టపరచడానికి 2003లో అయిదుగురు జడ్జీల ధర్మాసనం కూర్చునింది. *(ఇస్లామిక్ అకాడమీ కేసు)*. ఈ తీర్పు కూడా స్పష్టపరచవలసింది పోయి వక్రీకరించిందన్న ప్రైవేట్ విద్యా సంస్థల అభియోగంలో న్యాయం ఉందని సుప్రీంకోర్టుకే మళ్లీ అనిపించి, ఆ స్పష్టీకరణ సరయినదా కాదా అని తేల్చడానికి ఏడుగురు జడ్జీల ధర్మాసనం పూనుకుంది. *(ఇనాందార్ కేసు)*. ఆ తీర్పే మొన్న రచ్చకు దారితీసింది. ఈ మొత్తం వ్యాజ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వమూ మాత్రమే పార్టీలు. వారికి రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు, వీరికి ఇప్పించాలని పెద్దగా ఆసక్తి లేదు. వారిద్దరి వాదనలే విని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ప్రకటించేయడం ఏం న్యాయం? రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్న సామాజిక వర్గాలు వ్యాజ్యంలో భాగం కాదు. వారి వాదనలు కోర్టు వినలేదు. విని ఉంటే పైన మేము రెండు వాక్యాలలో ప్రతిపాదించిన వాదన వివరంగా చేసి ఉందురు. ఆ అవకాశమే లేకుండ వారి ఆకాంక్ష మీద నీళ్లు గుమ్మరించడం కోపం తెప్పించదా? చేసిన పని చేసేసి, 'మా తీర్పులు నచ్చకపోతే కోర్టులు మూసేయండి' అంటూ అలగడం ఎందుకు?

## విద్యారంగం ప్రైవేటీకరణ - కోర్టులు

ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలలో భాగంగా ఒక దశాబ్ద కాలంగా దేశంలో వేగంగా పెరుగుతున్న విద్యారంగ ప్రైవేటీకరణ పట్ల సుప్రీంకోర్టు అనుసరిస్తున్న వైఖరిని మొత్తంగా చూసినప్పుడు ఈ తీర్పు పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. విద్యను వ్యాపారం చేయడానికి వీలులేదన్న అభిప్రాయం నుండి సుప్రీంకోర్టు ఇప్పటిదాకా పక్కకు తొలగలేదు. అయితే ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్నది వ్యాపారం అన్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దానిని చూడడానికి కోర్టుకు మనస్కరించడం లేదు.

విద్యా సంస్థలను నెలకొల్పడం వ్యాపారం కిందికి రాదనీ అదొక వ్యాపకం అనీ సుప్రీంకోర్టు అంటుంది. ఆ వ్యాపకం వ్యాపారంగా మారిపోయినా దానిని వ్యాపకంగానే చూస్తానంటుంది. వ్యాపారమో, వ్యాపకమో దానిని సామాజిక ప్రయోజనాల దృష్ట్యా నియంత్రించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని సూత్రప్రాయంగా ఒప్పుకుంటుంది. కానీ 'మేము స్వంత నిధులతో సంస్థను నిర్వహిస్తున్నప్పుడు మా వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి ప్రభుత్వానికేం అధికారం ఉంది?' అన్న వారి వాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించదు. తిరస్కరించకపోగా చాలా సానుభూతితో చూస్తుంది.

ఈ అస్పష్ట వైఖరి నుండే అస్పష్టమైన తీర్పులు వెలువడుతున్నాయి. లేకపోతే 2002లో 11మంది జడ్జీలు ఇచ్చిన తీర్పును 2003లో అయిదుగురు జడ్జీలు కూర్చొని స్పష్టీకరించవలసి రావడం, ఆ స్పష్టీకరణ సరిగ్గా ఉందా లేదా అని 2003లో ఏడుగురు జడ్జీలు పరిశీలించవలసి రావడం జరిగేది కాదు. న్యాయస్థానాల పట్ల ఇంకా గౌరవం ఉండబట్టి సరిపోయింది గానీ లేకపోతే ప్రజలు సుప్రీంకోర్టును హాస్యం పట్టించి ఉందురు. మంచి తీర్పులిస్తారో చెడ్డ తీర్పులిస్తారో కనీసం వాటిని స్పష్టంగానయినా రాయలేరా అని అడిగితే 'అత్యున్నత' న్యాయమూర్తులు ఏం జవాబు చెప్తారు? ఒక్కొక్కసారి ఒక తీర్పు ఇచ్చిన 20 లేక 30 సంవత్సరాల తరువాత మారిన పరిస్థితులలో దానిని సక్రమంగా అన్వయించడానికి పునఃపరిశీలించవలసిన అవసరం వస్తుంటుంది. కానీ మూడేళ్ళలో రెండుసార్లు పునఃపరిశీలించవలసి వచ్చే తీర్పును ఏమనాలి? చట్టాలు, ప్రభుత్వ తాఖీదులు అస్పష్టంగా ఉంటే న్యాయస్థానాలు ప్రభుత్వాల పైన విరుచుకు పడుతుంటాయి. మీరు ఏం చెప్పదలచుకున్నారో మీకే తెలీదా అని అభిశంసిస్తుంటారు. ఇప్పుడు ఆ ప్రశ్నే సుప్రీంకోర్టును అడగనక్కరలేదా?

మూడేళ్ళలో రెండుసార్లు పునఃపరిశీలించిన తరువాతయినా అస్పష్టత తీరిందా అంటే తీరలేదు. ఇంకొక సంవత్సరం తిరిగేలోపల తొమ్మిది మంది జడ్జీలు కూర్చుని ఇనాందార్ కేసులో ఇస్లామిక్ అకాడమీ కేసు తీర్పుపైన చేసిన వ్యాఖ్యలను పునఃపరిశీలించినా, 13 మంది జడ్జీలు కూర్చొని టిఎంఏ పాయ్ కేసు తీర్పునే పునఃపరిశీలించినా

ఆశ్చర్యపోవద్దు. నిక్కచ్చిగా మా అభిప్రాయం చెప్పాలంటే 'విద్యను వ్యాపారం చేసుకోవచ్చు. దానిలో తప్పేమీ లేదు' అని సుప్రీంకోర్టు నిర్మొహమాటంగా ప్రకటించే దాకా ఈ ప్రహసనం సాగుతూనే ఉంటుంది. ఒకదాని తరువాత ఒకటి వెలువడుతున్న తీర్పులు ఆ దిశనే చూపిస్తున్నాయి.

ప్రస్తుతానికి 11+5+7 మంది జడ్జీలు తర్కించి తర్కించి ఒక విషయం మాత్రమే స్పష్టం చేశారు - ప్రైవేట్ విద్యాసంస్థలు రిజర్వేషన్లు ఇయ్యనక్కరలేదని. విద్యార్థుల విద్యా హక్కుకు కీలకమైన మరి రెండు విషయాలు ఇనాందార్ కేసు తరువాత కూడ అస్పష్టంగానే ఉండిపోయాయి. ఒకటి ఫీజు పరిమాణం, రెండు అడ్మిషన్ల పద్ధతి.

విద్యాభ్యాసం కల్పించడం వ్యాపకమే తప్ప వ్యాపారం కాదు కాబట్టి లాభాలు దండుకోకూడదు గానీ ఖర్చులు వసూలు చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. 'ఖర్చులు' అనే దానిలో ప్రస్తుత వ్యయమే కాక రాబోయే రోజులలో సంస్థ విస్తరణ కోసం, మెరుగుదల కోసం పెట్టబోయే వ్యయాన్ని కూడ లెక్కించవచ్చునని స్పష్టం చేసింది. ఈ భవిష్యత్ వ్యయం ఎంత ఉండవచ్చునో నిర్ణయించే పద్ధతిని నిర్దేశించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు (లేక కేంద్ర ప్రభుత్వం) చట్టం చేయవచ్చునని అంటూ, అప్పటిదాకా ప్రతీ రాష్ట్రంలోనూ ఒక రిటైర్డు హైకోర్టు జడ్జీ నేతృత్వంలో ఒక కమిటీ వేయాలని చెప్పింది. కానీ 'భవిష్యత్ విస్తరణ వ్యయం' పేరిట వసూలు చేసిన ఫీజును దాని కోసం ఖర్చుచేయక వ్యాపార లాభంగా జేబులో వేసుకుంటే చూసేదెవరు? చూసినా చేయగలిగిందేముంది? బలవంతంగా సంస్థ విస్తరణ చేయిస్తారా లేక పాత విద్యార్థులకు పైసలు వెనక్కి ఇప్పిస్తారా? ఇవి ఆచరణ సాధ్యం అయిన విషయాలా? ఈ ప్రశ్నలకు మూడు తీర్పులలోనూ జవాబు లేదు. భవిష్యత్ విస్తరణ వ్యయం పేరిట, కూడదు కూడదంటున్న వ్యాపార లాభాలకు సుప్రీంకోర్టు తలుపులు తెరిచి ఉంచిందని వ్యాఖ్యానిస్తే అబద్ధం అవుతుందా?

ప్రైవేట్ విద్యా సంస్థలలో అడ్మిషన్ల పద్ధతి ఏ విధంగా ఉండాలనేది ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. ఇక మీదట ప్రభుత్వం ఎంసెట్ పరీక్ష నిర్వహించి కౌన్సెలింగ్ జరిపి ప్రైవేట్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలకు విద్యార్థులను కేటాయిస్తుందా లేక వేరే ఏదయినా అడ్మిషన్ పద్ధతి అమలవుతుందా అనేది విద్యార్థులను ఆదుర్దాకు గురిచేస్తున్న ప్రశ్న. టిఎంఏ పాయ్ కేసు తీర్పునూ, దానిని వ్యాఖ్యానించిన ఇస్లామిక్ అకాడమీ కేసు తీర్పునూ, దానిని పునఃపరిశీలించిన ఇనాందార్ కేసు తీర్పునూ ఆద్యంతం చదివినవారు చెప్పగల జవాబు 'ఏమో తెలీదు' అని మాత్రమే.

ప్రభుత్వం నుండి నిధులు పొందని ప్రైవేట్ వృత్తి విద్యాసంస్థలకు విద్యార్థులను అడ్మిట్ చేసుకునే విషయంలో స్వేచ్ఛ ఉండాలని అన్నారు. వారికి బుద్ధిపుట్టిన

విద్యార్థులను అడ్మిట్ చేసుకోవచ్చునని అన్నారు. అయితే అడ్మిషన్ పద్ధతి న్యాయ బద్ధంగా, పారదర్శకంగా ఉండాలన్నారు. విద్యా ప్రమాణాలను గౌరవించాలని అన్నారు. ఈ మేరకు నియమాలు నిర్దేశించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. అడ్మిషన్లు పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలంటే అందరూ పోటీపడగల ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరిపి అందులో పొందిన ర్యాంకులను ప్రమాణంగా తీసుకోవడమే సరయిన పద్ధతి అన్నారు. ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్షను ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు కలిసి ఉమ్మడిగా నిర్వహించుకోవచ్చునన్నారు. అందరూ కలిసి ఒకటే నిర్వహించనక్కర లేదన్నారు. ఆయా సంస్థలలో ఇచ్చే స్పెషలైజేషన్లను బట్టి ఒక కోవకు చెందిన సంస్థలన్నీ కలిసి ఒక ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించవచ్చునన్నారు. ఈ ప్రవేశ పరీక్షలు సక్రమంగా జరిగేటట్టు ప్రభుత్వం పర్యవేక్షించవచ్చునన్నారు. లేదా ప్రభుత్వమే ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించవచ్చునన్నారు. (అదీ ఇదీ రెండూ జరగవచ్చా? తెలీదు!) ఈ ప్రవేశ పరీక్ష(ల)లో లభించిన ర్యాంకులను గౌరవిస్తూ వివిధ సంస్థల యాజమాన్యాలు తమకు ఇష్టమొచ్చిన వారికి స్వేచ్ఛగా అడ్మిషన్ ఇయ్యవచ్చునన్నారు.

ఇంతకూ అడ్మిషన్లు ఏ విధంగా జరగబోతాయో మీకు అర్థం అయిందా? మాకయితే కాలేదు. ఒక విషయం మాత్రం మాకే కాదు, మీకు కూడా అర్థం అయి ఉండాలి. దీనిమీద లిటిగేషన్ విపరీతంగా జరగబోతుంది. తొమ్మిది మంది జడ్జీలు కూర్చొని ఇనాందార్ కేసును మరొకసారి వ్యాఖ్యానించడమో, 13 మంది కూర్చొని టిఎంఏ పాయ్ కేసు తీర్పునే తిరగరాయడమో జరుగుతుంది. 'విద్యా వ్యాపారంలో తప్పేమీ లేదు' అన్న అధికారిక ప్రకటన అత్యున్నత న్యాయస్థానం నుండి వెలువడే దాకా ఈ తీర్పులు, వ్యాఖ్యానాలు, పునఃపరిశీలనలు సాగుతూనే ఉంటాయి.

అన్ని స్థాయిలలోనూ విద్యావకాశాలు అందరికీ సమానంగా దక్కాలన్న హక్కు కోసం ప్రభుత్వాల మీద, సమాజంలోని పెత్తందారీ కులాలు, వర్గాల మీదే కాక కోర్టుల మీద కూడా పోరాటం చేయవలసిన రోజు వచ్చిందని మాత్రం అందరూ గుర్తిస్తారనీ, దానికి తగిన సామాజిక, రాజకీయ కార్యాచరణ ప్రజాతంత్ర శక్తులు రూపొందించు కుంటారనీ ఆశిస్తాం.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*
*20 అక్టోబర్ 2005*

# ముస్లింలు, బిసిలు, రిజర్వేషన్లు

ఈవారంలో బిసి సంఘం నాయకులు ఆర్.కృష్ణయ్యగారి పేరు మీద రెండు పరస్పర భిన్నమైన ప్రకటనలు పత్రికలలో ప్రచురిత మయ్యాయి. (ఆయన చెప్పిందే పత్రికలు రాసాయో లేదో తెలీదు కాబట్టి పత్రికలలో ప్రచురిత మయ్యాయని అంటున్నాను.)

ముస్లింలను బిసి జాబితాలో 'ఇ' గ్రూపుగా చేర్చి 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను హైకోర్టు కొట్టివేయడాన్ని ప్రస్తావిస్తూ, 'ఒక్క రూపాయి విలువలేని రిజర్వేషన్లు ఇచ్చి రెండు వర్గాల మధ్య ప్రభుత్వం చిచ్చుపెట్టింది' అని ఆర్.కృష్ణయ్యగారు అన్నట్టు పత్రికలు రాసాయి. మరుసటిరోజు, కొన్ని బిసి కులాలను బిసి జాబితా నుండి తొలగించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టిందన్న వార్తకు స్పందిస్తూ ఆర్.కృష్ణయ్యగారే 'ఇటువంటి పనులు చేస్తే కాంగ్రెస్ పార్టీ అడ్రసు గల్లంతవుతుంది' అని హెచ్చరించినట్టు పత్రికలు ప్రచురించాయి.

ఇవి రెండూ వారిచ్చిన ప్రకటనలే అయితే, ముస్లింలకిచ్చినప్పుడు రూపాయి విలువలేని రిజర్వేషన్లు బిసిలకు ఇస్తేనేం, ఇయ్యక పోతేనేం కృష్ణయ్యగారూ అని వారిని మనం అడగవద్దా?

ఒక ప్రహసనంగా అందరూ కలిసి మార్చేసిన ముస్లిం రిజర్వేషన్ల ఉదంతంలో బాధాకరమైన విషయాలు చాలా ఉన్నాయి. అన్నిటి కంటే ఆందోళనకరమైన విషయం, రాష్ట్రంలోని బిసి కులాల సంఘాలు చాలా వరకు ముస్లింలకు ప్రభుత్వం అందించిన

చేయూతను సంఘటితంగా వ్యతిరేకించడం. హైకోర్టులో కేసు వేసిన వారిలో అగ్రకుల హిందువులు కొందరు కాగా, కనీసం మూడు బిసి సంఘాలూ ఉన్నాయి. కోర్టులో కేసు వేయడమే కాక బయట మీటింగ్‌లు పెట్టారు, ప్రకటనలు చేసారు, పత్రికలలో రాసారు.

దీనికి అపోహలు కొంత కారణం కాగా, సంఘ్ పరివార్ ప్రేరణ కూడా కొంతవరకు కారణం. సంఘ్ పరివార్ వాళ్ళు కార్మిక సంఘాలు నడిపినా, దళిత సంఘాలు నడిపినా పైకి ఆ వర్గాల ప్రయోజనాల కోసం ఒక మేరకు పనిచేస్తూ కూడ తమ దీర్ఘకాలిక అజెండాను లోలోపల సాగిస్తారనేది వారి వ్యవహారశైలిని అర్థం చేసుకున్న వారందరూ ఎరిగిన విషయమే. గుజరాత్‌లో ఆదివాసీ గూడెంలలో పనిచేస్తున్న విశ్వహిందూ పరిషత్, ఆ ప్రజల మెదళ్ళలోకి ఎంతటి విషం ఎక్కించిందో 2002లో జరిగిన మారణకాండ చూపించింది. ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బిసిల పేరిట రాష్ట్రంలో జరిగిన ప్రచార ఆందోళనలలో సంఘ్ పరివార్ పాత్ర చాలానే ఉంది. మన దగ్గర ప్రజాతంత్ర ఉద్యమాలలో సహితం సంఘ్ పరివార్ గురించి సరయిన అంచనా ఏనాడూ లేకపోవడంవల్ల బిసి సంఘాలలోను, ఉద్యమాల లోను ఉన్న ప్రజాతంత్ర వాదులు ఈ విషయాన్ని గుర్తించనూ లేదు, గొంతెత్తి మాట్లాడనూ లేదు. మాట్లాడకపోగా, కొందరు ప్రజాతంత్రవాదులుగా గుర్తింపు ఉన్న బిసి మేధావులు తమ వంతుగా గొంతు కలిపారు కూడ.

కాగా, నిజమైన అపోహలూ వాటినుండి పుట్టిన తప్పుడు వాదనలూ కూడ పనిచేశాయి. ఒక మైనారిటీగా ముస్లింలకు మైనారిటీ విద్యాసంస్థలు నడుపుకునే హక్కు ఉన్నప్పుడు 'అదనంగా' రిజర్వేషన్లు ఎట్లా అడుగుతారన్న వాదన ఒకటి చేసారు. మైనారిటీ విద్యాసంస్థలు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్‌కు ప్రత్యామ్నాయం ఎట్లా అవుతాయి? మహా అయితే మైనారిటీ విద్యాసంస్థలు మైనారిటీలకు ప్రత్యేక విద్యావకాశాలు కల్పిస్తాయని చెప్పవచ్చు. అంతమేరకు విద్యారంగంలో రిజర్వేషన్లు అడగడం సరయినది కాదనవచ్చు. కానీ ఆ వాదన కూడా సబబు కాదు. మైనారిటీ విద్యాసంస్థలన్నీ ప్రైవేట్ రంగ సంస్థలు. అక్కడ విద్య ఖరీదయింది. పేద మైనారిటీలకు అది అందుబాట్లో ఉండదు. డబ్బున్న మైనారిటీలను 'క్రీమీలేయర్' పేరిట ప్రభుత్వ రిజర్వేషన్లకు దూరం ఉంచారు కాబట్టి అదీ ఇదీ కూడా పొందేవారెవరూ ఉండరు.

ఇంకా రిజర్వేషన్లు పొందవలసిన బిసి కులాలు ఉన్నాయి కాబట్టి ముస్లింలకు ఇచ్చేస్తే వారికి నష్టం జరుగుతుందన్న వాదన కొందరు తీసుకొచ్చారు. మరి వారికి ఇచ్చేస్తే ముస్లింలకు నష్టం జరగదా? రిజర్వేషన్ల జాబితాలోని 'బిసి' అనే పదాన్ని 'వెనుకబడిన కులం' అని అర్థం చేసుకుని బిసిలలో ముస్లింలను ఎట్లా చేరుస్తారు? వారికి ఇవ్వదలచుకుంటే వేరుగా ఇవ్వండి, మా కోటాలో వద్దు అన్నవారున్నారు.

'బిసి' అంటే వెనుకబడిన వర్గం అని అర్థం. కులవ్యవస్థలో వెనుకబడిన కులాలుగా గుర్తించబడ్డవన్నీ వెనుకబడిన వర్గాలే. కానీ వెనుకబడిన కులాలు కాని వెనుకబడిన వర్గాలూ ఉండగలవు. అనేక రాష్ట్రాల జాబితాలలో ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలలో కొండ ప్రాంతాలలో నివసించే వారందరినీ (ఆదివాసులయినా కాకపోయినా) ఒక 'వెనుకబడిన వర్గం'గా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చారు. జమ్ము కాశ్మీర్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్ఒసి)కి సమీపంలో నివసించే వారందరినీ వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చారు. సాంకేతిక అభివృద్ధికి అవకాశం లేని వృత్తులలో ఉన్నవారిని అప్పటి మైసూర్ రాష్ట్ర ప్రభుత్వం కులంతో నిమిత్తం లేకుండ ఒక 'వెనుకబడిన వర్గం'గా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చింది. ఇవన్నీ సుప్రీంకోర్టు ఆమోదం పొందాయి. 'వెనుకబాటు తనం' అనేదానికి కొన్ని సూచికలుంటాయి. ఆ సూచికలు ఏవి అనేది శాశ్వతంగా నిర్ణయించలేము అనీ, అది పరిస్థితులను బట్టి ఉంటుందనీ సుప్రీంకోర్టు అనింది. మండల్ కమిషన్ తయారు చేసిన 12 సూచికలను, కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్ (చిన్నపరెడ్డి కమిషన్ అంటారు దీనిని) రూపొందించిన ప్రమాణాలను సుప్రీంకోర్టు ఆమోదించింది. ఈ సూచికలు ప్రమాణాల ప్రకారం ఏయే సామాజిక వర్గాలు వెనుకబడిన వర్గాలుగా గుర్తింపు పొందుతాయో అవి బి.సి కోటాలో రిజర్వేషన్ పొందగలవు. అంతే తప్ప 'బిసి' రిజర్వేషన్ అనేది 'బిసి' కులాలకే చెందిందని భావించి దానిలోనికి వేరే సామాజిక వర్గాలను రానియ్యవద్దనడం సరయిన వాదన కాదు. దీనిలో ముందు, వెనక అని వాదించేటట్టయితే ఎవరికి ముందు ఇచ్చినా మరొకరు అవకాశం కోల్పోగలరు కాబట్టి ఇది కేవలం ఒకరి విషయంలో ప్రయోగించగల వాదన కాదు.

ఇక హైకోర్టు వైఖరి విషయానికొద్దాం. తీర్పు ఇంకా చూడకపోయినప్పటికీ వాదన సమయంలో వారు వేసిన ప్రశ్నలను, పత్రికలలో తీర్పు గురించి వచ్చిన వార్తలను జోడించినట్టయితే, ముస్లింలను వెనుకబడిన వర్గంగా గుర్తించిన బిసి కమిషన్ రిపోర్టు అసమగ్రంగా అశాస్త్రీయంగా ఉందని హైకోర్టు ప్రధానంగా అభ్యంతరం చెప్పినట్టు అర్థమవుతుంది.

ప్రభుత్వాలు పాలనాక్రమంలో అనేక విధానపరమైన నిర్ణయాలు తీసు కుంటాయి. సమగ్రమైన, శాస్త్రీయమైన అధ్యయనం తరువాతనే పాలనా నిర్ణయాలు తీసుకోవాలని ఏ రాజ్యాంగమూ చెప్పదు. అట్లాగయితే పరిపాలన అసాధ్యం అవుతుంది. ఒక నిర్ణయం తీసుకునే ముందు దానికి సంబంధించిన సమాచారం సేకరించి, ఆ సమాచారాన్ని హేతుబద్ధంగా మదింపు వేయాలి. అంతే తప్ప 'సమగ్రమైన, శాస్త్రీయమైన' సమాచారం సేకరించాలనడానికి ప్రభుత్వం రీసర్చ్ స్కాలర్ కాదు, ప్రభుత్వం చేసేది సామాజిక శాస్త్ర పరిశోధనా కాదు.

సంబంధిత సమాచారాన్ని సేకరించి దానిని హేతుబద్ధంగా మదింపు వేయడానికి బిసి కమిషన్ నెలకొల్పబడింది. అది తన పనిచేసింది. ముస్లింలు మొత్తం మీద వెనుకబడిన వర్గమనీ, రిజర్వేషన్‌కు అర్హులనీ సూచించడానికి కావలసిన సమాచారం బిసి కమిషన్ నివేదికలో ఉంది. వారిలో డబ్బున్న వర్గాలు 'క్రీమీలేయర్' కింద ఎట్లాగూ మినహాయించబడతారు.

ఈ నివేదిక ఆధారంగా బిసి కమిషన్ చైర్మన్ దాళవా సుబ్రమణ్యంగారికి పిహెచ్.డి పట్టా ఇయ్యలేకపోవచ్చును గానీ ముస్లింలకు రిజర్వేషన్ ఇయ్యవచ్చు. అయినా ఈ విషయంలో మన హైకోర్టు ప్రదర్శించిన వైఖరి కొత్తది కాదు. రిజర్వేషన్లు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వం చేతి నుండి తన చేతిలోకి తీసుకోవడానికి న్యాయవ్యవస్థ చాలా కాలంగా ప్రయత్నం చేస్తున్నది. దానిలో భాగంగానే ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇవ్వొచ్చునా లేదా అని నిర్ణయించడానికి ప్రభుత్వం శాస్త్రీయమైన పరిశోధన జరపాలనీ, ఆ పరిశోధన ఎంత శాస్త్రీయంగా ఉందో తాము చూస్తామనీ అనసాగాయి. దాని పర్యవసానమే బిసి కమిషన్ ఏర్పాటు, దాని నివేదిక హేతుబద్ధంగానే కాదు, 'శాస్త్రీయంగా' కూడా ఉండాలన్న వక్కాణింపు. న్యాయవ్యవస్థలో రిజర్వేషన్ల పట్ల తొలినాటి నుండి ఉన్న వ్యతిరేక వైఖరే ఈ పరిణామానికి మూలం. దాని వల్ల ఈ రోజు ముస్లింలకు అన్యాయం జరిగినట్లే రేపు ఇంకెవరికయినా జరగగలదని గుర్తించినట్టయితే ఈ తీర్పును బిసి సంఘాలు తమ విజయంగా భావించవు.

చివరగా, 'ఇది ముస్లింలకు ఒక మతవర్గంగా రిజర్వేషన్లు కల్పించడానికి చట్టం అనే ఆచ్ఛాదన తగిలించుకున్న అనుచిత ప్రయత్నం' అన్న హైకోర్టు వ్యాఖ్య గురించి ఒక మాట. అది రాజకీయంగా సరైన వ్యాఖ్యా కాదా అన్నది పక్కనపెట్టండి. కోర్టు చేయదగ్గ వ్యాఖ్యేనా? ఆ ఆర్డినెన్స్ రాజ్యాంగబద్ధమా కాదా అని నిర్ణయించడం వేరు. దానిని జారీచేయడం వెనుక దురుద్దేశ్యం ఉందనడం వేరు. హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగపరంగా తప్పన్న విమర్శతో ఆగిపోకుండా, 'ఇది మైనారిటీల హక్కులను అణగదొక్కడానికి కోర్టు ధరించిన ముసుగు మాత్రమే'నంటే దానిని ఏమంటారు? కోర్టు ధిక్కారమంటారు. క్షమాపణ కోరుకోకపోతే ఆరు నెలలు జైలుకు పంపుతామంటారు. మరి కోర్టు చేసిన వ్యాఖ్యకు ఏ పేరు పెట్టాలి?

*ప్రజాతంత్ర*
*13 నవంబర్ 2005*

# రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన ఏ ప్రయోజనాల కోసం?

పుష్కరానికొకసారి మన దేశంలో 'రిజర్వేషన్ వ్యతిరేక' ఆందోళనలు పుట్టుకొస్తుంటాయి. అవే వాదనలతో, అవే నినాదాలతో, అవే చేష్టలతో ఒక కొత్తతరం కుల దురహంకారాన్ని ప్రదర్శిస్తుంటుంది.

ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసి కులాలకు రిజర్వేషన్ ఇవ్వరాదన్నది ప్రస్తుత అభ్యంతరం. రిజర్వేషన్ ఇవ్వాలన్న ప్రతిపాదన ప్రభుత్వం నుంచి వచ్చిందంటేనే ఆ సంస్థలలో ఒబిసి కులాలకు చెందిన వారు తగు మాత్రం ప్రవేశించలేకపోతున్నారని అర్థం. ఆ ప్రతిపాదనను అగ్రకులాల వారు వ్యతిరేకిస్తున్నారంటేనే వారు అధికభాగం సీట్లు చేజిక్కించుకుంటున్నారని అర్థం. ఉన్నత విద్యాసంస్థలన్నీ ఆధునిక అగ్రహారాలని వాటిలోకి తొంగి చూసిన వారందరికీ తెలుసును. ఒక్క విద్యార్థుల విషయంలోనే కాదు, అధ్యాపకుల విషయంలో కూడా.

విద్యార్థుల సీట్లలో ఒబిసి కులాలకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఇవాళ ఆందోళన చేస్తున్నారు గానీ, అధ్యాపక పోస్టులలో ఏనాడో ఒబిసి కులాలకు ఇచ్చిన రిజర్వేషన్‌కు ఏం గతి పట్టించారు? కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించమన్న మండల్ కమిషన్ సిఫారసులకు 1992లో సుప్రీంకోర్టు ఆమోదం లభించిన వెనువెంటనే, అది కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని విద్యాసంస్థల అధ్యాపక పదవులకు కూడా వర్తిస్తుందా అన్న ధర్మసందేహం ఆ విద్యాసంస్థల పాలక వర్గాలు వ్యక్తం చేశాయి. 1994 డిసెంబర్

13న జారీచేసిన ఒక సర్క్యులర్‌లో కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఆ ధర్మసందేహాన్ని నివృత్తి చేస్తూ, మండల్ కమిషన్ సిఫారసులు విద్యా సంస్థలకు కూడా వర్తిస్తాయని స్పష్టం చేసింది.

12 సంవత్సరాల తరువాత పరిస్థితి ఏమిటంటే, మన రాష్ట్ర రాజధానిలో ఉన్న కేంద్ర విశ్వవిద్యాలయంతో సహా దేశంలోని ఏ ఒక్క కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలోనూ అధ్యాపకుల పోస్టులలో ఒబిసి రిజర్వేషన్లు అమలు చేయడం లేదు. ఎందుకు చేయడం లేదని కోర్టులు ప్రశ్నిస్తే, ఎవ్వరూ చేయడం లేదు కాబట్టి మేమూ చేయడం లేదని ఒక్కొక్క విద్యాసంస్థ పాలకవర్గం సిగ్గువిడిచి పెట్టి జవాబు చెప్తున్నది. అధ్యాపక పోస్టులలోని రిజర్వేషన్లకు ఈ గతి పట్టించి, ఇప్పుడు విద్యార్థుల సీట్లలో రిజర్వేషన్లు ఇవ్వడానికే వీలులేదని గొడవ చేస్తున్నారు.

పుష్కరాల కింద బ్రాహ్మణులు కనిపెట్టి ఆ తరువాత శూద్ర అగ్రకులాలు స్వంతం చేసుకున్న వాదనలే తప్ప వీళ్ళీరోజు కొత్తగా చేస్తున్న వాదనలేవీ లేవు కాబట్టి వీరికి కొత్తగా చెప్పవలసిన జవాబేదీ లేదు. కొన్ని సామాజిక వాస్తవాలు మాత్రం ప్రస్తావించ వలసి ఉంది. 'ఉన్నత విద్యాసంస్థలు' అని పిలువబడుతున్న ఐఐటి, ఐఐఎం, పిజి మెడికల్ కాలేజీలు మొదలైన వాటి సంగతి పక్కన పెట్టండి. సాధారణ గ్రాడ్యుయేట్ల విషయమే తీసుకుని అందులో అగ్రకులాలు ఎందరున్నారో, ఒబిసిలు ఎందరున్నారో చూస్తే మన సామాజిక వ్యవస్థ వికృత స్వభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ ప్రకటించిన గణాంకాలను విశ్లేషించి, 'ది హిందూ' దినపత్రిక మే నెల 22వ తేదీన ఈ వివరాలు ప్రచురించింది. పట్టణ ప్రాంతాలలోని అగ్రకులాలలో 25.3 శాతం డిగ్రీ చదువుకున్నవారు కాగా ఒబిసిలలో 8.6 శాతం మాత్రమే డిగ్రీ చదువుకున్న వాళ్ళు ఉన్నారు. మొత్తంగా పట్టణ ప్రాంతాలలో డిగ్రీ చదువుకున్న వారిలో అగ్రకులాలవారు జనాభాలో వారి నిష్పత్తికంటే 64 శాతం ఎక్కువ ఉండగా, ఒబిసిల వాటా జనాభాలో వారి నిష్పత్తికంటే 44 శాతం తక్కువ ఉంది. పుట్టుకతోనే ఎవరూ ప్రతిభావంతులు కారనేది కనీసం పైకి అందరూ ఒప్పుకునే విషయమే కాబట్టి ఈ తేడాలకు లోతైన సామాజిక కారణాలున్నాయనేది ఎవరైనా కాదనగలరా? ఆ కారణాలను అధిగమించే విధాన రచన చేయవలసిన బాధ్యత భారత రాజ్యాంగం ప్రభుత్వం మీద పెట్టలేదనగలరా?

రిజర్వేషన్ల వల్ల ప్రపంచ ఖ్యాతి గాంచిన ఈ ఉన్నత విద్యాసంస్థల ప్రమాణాలు పడిపోతాయని వాదిస్తున్నారు వీళ్ళు. ఎందుకు పడిపోతాయి? సిలబస్ తగ్గించమని ఎవరూ అడగలేదే. తక్కువ మార్కులకే పాస్ చేయమని అడగలేదే. సెకండ్‌క్లాస్ వస్తే

ఫస్ట్ క్లాస్ ఇమ్మని ఎవరూ అడగలేదే. ప్రవేశంలో మాత్రమే రిజర్వేషన్ ఉంటుంది. ఆపైన అందరూ అదే సిలబస్ చదవవలసిందే. అదే పాస్ మార్కులు తెచ్చుకోవలసిందే. అవే ఫస్ట్‌క్లాస్ మార్కులు తెచ్చుకోవలసిందే. సంస్థ ప్రమాణాలు ఎందుకు పడిపోతాయి? - లేకపోతే నున్నగా, ఎర్రగా, ఖరీదుగా లేనివాళ్ళ ప్రవేశమే ప్రమాణాల పతనమా?

రిజర్వేషన్ల వల్ల ఒబిసిలలోని పేదలు బాగుపడలేదనీ, ధనవంతులు మాత్రమే బాగుపడ్డారనీ, రిజర్వేషన్ల వల్ల ఎవరు బాగుపడ్డారో తెలిపే సమాచారం ప్రభుత్వం ప్రకటించాలనీ వీళ్ళు వాదిస్తున్నారు. ప్రకటిస్తే సంతోషమే - ఎందుకంటే వారి ఆరోపణ నిజం కాదని రుజువు అవుతుంది. చదువుకునే అవకాశం లేక కులవృత్తులలో కాయకష్టం చేసి బతికిన తల్లిదండ్రుల పిల్లలు లక్షల సంఖ్యలో రిజర్వేషన్ల ఆసరాతో చదువుకుని జీవితంలో పైకి రాగలిగారన్న సత్యం రుజువవుతుంది. కానీ ప్రభుత్వం ప్రకటించవలసిన సమాచారం వేరే ఉంది. రిజర్వేషన్లు అసలే లేని ప్రైవేటు విద్యాసంస్థలలో సీట్లన్నీ ఎవరు పొందుతున్నారన్న సమాచారం సేకరించాలి, ప్రకటించాలి. అప్పుడు గానీ ఈ ఆందోళన ఎంత అబద్ధపు ఆందోళనో రుజువు కాదు.

వీళ్ళు 'సమానత్వం', 'న్యాయం' అంటూ బ్యానర్లు పట్టుకుని ఊరేగుతున్నారు గానీ అసలు సమస్య కార్పొరేట్ ఉద్యోగాలలో ఈ 'ఉన్నత విద్యాసంస్థల' ఉత్పత్తులకు ఉండే గిరాకీ. ఈ సంస్థల విద్యార్థులను వాళ్ళింకా చివరి పరీక్షలు రాయకముందే పెద్దపెద్ద కంపెనీలు 'క్యాంపస్ సెలెక్షన్'లో ఎంపిక చేసి నెలకు 50 వేల నుంచి 5 లక్షల దాకా జీతాలిచ్చే ఉద్యోగాలలో పెట్టుకుంటున్నాయి. ఈ అవకాశాన్ని ఇతరులతో పంచుకోవడానికి మనసొప్పకే ఈ అల్లరంతా. మరి రేపు ఈ కార్పొరేట్ రంగంలోని ఉద్యోగాలకే రిజర్వేషన్లు వర్తింపచేయాలన్న ప్రతిపాదనలతో ప్రభుత్వం ముందుకొస్తే ఇంకెంత అల్లరి చేస్తారో!

మొదట్లో ఈ ఆందోళనకారులు సీట్ల సంఖ్య పెంచితే తప్ప ఒబిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలులేదని షరతు పెట్టారు. అది ప్రభుత్వానికి భారమవుతుంది కాబట్టి ఆ షరతు పెడితే ప్రభుత్వం తన ప్రతిపాదనను వదులుకుంటుందని వాళ్ళు ఆశించినట్టు ఉన్నారు. కానీ ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఆ డిమాండ్‌ను అంగీకరించి సీట్లు పెంచుతూ ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించాయి. సీట్లు పెంచితే అందరి విద్యావకాశాలూ పెరుగుతాయి కాబట్టి దీనికి అభ్యంతరం చెప్పనవసరం లేదుగానీ, సీట్ల పెంపుదలతో రిజర్వేషన్‌ల కల్పనను ముడిపెట్టడానికి వీలులేదని ప్రభుత్వానికి స్పష్టంగా చెప్పాలి. ఈ ఉన్నత విద్యాసంస్థలన్నీ సాంకేతిక సంస్థలు కాబట్టి సీట్లు పెంచాలంటే ఇతర పరిశోధనా సదుపాయాలనూ, ఉపకరణాలనూ పెంచవలసి ఉంటుంది. దానికి ఖర్చు కావచ్చు. సమయం పట్టవచ్చు. అందువల్ల ముందు

రిజర్వేషన్‌లు కల్పించి ఆపైన వెనులుబాటును బట్టి సీట్ల పెంపకం చేపట్టాలే తప్ప, ఇది జరిగే వరకు అది జరగొద్దన్న వైఖరి ప్రభుత్వం అనుసరించకూడదు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే సీట్లు పెంచనిదే రిజర్వేషన్లు ఇవ్వరాదని మొదట వాదించిన వారు సీట్లు పెంచుతూ రిజర్వేషన్లు కల్పిస్తామన్న ప్రభుత్వ నిర్ణయం తరువాత కూడ తమ ఆందోళనను విరమించుకోలేదు సరికదా, దానిని ఇంకా ఉధృతం చేస్తామని బెదిరిస్తున్నారు. అంటే ఉన్నతస్థాయి ఉద్యోగ అవకాశాల మీద అగ్రకులాల కుండే గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడమే తప్ప వారి ఆందోళనకు వేరే లక్ష్యమేదీ లేదని స్పష్టం అవుతున్నది. ఇంత అహంకారం ఇంత బాహాటంగా వ్యక్తం కావడం నయా ఉదారవాద 'సంస్కరణల' యుగంలోనే సాధ్యం అయింది. సామాజిక అసమానతలను, వెనుకబాటుతనాన్ని, పేదరికాన్ని పోగొట్టే ప్రయత్నాలు వ్యర్థమనీ, అన్ని అవకాశాలు ఉన్నవాళ్ళు మరింతగా వర్ధిల్లడమే 'అభివృద్ధి' అనీ బోధించే ఈ 'సంస్కరణ వాదం' బ్రాహ్మణ వాదానికి బాగా అతికింది. దాని అహంకారాన్ని పెంచింది.

అన్యాయాన్ని సమర్థించే వాళ్ళు నిర్లజ్జగా ఆందోళనలు చేస్తుంటే న్యాయాన్ని కాంక్షించే వాళ్ళు మౌనప్రేక్షకులుగా ఉండిపోవడం తగదు. సమన్యాయాన్నీ సమాన హక్కులనూ కాపాడుకుందాం రమ్మని ఆహ్వానం పలుకుతూ -

*మానవహక్కుల వేదిక విశాఖ జిల్లా కరపత్రంగా వచ్చింది*
*10 జూన్ 2006*

# ముస్లిం రిజర్వేషన్లను అడ్డుకోవడమంటే సామాజిక న్యాయాన్ని బలహీనపర్చడమే!

ఇద్దరుహిందువులు కలుసుకుని ముస్లింల గురించి ఎప్పుడయినా మాట్లాడుకుంటే వాళ్ళ వెనుకబాటుతనాన్ని గురించి అవహేళనగా ముచ్చ టించుకుంటారు. ముస్లింలు ఉద్దేశ్యపూర్వకంగా వెనుకబడి ఉన్నారనీ నాగరికతలో అభివృద్ధి చెందడం వారికి రుచించదనీ ఏవగించుకుంటారు. స్త్రీలను బురఖాలలో బంధించి ఉంచుతారు, అన్నిటికీ షరియత్ వైపు చూస్తారు, పిల్లలను చదువు కోసం మదరసాలకే పంపిస్తారు, సైన్స్ కంటే ముల్లాల మాటలే ఎక్కువ విశ్వసిస్తారు....ఈ రకమైన సంభాషణ ఎన్నిసార్లు వినలేదు?

అయితే ముస్లింలు సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని భావించి ప్రభుత్వం వారికి విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఇవ్వడానికి సంకల్పించగానే ముస్లింలు వెనుకబడిన వర్గం కానే కాదు అంటూ అదే హిందువులు ఆగ్రహించారు. రాజశేఖరరెడ్డి ఓట్ల కోసం మైనారిటీలను బుజ్జగిస్తున్నాడని నిందించారు. హైకోర్టులో కేసువేసి గెలిచారు. రిజర్వేషన్ల చట్టాన్ని కొట్టేసిన బెంచిలోని అయిదుగురు జడ్జీలలో ఇద్దరు దాదాపు ఇదే అభిప్రాయం వ్యక్తం చేసారు. ముస్లింలకు ఒక మతవర్గంగానే రిజర్వేషన్లు కల్పించడానికి చట్టం అనే అచ్ఛాదన తగిలించుకున్న అనుచిత ప్రయత్నం అది అని వ్యాఖ్యానించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను విశ్వసిస్తున్నామని చెప్పుకునే వారు ప్రభుత్వం ఫలానా పని ఓట్ల కోసం చేసింది అని నిందించడంలో

అర్థమేమిటో తెలీదు. ఓట్ల కోసం రాజకీయ పార్టీలు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రయత్నం చేస్తాయనే కదా పార్లమెంటరీ వ్యవస్థను ప్రజాస్వామ్య వ్యవస్థగా గుర్తించేది?

ముస్లింలకు ఒక సామాజిక వర్గంగా రిజర్వేషన్లు కల్పించడం సబబా కాదా అన్న చర్చకు అర్థం ఉంది గానీ ఆ పని ఓట్ల కోసం చేసారన్న వ్యాఖ్యకు అర్థం లేదు.

మరి అది సబబు కాదనడానికి కోర్టులో ఏ వాదనలు చేసారు? కోర్టు వాటిని ఎందుకు ఆమోదించింది? చాలా విచిత్రమైన వాదనలు చేసారు. ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇచ్చేటప్పుడు ఆ వర్గాన్ని నిర్వచించవలసి ఉంటుంది. నిర్వచనం రిజర్వేషన్ ఇవ్వడానికి గల కారణాన్ని సూచించదు. రిజర్వేషన్ ఇస్తున్నదెవరికో వివరిస్తుందంతే. ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చే ఈ చట్టం 'ముస్లిం' అంటే ఎవరంటే ఇస్లాంను ఆచరించే వారు అని నిర్వచించింది. ఇస్లాంను ఆచరిస్తున్నందువల్ల వారికి రిజర్వేషన్ ఇస్తున్నామన లేదు. రిజర్వేషన్ పొందుతున్న వర్గాన్ని వర్ణించడానికి మాత్రమే ఈ నిర్వచనం ఇవ్వడం జరిగింది. అయితే దీనిని పట్టుకుని 'ఇస్లాంను ఆచరించడానికీ వెనుకబాటుతనానికీ సంబంధం ఏమిటి? లక్ష్యంతో సంబంధంలేని నిర్ణయం సహేతుకం ఎట్లా అవుతుంది?' అని వాదించడం జరిగింది. హైకోర్టు ఆ వాదనకు అనుకూలంగా స్పందించడమూ జరిగింది.

'ముస్లింలందరికీ రిజర్వేషన్ ఇస్తున్నారు. ఇస్లాంను ఆచరించే వారంతా ముస్లింలే నంటున్నారు. మరి రేపు ఒక హిందూ అగ్రకులస్తుడు రిజర్వేషన్ పొందడం కోసం ఇస్లాం పుచ్చుకుంటే అతను కూడ వెనుకబడినవాడు అయిపోతాడా?' అని వాదించారు. దీనికి సహితం హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ రకమైన వాదనలను గతంలో సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయాన్ని వివరించి చెప్పినప్పటికీ ఆ ఉదాహరణలను విస్మరించి ఈ వాదనను ఆమోదించింది.

జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో వాస్తవాధీన రేఖ సమీపంలో అభివృద్ధి ఏదీ జరిగే అవకాశం లేదు కాబట్టి అక్కడ నివసించే ప్రజలను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక వెనుకబడిన వర్గంగా గుర్తించి వారిని బిసి జాబితాలో చేర్చింది. ఇది అహేతుకం అంటూ జానకీ ప్రసాద్ పరిమూ అనే కాశ్మీర్ పండిట్ కోర్టుకు ఎక్కాడు. అక్కడ నివసించే వారందరూ ఒక వెనుకబడిన వర్గమని మీరంటే, రేపు ఒక శ్రీనగర్ నివాసి కేవలం రిజర్వేషన్ పొందడం కోసం అక్కడకు పోయి ఇల్లు కట్టుకుంటాడు. 'కేవలం ఇల్లు మార్చి వెనుకబడిన వాడయి పోతాడా?' అని ఆయన ప్రశ్నించాడు.

సుప్రీంకోర్టు ఈ వాదనను తిరస్కరించింది. ఒక చట్టం లేక ప్రభుత్వ చర్య సమర్థనీయమా కాదా అని చూసేటప్పుడు దానిని దుర్వినియోగం చేసే అవకాశం

ఉందనేది ప్రమాణం కావడానికి వీలులేదు. అది దానంతటది సమర్థనీయమా కాదా అని చూడాలి. దుర్వినియోగం చేసే అవకాశం ఉంటే దానిని అరికట్టే సహేతుకమైన మార్గాలు అన్వేషించాలే తప్ప ఆ చట్టాన్ని కొట్టేసే యత్నం తగదు. ఆ దుర్వినియోగం ఎప్పుడో అరుదుగా తప్ప జరగదని భావిస్తే దానిని అరికట్టడానికి ఏవో నియమాలు రూపొందించి చిక్కులు తెచ్చుకునే బదులు దానిని ఉపేక్షించడం మేలు. (కేవలం ఉద్యోగం కోసమో మెడిసిన్‌లో సీటు కోసమో ముస్లిం మతం పుచ్చుకునే హిందూ అగ్రకులస్తులు కోటిమందిలో ఒక్కరయినా ఉంటారా?)

ఇంతకంటే విచిత్రమైన వాదన కూడా చేసారు. దానికి కూడ హైకోర్టు తీర్పులో ఆమోదం లభించింది. ఈ వాదన చేసింది ఖాకీ నిక్కరు బిసి సంఘాల తరపున వాదించడానికి కర్నాటక నుండి వచ్చిన రవివర్మకుమార్ అనే ఆ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ సభ్యుడు, ఆ రాష్ట్రంలో బ్రాహ్మణ వ్యతిరేక ప్రజాతంత్ర ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన మేధావి.

‘ఖాకీ నిక్కరు బిసి సంఘాలు’ అన్నమాట ఎవరికీ కోపం తెప్పించనవసరం లేదు. వేరే ఏ విషయంలోనయినా మొహమాటానికి చోటు ఉందేమోగానీ సంఘ్ పరివార్‌ను పేరుపెట్టి గుర్తించడంలో ఉండదు, ఉండడానికి వీలు లేదు. సంఘ్ పరివార్ ఆలోచనారీతులు శూద్రకులాల ఉద్యమాలలోకి చాపకింద నీరులాగ పాకిపోయాయి. ప్రజాతంత్ర దృష్టిగల కొందరు తప్ప మిగతా బిసి సంఘాలు, మేధావులు ఈ విషయాన్ని గుర్తించకపోవడం బాధాకరం. మనువాదం మీద పోరాడడానికీ, సంఘ్ పరివార్ రాజకీయ ప్రతినిధులతో చెలిమి చేయడానికీ మధ్య వైరుధ్యమేమీ లేదని నమ్మే మాయావతులూ, కాన్షీరాంలూ దళిత నాయకులుగా చలామణి అవుతున్న చోట ఈ గుడ్డితనం ఆశ్చర్య పోవలసింది కాదేమోగానీ చాలా నష్టకరం.

రవివర్మకుమార్‌గారి వాదన ఏమిటంటే రాజ్యాంగంలో ‘వెనుకబడిన వర్గం’ అన్న ప్రయోగానికి అర్థం వెనుకబడిన హైందవ కులాలే తప్ప అన్యం కాదు. అది మైనారిటీలకు వర్తించదు. దీనికి మద్దతుగా రాజ్యాంగ పరిషత్‌లో అంబేద్కర్ ఇచ్చిన వివరణను ఆయన దీర్ఘంగా ఉటంకించారు. ఆయన వాదన చేసినప్పుడు కోర్టులో నవ్వుకున్నవారందరికీ ‘ఇది కొట్టివేయదగ్గ వాదన కాదు’ అని హైకోర్టు తీర్పులో లభించిన ఆదరణ ఆశ్చర్యం కలిగించింది.

రాజ్యాంగంలో వాడిన ‘వెనుకబడిన వర్గం’ అనే ప్రయోగం ముస్లింలకు వర్తిస్తుందా అన్న ప్రశ్న రాజ్యాంగ పరిషత్‌లో చర్చకు రాలేదు. ‘వెనుకబడిన వర్గం’ అనేది అస్పష్టంగా ఉంది, దాని భావం ఏమిటి అన్న వివరణ సభ్యులు కోరారు. అప్పుడు అంబేద్కర్ తమ దృష్టిలో ఉన్నది అణగారిన హైందవ కులాలేనని వివరించాడు.

ముస్లింల ప్రస్తావన ప్రశ్నలోనూ లేదు, జవాబులోనూ లేదు. ఒక మైనారిటీగా ముస్లింలకు ప్రత్యేక హక్కులు ఇవ్వాలా లేదా అన్న చర్చ మాత్రం జరిగింది. దాని నేపథ్యం వెనుకబాటుతనం కాదు. దేశ విభజనను నివారించడానికి ముస్లింలకు ప్రత్యేక హక్కులూ, అధికారాలూ కల్పించడం ఒక మార్గమన్న ఆలోచన 1946 దాకా చర్చలో ఉండింది. దేశ విభజన జరిగిన తరువాత ఇంక ఆ రకమైన ఆలోచనలు అనవసరం అన్న 'మూడ్'లోకి అందరూ రావడం వల్ల ముస్లింలకు ఒక మైనారిటీగా ప్రత్యేక హక్కులు కల్పించే ఆలోచన విరమించుకోవడం జరిగింది. అంతే తప్ప సామాజిక నేపథ్యంలో ముస్లింల గురించి చర్చ రాజ్యాంగ పరిషత్‌లో జరగనే లేదు.

జరిగి ఉండే అవకాశం కూడ లేదు. ఎందుకంటే రాజ్యాంగానికి తుదిరూపు ఇచ్చిన నాటికి దేశ విభజన జరిగిపోయింది గానీ స్వాతంత్ర్యానంతర సామాజిక చిత్రం ఇంకా రూపం తీసుకోలేదు. అప్పటికి ఇంకా ముస్లింల గురించి ఎవరు ఆలోచించినా స్వాతంత్ర్య పూర్వపు సామాజిక దృశ్యమే మనసులో ఉండే అవకాశం ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం దేశ వాయవ్య ప్రాంతంలో (అంటే ప్రస్తుత పాకిస్తాన్‌లో) ముస్లింలు ప్రధాన ఉన్నత వర్గం. బొంబాయితో పోటీపడిన కరాచీ నగరం, ఉమ్మడి పంజాబు రాజధాని అయిన లాహోర్ నగరం ముస్లింలు ప్రధాన సముదాయంగా ఉన్న నగరాలు. ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ముస్లిం జమీందార్లు, సంపన్నవర్గాలు పెద్ద సంఖ్యలో ఉండేవారు. హైదరాబాద్, భోపాల్ వంటి సంస్థానాలలో రాజవంశీకులయిన ముస్లిం నవాబులుండేవారు. స్వాతంత్ర్యానంతరం వాయవ్య ప్రాంతం పాకిస్తాన్‌లోకి పోయింది. ఉత్తరప్రదేశ్‌లోని జమీందారీ వర్గమే కాదు, ఉన్నత విద్యావంతులు, ధనవంతులు అయిన ముస్లింలు పెద్ద సంఖ్యలో పాకిస్తాన్‌కు తరలిపోయారు. హైదరాబాద్, భోపాల్ వంటి సంస్థానాల రాజవంశీకులు సహితం దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవడమో లేక సామాజిక జీవితం నుండి పూర్తిగా పక్కకు తప్పుకోవడమో జరిగింది. ఆ తరువాత క్రమంగా స్వాతంత్ర్యానంతర ముస్లిం సమాజం రూపం తీసుకుంది. ఇది ప్రధానంగా అణగారిన హైందవ కులాల నుండి మతమార్పిడి ద్వారా ముస్లింలయిన ప్రజాసమూహం. కనుక వీరి వెనుకబాటుతనాన్ని గురించి చర్చించేటప్పుడు రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చ ఇక్కడ అసందర్భమయినది.

అంతేకాక రాజ్యాంగాన్ని రాసిన వారి ఉద్దేశ్యాలు ఏవయినా, చివరికి రాజ్యాంగం 'వెనుకబడిన వర్గం' అన్నమాట వాడిందే తప్ప 'వెనుకబడిన కులం' అనలేదు. దీనిని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో నొక్కి చెప్పింది. వెనుకబడిన కులాలు వెనుకబడిన వర్గాలవుతాయి గానీ అవి మాత్రమే కావు అనీ, వెనుకబాటుతనానికి కులాన్ని ఏకైక ప్రమాణం చేయడానికి వీలు లేదనీ కనీసం డజను కేసులలో సుప్రీంకోర్టు అనింది.

పైన చెప్పినట్టు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో వాస్తవాధీనరేఖ సమీపంలో నివసించే వారిని వెనుకబడిన వర్గంగా గుర్తించారు. దానిని సుప్రీంకోర్టు ఆమోదించింది. ఉత్తర ప్రదేశ్‌లో కొండ ప్రాంతాలలో నివసించే ప్రజానీకం (ఆదివాసులయినా కాకున్నా) అభివృద్ధికి అననుకూలమైన పరిస్థితులలో జీవిస్తున్నందున ఆ రాష్ట్ర ప్రభుత్వం వారిని వెనుకబడిన వర్గంగా గుర్తించింది. దానిని కూడ సుప్రీంకోర్టు ఆమోదించింది. చాలా ఏళ్ళకింద అప్పటి మైసూరు రాష్ట్రప్రభుత్వం సాంకేతికంగా వెనుకబడిన వృత్తులను జీవనాధారంగా కలిగిన ప్రజలందరినీ వెనుకబడిన వర్గంగా గుర్తించింది. దీనిని సుప్రీంకోర్టు ఆమోదించింది. ఇవన్నీ రవివర్మ కుమార్‌గారు ఉటంకించిన 'అంబేద్కర్ అభిప్రాయానికి' భిన్నమైనవే. అయినప్పటికీ వారు ఆ వాదన చేయడం, 'అది కొట్టిపారేయ దగ్గవాదన కాద'ని ఒక జడ్జీ ఆదరించడం, ఆ జడ్జీ అభిప్రాయంతో తాము ఏకీభవిస్తున్నా మని మిగిలిన ఇద్దరు ప్రకటించడం జరిగిపోయింది.

నిజానికి విద్యా ఉద్యోగ రంగాలలో ముస్లింలు సగటు కంటె వెనుకబడి ఉన్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయని హైకోర్టు ఒప్పుకునింది. ఒక్కొక్క రంగంలోనూ ముస్లింల ప్రాతినిధ్యం లేక భాగస్వామ్యం 15 నుండి 30 శాతం దాకా తక్కువ ఉందని గుర్తించింది. అయితే ఇది గణనీయమైన వెనుకబాటుతనం కాదనీ, 50 శాతం కంటే తక్కువ ఉంటేనే గణనీయమైన వెనుకబాటుతనం అవుతుందనీ హైకోర్టు అంటుంది. ఈ అభిప్రాయానికి ప్రాతిపదిక ఏమిటి? సగటు కంటె 25 శాతం వెనుకబడి ఉంటే అది గణనీయమైన వెనుకబాటుతనం అని మండల్ కమిషన్ సూత్రీకరించింది. దానిని సుప్రీంకోర్టు ఆమోదించింది. మన రాష్ట్రంలో ముస్లింల వెనుకబాటుతనం దాదాపు అంత ఉంది. ఒక్కొక్క రంగంలో కొంచెం తక్కువ, ఒక్కొక్క రంగంలో కొంచెం ఎక్కువ ఉంది. అయినప్పటికీ 50 శాతం వెనుకబాటుతనం ఉంటేనే గణనీయమైన వెనుకబాటుతనం అవుతుందని హైకోర్టు ఏ ప్రమాణం లేకుండ అనింది.

రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారశైలిలోను, బిసి కమిషన్ నివేదికలోను లోపాలు లేకపోలేదు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వానికి నిలకడయిన న్యాయం చేయడం ముఖ్యం కాదు. 'మేము అధికారానికి రాగానే అయిదు శాతం రిజర్వేషన్ ఇచ్చేస్తాం' అన్న హామీని వెంటనే నిలబెట్టుకోవడం ముఖ్యం. బిసి కమిషన్‌కు కూడా సమగ్రమైన నివేదిక ఇవ్వడం ముఖ్యం కాదు, ఏలిన వారు ఎంత వేగంగా ఇమ్మంటే అంత వేగంగా ఇవ్వడం ముఖ్యం. బిసి కమిషన్ ముందు హాజరై వాళ్ళకు ఒక విషయం వివరంగా చెప్పడం జరిగింది. అధికభాగం సాంకేతిక అభివృద్ధికి అవకాశంలేని సంప్రదాయక అసంఘటిత ఉత్పత్తి రంగాలలో చిక్కుకున్న ప్రజావర్గాలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించవచ్చుననే అభిప్రాయం అనేక సుప్రీంకోర్టు తీర్పులలో వ్యక్తం అయ్యింది. అది ముస్లింల సామాజిక

స్థితికి సరిగ్గా అతుకుతుంది. కాబట్టి ముస్లిం ఉపాధి వివరాలను సమగ్రంగా సేకరించి ఆ ప్రాతిపదికన విశ్లేషిస్తే ఆ విశ్లేషణ కోర్టులలో నిలుస్తుందని సూచించాం. బిసి కమిషన్ ఆ పని చేయకుండ, మేము ముస్లింలు నివసించే ప్రాంతాలకు పోయినప్పుడు ఎక్కువ మంది చిల్లర వృత్తులలో ఉండడం గమనించాము అంటూ జర్నలిస్టు రిపోర్టులాగ రాయడం సహజంగానే అభిశంసనకు దారి తీసింది.

లక్ష్యశుద్ధి లేని రాజకీయాలు, కార్యదక్షత లేని నిపుణులు సామాజిక న్యాయాన్ని అకారణంగా బలహీనపరచగా, ప్రామాణికత అక్కరలేని న్యాయవ్యవస్థ దానిని మొత్తంగా పూడ్చి పెట్టింది.

*సాక్షి, మహాబోధి, చమన్*
*2006*

# విద్యాగ్రహారాలు

ఈ దేశంలో 'గర్వించదగ్గ' సంస్థలు, ప్రక్రియలు కులం దగ్గరి కొచ్చేసరికి చాతుర్వర్ణపు కుళ్లునంతా బయటపెట్టుకోవడం ఎన్ని సార్లు చూసామో, ఇంకెన్నిసార్లు చూడాలో!

వైద్య సంస్థగా, వైద్య విద్యాసంస్థగా దేశంలోనే కాదు బయట కూడా ప్రఖ్యాతి గాంచిన ఆల్ ఇండియా ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసి విద్యార్థులకు రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలులేదన్న ఉద్యమంలో అగ్ర భాగాన నిలబడడం చూసాం. తెలుగుబిడ్డ, రాజమండ్రి రత్నం అయిన దాని డైరెక్టర్ స్వయంగా ఆ ఉద్యమాన్ని రెచ్చగొట్టి నడిపించడమూ చూసాం.

నిజానికి మన దేశంలో అత్యున్నత విద్యాసంస్థలుగా గుర్తింపు పొందినవన్నీ అగ్రహారం అన్న బిరుదుకు అర్హమైనవే. కేవలం బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో ఉండడమే కాదు. బ్రాహ్మణీకం బలమైన శక్తి ఆ సంస్థలలో.

మన రాష్ట్ర రాజధానిలోని హైదరాబాద్ విశ్వవిద్యాలయాన్ని మరొక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వ్ చేయక తప్పని పోస్టులను మినహాయిస్తే తక్కిన వాటిలో - ఎస్‌సి, ఎస్‌టిలు, ఒబిసిల సంగతి పక్కన పెట్టండి, శూద్ర అగ్రకులాలకు సహితం ప్రవేశం కష్టం. పేరు వెనక రెడ్డి అనో చౌదరి అనో ఉండడం అనేక సామాజిక రంగాలలో పైకి ఎగబాకడానికి గ్రీన్‌కార్డే గానీ ఇక్కడ మాత్రం కాదు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఇవ్వక తప్పనట్టే ఒబిసిలకు కూడా వారికి కేటాయించిన కోటా ఇవ్వక తప్పని పరిస్థితి వస్తే తప్ప వారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరంగంలో ప్రవేశం దొరకదని గుర్తించిన వి.పి.సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను దుమ్ము దులిపి బయటకు తీసి 1990లో ఒక ఆదేశం జారీ చేసింది. అన్ని కేంద్ర ప్రభుత్వ సర్వీసులలోనూ ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఈ ఆదేశం సారాంశం.

దీనిని సవాలు చేస్తూ అగ్రకులాలు కోర్టుకెక్కగా, 9 మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఇందిరా సహాని వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే కేసులో వారి సవాలును కొట్టేసింది. అయితే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలు లేదనీ, ఒబిసిలలో క్రీమీలేయర్‌ను మినహాయించాలనీ ఇత్యాది కొన్ని షరతులు పెట్టింది. వీటిని దృష్టిలో పెట్టుకుని 1990 నాటి ఆదేశాన్ని కేంద్ర ప్రభుత్వం 1993లో కొద్దిగా సవరించి తిరిగి జారీ చేసింది. అప్పటినుండి కొన్ని ఒడిదుడుకులతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఒబిసిలకు రిజర్వేషన్లు అమలవుతూ ఉన్నాయి. అసలే అమలుకానిది కేంద్ర విద్యా సంస్థలలోనే. వేరే ఏ సమాజంలోనయినా బ్యూరోక్రసీ కంటే బుద్ధిజీవుల సంస్థలు ఉదారంగా వ్యవహరిస్తాయని అనుకుంటారు గానీ భారతదేశానికి సంబంధించి నంత వరకు బుద్ధిజీవుల వర్గం బ్రాహ్మణీకానికి నిలయం కావడం వల్ల ఆ సూత్రం తలకిందులవుతుంది.

1993లో కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఒబిసి రిజర్వేషన్ల ఆదేశాన్ని సవరించి జారీ చేసిన తదుపరి, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల వారికి ఆ ఆదేశాలు తమకు కూడా వర్తిస్తాయా అన్న సందేహం వచ్చిందంట. కేంద్రప్రభుత్వం ఆలస్యం చేయకుండ 1994లోనే ఆ విషయాన్ని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు కూడ కేంద్రప్రభుత్వ సంస్థలే కాబట్టి వాటికి కూడ వర్తిస్తుంది అని చిన్నపిల్లలకు విడమరచి చెప్పినట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఈ బుద్ధిజీవులకు విడమరచి చెప్పింది.

కానీ బ్రాహ్మణీకాన్ని అంత సులభంగా జయించగలమా? 1995 జనవరిలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు (యు.జి.సికి) ఒక లేఖ రాస్తూ మరొకసారి వివరణ కోరింది. ఒబిసి రిజర్వేషన్ల విషయంలో విశ్వవిద్యాలయాలు అనుసరించవలసిన పాలసీ ఏమిటో తెలపమని కోరింది.

ఈ కౌటిల్యానికి చాణక్యుడు కూడ విస్తుపోయి ఉండేవాడు. రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని వాడుకుని ప్రభుత్వం ఒక ఆదేశం జారీ చేసి అది విద్యాసంస్థలకు

కూడ వర్తిస్తుందని చెప్పిన తరువాత నీ సలహా ఏమిటని యు.జి.సిని అడగడం ఏమిటి? ఉన్నత విద్యాసంస్థలలో విద్యా ప్రమాణాలను కాపాడే లక్ష్యంతో విధాన రూపకల్పన చేసే అధికారం యు.జి.సికి ఉన్నమాట సత్యమే. యు.జి.సి చేసిన విధానాలు విశ్వవిద్యాలయాలకు శిరోధార్యం అని న్యాయస్థానాలు యు.జి.సి చట్టాన్ని వ్యాఖ్యానించిన మాట కూడా వాస్తవమే. అయితే 'జాతీయ ప్రాముఖ్యం గల' విషయాలలో యు.జి.సి కేంద్ర ప్రభుత్వ విధాన ప్రకటనకు లోబడి ఉంటుందనీ, ఒక విషయం 'జాతీయ ప్రాముఖ్యం' గలదా లేదా అన్న సందేహం వస్తే కేంద్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయమనీ యు.జి.సి చట్టంలోని సెక్షన్ 20 అంటుంది. రాజ్యాంగ ఆదేశాలననుసరించి ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం జాతీయ ప్రాముఖ్యం కలిగినది కాదని ఎవరూ అనలేరు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో చట్టాన్నీ రాజ్యాంగాన్నీ అధ్యయనం చేసిన మేధావులు, ఆచార్యవర్యులు చాలామందే ఉన్నారు. వారెవరైనా ఈ విషయం గ్రహించే ఉండాలి. వారు గ్రహించదలచుకోకుంటే యు.జి.సి అయినా తన పరిమితులెరిగి చెప్పి ఉండాలి. రెండూ జరగలేదు. పైగా, అప్పటికే కేంద్రప్రభుత్వం వివరణ ఇచ్చి ఉన్నప్పటికీ ఆ విషయాన్ని యు.జి.సి దాచిపెట్టి ఈ విషయం ఇప్పటికింకా కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉంది అని హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి జవాబు ఇచ్చింది.

1995లో మొదలయిన ఈ ప్రహసనం 2006 డిసెంబర్ దాకా సాగింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయం పదేపదే యు.జి.సికి ఉత్తరాలు రాస్తుంటుంది. ఈ విషయం ఇంకా కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉంది అని యు.జి.సి జవాబు చెప్తుంటుంది. ఆ జవాబు చూపించి హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఒబిసి రిజర్వేషన్లు వాయిదా వేస్తుంటుంది. లెక్చరర్ల పోస్టులు మాత్రం నింపుతుంటుంది. 1999లో 52, 2002లో 27, 2004లో 38 వెరసి 117 పోస్టులు ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించకుండ నింపింది. 1999లో జరిగిన నియామకాన్ని హైకోర్టులో ఇద్దరు నిరుద్యోగ విద్యావంతులు సవాలు చేయగా, 'యు.జి.సి తన అభిప్రాయాన్ని మాకు ఇంకా చెప్పలేదు' అని హైదరాబాద్ విశ్వవిద్యాలయం జవాబు చెప్పింది. హైకోర్టు ఇంత ముఖ్యమైన విషయంలో ఇంకా జాప్యం ఏమిటి అని ఆవేదన వ్యక్తం చేసి, 'నాలుగు వారాల లోపల యు.జి.సి తన అభిప్రాయం తెలపాలి' అని మధ్యంతర ఆదేశం జారీ చేసింది.

నాలుగు వారాలు కాదు, ఏడేళ్లు పట్టింది యు.జి.సి తన అభిప్రాయం తెలపడానికి. డిసెంబర్ 2006లో యు.జి.సి హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి ఒక లేఖ రాస్తూ, ఒబిసి రిజర్వేషన్ కేంద్రప్రభుత్వ అజమాయిషీలోని విద్యాసంస్థలకు కూడ వర్తిస్తుందని జనరల్‌గా చెప్పడమే కాక, 'మీ సంస్థలో అమలు చేయండి' అని

ఆదేశించింది కూడ. ఈ మాత్రం జరగడానికి యు.జి.సి చరిత్రలో మొట్టమొదటిసారి ఒక దళితుడు చైర్మన్ కావలసి వచ్చిందంటే ఈ దేశ దౌర్భాగ్యం అర్థం అవుతుంది.

అయితే కథ అక్కడితో అయిపోలేదు. 2006 డిసెంబర్ నెలలో ఇన్నాళ్లూ ఎదురు చూసినట్టు చెప్పుకున్న యు.జి.సి ఆదేశం లభించినా, హైదరాబాద్ విశ్వవిద్యాలయం తన వైఖరి మార్చుకోలేదు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీన మరొక 28 లెక్చరర్ల పోస్టులకు అడ్వర్టయిజ్‌మెంట్ ఇచ్చింది. కానీ దానిలోనూ ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించలేదు!

*ప్రజాతంత్ర*
*4 మార్చి 2007*

రిజర్వేషన్లు

# న్యాయస్థానాల వైఖరే అసలు సమస్య

తీర్పు రాయమంటే వ్యాసాలు రాస్తే కష్టం.

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం *ఎం.నాగరాజ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా* అనే కేసులో పిటిషనర్లు లేవదీసిన ప్రశ్నలకు జవాబులు చెప్పి ఊరుకోకుండా, రిజర్వేషన్ల మీద ఉడికీ ఉడకని వ్యాసం రాయడం కలకలానికి దారితీసింది. బిసిలలో లాగే ఎస్‌సి, ఎస్‌టిలలో కూడా 'క్రీమీలేయర్'ను గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించమని సుప్రీంకోర్టు అన్నదన్న అభిప్రాయం ప్రచారం అయింది. ఇంకొక రెండు ఆందోళనకరమైన అభిప్రాయాలు కూడా ఆ తీర్పులో వ్యక్తం అయ్యాయి గానీ, అవి మొదటి దానిలాగా వెంటనే అర్థమయ్యేవి కావు కాబట్టి అల్లరి జరగలేదు. ఒకటి, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏదైనా ప్రత్యేక ప్రతిపత్తి లేక హక్కు (రిజర్వేషన్లు, అర్హతల సడలింపు వగైరా) ఇవ్వదలచిన ప్రతి ఒక్క సందర్భంలోనూ వారు వెనుకబడి ఉన్నారని శాస్త్రీయ ప్రమాణాల ప్రాతిపదికన రుజువు చేసిన తరువాతే ఆ పని చేయాలి. రెండు, ప్రభుత్వ ఉద్యోగరంగంలో ఎంపికలో ఎస్‌సి, ఎస్‌టిల లాగే బిసిలకు కూడా రిజర్వేషన్లు ఇయ్యవచ్చును గానీ ప్రమోషన్లలో బిసిలకు ఇవ్వడానికి వీలులేదు.

ఈ మూడు అభిప్రాయాలూ స్పష్టాస్పష్టంగా ఈ తీర్పులో ఉన్నాయి. వాటిని రాజ్యాంగ వ్యాఖ్యానంగా సుప్రీంకోర్టు ఉద్దేశించిందా లేక యథాలాపంగా ప్రవచించిందా అనేది తెలీదు. మొదటిదేనేమోనన్న భయం, రెండవదేలెమ్మన్న ధీమా ఈ తీర్పు పట్ల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన వ్యాఖ్యలలో వ్యక్తం అవుతున్నది.

ఒక కవిత గురిందో కథ గురించో చర్చించుకునేటప్పుడు రచయిత భావమేమిటి అని వాదించుకోవడం, విభేదించడం సహజం. న్యాయస్థానాలిచ్చే తీర్పుల విషయం లోనూ అటువంటి పరిస్థితి ఉంటే కష్టం. తీర్పు తప్పు కావచ్చు, ఒప్పు కావచ్చు. న్యాయం కావచ్చు, అన్యాయం కావచ్చు. కానీ అస్పష్టంగా మాత్రం ఉండడానికి వీలులేదు.

ఈ మధ్య కాలంలో సుప్రీంకోర్టు నుంచే అస్పష్టమైన తీర్పులు వెలువడడం మామూలు విషయం అయిపోయింది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల గురించి 13 మంది జడ్జీల బెంచి ఏమందో స్పష్టంగా లేదని వారి అభిప్రాయం ఏమిటో వివరించమని అయిదుగురు జడ్జీలను కూర్చోబెడితే, ఈ బెంచి వారి అభిప్రాయాన్ని స్పష్టం చేసే బదులు తన సొంత అభిప్రాయం చెప్పగా, మళ్ళీ ఏడుగురు జడ్జీలు కూర్చుని వీరి అధిక ప్రసంగాన్ని విమర్శించి తొలి తీర్పును స్పష్టపరచే పనిచేసిన వైనం ఇనాందార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో ఈ మధ్యనే చూశాం. ఇది కొంతవరకు భాషకు సంబంధించిన సమస్య. హైకోర్టు, సుప్రీంకోర్టుల భాష ఇంగ్లిష్ అని రాసుకున్నాం. (కింది కోర్టులన్నీ కూడా ఇంగ్లిష్‌లో నడిచే అతి కొద్ది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి.) కానీ ఆ భాషమీద అతి కొద్దిమంది న్యాయమూర్తులకే పట్టు ఉంది. నాలుగు న్యాయ సిద్ధాంత పడికట్టు పదాలు పట్టుకుని క్లిష్టమైన వ్యాఖ్యలు చేస్తుంటారు. ఇది సహజంగానే అస్పష్టతకు, అసమగ్రతకు దారితీస్తుంది. కానీ భాష ఒక్కటే సమస్య కాదు. ఆలోచనలలో తార్కికత కొరవడడం మరొక సమస్య. కొంత న్యాయ సిద్ధాంత పరిభాష అలవడాలే గానీ, అత్యున్నత స్థాయి కోర్టు తీర్పులలో సైతం తర్కం ఎంత బలహీనంగా ఉంటున్నదో సాధారణ విద్యావంతులు కూడా చూడగలరు. మూడవ సమస్య భావదారిద్ర్యం. భారత దేశమంతటి వైవిధ్యము, సంక్లిష్టత ఉన్న దేశ పాలన గురించి ఆలోచించేటప్పుడు ఉండవలసిన విశాల దృక్పథం ఈ తరం న్యాయమూర్తులలో చాలా అరుదు. ప్రత్యేకించి సమానత, సామాజిక న్యాయం అనే భావన పట్ల వ్యతిరేక వైఖరి - రాజ్యాంగంలో వాటికింకా చోటు ఉంది కాబట్టి అప్పుడప్పుడు వాటి దిశగా ఒక నమస్కారం పారేయడం తప్పనిసరైనప్పటికీ - న్యాయస్థానాలలో చాలా మామూలు విషయం అయిపోయింది.

ఈ భావదారిద్ర్యమే లేకపోతే ప్రస్తుతం ఆందోళనకూ వివాదానికీ దారితీసిన 'నాగరాజు' కేసు ఉనికిలోకి వచ్చేదే కాదు. పార్లమెంటు రాజ్యాంగానికి చేసిన 77వ, 81వ, 82వ, 85వ సవరణలు చెల్లుతాయా లేక అవి పార్లమెంటుకుండే అధికారాలను మించిన సవరణలా అనేది నాగరాజు కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందున్న వివాదం. రిజర్వేషన్ల పట్ల సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన సంకుచితమైన తీర్పులను అధిగమించడానికే ఈ నాలుగు రాజ్యాంగ సవరణలూ చేయవలసి వచ్చిందని గ్రహిస్తే, వాటి రాజ్యాంగబద్ధతపై అగ్రకులాలు లేవదీసిన సవాలును అడ్డం పెట్టుకుని మరిన్ని సందేహాస్పదమైన వ్యాఖ్యలు ఆ కోర్టు ఏ విధంగా చేయగలిగిందో అర్థం అవుతుంది.

ఉద్యోగ రిజర్వేషన్లకు మూలం రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4)లో ఉంది. ప్రభుత్వ ఉద్యోగరంగంలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు నియామకాల లోనూ పోస్టులలోనూ రిజర్వేషన్లు ఇయ్యవచ్చునని 16(4) అంటుంది. నియామకం అనేది నేరుగా ఉద్యోగంలోకి తీసుకోవడం ద్వారా జరగవచ్చు, ప్రమోషన్ ద్వారానూ జరగవచ్చు. 'పోస్టు' అనేది (ఉద్యోగం అందాం) నేరుగా నింపేదీ కావచ్చు, ప్రమోషన్ ద్వారా నింపేదీ కావచ్చు. కాబట్టి 16(4) ప్రకారం నేరుగా చేసే నియామకాలలోనే కాక ప్రమోషన్లలో కూడా (తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు) రిజర్వేషన్ కల్పించవచ్చుననేది అందరూ సులభంగా గ్రహించగల విషయం. 1962లో 'రంగాచారి' కేసుగా పేరుపొందిన *జనరల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే వర్సెస్ రంగాచారి* అనే కేసులో సుప్రీంకోర్టు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అయితే 1992లో మండల్ కమిషన్ కేసు *(ఇందిరా సహానీ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా)*లో తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం దానిని తిరగదోడి నేరుగా చేసే అపాయింట్‌మెంట్ లోనే తప్ప ప్రమోషన్‌లో రిజర్వేషన్ ఇవ్వడానికి వీలులేదనింది.

ఎందుకని? రిజర్వేషన్ ద్వారా జూనియర్లకు ప్రమోషన్ వచ్చి సీనియర్ దిగువ పోస్టులో ఉండిపోవడం పాలనా యంత్రాంగంలో అసంతృప్తికి దారితీస్తున్నదని, దాని సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నదని వాదించిన వారి తర్కాన్ని కోర్టు ఆమోదించిన కారణంగా ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు పాలనా యంత్రాంగం సామర్థ్యం దెబ్బతినకుండా చూసుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 335 చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఉటంకించింది. అయితే జూనియర్లు ముందే ప్రమోట్ కావడమనేది వేరే కారణాల వల్ల కూడా జరుగుతుంది. క్వాలిఫికేషన్లు లేవని, డిపార్టుమెంటల్ పరీక్షలు పాసు కాలేదని, పనిలో యోగ్యత కొరవడిందని సీనియర్‌లు ప్రమోషన్ పొందని సందర్భాలు అనేకం. ఒక్కొక్కసారి పైస్థాయి పోస్టుకు కింది నుంచి ప్రమోషన్ల ద్వారానే కాక నేరుగా రిక్రూట్ చేసుకోవడం కూడా జరుగుతుంది. అప్పుడు వయసు, అనుభవం రెండూ తక్కువ ఉన్నవారు పై స్థాయి ఉద్యోగాలలో నియమితు లవుతుంటారు. 50 ఏళ్ళ వయసున్న ఆర్‌డిఓలు మూతిమీద మీసం లేని యువ కలెక్టర్లకు వంగి వంగి సలాంలు చేయడం చూస్తూనే ఉన్నాం. అప్పుడు లేని సమస్య రిజర్వేషన్ ఇచ్చినప్పుడే ఎందుకొచ్చింది?

వచ్చిందని తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం భావించింది. అప్పుడు ప్రభుత్వం దానికి విరుగుడుగా 77వ రాజ్యాంగ సవరణ చేసి ఆర్టికల్ 16 (4ఎ) చేర్చి ఎస్‌సి, ఎస్‌టిలకు ఉద్యోగాలలోనూ (తగిన ప్రాతినిధ్యం లేని పక్షంలో), ప్రమోషన్లలోనూ రిజర్వేషన్ ఇయ్యవచ్చునని రాజ్యాంగం చేత చెప్పించారు.

ఈ సవరణ వెంటనే అమలు కావడం మొదలయింది. సహజంగానే, రిజర్వేషన్ ద్వారా ప్రమోషన్ పొందినవారు పైపోస్టులో చేరిన రోజు నుంచి సీనియారిటీ పొందారు. దీనిని ప్రమోషన్ ఆలస్యంగా పొందిన అగ్రకులాల వారు సవాలు చేయగా, *అజిత్‌సింగ్ జనూజా వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్* కేసులో 1995లో సుప్రీంకోర్టు 77వ రాజ్యాంగ సవరణ కారణంగా ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రమోషన్‌లో రిజర్వేషన్లు ఇస్తే ఇచ్చారు గానీ ఈ రకంగా ప్రమోషన్ పొందిన వారికి పైపోస్టులో సీనియారిటీ రాదనింది. వారి తరువాత ప్రమోషన్ పొందిన వారి సీనియర్లు పైపోస్టులోనూ సీనియర్లవుతారని ప్రకటించింది. పైన చెప్పినట్టు, అనేక ఇతర కారణాల వల్ల కింది పోస్టులో జూనియర్లుగా ఉన్నవారు ముందుగా ప్రమోషన్ పొందుతారని చూశాం. అక్కడ వాళ్ళ సీనియారిటీ ప్రమోషన్ పొందిన నాటినుంచి లెక్కించబడుతుంది తప్ప కింది పోస్టులో వారికి సీనియర్లుగా ఉన్నవారు ఆలస్యంగా డిపార్టుమెంటల్ టెస్టులు పాసై ఆలస్యంగా ప్రమోషన్ పొందితే పైపోస్టులో వారికి సీనియారిటీ ఇవ్వరు. ఒక్క రిజర్వేషన్ల విషయంలోనే అభ్యంతరం ఎందుకొచ్చింది మరి?

వచ్చిందని సుప్రీంకోర్టు భావించింది కాబట్టే మళ్లీ 85వ రాజ్యాంగ సవరణ అవసరం అయింది. మొన్ననే పుట్టిన ఆర్టికల్ 16(4ఎ)ని సవరించి ప్రమోషన్‌లో రిజర్వేషన్‌లు సీనియారిటీతో సహా ఇయ్యవచ్చునని రాజ్యాంగం చేత అనిపించవలసి వచ్చింది.

అక్కడితో కథ అయిపోలేదు. మామూలుగా, రిజర్వేషన్లు కల్పించినా కూడా సంబంధిత సామాజిక వర్గం ఆ ప్రయోజనాన్ని అందుకునే స్థితిలో లేకుంటే, ఉద్యోగ అర్హతలను సడలించడం జరుగుతుంది. ఇందులో తప్పేమీ లేదని కోర్టులు కూడా గతంలో అని ఉన్నాయి. అందువల్ల ప్రమోషన్లలో ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చిన రిజర్వేషన్లకు కూడా దీనిని వర్తింప చేసి ప్రమోషన్ పోస్టులకుండే అర్హతలను కూడా అవసరమైన మేరకు ప్రభుత్వం సడలించ సాగింది. ఇది చెల్లదని సుప్రీంకోర్టు *ఎస్.వినోద్‌కుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా* కేసులో 1996లో అనింది. దీనిని అధిగమించడానికి 82వ రాజ్యాంగ సవరణ చేసి ఆర్టికల్ 335కు ఒక షరతు తగిలించవలసి వచ్చింది.

చివరిగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న నియమాన్ని మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన తీరువల్ల 81వ రాజ్యాంగ సవరణ అవసరం అయింది. నిజానికి ఒక కేడర్‌లో మొత్తం రిజర్వేషన్ 50 శాతం మించి ఉండడానికి వీలులేదన్న రాజ్యాంగ సూత్రానికి ఇప్పుడు ఏ తర్కం లేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో ఎటువంటి వివక్షా పాటించడానికి వీలులేదని, అందరికీ సమాన అవకాశాలు ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(1) అంటుంది. అయితే ఉద్యోగరంగంలో తగు ప్రాతినిధ్యం

లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించవచ్చునని 16(4) అంటుంది. మొదట్లో ఈ 16(4) ను 16(1)కి మినహాయింపుగా భావించింది సుప్రీంకోర్టు. అంటే రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు అని అర్థం చేసుకుంది. మరైతే మినహాయింపు అసలు కంటే ఎక్కువ ఉండకూడదు కదా? ఎక్కువ ఉంటే దానిని మినహాయింపు అనరు కదా? ఈ కామన్‌సెన్స్ తర్కంతో 1963లో గజేంద్ర గడ్కర్ '50 శాతం గరిష్ఠ పరిమాణం' అనే దానిని రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సూత్రంగా *ఎం.ఆర్. బాలాజీ వర్సస్ స్టేట్ ఆఫ్ మైసూర్* కేసులో ప్రకటించాడు.

రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదనీ, సమాన అవకాశాలకు ఒక సాధనమనీ 1976లో మొట్టమొదటిసారి సుప్రీంకోర్టు గుర్తించింది. కృష్ణయ్యర్, ఫజల్ అలీ మొదలుగా గల ఏడుగురు జడ్జీల బెంచి *స్టేట్ ఆఫ్ కేరళ వర్సస్ ఎన్.ఎం. థామస్* కేసులో ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రకటించింది. మరి రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదు, ఒక సాధనం అని గుర్తించినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి లోబడి ఎందుకు ఉండాలి? సమాన అవకాశాలకు ఆ సమయంలో ఉండే ఆటంకం ఎంత బలంగా ఉందన్న దాన్ని బట్టి రిజర్వేషన్ల పరిమాణం ఉండాలే తప్ప ముందే ఒక గరిష్ట పరిమాణం రాజ్యాంగం ఎట్లా ప్రకటించగలుగుతుంది? ఫజల్ అలీ ఆ కేసులో విడిగా రాసిన తీర్పులో ఈ మాట అననే అన్నాడు. ఒక రాష్ట్రంలో వెనుకబడిన ప్రజలు 80 శాతం ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండడానికి వీలు లేదనడం అర్థరహితం అన్నాడు. (ఈ మాట ఒక హైందవేతర న్యాయమూర్తే అనగలిగాడని మేమంటే న్యాయమూర్తులకు మతాన్నీ, కులాన్నీ ఆపాదిస్తున్నాం అని విరుచుకుపడతారు కాబోలు!)

అయినప్పటికీ గజేంద్ర గడ్కర్ అభిప్రాయమే సుప్రీంకోర్టు అభిప్రాయంగా కొనసాగింది. మండల్ కమిషన్ కేసులో తొమ్మిది మంది జడ్జీల బెంచి కూడా దానిని నొక్కి చెప్పింది. తొలినాటి తర్కాన్ని కోల్పోయిన ఈ అభిప్రాయం కేవలం సుప్రీంకోర్టు ప్రవచనం కారణంగా ఒక రాజ్యాంగ సూత్రంగా మిగిలిపోయింది. అయితే మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఒక ఉద్యోగానికి సంబంధించిన కేడర్‌లో రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదని ఊరుకోకుండా, ఒక కేడర్‌కు ఏ ఒక్క సంవత్సరంలో జరిగే రిక్రూట్‌మెంట్‌లోనైనా రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండడానికి వీలులేదని కూడా ప్రకటించింది. మరైతే బ్యాక్‌లాగ్ పోస్టులను ఎట్లా నింపుతారు? ఒక కేడర్‌లో ఒక సంవత్సరం కొత్తగా 30 పోస్టులు నింపవలసి వచ్చిందనుకుందాం. అందులో 15 దాకా రిజర్వ్‌డ్ పోస్టులు ఉంటాయి. (ఒకటో రెండో ఇటూ అటూగా). కానీ అదే కేడర్‌లో 20 ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టులు నింపవలసి ఉందనుకోండి. అవన్నీ ఎస్‌సిలకు రిజర్వ్ కావలసిందే కదా! ఆ 30, ఈ 20 కలిపి నోటిఫై చేస్తే మొత్తం 50 పోస్టులలో

35 రిజర్వ్ అవుతాయి. అంటే 50 శాతం మించి పోతుంది. ఒకవేళ ఆ సంవత్సరం కేవలం బ్యాక్‌లాగ్ పోస్టులే నింపినట్టయితే ఇరవైకి ఇరవయ్యీ రిజర్వ్ అవుతాయి. అంటే బ్యాక్‌లాగ్ నింపడం అసాధ్యం అని అర్థం. బొత్తిగా అనాలోచితంగా తొమ్మిది మంది జడ్జీల బెంచి వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాన్ని అధిగమించడానికి 81వ రాజ్యాంగ సవరణ చేసి రాజ్యాంగానికి ఆర్టికల్ 16(4బి)ని చేర్చి రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదు అన్న విషయాన్ని ఒక సంవత్సరంలో చేసే నియామకాలకు అన్వయించేటప్పుడు బ్యాక్‌లాగ్ పోస్టులు లెక్కలోకి రావని రాజ్యాంగం చేతనే చెప్పించవలసి వచ్చింది.

ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే అధికారానికి సుప్రీంకోర్టు అడుగడుగునా అహేతుకంగా అడ్డంపడడం ఈ రాజ్యాంగ సవరణలకు దారితీసిందనేది స్పష్టమే. 1950ల నుంచి 1970 దాకా ప్రైవేటు ఆస్తిని ప్రభుత్వపరం చేసే చట్టాలకు, ప్రభుత్వ ఆదేశాలకు సుప్రీంకోర్టు అడ్డం పడడం, ఆ అడ్డంకిని తొలగించుకోవడానికి ప్రభుత్వం ఒకటికి నాలుగుసార్లు రాజ్యాంగాన్ని సవరించడం జరిగింది. ఇప్పుడు ప్రైవేటు ఆస్తులను పెంచే పనే తప్ప స్వాధీనం చేసుకునే ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు కాబట్టి ఆ విషయంలో ప్రభుత్వానికీ, న్యాయస్థానాలకూ ఘర్షణ పాత చరిత్ర అయిపోయింది. దాని స్థానాన్ని రిజర్వేషన్లు ఆక్రమించుకున్నాయి. మెట్టుమెట్టుగా సుప్రీంకోర్టు అడ్డుపడడం, ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి సామాజిక న్యాయ లక్ష్యాన్ని కాపాడడం జరుగుతున్నది.

భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద రాజ్యాంగాలలో ఒకటన్నది తెలిసిన విషయమే. రాజ్యాంగంలో స్థూలంగా పాలనాధికారాలనూ, పౌరుల హక్కులనూ సూచించాలే గానీ ప్రతి చిన్న పాలనాధికార విశేషాన్నీ రాజ్యాంగంలో రాయడం ఏమిటన్న విమర్శ భారత రాజ్యాంగంపైన ఎప్పటినుంచో ఉంది. రాజ్యాంగ పరిషత్ ముందు రాజ్యాంగం ముసాయిదాను ప్రవేశపెట్టిన సందర్భంగా చేసిన చాలా ఆసక్తికరమైన ఉపన్యాసంలో అంబేద్కర్ దీనికి చక్కగా జవాబు చెప్పాడు. ప్రతి రాజ్యాంగానికీ కొన్ని విలువలు ఉంటాయి. ఆ విలువల స్ఫూర్తిని ఆ సమాజం, ఆ దేశ పాలనా యంత్రాంగం జీర్ణించుకుని ఉన్నట్టయితే రాజ్యాంగం క్లుప్తంగా ఉన్నా ఫరవాలేదు గానీ మనది ప్రజాస్వామ్యాన్ని పైపూతగా గల అత్యంత అప్రజాస్వామిక సమాజం కాబట్టి అది సాధ్యం కాదని అన్నాడు. చారిత్రక కారణాల వల్ల వెనుక ఉంచబడ్డ వారికి ఉద్యోగాలలో ప్రత్యేక హక్కులు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంది అన్న నాలుగు వాక్యాలు రాజ్యాంగంలో రాసి ఉంటే సరిపోవలసింది... ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇయ్యవచ్చునా, ఇస్తే సీనియారిటీ ఇయ్యవచ్చునా, క్వాలిఫికేషన్ మార్కులు తగ్గించవచ్చునా అంటూ ఒక జీవోలో ఉండవలసిన వివరాలన్నీ రాజ్యాంగంలోనే రాసుకోవలసిన అగత్యం ఏర్పడడానికి రాజ్యాంగ విలువల స్ఫూర్తి సమాజంలోను, పాలనా యంత్రాంగంలోనే కాదు, న్యాయస్థానాలలోనూ కొరవడడం తప్ప వేరే కారణం లేదు.

సరే, పైన క్లుప్తంగా వివరించిన 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు చెల్లవంటూ అగ్రకులాలవారు కుప్పలు కుప్పలుగా సుప్రీంకోర్టులో కేసులు వేశారు. వాటన్నిటి పైనా 2006 అక్టోబరు 19వ తేదీన *నాగరాజు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా* అనే కేసులో అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తరపున తీర్పు ప్రకటించిన కపాడియా అన్ని కేసులనూ కొట్టివేసి ఆ నాలుగు రాజ్యాంగ సవరణలూ చెల్లుతాయని స్పష్టం చేశారు. అయితే ఆ క్రమంలో వివాదంలో భాగం కాని విషయాల మీద పొంతన లేని వ్యాఖ్యలు చేసి అనవసరమైన గందరగోళం సృష్టించారు.

కేసు వేసిన వాళ్ళు ఆ నాలుగు రాజ్యాంగ సవరణలూ చెల్లవనడానికి రెండు కారణాలు చూపించారు. సుప్రీంకోర్టు తీర్పులలో ప్రకటించిన సూత్రాలను వమ్ము చేయడానికి రాజ్యాంగాన్ని సవరించడం చట్టసభకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాల దుర్వినియోగం అన్నారు. రెండు, ఆ నాలుగు సవరణలు రాజ్యాంగం మౌలిక స్వరూపాన్నే మార్చేశాయి కాబట్టి అవి చెల్లవన్నారు. రెండు వాదనలనూ కపాడియా నిస్సంకోచంగానే తిరస్కరించారు. చట్టానికి సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్య చట్టంతో సమానమని రాజ్యాంగం లోని ఆర్టికల్ 141 అంటుంది. కాబట్టి అన్ని చట్టాలను సవరించినట్టే ఆ వ్యాఖ్యను కూడా సవరించవచ్చు. అది చట్ట సవరణే అవుతుంది గానీ సుప్రీంకోర్టును అగౌరవ పరచే చర్య కాదు. ఇది సాధారణ చట్టాలకే కాక రాజ్యాంగ చట్టానికి కూడా వర్తిస్తుంది. ఎందుకంటే రాజ్యాంగాన్ని సవరించే అధికారం కూడా పార్లమెంటుకు ఉంది.

ఇక రెండవ అభ్యంతరం, ఈ నాలుగు సవరణలూ రాజ్యాంగం మౌలిక స్వరూపాన్నే మార్చేశాయి కాబట్టి అవి చెల్లవు అనేది. రాజ్యాంగాన్ని సైతం సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 అంటుంది. వివిధ రకాల రాజ్యాంగ సవరణలకు అనుసరించవలసిన పద్ధతులను కూడా నిర్దేశిస్తుంది. పైన చెప్పినట్టు, సొంత ఆస్తులను ప్రభుత్వపరం చేయడానికి చేపట్టిన చర్యలకు సుప్రీంకోర్టు పదే పదే అడ్డుతగలగా ఆ ఆటంకాన్ని అధిగమించడానికి 1970 దాకా రాజ్యాంగాన్ని అనేకసార్లు సవరించడం జరిగింది. ఆ సందర్భంగా రాజ్యాంగాన్ని సవరించ వచ్చునంటే ఎంత దూరమైనా పోవచ్చునా, మొత్తంగా రాజ్యాంగాన్నే తిరగ రాయవచ్చునా అన్న ప్రశ్న వచ్చింది. *కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ* అనే కేసులో 1973లో 13 మంది జడ్జీల బెంచి, రాజ్యాంగ ప్రాథమిక హక్కులతో సహా దేనినైనా సవరించ వచ్చును గానీ సవరణ కారణంగా రాజ్యాంగ 'మౌలిక స్వరూపం' మారిపోకూడదని ప్రకటించింది. కాని 'మౌలిక స్వరూపం' అంటే ఏమిటో అప్పటినుంచి ఇప్పటిదాకా సుప్రీంకోర్టు చెప్పలేదు. అయితే ప్రజాస్వామ్యం, లౌకికవాదం, చట్టబద్ధ పాలన మొదలైన వాటిని 'మౌలిక స్వరూపం'లో భాగంగా సుప్రీంకోర్టు ఆ తరువాత వెలువరించిన తీర్పులలో గుర్తించింది.

నాగరాజు కేసులో కపాడియా ఈ విషయాన్ని ఆసక్తికరంగా చర్చించారు. మౌలిక స్వరూపం అంటే రాజ్యాంగంలోని ఫలానా ఆర్టికల్ లేదా మరొక ఆర్టికల్ కాదనీ, రాజ్యాంగంలోని వివిధ అధికరణలను కలుపుతూ అనుసంధానం చేసే అంతస్సూత్రాలను మౌలిక స్వరూపంగా భావించాలనీ అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, చట్టపరమైన సమానత్వం, సామాజిక న్యాయం, పాలనలో నిష్పాక్షికత మొదలైనవి ఒక చోటో ఇంకొక చోటో రాజ్యాంగంలో ప్రస్తావించబడి ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ ఇవి రాజ్యాంగానికి అంతస్సూత్రంగా ఉన్నాయి. ఇవీ, ఇటువంటివీ మౌలిక సూత్రాలు. వీటిని తిరస్కరించే విధంగా రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు రాజ్యాంగం ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగ రంగంలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వవచ్చునా లేదా, ఇస్తే సీనియారిటీ ఇవ్వవచ్చునా లేదా అనేవి ఇటువంటి అంతస్సూత్రాల కిందికి రావు కాబట్టి వాటికి సంబంధించి చేసిన సవరణలు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చేశాయని అనడానికి వీలులేదని కపాడియా అన్నారు.

అంతవరకూ బాగానే ఉంది. కానీ 'మౌలిక స్వరూపం' అనే దానికి ఇచ్చిన వివరణ హేతుబద్ధంగానే ఉందనుకున్నా, రాజ్యాంగ అధికరణాలకు అంతస్సూత్రంగా ఏయే విలువలను గుర్తించాలనేది ఇప్పటికీ సుప్రీంకోర్టు చేతిలోనే ఉండిపోవడం గమనార్హం. దేశ పార్లమెంటు దేశ రాజ్యాంగంలో ఏ మేరకు సవరణలు చేయవచ్చునన్న ప్రమాణాలను రాజ్యాంగమే సూచించడం ఉచితంగా ఉంటుంది తప్ప సుప్రీంకోర్టులో అప్పటికి కూర్చున్న న్యాయమూర్తుల అభిప్రాయాలు ఆ ప్రమాణాన్ని నిర్దేశించడం ఏ రకంగానూ మంచిది కాదు. ప్రభుత్వ ఉద్యోగాలలో 69 శాతం రిజర్వేషన్లు ఇస్తున్న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ విధానం రాజ్యాంగబద్ధమేనా అనేది సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులలో ఒకటి. దానిని 9వ షెడ్యూల్‌లో వేసి న్యాయ సమీక్ష నుంచి కాపాడాలని చూశారు గానీ 9వ షెడ్యూలులో ఉన్న చట్టాలు సైతం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భిన్నమైతే కొట్టివేయవలసి ఉంటుందని ఈ మధ్యనే సుప్రీంకోర్టు అని ఉంది. కాబట్టి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదన్న సూత్రం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి సంబంధించినదా - అంటే రిజర్వేషన్లు సగం కంటే ఎక్కువ ఉండడం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమైన సమానతా సూత్రాన్ని అతిక్రమిస్తుందా - అనే ప్రశ్న త్వరలోనే మరొక రాజ్యాంగ ధర్మాసనం ముందుకు రాబోతుంది. ఆ లోపల 'మౌలిక స్వరూపం'గా గుర్తించగల రాజ్యాంగ అంతస్సూత్రాలైన విలువలు ఏమిటన్నది పార్లమెంట్ స్పష్టం చేయడం మంచిది.

అదట్లా ఉంచి 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు ఏ రకంగానూ రాజ్యాంగ విరుద్ధం కావని అంటూ అక్కడితో ఆగిపోకుండా సుప్రీంకోర్టు చేసిన అసందర్భమైన అదనపు ప్రసంగాన్నీ, నష్టకరం కాగల వ్యాఖ్యలనూ చూద్దాం.

'ఈ రాజ్యాంగ సవరణలు రాజ్యాంగబద్ధమైనవేనని అంటున్నామంటే వీటిని ఆశ్రయించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలూ ప్రభుత్వ సంస్థలూ ప్రమోషన్ల విషయంలో చేపట్టిన రిజర్వేషన్‌లన్నీ చెల్లుతాయని మా అభిప్రాయం కాదు. ఈ సవరణలు ఆ విషయంలో ప్రభుత్వానికి కల్పించే అధికారం రాజ్యాంగబద్ధమే అని అంటున్నాం కానీ ఆ అధికారాన్ని వినియోగించిన ప్రతి సందర్భంలోనూ, దానిని సక్రమంగా వినియోగించారా లేదా అనేది కోర్టులు సమీక్షించగలవు' అని సుప్రీంకోర్టు అనింది. ఒక అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టడం రాజ్యాంగబద్ధమే అయినా, దానిని వినియోగించే క్రమంలో చేపట్టిన ఒక చర్య అక్రమంగా ఉంటే అది చెల్లదనీ, ఆ విషయం కోర్టులు సమీక్షించగలవనీ చెప్పే సూత్రంతో పేచీ ఏమీ లేదు. ఉదాహరణకు ప్రజావసరాల కోసం ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చునన్న అధికారం రాజ్యాంగబద్ధమే అయినా ఒక్కొక్క భూసేకరణ ప్రక్రియనూ అది నిజంగా ప్రజావసరం కోసమే, నిష్పక్షపాతంగా జరుగుతున్నదా మొదలైన ప్రమాణాల ప్రాతిపదికన కోర్టులు సమీక్షించవచ్చు.

అయితే 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు ఇచ్చే అధికారాన్ని వినియోగించే చర్యలను సమీక్షించే సందర్భంలో ఏ ప్రమాణాలను ఉపయోగించాలన్న సూత్రీకరణ చేసేటప్పుడు, ఈ రాజ్యాంగ సవరణలిచ్చే అధికారం ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే సంబంధించిందని దృష్టిలో పెట్టుకోకుండా బిసి రిజర్వేషన్లకు వర్తించే ప్రమాణాలను కూడా కపాడియా తన తీర్పులో ఉటంకించడం అనవసరమైన గందరగోళానికి దారితీసింది. ఇంత సామాజిక ప్రాధాన్యం గల విషయాలలో అజాగ్రత్తగా తీర్పులు రాయడం క్షంతవ్యం కాదు. అయితే ఈ అజాగ్రత్త కేవలం పొరపాటున దొర్లింది కాదు. రాజ్యాంగబద్ధమేనని ఒప్పుకోక తప్పని అధికారాల పట్ల వాస్తవానికి వ్యతిరేక భావం ఉండడం ఈ అదనపు ప్రసంగానికి కారణం.

ఆయన ఏకరవు పెట్టిన ప్రమాణాలేమిటంటే రిజర్వేషన్లు పొందబోయే వారు వెనుకబడి ఉన్నారని 'గణాంకయుతమైన సమాచారం' ఉండాలి. ఆ ఉద్యోగ రంగంలో వారికి తగిన ప్రాతినిధ్యం లేదని కూడా కచ్చితమైన సమాచారం ఉండాలి. మొత్తం కేడర్‌లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా ఉండాలి. క్రీమీలేయర్ సూత్రాన్ని పాటించాలి. వీటిని ఆయన తన తీర్పులో ఒకచోట పొందుపరచలేదు. వ్యాసం రాసే పద్ధతిలో - ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఉపన్యాస ధోరణిలో - ఇక్కడొకటీ, అక్కడొకటీ చెప్పారు. అయితే ఈ నాలుగింటిలో రెండు మాత్రమే ఎస్‌సి, ఎస్‌టిలకు వర్తిస్తాయి. ఆ ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం ఉందా లేదా అని చూడాలి, మొత్తం కేడర్‌లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా చూడాలి అనేవి రెండూ ప్రస్తుత రాజ్యాంగ వ్యాఖ్యానాల ప్రకారం అన్ని రిజర్వేషన్లకూ వర్తిస్తాయి. వెనుకబడి ఉన్నారని రుజువుచేసే

గణాంకయుత మైన సమాచారం ఉండాలి అనేదీ, క్రీమీలేయర్‌ను తొలగించాలి అనేదీ బిసిలకే తప్ప ఎస్‌సి, ఎస్‌టిలకు వర్తించవని ఇంతకంటే పెద్ద బెంచిలు తీర్పులు ఇచ్చి ఉన్నాయి. 'ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు' రిజర్వేషన్ ఇవ్వడాన్ని గురించి ఆర్టికల్ 16(4) చెప్తుంది. ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇచ్చే ముందు అది వెనుకబడిన వర్గమా కాదా అని పరిశీలించాలనీ, దానికోసం ప్రతి రాష్ట్రంలోనూ ఒక బిసి కమిషన్‌ను నెలకొల్పాలనీ, ఆ కమిషన్ ఈ విషయాన్ని పరిశోధించి నివేదిక ఇవ్వాలనీ మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు అనింది. అయితే ఇది ఎస్‌సి, ఎస్‌టిలు కాని కులాలకు మాత్రమే వర్తిస్తుంది. ఎందుకంటే ఎస్‌సి, ఎస్‌టిలను ఆర్టికల్ 16(4) పరిధిలోని వెనుకబడిన వర్గాలుగా రాజ్యాంగమే గుర్తించిందని ఒకసారి కాదు, అనేకసార్లు సుప్రీంకోర్టు ప్రకటించి ఉంది. వారి విషయంలో వెనుకబడి ఉన్నారని 'గణాంకయుతమైన సమాచారం' ప్రతిసారీ సేకరించి రుజువు చేయనవసరం లేదు. రాజ్యాంగం ప్రకారమే వారు వెనుకబడిన వర్గాలు. ఇతర కులాలకే అది అవసరం. (అందుకే అటువంటి కులాలను ఇతర వెనుకబడిన కులాలు (Other Backward classes) అంటారు.) క్రీమీలేయర్‌ను - అంటే ఇప్పటికే రిజర్వేషన్‌ల వల్ల ప్రయోజనం పొంది ఉన్న ఉపవర్గాన్ని గుర్తించి రిజర్వేషన్ల పరిధినుంచి తొలగించాలన్న సూత్రాన్ని ఆదేశించిన మండల్ కమిషన్ కేసులోనే 'ఇది బిసిలకే తప్ప ఎస్‌సి, ఎస్.టిలకు వర్తించదని స్పష్టం చేస్తున్నాం' అని సుప్రీంకోర్టు అనింది. అది తొమ్మిది మంది జడ్జీల తీర్పు. దానికి భిన్నంగా ఐదుగురు జడ్జీలు ప్రవచించడానికి వీలులేదు. అయినా తాను ఆ సాహసం చేస్తున్నానని కపాడియా అనలేదు. ఏం రాస్తున్నారో ఆలోచించకుండా రాసేశారంతే.

ఈ రెండు ప్రవచనాలూ గందరగోళానికి దారితీసినప్పటికీ అవి ఇంతకంటే పెద్ద బెంచీలు గతంలో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకం కాబట్టి వాటికి ఆచరణలో దుష్ఫలితమేమీ ఉండదు. కానీ మరొక నష్టకరమైన సూత్రీకరణ తీర్పులో ఉంది - దానినెవ్వరూ గమనించినట్టు లేదు.

ప్రమోషన్లలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చునని చెప్పే ఆర్టికల్ 16(4) చెల్లుబాటు అవుతుందనే అభిప్రాయానికి రావడానికి సుప్రీంకోర్టు ఇతర కారణాలతో బాటు ఒక విచిత్రమైన వాదనను ఆసరా చేసుకుంది. ఇది ఎవరైనా చేసిన వాదనో లేక జడ్జీల బుద్ధికే తోచిందో తెలీదు. 16(4) ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇయ్యవచ్చు. 16(4ఎ) ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వవచ్చు. అంటే ఉద్యోగాలలో వెనుకబడిన వర్గాలన్నిటికీ రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం ఉండగా, ప్రమోషన్ల దగ్గరికి వచ్చేసరికి అందులో మరీ వెనుకబడిన వారైన ఎస్‌సి, ఎస్‌టిలను వేరుచేసి వారికి మాత్రం రిజర్వేషన్లు ఇచ్చే అవకాశాన్ని కల్పించారు. ఇది హేతుబద్ధమైన ఉపవర్గీకరణే కదా అనింది సుప్రీంకోర్టు.

బిసిలకంటే ఎస్‌సిలు, ఎస్‌టిలు వెనుకబడిన వారు కాబట్టి వారిని వేరుచేసి వారికి మాత్రం ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడంలో తప్పేమీ లేదనింది. నిజానికి బిసిలకు ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడం న్యాయమా అన్న ప్రశ్న ఎవరూ లేవదీయలేదు. అసలు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించే అధికారం ఇచ్చే రాజ్యాంగ సవరణ చెల్లుతుందా అన్నదొక్కటే ఈ కేసులోని వివాదం. అది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగకరం కాదు కాబట్టి దానిలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు అనింది. అక్కడితో ఆగకుండా, మూడు వర్గాలకు రిజర్వేషన్ ఇచ్చే అధికారం ఉండగా, అందులో రెండు వర్గాలను మరీ వెనుకబడినవిగా గుర్తించి వేరుచేసి వారికి మాత్రం ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడం హేతుబద్ధమైన ఉపవర్గీకరణేననీ, అందులో తప్పేమీ లేదనీ అనడం ఎందుకు? రేపు బిసిలకు కూడా ఆయా ఉద్యోగ రంగాలలో తగిన ప్రాతినిధ్యం లేని సందర్భాలలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించవచ్చుననే సవరణ చేస్తే, వారికి ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే ఇవ్వడం వల్లనే 16(4) చెల్లుబాటవుతుందని సుప్రీంకోర్టు నాగరాజు కేసులో చెప్పింది కాబట్టి వారికి కూడా ఇస్తే చెల్లదని దబాయించడానికా? దీనిని 'ముందు జాగ్రత్తగా' చేసిన సూత్రీకరణగా అనుకోకూడదా?

ప్రభుత్వ రంగమే తగ్గిపోతూ ఉన్నప్పుడు, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలే తరిగిపోతున్నప్పుడు, ఈ చర్చ ఎందుకు అంటారేమో. అది సరైన అభ్యంతరం కాదు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ బలంగా ముందుకొస్తున్నది. విద్యాసంస్థల వరకు దీనికి సహితం ఒక రాజ్యాంగ సవరణ సుప్రీంకోర్టు నిర్వాకం వల్ల అవసరం అయింది. దాన్ని చేశారు కూడా. ఉద్యోగరంగంలో రిజర్వేషన్ల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తటపటాయిస్తున్నా రేపో మాపో కల్పించక తప్పదు. సుప్రీంకోర్టు అడ్డం పడితే దానికి కూడా రాజ్యాంగాన్ని సవరించక తప్పదు. ఈ రోజు ప్రభుత్వ రంగ రిజర్వేషన్ల గురించి జరుగుతున్న సంవాదం యావత్తు రేపు ప్రైవేటురంగ రిజర్వేషన్ల సమస్య మీద కూడా ప్రభావం వేస్తుంది. అందువల్ల ఈ చర్చ చాలా అవసరం. ఆ సంగతి ప్రజాతంత్ర శక్తులకు అర్థం కాకున్నా రిజర్వేషన్ వ్యతిరేకులకు స్పష్టంగా అవుతున్నది కాబట్టే వాళ్ళు దీనికి ఇవ్వవలసిన ప్రాధాన్యమంతా ఇస్తున్నారు.

*మానవహక్కుల వేదిక బులెటిన్ - 8*
*మే 2007*

# తిరిగి తిరిగొచ్చిన ముస్లిం రిజర్వేషన్లు ఈసారైనా నిలిచేనా?

ముస్లిం రిజర్వేషన్ల చట్టం మళ్లీ వచ్చింది. ఒకసారి జీవో రూపంలో వచ్చింది. రెండవసారి చట్టం రూపంలో వచ్చింది. ఇప్పుడు మళ్ళీ చట్టం రూపంలో వచ్చింది.

అప్పుడయినా ఇప్పుడయినా కొంచెం జాగ్రత్త తీసుకుని ఆదేశం జారీ చేస్తే, న్యాయస్థానాల సంకుచితత్వం తప్ప వేరే ఏ అవరోధమూ ఉండేది కాదు. మొదటిసారి బిసి కమిషన్ ద్వారా నివేదిక పొందకుండ ఆదేశం జారీ చేసారు. రెండవసారి బిసి కమిషన్ సమగ్రమైన పరిశీలన జరిపేంత వరకు ఆగకుండ తొందరపెట్టి అసమగ్రమైన నివేదిక ఆధారంగా ఆదేశం జారీ చేసారు. ఈసారి ప్రభుత్వం వేరే సందర్భంలో నియమించిన కమిషన్ రిపోర్టును ఆధారం చేసుకుని నివేదిక ఇమ్మని బిసి కమిషన్‌ను మళ్లీ తొందర పెట్టారు. చట్టం కల్పించిన అధికారాన్ని చలాయిస్తున్న బిసి కమిషన్, నివేదిక ఎప్పుడిచ్చేదీ మేము నిర్ణయిస్తాం అనే బదులు రాజశేఖరరెడ్డి అడిగిందే తడవు ఇచ్చేసింది. ఈ అరువు నివేదిక మీద ఆధారపడ్డ నిర్ణయం చెల్లుతుందా? మరొక్కసారి కోర్టులు కొట్టేస్తే ఏం సాధించినట్టు?

కోర్టుకెక్కుతారనడంలో సందేహం లేదు. వ్యాజ్యం వేసే వాళ్ల పేర్లు ఏవయినా, గత రెండు పర్యాయాలూ హైకోర్టులో కేసు వేసింది విశ్వహిందూ పరిషత్ వారే. ఈసారీ వేయబోతారు. వాళ్ల మనసులో ఉన్నది కుళ్లే అయినా, సవాలు చేయడానికి సాంకేతిక కారణాలు

దొరుకుతున్నాయి. ప్రభుత్వ వ్యవహార శైలి వారికి ఆ అవకాశం అందజేస్తున్నది. గతంలో రెండుసార్లూ వారు విజయం సాధించారు. ఈసారి కూడ వాళ్లకు బలమైన కారణం దొరుకుతుంది. బిసి కమిషనే పరిశోధనే జరపాలని చట్టం అంటుండగా, వేరే కమిషన్ నివేదికను వారు స్వీకరించి ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చా అన్నది చట్టరీత్యా బలమైన అభ్యంతరం కాగలదు.

ముస్లింలు సామాజికంగా వెనుకబడి ఉన్నారన్న విషయంలో పెద్దగా అభిప్రాయ భేదం ఎవరూ వ్యక్తం చేయగా నేను వినలేదు. కానీ దాని గురించి ప్రభుత్వం ఏమీ చేయడానికి వీలులేదు. ఏం చేసినా అడ్డం పడతారు. ప్రభుత్వ వ్యవహార శైలి దానికి తగినట్టే ఉంది. ముస్లింలకు న్యాయం చేయడం కంటే రాజశేఖరరెడ్డి హామీ ఇచ్చిన గడువు లోగా చేసేసాడని ప్రచారం చేసుకోవడం ముఖ్యం. ఏదో వేదిక మీద రాజశేఖరరెడ్డి 'రాబోయే విద్యా సంవత్సరం లోగా అమలు చేస్తాం' అని ప్రకటిస్తాడు. అది ఆయన ఎట్లాగయినా నిలబెట్టుకోవాలి. కాబట్టి బిసి కమిషన్ ఆ లోపల తన నివేదిక ఇచ్చేయాలి. ఇచ్చేస్తుంది. వెనువెంటనే చట్టం జారీ అయిపోతుంది. వెంటనే కాషాయంబరధారులు కోర్టులో కేసు వేస్తారు. అధికారం ఇట్లాగేనా చలాయించేది అంటూ కోర్టు హూంకరిస్తుంది.

ఎవరి మేలు కోసం ఈ ప్రహసనం?

మొదటి నుండీ ఒక మాట చెప్తున్నాం. కోర్టులో వాదించాం, బిసి కమిషన్‌కూ చెప్పాం. సంప్రదాయక సాంకేతిక రంగంలో చిక్కుకుని తక్కువ ఆదాయం పొందుతున్న వర్గాన్ని విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల నిమిత్తం వెనుకబడిన వర్గంగా గుర్తించవచ్చునని సుప్రీంకోర్టు పలుమార్లు ప్రకటించి ఉంది. వట్టి పేదరికం వెనుకబాటుతనం కాదు. అభివృద్ధికి అవకాశం లేని ఆర్థిక రంగంలో చిక్కుకున్న పేదరికం వెనుకబాటుతనం కిందికి వస్తుంది. తక్కువ ఉత్పాదకతగల సంప్రదాయక ఆర్థిక రంగంలో స్వయం ఉపాధి మీద అత్యధికంగా బతికే ముస్లింలకు ఇది వర్తిస్తుంది. అయితే ఈ సంగతి గణాంకయుతంగా నిర్ధారించడం అవసరం. బిసి కమిషన్ ఆ పనిచేస్తే ఏ సమస్య ఉండదని సూచించాం. దానికోసం ప్రభుత్వ శాఖల మీదనే ఆధారపడకుండా సెస్ వంటి పరిశోధనా సంస్థలకు, విశ్వవిద్యాలయాల సామాజిక శాస్త్ర విభాగాలకూ వివిధ పరిశోధనాంశాలను పురమాయించడం ఉచితంగా ఉంటుందని బిసి కమిషన్ చైర్మన్ సుబ్రమణ్యంగారికి వివరించి చెప్పాం. ఆయన రెండు పర్యాయాలూ ఆ పని చేయకుండా ముఖ్యమంత్రి పురమాయింపు మేరకు ఉడికీ ఉడకని నివేదిక ఇచ్చేసారు.

ముస్లింలలో 15 'కులాలను' గుర్తించి వారికి బిసి 'ఇ'గా గుర్తింపు ఇవ్వాలని బిసి కమిషన్ సిఫారస్ చేసిందట. ముస్లింలో కులాలు లేవనీ, కులాలను గుర్తించడం ముస్లిం వ్యతిరేక చర్య అనీ కొన్ని ముస్లిం సంస్థలూ, కొందరు ముస్లిం పెద్దలూ

అభ్యంతరం తెలిపారు. ఇస్లాం కులాన్ని గుర్తించని మాట వాస్తవమే కానీ ముస్లింలలో కులాన్ని పోలిన వర్గాలు ఉన్న మాటా వాస్తవమే. వివిధ హిందూ కులవృత్తులవారు ఇస్లాం పుచ్చుకున్న తరువాత అదే వృత్తులలో కొనసాగడమే కాక తమ కులం గుర్తింపును కూడ తమతో తీసుకుపోయారు. ఈ ముస్లిం కులాల మధ్య గోడలు మరీ అంత దుర్భేద్యంగా ఉండకపోవచ్చు. పెళ్ళిళ్ళ మీద నిషేధం కచ్చితంగా అమలు కాకపోవచ్చు. అయినప్పటికీ ముస్లింలలో ఉపవర్గాలుగా అవి ఉనికిలో ఉన్న మాట వాస్తవం. తొలినాటి హిందూ కులాలతో సమానంగా వెనుకబడి ఉన్న మాటా వాస్తవం. కాబట్టి ముస్లిం మత పెద్దల అభ్యంతరం సహేతుకమైనది కాదు. అయితే ఈ నిర్ణయంలో వేరే సమస్యలున్నాయి.

ఈ 15 'కులాలు' కాక ప్రత్యేకమైన వర్గంగా ఒక పేరుగానీ, గుర్తింపుగానీ లేని వెనుకబడిన ముస్లింలు లేరా? హిందువులందరూ ఏదో ఒక కులం కలిగి ఉంటారు. ముస్లింలలోనూ చారిత్రక కారణాలవల్ల కులాన్ని పోలిన గుర్తింపు కొంత వరకు ఉన్నప్పటికీ ముస్లింలందరూ ఏదో ఒక 'కులం' కలిగిలేరు. లేని వాళ్ళందరూ అభివృద్ధి చెంది పోయినవారూ కారు. వాళ్ళ సంగతేమిటి?

ఈ 15 'కులాల' జనాభా ఎంత? ముస్లిం జనాభాలో వారి శాతం ఎంత? ఈ విషయాలు బిసి కమిషన్‌కూ తెలీదు. రాష్ట్ర ప్రభుత్వానికీ తెలీదు. వీళ్ళంతా కలిసి ముస్లిం జనాభాలో 85 శాతం ఉంటారని మంత్రి షబ్బీర్ అలీ అనగా విన్నాం. అది ఆయన విశ్వాసమే తప్ప ఆయన దగ్గరా సమాచారం లేదు. ఒకవేళ వీరందరి జనాభా కలిపి ముస్లింలలో 50 శాతమే అయితే, వీరికి 4 శాతం రిజర్వేషన్ ఇచ్చేస్తే తక్కిన 50 శాతంలోని (ప్రత్యేకమైన గుర్తింపు ఏదీ లేని) వెనుకబడిన వర్గానికి ఏమీ ఇవ్వడం సాధ్యపడదు కదా?

పైగా, వీరి జనాభా ఎంతో తెలియకుంటే 4 శాతం రిజర్వేషన్ ఎట్లా ఇచ్చావని హైకోర్టు ప్రశ్నిస్తే ప్రభుత్వం ఏం జవాబు చెప్తుంది? రిజర్వేషన్ జనాభా నిష్పత్తి ప్రకారమే ఉండనక్కరలేదు గానీ జనాభా నిష్పత్తితో నిమిత్తం లేకుండా ఇవ్వడం తగదు. ఆ నిష్పత్తి ఎంతో అసలే తెలియకుండ 4 శాతం రిజర్వేషన్ ఎట్లా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించదా?

త్వరలో మొదలు కాబోయే విద్యా సంవత్సరం కౌన్సిలింగ్‌లో ఈ ఆర్డినెన్స్‌ను అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పం. అయితే ముస్లింలెవ్వరి దగ్గరా తమ 'కులాన్ని' సూచించే సర్టిఫికెట్‌లు లేవు. వాళ్లిప్పుడు తాసిల్దార్లకు అర్జీలు పెట్టుకోవాలట. తాసీల్దార్లు ఎంక్వైరీ జరపాలి, సర్టిఫికెట్‌లు ఇవ్వాలి. త్వరపడి ఇచ్చేస్తే పొరపాట్లు జరగగలవు. అనర్హులు రిజర్వేషన్ పొందగలరు. ఆచరణాత్మకమైన ఈ సమస్య కూడా హైకోర్టులో చర్చకు రాగలదు. దానికి ప్రభుత్వం ఏం జవాబు చెప్తుంది?

ప్రభుత్వానికి బలహీన వర్గాలకు మేలు చేసే బాధ్యత, అధికారము ఉన్నప్పుడు, ముస్లింలు ఒక బలహీన వర్గమేననేది ఎవ్వరూ కాదనలేని వాస్తవం అయినప్పుడు, న్యాయస్థానాలకు ఇంత భయపడవలసిన అవసరం ఉందా అన్న ప్రశ్న రావచ్చు. ఆ అవసరం వాస్తవానికి ఉండకూడదు. రాజ్యాంగ కర్తల ఉద్దేశ్యమూ అదే. అయితే కొన్ని విషయాలలో న్యాయస్థానాలు రాజ్యాంగం తమకు ఇవ్వని అధికారాన్ని తమ తీర్పుల ద్వారా కాలక్రమంలో తమకు దఖలు పరచుకున్నాయి. పర్యావరణం, అడవుల వినియోగం రెండు ప్రముఖ ఉదాహరణలు. రిజర్వేషన్లు మరొకటి. రాజ్యాంగ కర్తల ఉద్దేశ్యం ఏదయినప్పటికీ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు నచ్చకపోతే ప్రభుత్వాలు రిజర్వేషన్లు ఇవ్వలేవు. ఒక సమస్య పరిష్కారానికి పాలనా విధానాన్ని రూపొందించేముందు దానికి సంబంధించిన సమాచారం ప్రభుత్వం వద్ద ఉండాలనీ ఆ సమాచారాన్ని హేతుబద్ధంగా వివేచించాలనీ మాత్రమే రాజ్యాంగ పాలనా సిద్ధాంతం చెప్తుంది. రిజర్వేషన్ల కాడికొచ్చేసరికి సమస్య గురించి సమగ్ర శాస్త్రీయ విశ్లేషణ చేయనిదే పాలనా చర్యలు చేబట్టడానికి వీలు లేదని న్యాయస్థానాలు ఇప్పుడు అంటున్నాయి. అన్ని పాలనా రంగాలకూ ఈ ప్రమాణాన్ని వర్తింపజేసేటట్టయితే పాలన అసాధ్యం అవుతుందని వారికి తోస్తున్నట్టు లేదు. అంతేకాదు.... ఏ సమస్యకైనా ప్రభుత్వం ప్రతిపాదించే పరిష్కారం స్థూలంగా చూసినప్పుడు హేతుబద్ధమైనదేనా అన్న పరిశీలన మాత్రమే న్యాయస్థానాల పరిధిలోని విషయం కాగా, రిజర్వేషన్ల కాడికొచ్చేసరికి ప్రభుత్వం ప్రతిపాదించే పరిష్కారం సమస్యకు ఎంతవరకు తగినదని తాము బేరీజు వేస్తామని న్యాయస్థానాలు అంటున్నాయి. ఒక దశాబ్ద కాలంగా న్యాయస్థానాల వైఖరి ఈ దిశగా మెట్టు మెట్టు సాగుతున్నది. మొన్న మన రాష్ట్ర హైకోర్టు ముస్లిం రిజర్వేషన్ చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు దీనికి పరాకాష్ట.

అన్ని రకాలుగా అవాంఛనీయమైన ఈ పరిణామాన్ని ప్రశ్నించడానికి పార్లమెంటు స్పీకర్ సోంనాథ్ ఛటర్జీ ఒక్కడే చిన్న ప్రయత్నం చేసాడు. అయితే అది ఎక్కువ దూరం పోలేదు. దీని ఫలితంగా రిజర్వేషన్ హక్కు పొందవలసిన ప్రజలు రాజశేఖరరెడ్డి వంటి నాయకుల అవకాశవాదానికీ న్యాయస్థానాల మూర్ఖత్వానికీ మధ్య చిక్కుకుని చేయిజారి పోతున్న ఫలాలు ఇదిగో దక్కాయి అదిగో దక్కాయి అని తమకు తాము ఆశ చూపుకుంటూ బతకవలసిందే కాబోలు.

*ప్రజాతంత్ర*
*8 జులై 2007*

# ఈ తీర్పుతోనూ సమస్యలున్నాయి

ఒబిసి రిజర్వేషన్ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించిన సమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరిజిత్ పసాయత్ వ్యక్తం చేసిన వ్యతిరేక అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తుది తీర్పు సంతోషం కలిగించడం సహజం. అందువల్ల వెంటనే అందరూ దానిని ఆహ్వానించారు. కాంగ్రెస్ వారు భుజాలు చరుచుకున్నారు కూడ. అగ్రహారాలుగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసిల ప్రవేశానికి మార్గం సుగమం చేసిన మేరకు ఈ తీర్పు హర్షణీయమేగాని, ఇప్పటికి పత్రికలలో వచ్చిన వ్యాఖ్యలను బట్టి చూసినా పదిహేనేళ్లుగా రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాలు వ్యక్తం చేస్తున్న వ్యతిరేక వైఖరినే ఈ తీర్పు ఇంకొంచెం ముందుకు తీసుకుపోయిందన్న సందేహం రాకమానదు. ఒబిసిల కిచ్చే రిజర్వేషన్ నుండి ఆయా కులాలలోని ఉన్నత వర్గాన్ని (క్రీమీలేయర్) మినహాయించా లన్న సూత్రీకరణ ఇప్పటిదాకా ఉద్యోగ రిజర్వేషన్లకే పరిమితం అయి ఉండింది. దానినిప్పుడు విద్యా వ్యవస్థలో సీట్లకూ వర్తింపజేశారు. ఆ ఉన్నత వర్గాన్ని గుర్తించడానికి ఉపయోగించవలసిన ప్రమాణాలను కూడ తామే శాసనకర్తలయినట్లు ప్రకటించారు. ఇంకా ఏమేం చెప్పారో తీర్పు పూర్తి ప్రతిని చూస్తే తప్ప చెప్పలేం.

రాజ్యాంగం రాకపూర్వం నుండి కూడ మన దేశంలో రిజర్వేషన్లు అమలయ్యాయి. దక్షిణభారత రాష్ట్రాలలోనూ మహారాష్ట్ర లోనూ వచ్చిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాల ప్రభావం వల్ల విద్యా ఉద్యోగ రంగాలలోనూ ప్రాతినిధ్య వ్యవస్థలలోనూ బ్రాహ్మణేతర కులాల ప్రవేశానికి మార్గం ఏర్పడింది. రాజ్యాంగం అమలులోకి

వచ్చిన తరువాత ఇది నిజానికి మరింత సరళతరం అయి ఉండాలి. రాజ్యాంగకర్తల ఉద్దేశ్యం అదే. అయితే న్యాయస్థానాలు తమ వ్యతిరేక వైఖరితో ఆ అవకాశాన్ని కుదించి వేశాయి. 1976దాకా రిజర్వేషన్లు సమాన అవకాశాలకు విరుద్ధం అంటూ జడ్జీలు సూత్రీకరించారు. 1976లో మొట్టమొదటిసారి రిజర్వేషన్లు సమాన అవకాశాలకు విరుద్ధం కాదనీ సమాన అవకాశాలకు సాధనం అనీ సుప్రీంకోర్టు గుర్తించింది. మామూలు మనుషులకిది సులభం గానే అర్థం అవుతుంది గానీ న్యాయమూర్తులకు అర్థం కావడానికి పాతికేళ్లు పట్టింది.

అప్పటినుండి రిజర్వేషన్ల విషయంలో కొంత అనుకూల వైఖరి కోర్టు తీర్పులలో కనిపిస్తుంది. 1992లో తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకటించిన 'మండల్ కమిషన్' కేసు ఈ అనుకూల వైఖరిని ఒక వైపు క్రోడీకరించి ఆమోదముద్ర వేస్తూ ఆ తరువాతి వ్యతిరేక పరిణామాలకు బీజం అయిన రెండు సూత్రీకరణలను కూడ చేసింది. అన్ని ఒబిసి కులాలలోనూ 'క్రీమీలేయర్' అని పిలవ బడే ఉన్నత వర్గాన్ని రిజర్వేషన్ల పరిధినుండి తొలగించాలన్నది ఒక సూత్రీకరణ. ఒబిసి కులాలను గుర్తించడానికి బిసి కమిషన్‌ను నియమించి బహిరంగ విచారణను చేపట్టా లన్నది రెండవది.

అప్పటినుండి గడిచిన పదిహేను సంవత్సరాలుగా మళ్లీ వ్యతిరేకవైఖరి గల తీర్పులే వస్తున్నాయి. ఈ వ్యతిరేక వైఖరిని సమర్థించుకోవడానికి రిజర్వేషన్ల వల్ల ఆయా కులాలలోని ధనవంతులే బాగుపడుతున్నారని వ్యాఖ్యానించడం వింటున్నాం. ఈ వ్యాఖ్య న్యాయమూర్తుల నుండి వింటున్నాం, సామాజిక వ్యాఖ్యాతల నుండి కూడ వింటున్నాం. నాకు తెలిసి ఈ విషయంలో ఎవరూ అధ్యయనం చేపట్టలేదు. రిజర్వేషన్లు ఆయా కులాలలో ఎంత మందికి అందాయన్న సమగ్రమైన పరిశోధన ఏదీ లేదు. న్యాయస్థానాల తీర్పులు అటువంటి ఏ పరిశోధననూ ఉటంకించలేదు. మరి ఏ సమాచారం లేకుండా ఈ నిర్ణయానికి ఎట్లా వచ్చారు? ప్రభుత్వం ఏదైనా నిర్ణయం చేస్తే 'నీ దగ్గర ఏం సమాచారం ఉంది? ఎప్పుడు సేకరించారు? ఎంత శాస్త్రీయంగా సేకరించావు?' అని న్యాయస్థానాలు ప్రశ్నిస్తుంటాయి. ఆ ప్రశ్నలు న్యాయస్థానాలను అడగకూడదా? తమ దగ్గర ఏం సమాచారం ఉందని న్యాయమూర్తులు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు? ఏ సమాచారం ఆధారంగా ప్రతీ ఒబిసి కులంలోనూ ఒక ఉన్నత వర్గమే రిజర్వేషన్లు తీసుకుంటున్నదన్న నిర్ణయానికొచ్చి వారిని తొలగించాలని పట్టుబడు తున్నారు. ఒబిసిలలోఎస్‌సి, ఎస్‌టిలకు దగ్గరగా ఉన్న కులాలూ ఉన్నాయి. మన దగ్గర దొమ్మరి కులాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. దొమ్మరులలోనూ క్రీమీలేయర్‌ను తొలగించవలసిందేనా? నాకు తెలిసి ఆ కులంలో ఒక ఎమ్మెల్యేగానీ ఒక ఐఎఎస్ అధికారి గానీ ఒక జడ్జీ గానీ లేరు. రేపెవరైనా కష్టపడి ఆ హోదాను చేరుకుంటే వారి పిల్లలను వెంటనే రిజర్వేషన్లకు అనర్హులు చేయవలసిందేనా? చాలా ఒబిసి కులాలలో

'క్రీమీలేయర్'ను తొలగించినట్టయితే రిజర్వేషన్ కోటా సహితం నిండకపోవచ్చు. ప్రస్తుత విషయానికి వస్తే ఐఐటి, ఐఐఎం వంటి సంస్థలలో సీట్లు అందుకోవాలంటే కొంత ఆర్థిక స్తోమత, విద్య విషయంలో అనుకూలమైన కుటుంబ వాతావరణం అవసరం. 'క్రీమీలేయర్'ను తొలగించి వేస్తే 27 శాతంలో సగం కూడా నిండకపోవచ్చు. ఉద్యోగాలయితే ఖాళీగా ఉంచి మరుసటి సంవత్సరం మళ్లీ ప్రయత్నించవచ్చును గానీ విద్యా సంస్థలలో సీట్లను ఖాళీ ఉంచడానికి వీలులేదు. ఓపెన్ కాంపిటీషన్‌కు బదలాయించవలసిందే. ఇంతా చేసి ఉన్నత విద్యా సంస్థలలో ఈ తీర్పు చలవ వల్ల ఏ మార్పయినా చూడబోతామా?

రిజర్వేషన్ల లక్ష్యం సామాజిక వర్గాల మధ్య సమానత సాధించడమే తప్ప సామాజిక వర్గాల లోపల సమానత సాధించడం కాదు. దానికి కావలసిన చర్యలు వేరే. ఓపెన్ కాంపిటీషన్‌లోనూ ఇప్పటికే బాగుపడిన వారి పిల్లలే మళ్లీ మళ్లీ ఎంపిక అవుతుంటారు. అదెందుకు ఎవరికీ ఆందోళన కలిగించదు? సామాజిక వర్గాలను, ప్రత్యేకించి కులాలను, నిచ్చెన మెట్ల మీద నిలబెట్టి హెచ్చుతగ్గులు నిర్దేశించిన సామాజిక వ్యవస్థను సంస్కరించి అన్ని కులాలనూ ఒకే సరసన నిలబెట్టడం రిజర్వేషన్ల లక్ష్యం. ఒబిసిలలో ఏదైనా ఒక కులం రిజర్వేషన్ల అవసరం లేకుండ ఓపెన్ కాంపిటీషన్‌లోనే అవకాశాలు పొందగలుగుతున్నదన్న అభిప్రాయం ఉన్నట్టయితే, అదెంతవరకు వాస్తవమో పరిశీలించి ఆ మేరకు ఆ కులానికిచ్చే రిజర్వేషన్ కోటా తగ్గించవచ్చు. అది న్యాయమైన చర్యే అవుతుంది. అయితే ఆ పని చేయాలంటే ముందు కులాలవారీ జనాభా లెక్కలు కావాలి. కులాలవారీగా ఓపెన్ కాంపిటీషన్‌లో ఏమేరకు నెగ్గుకొని రాగలుగుతున్నారన్న లెక్కలు కావాలి. ఇవేవీ లేవు.

ఇక వెనుకబడిన సామాజిక వర్గాల గుర్తింపు విషయానికొస్తే, ఒక వర్గం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని సూచించే ప్రాథమిక సమాచారం ప్రభుత్వం దగ్గరుంటే చాలు. ప్రభుత్వం వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. అంతే తప్ప వెనుకబాటుతనాన్ని శాస్త్రీయంగా రుజువుచేయాలన్నది రాజ్యాంగ నియమం కాదు. బహిరంగ విచారణ జరిపి రిజర్వేషన్ ఇవ్వడాన్ని వ్యతిరేకించే వాళ్ల అభిప్రాయాలు కూడా లెక్కలోకి తీసుకుని నిర్ణయం చేయాలన్నది అసలే కాదు. ఈ ఒక్క విషయంలోనే కాదు.... ఏ విషయంలోనైనా సమస్యను వాస్తవికంగా గుర్తించాలి, హేతుబద్ధంగా పరిష్కరించాలి అన్నదే పాలనా నియమం. దీనికి సంబంధించిన ప్రాథమిక సమాచారం ప్రభుత్వం దగ్గర ఉండి, ప్రాథమికంగా హేతుబద్ధంగా వ్యవహరించినంత కాలం న్యాయస్థానాల జోక్యానికి అవకాశం లేదు, ఉండకూడదు. ఆపైన ప్రభుత్వ చర్యల తప్పొప్పులు ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజలు చూసుకుంటారు.

రిజర్వేషన్ల విషయంలో ఈ ప్రజాస్వామ్య సూత్రాన్ని న్యాయస్థానాలు పక్కనపెట్టి, వెనుకబడిన వర్గాల గుర్తింపు బహిరంగ విచారణ ద్వారా జరగాలనీ, శాస్త్రీయ ప్రమాణాలను సంతృప్తి పరచాలనీ, ఆ ప్రమాణాలను అందుకున్నదీ లేనిదీ తాము

తేలుస్తామనీ అంటున్నాయి. 1992లో తొమ్మిది మంది జడ్జీలు ఇచ్చిన మండల్ కమిషన్ తీర్పు ఇంతదూరం పోలేదు గానీ దీనికి బీజం వేసింది. ఆ తరువాత వచ్చిన తీర్పులలో ఈ వైఖరి బలపడింది. మన రాష్ట్ర హైకోర్టు గతంలో ముస్లిం రిజర్వేషన్ల చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు దీనికి అతి సమీప ఉదాహరణ.

మొన్నటి సుప్రీంకోర్టు తీర్పులో ముగ్గురు జడ్జీలు విడిగా రాసిన అభిప్రాయంలో ఈ కోవకు చెందిన వ్యాఖ్యలూ సూత్రీకరణలూ చాలా ఉన్నట్టున్నాయి. న్యాయస్థానాలు మితిమీరి అధికారాన్ని చలాయిస్తున్న ఈ వైనాన్ని నిర్మొహమాటంగా చర్చించకపోతే ఒక్క రిజర్వేషన్ హక్కునేకాదు, మొత్తంగానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం పోనుపోను చాలా కష్టం కాగలదు.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*16 ఏప్రిల్ 2008*

# వర్గీకరణ అటకెక్కినట్టేనా?

చట్ట సభలలో స్త్రీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రతిపాదన గురించి ఒక అభిప్రాయం చాలా కాలం కిందే స్థిరపడిపోయింది. అది జరగవలసిందే నని అందరూ అంటారు గానీ ఎప్పటికీ జరగదు. ఇప్పుడు ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ అదే కోవకు చెందిన విషయమా అన్న సందేహం వస్తున్నది. అది న్యాయమైన డిమాండని అందరూ (అతికొద్ది మినహాయింపులతో) ఒప్పు కుంటారు. కానీ చేయరు. అంటే దానిలాగే ఇదీ జరగదనుకోవాలా?

దళితులలో అంతర్గతంగా అసమానతలున్నాయన్న విషయాన్ని ఎవరూ కాదనడం లేదు. సాంఘికమైన ఈ అసమానత విద్యా ఉద్యోగరంగాలలో దళితులకు ఉమ్మడిగా ఇచ్చిన రిజర్వేషన్లను అనుభవించే విషయంలోనూ అసమానతకు దారితీసిందని ఇప్పటికి రెండు న్యాయవిచారణ కమిషన్లు నిర్ధారించాయి. జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ మొదట నిర్ధారించింది. ఆ నివేదిక ఆధారంగా అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎబిసిడి వర్గీకరణ చట్టాన్ని గురించి హైకోర్టులోనూ సుప్రీంకోర్టు లోనూ జరిగిన వాదోపవాదాలలో ఈ నిర్ధారణ తప్పని ఎవ్వరూ వాదించే ప్రయత్నం చేయలేదు. అది నిజమే అయినప్పటికీ ప్రభుత్వం వర్గీకరణ చేయవచ్చునా అన్నదే న్యాయస్థానాలలో జరిగిన వాదన. సుప్రీంకోర్టయితే 'జస్టిస్ రాజు కమిషన్ నివేదికలోని నిజానిజాల జోలికి మేము పోవడం లేదు' అని ప్రకటించి మరీ రాష్ట్ర ప్రభుత్వ చట్టాన్ని కొట్టేసింది. దళితులలో అంతర్గత అసమానత ఉంటే

ఉండవచ్చును గానీ దాని గురించి ఏమీ చేయడానికి వీలులేదని అయిదుగురు సుప్రీంకోర్టు జడ్జీలు తేల్చారు.

ఈ తీర్పు రాజ్యాంగానికి మచ్చ. అసమానతనూ అన్యాయాన్నీ గుర్తించిన తరువాత ఏమీ చేయడానికి వీలులేదనీ, చేస్తే రాజ్యాంగం ఒప్పుకోదనీ అనడం భారత రాజ్యాంగం మీద అన్యాయమైన నింద. అసమానతలను అధిగమించడానికి సామాజిక ఆర్థిక అవరోధాలు అనేకం ఉన్నాయనేది వాస్తవం. వాటినన్నింటినీ అధిగమించడానికి కావలసిన రాజకీయ సాధనాలు రాజ్యాంగం ఇవ్వలేదంటేనూ వాస్తవమే. కానీ రాజకీయ సంకల్పం అంటూ ఏర్పడిన తరువాత కూడ రాజ్యాంగం అడ్డం అనేది అర్థరహితమైన వ్యాఖ్య. సుప్రీంకోర్టే చేయవచ్చును గాక, అది అర్థరహితమైన వ్యాఖ్యే. ఒక్క జాతుల స్వయం నిర్ణయాధికారం మాత్రమే దీనికి మినహాయింపు. ఒక్క జాతి విషయంలోనే వారి స్వాతంత్ర్య కాంక్ష న్యాయమైనదని అన్ని రాజకీయ శక్తులూ అంగీకరించినా కూడ రాజ్యాంగం ఒప్పుకోదు. దీనికి వేరే మినహాయింపులు లేవు.

ఏమైతేనేం, తప్పో ఒప్పో సుప్రీంకోర్టు చెప్పిన తరువాత రాజ్యాంగాన్ని సవరించడం తప్ప వేరే ఏ మార్గం లేదు కాబట్టి దేశ పాలకులు నిజంగానే దళితులందరికీ సమాన న్యాయం చేయదలచుకుంటే రాజ్యాంగాన్ని సవరించవలసింది. ఏమని సవరించాలో ఎవరయినా చెప్పగలరు. దానికొక న్యాయవిచారణ కమిషన్ అక్కరలేదు. 'ఎస్‌సిలకు గానీ ఎస్‌టిలకు గానీ ఇచ్చిన రిజర్వేషన్లు లేక ప్రత్యేక సదుపాయాలు, వారిలోని ఉపకులాల మధ్య సమన్యాయం సాధించడానికి హేతుబద్ధంగా పంపిణీ చేసే అధికారం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఉంది' అన్న వాక్యాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో మూడవ క్లాజుగా చేరిస్తే సరిపోతుంది.

ఈ సలహా ఇవ్వడానికి న్యాయవిచారణ కమిషన్ ఆవశ్యకత లేకపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ మార్గాన్నే ఎంచుకుంది. సుప్రీంకోర్టు తీర్పుతో కాగల కార్యం గంధర్వులు తీర్చారని ఊపిరి పీల్చుకున్నారేమో, ఎం.ఆర్.పి.ఎస్ ఆందోళన పెంచేసరికి ఏదో ఒకటి చేసినట్టు కనబడాలని భావించి ఈ పని చేశారు. జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ ఈ విధంగా పుట్టింది. నిజానికి ఎవరూ గమనించినట్టు లేదు గానీ, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చిన రిజర్వేషన్‌ను వారిలో అందరూ సమానంగా అందుకున్నారా అని చూడడానికి ఒక కమిషన్ వేయడం సహితం రాజ్యాంగ విరుద్ధం అన్న వ్యాఖ్య సుప్రీంకోర్టు తీర్పులో ఉంది. జస్టిస్ ఉషా మెహ్రా సహితం - ఆ తీర్పును క్షుణ్ణంగానే చదివినప్పటికీ - ఈ వ్యాఖ్యను గమనించినట్టు లేరు. రామచంద్రరాజు కమిషన్ నివేదిక చేసిన నిజ నిర్ధారణను ఎవరూ కాదనలేదు కాబట్టి ఆమె కొత్తగా నిజనిర్ధారణ చేయవలసి ఉండలేదు గానీ మళ్లీ గణాంకాలను వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రాబట్టి లెక్కలు తీశారు. అదే

నిర్ధారణకు మళ్లీ వచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు కారణంగా ఏర్పడిన సమస్యను అధిగమించడానికి రాజ్యాంగ సవరణను సూచించారు. అయితే వారు చేసిన సూచన అంత వాంఛనీయం కాదు. రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి పార్లమెంటుకు పంపినట్టయితే పార్లమెంటు వర్గీకరణ చేపట్టవచ్చునని ఆర్టికల్ 341 కి క్లాజు 3 చేర్చాలని ఉషామెహ్రా కమిషన్ సూచన.

'ఏకగ్రీవంగా' ఎందుకుండాలి? ఏ ఒక్కరైనా కాకుండ చేసే అవకాశం ఎందుకియ్యాలి? అసెంబ్లీ నిర్ణయించి పార్లమెంటుకెందుకు పంపించాలి? తానే ఎందుకు చేయకూడదు? ఒక సామాజికవర్గం వెనుకబడి ఉందని గుర్తించిన తరువాత వారికి రిజర్వేషన్లు గానీ, వేరే ఏదయినా రూపంలో ప్రత్యేక అవకాశాలు లేక హక్కులు గానీ కల్పించడానికి పార్లమెంటుకు, అసెంబ్లీకే కాదు, స్థానిక సంస్థలకు సహితం అధికారం ఉందనీ, దానికి చట్టం చేయనక్కరలేదనీ, ఆదేశం జారీ చేసినా చాలుననీ రాజ్యాంగం రాసిన నాటి నుంచి న్యాయస్థానాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇచ్చిన రిజర్వేషన్ న్యాయ బద్ధంగా పంచడానికి అంతకంటె క్లిష్టమైన పద్ధతి ఎందుకు పాటించాలి?

అసంతృప్తికరమైన ఉషామెహ్రా కమిషన్ సూచన సహితం అమలయ్యే దాఖలాలు లేవు. 'తేనెతుట్టెను కదిలించవద్దు' అని జాతీయ ఎస్‌సి కమిషన్ అనిందని వార్తలొచ్చాయి. ఏమీ చేయకుండ ఉండడానికి ఇది ప్రభుత్వానికొక చక్కని బహానా కాగలదు. ఎస్‌సిలకు సంబంధించిన విధానపరమైన విషయాలలో ప్రభుత్వం ఎస్‌సి కమిషన్‌ను తప్పనిసరిగా సంప్రదించాలని రాజ్యాంగం చెబుతుంది. సంప్రదింపు అంటే సమ్మతి కాదని వాదించవచ్చును గానీ ఈ సాకు చాలు ప్రభుత్వం చాటు చేసుకోవడానికి. వాస్తవమేమిటంటే ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే కాదు, అన్ని రాష్ట్రాలలోనూ ఎస్‌సిలలో, ఎస్‌టిలలో సాంఘిక, చారిత్రక కారణాల వల్ల కొన్ని కులాలు, తెగలు కొంచెం ముందున్నాయి. చట్టాలు ఇచ్చిన అవకాశాలను వారే ఎక్కువగా పొందగలుగుతున్నారు. దీనిని చారిత్రకంగా, సామాజికంగా అర్థం చేసుకున్నట్టయితే ఇందులో కుట్రల కోసం, కుతంత్రాల కోసం వెతకనక్కరలేదు. ఎటొచ్చీ ఈ అసమానతను సవరించే ప్రయత్నాన్ని అడ్డుకునే కొద్దీ దానివల్ల నష్టపోయినవారి కళ్లకు కుట్రలు, స్వార్థమే కనిపిస్తాయి. అది అవాంఛనీయమైన విద్వేష వాతావరణానికి దారితీస్తుంది. అయితే అన్ని రాజకీయ పార్టీలలోనూ ఆయా రాష్ట్రాల దళిత, ఆదివాసీ కులాలు, తెగలలో కొంచెం ముందున్న వారే ఆ వర్గాల నాయకులుగా, ప్రతినిధులుగా ఉన్నారు. పాలనా యంత్రాంగంలోని నిర్ణయాత్మకమైన స్థానాలలో దళితులు, ఆదివాసులు ఉన్నప్పుడు కూడా వారే ఉన్నారు. అందువల్ల రాజకీయ వ్యవస్థ కళ్ళకు, పాలనా యంత్రాంగం కళ్ళకు ఈ అసమానతను సవరించే ప్రయత్నం 'తేనెతుట్టెను కదిలించడం'గా కనిపించడం సహజం. కానీ అది ప్రామాణికం కావడానికి వీలులేదు.

ఇది కేవలం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సమస్య అయినట్టు, అందులోనూ మాదిగ కులస్తుల సమస్య మాత్రమే అయినట్టు ఎంఆర్‌పిఎస్ మాత్రమే ఆందోళన చేసే పరిస్థితి ఉండడం దురదృష్టకరం. ప్రత్యేకించి మన రాష్ట్రంలోని అడవి ప్రాంత ఆదివాసులలో ఎస్‌టి రిజర్వేషన్ ఫలితాలు అధికంగా మైదాన ప్రాంతంలో ఉనికి ఉన్న తెగలే తీసుకుంటుండం పట్ల చాలా అసంతృప్తి ఉంది. అయినప్పటికీ సుప్రీంకోర్టు తీర్పు ఎస్‌సిలతో సమానంగా ఎస్‌టిలకూ వర్తిస్తుందని తెలియకనో, లేకపోతే 'వాళ్లకొచ్చినప్పుడు మాకూ వస్తుంది లెమ్మ'న్న ఉదాసీన వైఖరివల్లనో ఆదివాసీ సంఘాలు చోద్యం చూస్తూ కూర్చున్నాయి.

అణగారిన వర్గాలలోని అంతర్గత వైరుధ్యం దీర్ఘకాలం నానుతూ ఉండడం వారి పురోగమనానికీ, సమాజ పురోగమనానికీ నష్టకరం అనేది అందరూ గుర్తిస్తున్న సత్యమే.  ఈ విషయంలో ప్రధాన బాధ్యత సాపేక్షంగా ఎక్కువ ప్రయోజనం పొందిన వారిపైననే ఉంటుంది. దురదృష్టవశాత్తు మాల కులస్తులలో న్యాయబద్ధంగా ఆలోచించే వాళ్లు చాలామంది ఉన్నప్పటికీ సమన్యాయాన్ని ఎప్పటికీ జరగనివ్వం అనే వారివే పెద్ద గొంతులయ్యాయి. అనంతంగా రగులుతూ ఉన్న ఈ సమస్య పరిష్కారానికి ఇదే ప్రధాన అవాంతరం అని గుర్తించకపోతే మహిళా రిజర్వేషన్ లాగ న్యాయబద్ధమైన వర్గీకరణ కూడ శాశ్వతంగా అటకెక్కి కూర్చుని మూడు ధర్నాలు ఆరు రాస్తారోకోల వార్షిక తంతుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*31 డిసెంబర్ 2008*

## సచార్ కమిటీ చెప్పిన సత్యం

# ముస్లింలు దళితులకే దగ్గర

చాలాకాలం పాటు చర్చలో ఉండబోయే నివేదిక ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతులపైన రాజిందర్ సచార్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ సమర్పించిన వివరమైన రిపోర్టు. ముస్లింల స్థితిగతుల గురించే కాక మన సామాజిక జీవితంలో విభిన్న సామాజిక వర్గాల సాపేక్ష స్థితి గురించి కూడా ఈ నివేదికలో చాలా సమాచారం ఉంది.

భారతదేశంలో ముస్లింల స్థితి సవర్ణ హిందూ కులాలకూ ఎస్‌సి, ఎస్‌టిలకూ మధ్యస్తంగా ఉందనీ, కొన్ని విషయాలలో ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా వెనుకబడి ఉన్నారనీ ఈ నివేదిక సారాంశం. ఎస్‌సి, ఎస్‌టిలను కలిపేయకుండా వేరువేరుగా లెక్కించి ఉంటే చాలా విషయాలలో ముస్లింల స్థితిగతులు ఎస్‌సిల స్థితిగతులకు సమానం అని తేలేది. అట్లాగే 'ఇతర హిందువులు' అనే శీర్షికన అగ్రకులాలనూ బిసిలనూ కలిపేయకుండా వేరుగా చూపించి ఉంటే సామాజిక విషయాలలో హిందూ అగ్రకులాల ఆధిపత్యం ఎంతగా ఉందో స్పష్టం అయి ఉండేది.

రిజర్వేషన్లు ఉండడం వల్ల ఎస్‌సి, ఎస్‌టిలు ఎక్కడ లాభపడ్డారో, రిజర్వేషన్లు లేక ముస్లింలు ఎక్కడ నష్టపోయారో ఈ నివేదిక స్పష్టంగా చూపిస్తుంది. 'సచార్ కమిటీ సిఫారసులను అమలు చేయాలి' అన్న నినాదం వింటున్నాం గానీ, సిఫారసులే ఈ నివేదికలోని అత్యంత బలహీనమైన అంశం. నివేదికలో స్పష్టంగా చూపించిన పరిస్థితిని సవరించాలంటే కమిటీ చేసిన వాటికంటే ఇంకా బలమైన సిఫారసులు కావాలి.

'భారతదేశంలోని ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యాసంబంధమైన స్థితిగతుల గురించి నిర్దుష్టమైన సమాచారం లేకపోవడం వల్ల ఆ వర్గం యొక్క సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని తొలగించడానికి అవసరమైన విధానాలు, పథకాలు రూపొందించడం కష్టంగా ఉంది' అని కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఒక ఉన్నతస్థాయి కమిటీని ఆ సమాచారం సేకరించి సమగ్రమైన నివేదిక ఇచ్చే నిమిత్తం 2005 మార్చి 9వ తేదీన నియమించింది. ఆ కమిటీ అధ్యక్షులు రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పియుసిఎల్ మాజీ జాతీయ అధ్యక్షుడు అయిన రాజిందర్ సచార్ కాగా సభ్యులు శ్రీ సయ్యద్ హమీద్, డా. టి.కె.ఊమెన్, శ్రీ ఎం.ఏ.బాసిత్, డా. రాకేశ్ బసంత్, డా. అఖ్తర్ మజీద్, డా. అబుసలే షరీఫ్‌లు. వీరిలో ఒక్క ఎం.ఏ బాసిత్ తప్ప అందరూ విద్యా రంగంలో ఉన్నత పదవులు నిర్వహిస్తున్న వారే. బాసిత్ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా విభాగం డైరెక్టర్.

వీరు అందుబాట్లో ఉన్న అన్ని మూలాల నుంచి సమాచారం సేకరించి నవంబర్ 2006 కల్లా నివేదికను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. ముస్లింల స్థితిగతుల తులనాత్మక పరిశీలన ఈ నివేదిక లక్ష్యాలలో ముఖ్యమైనది కాబట్టి ఇతర సామాజిక వర్గాలతో పోలిక కోసం ఎస్‌సి, ఎస్‌టిలను ఒక వర్గంగా, ముస్లింలను ఒక వర్గంగా, 'ఇతరులను' ఒక వర్గంగా తీసుకున్నారు. కొన్ని విషయాలలో 'ఇతరుల'లో హిందూ వెనుకబడిన కులాలను వేరు చేసి ఒక వర్గంగా చూపించారు. కొన్ని విషయాలలో 'ఇతర మైనారిటీల'ను (అంటే సిక్కు, బౌద్ధ, క్రైస్తవ, యూదు, పార్సీలను) వేరు చేసి ఒక వర్గంగా చూపించారు. అన్ని విషయాలలోనూ ఈ అయిదు వర్గాలనూ విడివిడిగా లెక్కించి ఉంటే బాగుండేది. అట్లా చేయకపోవడానికి సమాచార లభ్యతలోని అసమగ్రత ముఖ్యకారణం అనిపిస్తుంది. మంచికైనా చెడుకైనా దేశ రాజకీయ సామాజిక సంవాదం నిర్మొహమాటంగా కులాలు, మతాల ప్రాతిపదికన జరుగుతున్నప్పటికీ, పది సంవత్సరాల కొకసారి జరిగే జనాభా లెక్కలలో కులాల విషయం వచ్చేసరికి ఒక్క ఎస్‌సి, ఎస్‌టిలను మాత్రమే గుర్తించడం జరుగుతున్నది. అయితే నేషనల్ సాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) కులాన్ని ఒక సామాజిక వాస్తవికతగా గుర్తించడం వల్ల హిందూ కులాల స్థితిగతుల గురించి సమాచారం ఇప్పుడు కొంత లభ్యమవుతున్నది. సచార్ కమిటీ నివేదిక 2001 జనాభా లెక్కలపైనే కాక, ఎన్ఎస్ఎస్ఓ 61వ రౌండు (2004-2005) గణాంకాలపైన, పోలిక కోసం 55వ రౌండు (1999-2000) గణాంకాలపైన ప్రధానంగా ఆధారపడింది. ఇవికాక అవసరాన్ని బట్టి వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం సేకరించి ఉపయోగించుకున్నారు.

ముస్లింల పట్ల వ్యతిరేక భావాన్ని రెచ్చగొట్టడానికి వాడుకునే అనేక విషయాలను గణాంకాల ఆధారంగా విశ్లేషించి జవాబు చెప్పడం సచార్ కమిటీ నివేదిక చేసిన సేవలలో ఒకటి.

**జనాభా**

వీటిలో మొదటిది జనాభా. ముస్లింలు కుటుంబ నియంత్రణ పాటించరనీ, ఒక్కొక్క మగవాడూ నలుగురు స్త్రీలను పెళ్ళి చేసుకుంటాడనీ, అందువల్ల వారి జనాభా వేగంగా పెరిగి చివరికి భారతదేశంలో హిందువులు మైనారిటీ అయిపోయే ప్రమాదం ఉందనీ ఒక ప్రచారం సంఘ్ పరివార్ చాలాకాలంగా చేస్తూ ఉంది. ముస్లింల పట్ల ద్వేషం అత్యధికంగా రెచ్చగొట్టబడ్డ గుజరాత్‌లో 'మేము అయిదుగురం, మా వాళ్ళు ఇరవై నాలుగు' అన్న అసహ్యకరమైన నినాదం ముస్లింల గురించి నరేంద్రమోడి, ప్రవీణ్ తొగాడియా వంటివారు ప్రచారం చేయడం జరిగింది. (ప్రతీ ముస్లిం పురుషుడూ నలుగురు భార్యలను చేసుకుంటాడనీ, ఒక్కొక్క భార్య ఆరుగురిని కంటుందనీ దీని భావం. అన్ని సామాజిక వర్గాలలాగే ముస్లింలలో కూడా పురుషుల కంటే స్త్రీల సంఖ్య కొంచెం తక్కువనీ, కాబట్టి ఒక్కొక్కడూ నలుగురిని చేసుకోవడం సాధ్యం కాదనీ గుర్తించగల సాధారణ లోకజ్ఞానానికి సహితం ఈ ప్రచారం అతీతం.)

సచార్ కమిటీ జనాభా లెక్కలన్నిటినీ పరిశీలించింది. ప్రాంతాల వారీగా, మత వర్గాల వారీగా విశ్లేషించింది. భారతదేశ జనాభా పెరుగుదల రేటు క్రమంగా తగ్గుతున్న దనీ, అన్ని ప్రాంతాలలో అన్ని మతవర్గాలలో ఈ పోకడ కనిపిస్తున్నదనీ, అయితే ముస్లింలలో ఈ మార్పు కొంచెం ఆలస్యంగా మొదలయిందనీ నిర్ధారించింది. 1961లో దేశ జనాభాలో ముస్లింలు 10.7 శాతం ఉన్నారనీ, 2001లో ముస్లిం జనాభా 13.4 శాతం చేరుకుందనీ, అయితే అన్ని వర్గాలలాగే ముస్లింలలో కూడా పెరుగుదల రేటు తగ్గుతూ ఉందనీ, ప్రస్తుత పోకడలు ఇట్లాగే కొనసాగితే ముస్లింల జనాభా దేశ జనాభాలో 18 లేక 19 శాతం దగ్గర స్థిరపడుతుందనీ సవివరంగా చూపించింది. ఇకనైనా ముస్లింలు దేశంలో మెజారిటీ అయిపోబోతున్నారన్న ప్రచారం సంఘ్ పరివార్ ఆపుతుందేమో చూద్దాం.

మెజారిటీ అయిపోతారన్న ప్రచారం అవాస్తవమే అయినా, ముస్లింల నిష్పత్తి పెరుగుతున్న విషయం వాస్తవమే కదా అని సంఘ్ పరివార్ అనవచ్చు. కానీ దీనికి కారణం వారు ప్రచారం చేసే మత సంబంధమైన విషయాలు కావు.

దేశ జనాభా పెరుగుదల రేటులో ప్రాంతాల వారీగా చాలా తేడాలున్నాయి. దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాలలో అది వేగంగా పడిపోతున్నది. ముస్లింల జనాభా పెరుగుదల రేటు కూడా ఈ రాష్ట్రాలలోనే బాగా తగ్గిపోయింది. దక్షిణ భారత దేశంలోని ముస్లిం జనాభా పెరుగుదల రేటు ఉత్తర భారతదేశంలోని మొత్తం జనాభా పెరుగుదల రేటు కంటే తక్కువ. ఏ సామాజిక ఆర్థిక ప్రత్యేకతలైతే దక్షిణ భారతదేశంలో జనాభా నియంత్రణను వేగవంతం చేశాయో అవి దక్షిణ భారతదేశంలోని ముస్లింల

మీదా పని చేశాయి. అదే విధంగా ఏ కారణాలైతే ఉత్తర భారతదేశంలో జనాభా నియంత్రణ మందకొడిగా ఉండడానికి దోహదం చేశాయో ఆ కారణాలే అక్కడి ముస్లింలపైనా పని చేశాయి. మన దేశ జనాభాలోని ముస్లింలలో 22 శాతం ఉత్తర ప్రదేశ్‌లోనే నివసిస్తున్నారని దృష్టిలో ఉంచుకుంటే ముస్లిం జనాభా పెరుగుదల రేటు సగటు జనాభా పెరుగుదల రేటు కంటే ఆలస్యంగా, మందకొడిగా తగ్గడానికి మామూలుగా ప్రచారమయ్యే కారణాల కంటే ఉత్తరప్రదేశ్ వెనుకబాటుతనం ముఖ్య కారణమని చెప్పుకోవచ్చునేమో! ముస్లింలు పెద్ద సంఖ్యలో నివసించే జమ్మూకాశ్మీర్ జనాభా పెరుగుదల రేటు కంటే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్‌ల జనాభా పెరుగుదల రేటు ఎక్కువ. ముస్లింల జనాభా పెరుగుదల గురించి పనిగట్టుకుని దుష్ప్రచారం చేసే సంఘ్ పరివార్‌కు సామాజికంగా, రాజకీయంగా బలం ఉండేది ఈ రాష్ట్రాలలోనే కావడం వల్ల ఎవరు ఎవరిని నిందించాలో తెలియని పరిస్థితి ఉందను కోవాలి.

## స్త్రీల నిష్పత్తి ముస్లింలలో ఎక్కువ

*2001 జనాభా లెక్కల ప్రకారం భారత జనాభాలో 1000 మంది మగవాళ్ళకు గాను 933 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారన్న సమాచారం చాలా ఆందోళన కలిగించింది. 1961లో ఆ నిష్పత్తి 960 ఉండింది. ప్రకృతి సిద్ధంగా మగవాళ్ళే కొంచెం విరివిగా పుడతారు (105 మంది మగపిల్లలకు గాను 100 మంది ఆడపిల్లలు) గానీ మగవాళ్ళ ఆయుష్షు సగటున కొంచెం తక్కువ కాబట్టి ఎక్కువ సమాజాలలో స్త్రీలే మగవాళ్ళ కంటే ఎక్కువ ఉంటారు. దక్షిణ, తూర్పు ఆసియా దేశాలు దీనికి మినహాయింపు. ఆడపిల్లల పట్ల గర్భంలో ఉన్నప్పుడు మొదలుపెట్టి అమలయ్యే వివక్షే దీనికి కారణం.*

*అయితే ఈ విషయంలో ముస్లింల స్థితి చాలా మెరుగు. ముఖ్యంగా పిల్లలలో అమ్మాయిల సంఖ్య ముస్లింలలో బాగా ఎక్కువ. 2001 లెక్కల ప్రకారం 5 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలలో ప్రతి 1000 మంది మగపిల్లలకు గాను అమ్మాయిలు 928 కాగా ముస్లింలలో ఆ నిష్పత్తి 985. అంతేకాక శిశుమరణాల విషయంలో సాపేక్షంగా బాగా పేదలైన ముస్లింల స్థితే చాలా మెరుగ్గా ఉంది. దేశంలో పుట్టిన పిల్లలలో 1000కి 68 మంది 1 సంవత్సరం లోపల చనిపోతుండగా ముస్లింలలో ఆ సంఖ్య 55. 1000లో 95 మంది పిల్లలు 5 సంవత్సరాల లోపల చనిపోతుండగా ముస్లింలలో ఆ సంఖ్య 80. ఎంత పేదరికంలో ఉన్నా ముస్లింలే పిల్లలను, అందులో అమ్మాయిలను బాగా కాపాడుకుంటారని దీని భావం.*

కారణాలు ఏవైతేనేం, దేశం మొత్తం మీద తీసుకున్నప్పుడు జనాభా పెరుగుదల రేటు 1970 తరువాత తగ్గుముఖం పట్టగా, ముస్లిం ప్రజానీకంలో ఈ తగ్గుదల దశాబ్దం ఆలస్యంగా మొదలైంది. దేశంలోని కొన్ని ప్రాంతాలలోనూ ఆలస్యంగానే మొదలైంది. కానీ తగ్గుదల మొదలైన తరువాత వేగంగా జరుగుతున్నది. 1991-2001ల మధ్య హిందువుల జనాభా పెరుగుదల రేటు 2.8 పాయింట్లు పడిపోగా, ముస్లింల జనాభా పెరుగుదల రేటు 3.4 పాయింట్లు పడిపోయింది. వాసెక్టమీ లేక ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకునే విషయంలో సంసిద్ధత ముస్లింలలో తక్కువే అయినప్పటికీ మిగతా గర్భనిరోధక చర్యలపట్ల అనుకూలత ఇతర ప్రజా సమూహాల కంటే ముస్లింలలో తక్కువ లేదని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి అన్ని సామాజిక వర్గాల జనాభా పెరుగుదల రేటు ఒకటవుతుందనీ, అప్పటికి ముస్లింల జనాభా దేశ జనాభాలో 18 లేక 19 శాతం చేరి అక్కడితో ఆగిపోతుందనీ సచార్ కమిటీ అంచనా వేసింది. ఏ రాష్ట్రాలలోనైతే ముస్లిం జనాభా సాపేక్షంగా ఎక్కువ ఉన్నారో ఆ రాష్ట్రాలలో వైద్య, ఆరోగ్య సేవలు, స్త్రీలలో విద్యాభివృద్ధి, పేదరికం తగ్గుదల మొదలైన లక్ష్యాలపైన ఇతర రాష్ట్రాలతో సమానంగా దృష్టిపెట్టి ఉంటే ఇంతటి తేడా కూడా బహుశా ఉండేది కాదని సచార్ కమిటీ అంటుంది. ఎందుకంటే స్వచ్ఛందంగా జనాభాను అదుపు చేసుకోవడానికి స్త్రీలలో మెరుగైన విద్యావ్యాప్తి, పిల్లల ఆరోగ్యానికి భరోసా, కనీస జీవన ప్రమాణాల భద్రత ఎక్కువగా దోహదం చేస్తాయని అన్ని పరిశోధనలూ తెలుపుతున్నాయి.

## విద్య : స్కూలు దశ

విద్య అంటే అక్షరాస్యత మాత్రమే కాదు గానీ అక్షరాస్యత సులభంగా అర్థమయ్యే ప్రమాణం. 2001 జనాభా లెక్కల ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిలలో అక్షరాస్యత 52.2 శాతం, ముస్లింలలో 59.1 శాతం, ఇతరులలో 70.8 శాతం. మొదట్లో చెప్పినట్టు ఎస్‌సి, ఎస్‌టిల గణాంకాలు కలిపేయకుండా వేరుగా చూపించి ఉంటే ముస్లింలలో అక్షరాస్యత ఎస్‌సిలలో అక్షరాస్యతకు బాగా దగ్గర ఉన్న విషయం స్పష్టమయ్యేది.

అక్షరాస్యత తరువాత లెక్కించవలసింది స్కూలుకు పోతున్న పిల్లల నిష్పత్తి. దీనికి 1999-2000కు సంబంధించిన గణాంకాలనూ, 2004-2005కు సంబంధించిన గణాంకాలనూ సచార్ కమిటీ పరిశీలించింది. 1999-2000లో ముస్లిం పిల్లలలో స్కూలుకు పోయేవారి నిష్పత్తి హిందూ అగ్రకులాల కంటే, బిసిల కంటే బాగా తక్కువ ఉండింది గానీ ఎస్‌సి, ఎస్‌టిల కంటే మెరుగుగా ఉండింది. 2004-2005 నాటికి ఎస్‌సి, ఎస్‌టిలలో బడికిపోయే పిల్లల నిష్పత్తి ముస్లింలను దాటిపోయింది. ముస్లింలలో 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న పిల్లలలో 25 శాతం అసలు బడి ముఖమే చూడనివారు. ఎస్‌సి, ఎస్‌టిలతో సహా వేరే ఏ సామాజిక వర్గం స్థితీ ఇంత అధ్వాన్నంగా లేదు. ఇతర వెనుకబడిన వర్గాల చదువు పట్ల ప్రభుత్వం పెడుతున్న శ్రద్ధతో పోలిస్తే

ముస్లింల చదువుపట్ల పెడుతున్న శ్రద్ధ చాలా తక్కువ కావడం దీనికి ఒక ముఖ్య కారణం. ఒకవేళ ఏమైనా చేయాలని ప్రభుత్వానికి తోచినా 'ఓటు బ్యాంకు రాజకీయాలు' అంటూ గగ్గోలు పెట్టేవారు చాలామంది ఉండనే ఉన్నారు.

బడికి ఎందరు పోతున్నారన్న ప్రశ్న తరువాత బడికి పోయిన వారు సగటున ఎన్ని సంవత్సరాలు చదువుతున్నారన్న ప్రశ్న వేసుకోవాలి. అన్ని వర్గాల సగటు 4 సంవత్సరాలు కాగా (అంటే బడికిపోయే పిల్లలు సగటున 4వ తరగతితో చదువు ఆపేస్తారని అర్థం) ముస్లింలలో 3 సంవత్సరాల 4 నెలలే. ఇది ఎస్‌సి, ఎస్‌టిలతో సహా అన్ని సామాజిక వర్గాల కంటే తక్కువ.

అయితే జనాభా పెరుగుదలలాగే బడికిపోయే పిల్లల నిష్పత్తి, సగటు విద్యా కాలాల విషయంలో కూడా ప్రాంతాలవారీ తేడాలున్నాయి. దక్షిణ భారత రాష్ట్రాలు, గుజరాత్, మహారాష్ట్రలలో ముస్లింల స్థితి ఈ విషయంలో మెరుగుగానే ఉంది. మళ్ళీ ప్రధాన లోపం హిందీ రాష్ట్రాలలోనే.

5వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, 7వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, 10వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, ఇంటర్ పూర్తి చేసిన వారెంత మంది అన్న లెక్కలు తీస్తే, గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల స్థితి సరిగ్గా ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా ఉంది. ఎస్‌టిల కంటే ఎస్‌సిల స్థితి కొంత మెరుగ్గా ఉంటుంది. కాబట్టి ఎస్‌సి, ఎస్‌టిలను కలిపేయకుండా వేరువేరుగా ముస్లింలతో పోల్చినట్టయితే గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల విద్యాప్రమాణాలు ఎస్‌సిల కంటే అధ్వాన్నంగా ఉన్నాయని కనిపించి ఉండేది. పట్టణ ప్రాంతాలలో మాత్రం ముస్లింలలో విద్యా ప్రమాణాలు పైస్థాయికి పోయే కొద్దీ దేశ సగటులో సగానికంటే ఎక్కువ లేకపోయినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టిల కంటే మెరుగే.

గ్రామీణ ప్రాంతాల పిల్లలను పట్టణ ప్రాంతాల పిల్లలతో సమానం చేయగల ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించే లక్ష్యంతో జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పడ్డాయి. దేశంలో అవి 551 ఉన్నాయి. వాటిలో ఒకటిన్నర లక్షల మంది పిల్లలు చదువుకుంటున్నారు. అయితే ఈ స్కూళ్ళలో ముస్లిం విద్యార్థుల నిష్పత్తి 4 శాతం మాత్రమే. దేశ జనాభాలో ముస్లింలు 13.4 శాతం అని (పోనీ గ్రామీణ జనాభానే తీసుకుంటే గ్రామీణ భారతంలో ముస్లింలు 12 శాతం అని) దృష్టిలో పెట్టుకుంటే ఇది వారి జనాభా వాటాతో పోలిస్తే చాలా తక్కువ.

స్కూలులో చేరడమే కాదు, చదువు పూర్తి చేయడమూ ముఖ్యమే అని చెప్పుకున్నాం. స్కూలులో చేరిన ముస్లిం పిల్లలలో 44 శాతం 5వ తరగతి పూర్తి చేస్తున్నారు. ఎస్‌సిలలో ఇది 39 శాతం, ఎస్‌టిలలో (ఇక్కడ ఈ రెండు గణాంకాలు

వేరు వేరుగా చూపారు) 32 శాతం. అయితే 5వ తరగతి పాసైన వారిలో ఎంతమంది 7వ తరగతి పూర్తి చేస్తారు, 7వ తరగతి పాసైన వారిలో ఎంతమంది హైస్కూలు పూర్తి చేస్తారు అన్న లెక్కలలో ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టిలతో సమానం. (మొదటిది 65 శాతం, రెండవది 50 శాతం.) హైస్కూలు పాసైన వారిలో ఎంతమంది కాలేజీ చదువు పూర్తి చేస్తారన్న లెక్క తీసుకుంటే, ముస్లింలలో అది 26 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 23 శాతం. ఈ అన్ని విషయాలలోనూ 'ఇతరులు' - అంటే హిందూ సవర్ణకులాలు - సాపేక్షంగా బాగా మెరుగైన స్థితిలో ఉన్నారని వేరే చెప్పనవసరం లేదు. స్కూలులో చేరే వారిలో 5వ తరగతి పాసయ్యే వారిలో 7 పూర్తి చేసేవారు 75 శాతం, 7వ తరగతి పాసయ్యేవారిలో హైస్కూలు పూర్తి చేసేవారు 62 శాతం, హైస్కూలు పూర్తి చేసే వారిలో కాలేజీ పూర్తి చేసేవారు 34 శాతం ఉన్నారు. ఇందులో అగ్రకులాలను, బిసిలను వేరు చేస్తే - హిందూ అగ్రకులాలతో పోల్చినప్పుడు ముస్లింల స్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో ఇంకా స్పష్టం అవుతుంది.

## విద్య : కాలేజీ దశ

ఉద్యోగాలకు కాలేజీ డిగ్రీ, అందులోనూ ఏదైనా సాంకేతిక విద్యకు సంబంధించిన డిగ్రీ లేక డిప్లొమా చాలా ముఖ్యం. ఈ విషయంలో ముస్లిం ప్రజానీకం చాలా వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ నివేదిక తెలుపుతుంది. దేశ జనాభాలో 20 సంవత్సరాల వయసు పైబడిన వారిలో 3.8 కోట్ల మందికి ఏదైనా డిగ్రీ లేక డిప్లొమా ఉంది. ఇది ఆ వయసుగల జనాభాలో 6 శాతం. అందులో సాంకేతిక విద్యలో క్వాలిఫికేషన్ పొందినవారు వెయ్యిలో 70 మంది. ముస్లింలలో 20 సంవత్సరాల వయసు పైబడిన వారిలో డిగ్రీ లేక డిప్లొమా గలవారు వెయ్యిలో 10 మంది మాత్రమే. వారి స్థితి ఎస్‌సి, ఎస్‌టిల కంటే కొంచెం మెరుగే అయినా 'ఇతరుల'తో పోలిస్తే సగం కంటే తక్కువ.

ఉన్నత విద్య విషయంలో సచార్ కమిటీ బిసిల గణాంకాలు విడిగా సేకరించింది కాబట్టి బిసిల స్థితినీ, ముస్లింల స్థితినీ పోల్చవచ్చు. ఒక సామాజిక వర్గానికి ఉన్నంతలో న్యాయం జరుగుతున్నదని చెప్పాలంటే దేశ జనాభాలో వారి నిష్పత్తి ఎంత ఉందో డిగ్రీ లేక డిప్లొమా పొందిన విద్యావంతులలో వారి నిష్పత్తి అంత ఉండాలి. బిసిల విషయంలో డిగ్రీ లేక డిప్లొమా పొందిన వారి నిష్పత్తి దేశ జనాభాలోని బిసిల నిష్పత్తిలో 2/3వ వంతు ఉండగా, ముస్లింలలో ఇది 1/2 మాత్రమే. (ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఇవ్వడాన్ని కొన్ని బిసి సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి కాబట్టి వారి స్థితి వీరికంటే అన్యాయం అని గుర్తించడం అవసరం.) హిందూ అగ్రకులాల విషయానికొస్తే, జనాభాలో వారి వాటా కంటే డిగ్రీ లేక డిప్లొమా

గల వారిలో వారి వాటా రెండున్నర రెట్లను మించి ఉంది. కాగా ముస్లింల మేలుకోసం ప్రభుత్వం ఏం చేయజూసినా 'ఓటు బ్యాంకు రాజకీయాలు' అంటూ రోడ్డెక్కి అరిచేది ఎక్కువగా వీళ్ళే.

ఉద్యోగ అర్హతలలో సాంకేతిక విద్యకుండే ప్రాముఖ్యం తెలిసిందే. 2001 సెన్సెస్ ప్రకారం 20 సంవత్సరాలు పైబడిన దేశ జనాభాలో 1000లో 70 మందికి సాంకేతిక విద్యలో డిగ్రీ లేక డిప్లొమా ఉండగా, ముస్లింలలో 1000లో 10 మందికే ఉన్నాయన్న సమాచారాన్ని పైన ప్రస్తావించాము. 2004-2005 ఎన్ఎస్ఎస్ రౌండ్ సేకరించిన సమాచారాన్ని ఆధారం చేసుకుని ఈ విషయాన్ని సచార్ కమిటీ మరింత వివరంగా విశ్లేషించింది. వెనుకబడిన వర్గాలవారు డిగ్రీల విషయంలో పోటీపడలేకపోయినా డిప్లొమాల విషయంలో పడగలరన్న అభిప్రాయం ఉంటుంది. కాబట్టి సచార్ కమిటీ రెండింటి గణాంకాలనూ వేరువేరుగా విశ్లేషించింది. డిగ్రీల విషయం చూస్తే, అగ్రకులాలలో 20 సంవత్సరాలు పైబడిన వారిలో వెయ్యిలో 80 మందికి పైగా సాంకేతిక విద్యలో డిగ్రీలు కలిగి ఉండగా బిసిలలో 20 మంది, ఎస్సి ఎస్టిలలో 10 మంది, ముస్లింలలో 17 మంది కలిగి ఉన్నారు. డిప్లొమాల విషయమే చూసినా హిందూ అగ్రకులాలలో 20 సంవత్సరాల వయసు పైబడిన జనాభాలో వెయ్యిలో 40 మంది డిప్లొమాలు కలిగి ఉన్నారు. బిసిలలో 20 మంది, ఎస్సి ఎస్టిలలో 10 మంది, ముస్లింలలో 15 మంది డిప్లొమా పాసైన వారు ఉన్నారు.

రిజర్వేషన్ల రూపంలో గానీ, ఇతర రూపాలలో గానీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్ల హైందవ సమాజానికి చెందిన బిసిలు, ఎస్సి, ఎస్టిలు కాలక్రమంలో ఉన్నత విద్య విషయంలో తమ స్థితిని కొద్దిగా మెరుగు పరుచుకోగలుగుతుండగా చదువు విషయంలో ప్రభుత్వం ఏ ప్రత్యేక చర్యలు చేపట్టని ముస్లింలలో ఇది సాపేక్షంగా స్వల్పంగా ఉంది. పాత గణాంకాలు దొరకడం కష్టం కాబట్టి కాలానుగతమైన మార్పును అంచనా వేయడానికి సచార్ కమిటీ ఇప్పుడున్న జనాభాలోనే తరాల మధ్యనున్న తేడాను విశ్లేషించే మార్గం ఎంచుకుంది. 51 సంవత్సరాలు పైబడిన వారిలో వివిధ సామాజిక వర్గాలలో కాలేజీ చదువు పూర్తి చేసిన వారి నిష్పత్తిని తీసుకొని, 40-50 సంవత్సరాలు, 30-40 సంవత్సరాలు, 20-30 సంవత్సరాలు మధ్యనున్న వారిలో అదే నిష్పత్తితో పోల్చారు. మొదటి వర్గం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యావంతులైన తొలితరం స్థితిని సూచిస్తుందని భావించినట్టయితే, అప్పట్లో అగ్రకులాలలో డిగ్రీ చదువుకున్న వారి నిష్పత్తితో పోలిస్తే ముస్లింలలో ఆ నిష్పత్తి అయిదవ వంతే ఉన్నప్పటికీ, బిసిలు, ఎస్సి, ఎస్టిల కంటే ముస్లింలే మెరుగు. కానీ, ఆ తరువాత బిసి, ఎస్సి, ఎస్టిలు

సాపేక్షంగా కొంత వేగంగానే తమ స్థితిని మెరుగుపరుచుకోగా ముస్లింలు వెనుకబడ్డారు. అప్పటికీ ఇప్పటికీ అగ్రకులాలలో అది మూడున్నర రెట్లయింది. ముస్లింలలో రెండుంబావు రెట్లయింది. ఇప్పుడు బిసి జనాభాలో డిగ్రీ చదువుకున్న వారి నిష్పత్తి ముస్లింలలో అదే నిష్పత్తి కంటే 50 శాతం ఎక్కువ. ఎస్‌సి, ఎస్‌టిలలో ఆ నిష్పత్తి ఇప్పటికింకా ముస్లింల కంటే తక్కువే ఉన్నప్పటికీ ఇవే పాలనా విధానాలు కొనసాగితే ఇంకొక్క తరంలో ఎస్‌సి, ఎస్‌టిలు ఈ విషయంలో ముస్లింలను దాటిపోగలరు. (అయితే ఇక్కడ ఎస్‌సి, ఎస్‌టిలను కలిపేసిన విషయం గుర్తుంచుకోవాలి. విడదీసినట్టయితే ఎస్‌సిలలో డిగ్రీ ఉన్న వారి నిష్పత్తి ఇప్పటికే ముస్లింలలో అదే నిష్పత్తికి చేరువై ఉండవచ్చు. ఎస్‌టిలలో ఇంకొక రెండు తరాలకు కూడా కాకపోవచ్చు.) పట్టణ ప్రాంతాలను విడిగా తీసుకుంటే చాలా రాష్ట్రాలలో ఇప్పటికే ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టిల కంటే ఈ విషయంలో వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ అంటుంది. ముస్లింలకు కూడా విద్యారంగంలో రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్పులు, ఆశ్రమ పాఠశాలలు వగైరా నెలకొల్పవలసిన అవసరానికి ఇంతకంటే బలమైన వాదన అక్కరలేదు.

## విద్య : ఉన్నత స్థాయి

పేరుగాంచిన ఉన్నత విద్యాసంస్థలలో ముస్లింల స్థానం ఏమిటి అన్న ప్రశ్నకు జవాబు ఇంకా నిరాశాజనకంగా ఉండబోతుందని ఊహించడం కష్టం కాదు. బిసిలకు రిజర్వేషన్ ఇస్తామంటేనే అగ్రకులాల వారు నానా రచ్చ చేసి సుప్రీంకోర్టుకు పోయి స్టే తెచ్చుకున్న ఐఐఎం, ఐఐటిల గురించి సచార్ కమిటీ సమాచారం సేకరించింది. ఐఐఎంలలోని 4,743 మంది విద్యార్థులలో కేవలం 63 మంది ముస్లింలు (1.3 శాతం), ఐఐటిలలోని 27,161 మంది విద్యార్థులలో 894 మంది ముస్లింలు (3.3 శాతం) ఉన్నారు. దేశ జనాభాలో ముస్లింలు (2001 జనాభా లెక్కల ప్రకారం) 13.4 శాతం అన్న విషయం దృష్టిలో ఉంచుకోవాలి. ప్రతిష్ఠాత్మకమైన వైద్య విద్యాసంస్థలలో కూడా ఇదే పరిస్థితి. ముస్లిం విద్యార్థులు కేవలం 4 శాతం ఉన్నారు.

2004-2005 సంవత్సరానికి సంబంధించి 129 విశ్వవిద్యాలయాల సమాచారం సేకరించిన సచార్ కమిటీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో ముస్లింలు అతి తక్కువగా ఉన్న విషయాన్ని చూపించింది. మొత్తం పిజి విద్యార్థులలో 50 శాతం కంటే కొంచెం ఎక్కువ హిందూ అగ్రకులాలు, 24 శాతం బిసిలు, 14 శాతం దాకా ఎస్‌సి, ఎస్‌టిలు ఉండగా 5 శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. (మిగిలిన వారు సిక్కులు, బిసి జాబితాలో లేని క్రైస్తవులు వగైరా). విద్యా వ్యవస్థలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ముస్లింలు ఎంతగా వెనుకబడి పోయారో ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తాయి.

## మదరసాలు, మాధ్యమం

ముస్లింలు పిల్లలను బడికి పంపే బదులు మదరసాలకు పంపుతారు కాబట్టి వారిలో విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండవచ్చుననీ, అది వారి తప్పే కనుక ప్రభుత్వాన్ని గానీ, హిందూ సమాజాన్ని గానీ నిందించడంలో అర్థం లేదని వాదించేవారు ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సచార్ కమిటీ ఎంతమంది ముస్లిం పిల్లలు మదరసాలకు పోతున్నారన్న సమాచారం సేకరించింది. ఆ సమాచారం సారాంశం ఏమిటంటే బడికిపోయే ముస్లిం పిల్లలలో 66 శాతం ప్రభుత్వ పాఠశాలలకు పోతారు. 30 శాతం ప్రైవేట్ పాఠశాలలకు పోతారు. 4 శాతం మాత్రమే మదరసాలలో చదువుకుంటున్నారు. ఉత్తర భారతదేశంలో ఈ నిష్పత్తి 7 శాతం దాకా ఉండగా దక్షిణ భారతదేశంలో 1.7 శాతం మాత్రమే. ఏదైనా, విద్యా విషయంలో ముస్లింలు వెనుకబడి ఉండడానికి మదరసాలకు పోవడం కారణం ఎంతమాత్రం కాదు.

ఇక్కడ అవగాహనా లోపంవల్ల తలెత్తే గందరగోళం కొంత ఉందని సచార్ కమిటీ గుర్తించి దానిని కూడా వ్యాఖ్యానించింది. మదరసా అనేది పాఠశాల. అది లౌకిక పాఠశాలకు ప్రత్యామ్నాయం. మదరసాకు పోయే పిల్లలు లౌకిక పాఠశాలలకు పోరు. కానీ కేవలం మతబోధ చేయడానికి మసీదులకు అనుబంధంగా మక్తాబ్ అనే ధార్మిక విద్యాసంస్థ ఉంటుంది. అందులో అరబ్బీ నేర్పిస్తారు, ఖురాన్ చదివిస్తారు. ఇది లౌకిక పాఠశాలకు ప్రత్యామ్నాయం కాదు. లౌకిక పాఠశాలకు పోయే పిల్లలు అదనంగా మక్తాబ్‌లకు కూడా మతబోధ కోసం పోతారు. ఈ రెండింటికీ తేడా తెలియక అన్నిటినీ మదరసాలుగా భావించడం వల్ల మదరసాలలో చదువుకునే ముస్లిం పిల్లల సంఖ్య చాలా ఎక్కువ అనే అభిప్రాయం ప్రచారం అయిందని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. అయితే రెండింటినీ కూడినా కూడా వచ్చే సంఖ్య తక్కువే. ఎందుకంటే స్కూలుకు పోయే పిల్లలలో మతబోధ కోసం ఊరి మసీదుకు అనుబంధంగా ఉండే మక్తాబ్‌కు పోయే పిల్లలు 4 శాతమే. అంటే మదరసాలు, మక్తాబ్‌లు కలిపినా వాటికి హాజరయ్యే పిల్లలు 8 శాతమే కాబట్టి ధార్మిక పాఠశాలలకు పిల్లలను పంపడంలో ముస్లిం పెద్దలకున్న మోజువల్ల వారిలో అవిద్య ప్రబలిందన్న నిందకు ఆధారం లేదు.

మరైతే కారణాలేమిటి అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు పేదరికం అధికంగా ఉండే అన్ని సామాజిక వర్గాలకు సామాన్యంగా ఉండే కారణాలతో బాటు కొన్ని ప్రత్యేకమైన కారణాలు కూడా కనిపిస్తాయి. నిజానికి పేదరికం ఒక్కటే వెనుకబాటుతనానికి కారణం కాదని రుజువు చేసే గణాంకాలు కూడా సచార్ కమిటీ ఇచ్చింది. ముస్లింలలో పేదలను, ఇతరులను వేరుచేసి ఈ రెండు ఉపవర్గాలూ సమాజంలోని విద్యావంతులలో ఏ నిష్పత్తిలో ఉన్నారో తెలిపే గణాంకాలు ఇచ్చింది (పేదలు అనే మాటను ఏ విధంగా నిర్వచించారనేది ప్రస్తుతానికి అనవసరం - నిర్వచనం ఇటూ అటూ మార్చినా

గణాంకాలలో తేడా ఏమీ రాబోదు). దేశ జనాభాలో ముస్లింలు 2001 జనాభా లెక్కల ప్రకారం 13.4 శాతం అని చెప్పుకున్నాం. 2004-2005 ఎన్‌ఎస్‌ఎస్ లెక్కల ప్రకారం పేద వర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్లలో ముస్లింలు 10.5 శాతం, ఇతర వర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్లలో 6.8 శాతం. పేద వర్గాలలోని పోస్ట్‌గ్రాడ్యుయేట్లలో ముస్లింలు 7 శాతం, ఇతర వర్గాలలోని పోస్ట్‌గ్రాడ్యుయేట్లలో 6.4 శాతం. గ్రాడ్యుయేట్లలో పేదవర్గాలలోనే ముస్లింల నిష్పత్తి ఎక్కువ ఉండడం ఆశ్చర్యం కలిగించవచ్చును గానీ, అందులో ఆశ్చర్యపడడానికేమీ లేదు. అన్ని అవకాశాలలోనూ సింహభాగం తీసుకునేది హిందూ అగ్రకులాలు. పేదలలో వారి సంఖ్య తక్కువ కాబట్టి వారి తాకిడి తక్కువ. కాబట్టి పేద వర్గాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు, ముస్లింలు వాటాకోసం ఎక్కువ పోటీ పడతారు. అయితే ఇక్కడ ప్రస్తుతం ఏమిటంటే పేదలు కాని ముస్లింలు సహితం గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లలో తమ జనాభా దామాషాలో సగం కూడా లేరు.

ప్రత్యేక కారణాలలో మాధ్యమాన్ని సచార్ కమిటీ వివరంగా ప్రస్తావించింది. ముస్లింలందరి మాతృభాష ఉర్దూ కాకపోయినప్పటికీ ఉర్దూ మాతృభాష అయిన వారికి తమ మాతృభాషలో చదువుకునే అవకాశం సరిగ్గా లభ్యం కావడం లేదని గణాంకాలతో సహా చూపించింది. ఒక్క మహారాష్ట్రలో మాత్రమే ముస్లింలలో ఎంత నిష్పత్తి ఉర్దూను తమ మాతృభాషగా భావిస్తారో ముస్లిం పిల్లలలో అంత నిష్పత్తి ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. కర్ణాటకలోని ముస్లింలలో దాదాపు 70 శాతం ఉర్దూను మాతృభాషగా భావిస్తుండగా ముస్లిం పిల్లలలో 45 శాతం మంది మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ముస్లింలలో 80 శాతం ఉర్దూ తమ మాతృభాషగా భావిస్తుండగా (ఈ నిష్పత్తి దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ) 20 శాతం మంది మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. బీహార్‌లో 60 శాతం ముస్లింలు ఉర్దూ మాతృభాష కలవారు కాగా వారి పిల్లల్లో 30 శాతం మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. అయితే అన్నిటికంటే అధ్వాన్నమైన స్థితి ఉర్దూకు పుట్టినిల్లయిన ఉత్తరప్రదేశ్‌ది. అక్కడ ముస్లింలలో 45 శాతానికి మాతృభాష ఉర్దూ కాగా ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్న ముస్లిం పిల్లలు 2 శాతం మాత్రమే! దేశంలోని ముస్లింలలో 22 శాతం ఉత్తరప్రదేశ్ వాసులేనని గుర్తుంచుకుంటే మాతృ భాషలో విద్యాబోధన ముస్లిం పిల్లలకు ఎంతగా నిరాకరించబడుతున్నదో అర్థం అవుతుంది. ఉన్నంతలో ఉర్దూ మాధ్యమానికి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలోనే ప్రోత్సాహం లభిస్తున్నదనీ, ఉత్తర భారతదేశంలోని ప్రభుత్వాలు తమకు సమాచారం ఇచ్చే విషయంలో సహితం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించాయనీ సచార్ కమిటీ అనింది. ముస్లింల వెనుకబాటుతనంలో 'హిందీ రాష్ట్రాల' పాపం చాలా ఉందని మొదట్లోనే చెప్పుకున్నాం కదా.

## ఉపాధి

సచార్ కమిటీ ఉపాధి అవకాశాలను మూడుగా వర్గీకరించి ముస్లింల ఉపాధి పరిస్థితిని విశ్లేషించింది. స్వయం ఉపాధి, దిన కూలీ (క్యాజువల్), స్థిరమైన ఉద్యోగాలు (రెగ్యులర్) అనే మూడు విభాగాలను సచార్ కమిటీ గుర్తించింది. ముస్లింలలో అధిక భాగం స్వయం ఉపాధిపైన, ఆ తరువాత దినకూలీపైన, ఆ తరువాత స్థిరమైన ఉద్యోగాల పైన ఆధారపడతారని సమాచారాన్ని విశ్లేషించి తెలిపింది. హిందూ అగ్రకులాలకు స్వయం ఉపాధి ప్రథమం (ఇందులో వ్యవసాయం కూడా ఉందని గుర్తుంచుకోవాలి), స్థిరమైన ఉద్యోగాలు ద్వితీయం, దినకూలీ తృతీయం. ఎస్‌సి, ఎస్‌టిలకు దినకూలీ ప్రథమం, స్వయం ఉపాధి ద్వితీయం, స్థిరమైన ఉద్యోగాలు తృతీయం. హిందూ బిసి కులాలకు కూడా స్వయం ఉపాధి ప్రథమం కానీ మిగిలిన రెండూ దాదాపు ఒకే మోతాదులో జీవనాధారం కల్పిస్తాయి.

స్థిరమైన ఉద్యోగాల విషయంలో ముస్లింలది అన్ని ఇతర సామాజిక వర్గాల కంటే దయనీయమైన స్థితి. స్థిరమైన ఉద్యోగాలు ఎక్కువగా లభించేది పట్టణ ప్రాంతాలలోనే కాబట్టి ఈ విషయం చూడడానికి పట్టణ ప్రాంత జనాభాను విడిగా తీసుకోవచ్చు. పట్టణ ప్రాంత అగ్రకులాలలోని ఉద్యోగులు, కార్మికులలో 49 శాతానికి స్థిరమైన ఉద్యోగాలుండగా, ఎస్‌సి, ఎస్‌టిలలో ఈ నిష్పత్తి 40 శాతం, బిసిలలో 36 శాతం, ముస్లింలలో కేవలం 27 శాతం. అదే పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో 64 శాతం మంది స్వయం ఉపాధిపైన ఆధారపడుతుండగా, బిసిలలో ఆ నిష్పత్తి 51 శాతం, హిందూ అగ్రకులాలలో 55 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 43 శాతం. అయితే 'స్వయం ఉపాధి' అనే దాంట్లో కడుపునిండా కూడు పెట్టని నికృష్టమైన పనుల నుంచి మంచి ఆదాయమిచ్చే వాటిదాకా చాలా ఉంటాయి. కాబట్టి ప్రధానంగా స్వయం ఉపాధి పైన ఆధారపడే ముస్లింలు ఏ రకమైన వృత్తులలో లేక వ్యాపకాలలో ఎక్కువగా ఉన్నారో తెలుసుకుంటే తప్ప చిత్రం పూర్తికాదు. ముస్లింలు అధికంగా పని చేసే రంగాలు పొగాకు ఉత్పత్తులు (ఈ రంగంలో పనిచేసే కార్మికులలో మగవాళ్లలో 41 శాతం, ఆడవాళ్ళలో 35 శాతం ముస్లింలు), దుస్తుల తయారీ (మగవాళ్ళలో 30 శాతం, ఆడవాళ్ళలో 17 శాతం ముస్లింలు), మోటార్ వాహనాల అమ్మకం, రిపేరు (26 శాతం ముస్లింలు), ఎలక్ట్రికల్ ఉత్పత్తులు (23 శాతం ముస్లింలు), వర్తక రంగంలో పనిచేసే ఉద్యోగులు (27 శాతం ముస్లింలు.)

స్వయం ఉపాధిపైన ఆధారపడే వారిలో వీధివీధీ తిరుగుతూ వస్తువులు అమ్మేవారు మొత్తం జనాభాలో 8 శాతం కాగా ముస్లింలలో ఆ నిష్పత్తి 12 శాతం. స్వయం ఉపాధిపైన ఆధారపడే స్త్రీలలో స్వంత ఇంట్లోనే పనిచేసేవారు 51 శాతం కాగా, ముస్లింలలో అది 70 శాతం. ముస్లిం స్త్రీలు బయటికి పోయి పని చేయడం

సాంప్రదాయక కట్టడి కారణంగా కష్టం కావడం వల్ల చిన్నాచితక ఉత్పత్తి కేంద్రాలు, షాపులు ఇంటి నుండే నడుపుతారు. స్వంత శ్రమతో ఇంట్లోనే ఉండి ఉపాధి పొందే మహిళల నిష్పత్తి ఇతర సామాజిక వర్గాలలో కంటే ముస్లింలలోనే ఎక్కువ. శ్రామికులుగా నమోదైన ముస్లిం మహిళలలో దాదాపు 80 శాతం ఈ కోవకు చెందినవారే. వేరే ఏ సామాజిక వర్గంలోనూ ఈ నిష్పత్తి 65 దాటదు. ఈ రకమైన పని ఎక్కువగా సబ్ కాంట్రాక్టు రూపంలో ఉంటుందనీ, ఆరోగ్యమూ, ఆదాయమూ రెండూ కూడా హీనంగా ఉంటాయనీ సచార్ కమిటీ వ్యాఖ్యానించింది.

స్వయం ఉపాధి అనేది అసంఘటిత రంగంలో భాగం. ఇంగ్లీషులో ఇన్‌ఫార్మల్ సెక్టర్ అంటారు. అయితే అసంఘటిత రంగంలో వేరే ఉపాధి ప్రక్రియలు కూడా ఉన్నాయి. సంఘటిత రంగంతో పోలిస్తే ఇక్కడ ఆదాయాలు తక్కువ, అభద్రత ఎక్కువ. ముస్లింలలో వేరే అన్ని సామాజిక వర్గాల కంటే ఎక్కువ మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. పట్టణ ప్రాంత కార్మికులలో సంఘటిత రంగంలో ఉండేవారి నిష్పత్తి బిసిలలో 22 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 18 శాతం ఉండగా ముస్లింలలో 8 శాతం మాత్రమే.

పోలీసులలోనూ, సైన్యంలోనూ ముస్లింలు ఎందరున్నారన్న సమాచారం సచార్ కమిటీ సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి కోరినప్పుడు భారతీయ జనతా పార్టీ నేతలు చాలా రచ్చచేసిన విషయం పత్రికలలో చదివాము. అయినప్పటికీ సచార్ కమిటీ ఆ సమాచారం సేకరించగలిగింది. రక్షణ రంగంలోని వివిధ హోదాలలో హిందూ అగ్రకులాలు 52 శాతం, బిసిలు 23 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలు 12 శాతం ఉండగా ముస్లింలు కేవలం 4 శాతం ఉన్నారు. కేంద్ర పోలీసు సంస్థలలో హిందూ అగ్రకులాలు 42 శాతం, బిసిలు 23 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలు 23 శాతం ఉండగా ముస్లింలు 6 శాతం మాత్రమే ఉన్నారు. రాష్ట్ర పోలీసు సంస్థలలో అగ్రకులాలు 37 శాతం, బిసిలు 21 శాతం, ఎస్‌సి ఎస్‌టిలు 26 శాతం ఉండగా ముస్లింలు 7 శాతం ఉన్నారు. ఇవి 2004-2005 గణాంకాలు కాగా, 2001 జనాభా లెక్కల ప్రకారమే దేశ జనాభాలో ముస్లింలు 13.4 శాతం అని పైన చూశాము. 'మత సంఘర్షణల'లో పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది హిందువుల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని తరచుగా వినవచ్చే ఆరోపణల వెనుక ఈ వాస్తవం కూడా ఉందని గుర్తుంచుకోవాలి.

కార్మికులలో ఏ రోజు కారోజు పని వెతుక్కునే వారిని క్యాజువల్ అనీ, కొంత స్థిరత్వం ఉండే ఉద్యోగులను రెగ్యులర్ అనీ అనడం రివాజు. క్యాజువల్ కార్మికులెవరికీ పని భద్రత ఉండదు. రెగ్యులర్ అని పిలవబడే వారందరికీ కూడా ఒకే రకమైన భద్రత ఉండదు. లిఖిత పూర్వకమైన అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉండటం కొంత ఎక్కువ భద్రత ఇస్తుంది. సామాజిక వర్గాల వారీగా రెగ్యులర్ కార్మికులలో ఎంత మందికి ఈ మేరకు భద్రత ఉందని లెక్కలు వేస్తే ముస్లింలది అందరికంటే అధ్వాన్నమైన స్థితి.

రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తున్నారు అనుకునే ముస్లింలలో 72 శాతానికి అపాయింట్ మెంట్ లెటర్ లేదు. హిందూ అగ్రకులాలలో ఈ నిష్పత్తి 50 శాతం కాగా, బిసిలలో, ఎస్‌సి, ఎస్‌టిలలో 62 శాతం. లిఖిత పూర్వకమైన ఉద్యోగ ఒప్పందం ఉన్న వారిలో మూడేళ్ళు మించిన ఉద్యోగకాలం (టెన్యూర్) ఉన్నవారు అగ్రకులాలలో 42 శాతం కాగా, బిసిలలో 32 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 34 శాతం, ముస్లింలలో 23 శాతం. ప్రావిడెంట్ ఫండ్ వంటి హక్కులు కలిగి ఉండేవారు హిందూ అగ్రకులాలకు చెందిన ఉద్యోగులలో 55 శాతం మంది ఉండగా అది బిసిలలో 42 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 43 శాతం, ముస్లింలలో 29 శాతం. నికరమైన నెల జీతం ఉండేవారు అగ్రకులాలకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులలో 95 శాతం, బిసిలలోనూ, ఎస్‌సి, ఎస్‌టిలలోనూ 89 శాతం, ముస్లింలలో 82 శాతం ఉన్నారు.

ఒక పద్ధతి ప్రకారం కనిపించే పై వ్యత్యాసాలకు వివక్షే కారణం కాకపోవచ్చు. ముస్లింలు ఎక్కువగా పనిచేసే ఆర్థిక రంగాల స్వభావమే అది కావచ్చు. అయితే ఆ ఆర్థిక రంగాలకు ఆ స్వభావం ఉండడానికి కారణం వాటిలో ఎక్కువగా ముస్లింలు పని చేయడమేనేమో అని కూడా చూడవలసి ఉంటుంది.

## బ్యాంకు రుణాలు

ఒక సామాజిక వర్గం బ్యాంకు రుణాలు ఏ మేరకు పొందగలుగుతున్నదనేది ఆర్థిక అభివృద్ధిలో వారు ఏ మేరకు పాల్గొంటున్నారనే దానికి ఒక సూచిక. ఈ విషయంలో కులాల వారీ గణాంకాలు దొరకనట్టున్నాయి. అయితే మైనారిటీలకు బ్యాంకు రుణాలు అందించడం అనే లక్ష్యం ప్రభుత్వ విధానాలలో భాగంగా బ్యాంకులపైన ఉంది కాబట్టి ముస్లింలకు సంబంధించిన గణాంకాలను రిజర్వ్ బ్యాంకు సచార్ కమిటీకి ఇవ్వ గలిగింది.

ప్రభుత్వ బ్యాంకులలోనూ, ప్రైవేట్ బ్యాంకులలోనూ కూడా ముస్లింల అకౌంట్ల నిష్పత్తి వారి జనాభా నిష్పత్తి కంటే కొంచెం మాత్రమే తక్కువ. ప్రభుత్వ బ్యాంకులలో ముస్లింల సేవింగ్స్ తదితర ఖాతాలు 12.2 శాతం, ప్రైవేట్ బ్యాంకులలో 11.3 శాతం ఉన్నాయి. అయితే రుణాల మొత్తంలో ముస్లింల వాటా (సచార్ కమిటీ వేసిన అంచనా ప్రకారం) ప్రభుత్వ బ్యాంకులలో 4.6 శాతం మాత్రమే కాగా ప్రైవేట్ బ్యాంకులలోనూ అది 6.6 శాతం మాత్రమే. తలసరి రుణం హిందువులతో పోలిస్తే ముస్లింలు పొందుతున్నది ప్రభుత్వ బ్యాంకులలో మూడవ వంతు మాత్రమే (33 శాతం) కాగా ప్రైవేట్ బ్యాంకులలో 40 శాతం మాత్రమే. ఉద్యోగాల కంటే స్వయం ఉపాధి, వర్తక రంగాలలో ముస్లింలు అధికంగా ఉన్న కారణంగా బ్యాంకు రుణాల లభ్యత ఎంత ఉన్నది వారి ఆర్థిక స్థితిగతులకొక ముఖ్య సూచిక. అదేమంత ఆశాజనకంగా లేదని ఈ గణాంకాలు తెలుపుతాయి.

రాష్ట్రాలవారీ గణాంకాలు తీసుకున్నా కూడా దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ బ్యాంకు రుణాల మొత్తంలో ముస్లింల వాటా జనాభాలో వారి వాటాకు సమానంగా లేకపోగా అందులో సగం, మూడవ వంతు, నాలుగవ వంతు, అయిదవ వంతు, దేశ రాజధాని అయిన ఢిల్లీలోనైతే 24వ వంతు (జనాభాలో ముస్లింలు 100కి 12 మంది కాగా బ్యాంకు రుణాలలో 100 రూపాయలలో 50 పైసలే వారికిచ్చినవి) ఉంది. ఇందుకు రెండే మినహాయింపులు. ఒరిస్సా జనాభాలో ముస్లింల నిష్పత్తి ఎంతో బ్యాంకు రుణాలలో వారి వాటా కూడా అంతే. తమిళనాడు జనాభాలో ముస్లింలు 5.6 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా అంతకంటే కొంచెం ఎక్కువ - 6.6 శాతం.

చివరికి జనాభాలో ముస్లింలు 67 శాతం ఉన్న జమ్ము కాశ్మీర్‌లోనూ బ్యాంకు రుణాలలో ముస్లింల వాటా 54.4 శాతమే. జనాభాలో 24 శాతం అయిన హిందువుల వాటా బ్యాంకు రుణాలలో 40 శాతం.

ముస్లింలు ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న జిల్లాలను తీసుకుని చూస్తే ఈ స్థితి మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. దేశంలో ముస్లింల జనాభా 40 శాతం మించిన జిల్లాలు 11 ఉన్నాయి. ఈ జిల్లాల సగటు ముస్లిం జనాభా 51.4 శాతం. కానీ అక్కడున్న బ్యాంకుల (ప్రభుత్వ, ప్రైవేటు కలుపుకుని) రుణాలలో ముస్లింల వాటా 11.6 శాతం మాత్రమే. ఈ జిల్లాలలో ఒకటైన మన హైదరాబాద్‌లో ముస్లింలు జనాభాలో 41.2 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 3.2 శాతం. జనాభాలో 26 నుంచి 40 శాతం దాకా ముస్లింలు ఉన్న 12 జిల్లాలలో ముస్లిం జనాభా వాటా 34.2 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 19.3 శాతం. జనాభాలో ముస్లింల నిష్పత్తి 22 నుంచి 26 శాతం దాకా ఉన్న 10 జిల్లాలలో ముస్లిం జనాభా వాటా 24.1 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 6.3 శాతం.

మైనారిటీలు అధికంగా నివసించే జిల్లాలలో వారికి బ్యాంకు రుణాలు విరివిగా అందేటట్టు చూడమని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంకు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇదీ పరిస్థితి!

## లఘు పరిశ్రమల రుణాలు, నాబార్డ్ రుణాలు

ముస్లింలు ఉద్యోగాల కంటే స్వయం ఉపాధి రంగంలోనూ, చిన్న వర్తక రంగంలోనూ అధికంగా ఉన్నారు కాబట్టి వారు తమ అభివృద్ధికి చిన్నతరహా పరిశ్రమల లోకి ప్రవేశించడం ఒక మార్గం. దీనికి ప్రత్యేకంగా రుణాలు ఇచ్చే సంస్థ భారత లఘు పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి - SIDBI). సిడ్బి 2000-2006 మధ్య ఇచ్చిన రుణాలలో కేవలం 1.5 శాతం ముస్లింలకు అందింది. అందిన మేరకు కూడా తక్కువ మొత్తాలు అందాయి. సిడ్బి ఇచ్చిన సగటు రుణం 1.66 కోట్ల రూపాయలు కాగా, ముస్లిం వ్యక్తులకిచ్చిన సగటు రుణం 63 లక్షల రూపాయలు మాత్రమే.

నాబార్డ్ గ్రామీణ అభివృద్ధి కోసం రుణాలు ఇవ్వడం ఒక ముఖ్య లక్ష్యంగా గల సంస్థ. 2004-05, 2005-06 సంవత్సరాలలో నాబార్డ్ ఇచ్చిన ఉత్పత్తి రుణాలలో 3.2 శాతం ముస్లింలకు అందింది. పెట్టుబడి రుణాలలో 3.9 శాతం ముస్లింలకు అందింది. అన్ని వసతులలాగా ఈ విషయంలోనూ ముస్లింలకు అందుతున్న వాటా వారి జనాభా దామాషా కంటే బాగా తక్కువ.

## సామాజిక, భౌతిక వసతులు

ఈ శీర్షిక కింద సచార్ కమిటీ ముస్లింలకు స్కూళ్ళు, ఆస్పత్రులు తదితర సామాజిక వసతులు, రోడ్లు, కరెంటు, తాగునీరు, రవాణా సదుపాయాలు వగైరా భౌతిక వసతులు ఇతరులతో సమానంగా అందుతున్నాయా లేదా అన్న చర్చ చేసింది. గణాంకాల లభ్యతలోని సమస్యల కారణంగా పల్లెల గురించి మాత్రమే ఒక నిర్ధారణకు రాగలిగింది. ముస్లింలు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాలలో సామాజిక భౌతిక వసతుల స్థితి సగటు కంటే హీనంగా ఉందని నిర్ధారించింది. పెద్ద గ్రామాలలో సాధారణంగా వసతులు చిన్న గ్రామాల కంటే మెరుగ్గా ఉంటాయి కాబట్టి సచార్ కమిటీ సైజుల వారీగా గ్రామాలను తీసుకుని పరిశీలించింది. 1000 మంది కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాన్ని చిన్న గ్రామం అని, 1000-2000 లోపు జనాభా ఉన్న గ్రామాలని ఒక మోస్తరు పరిమాణం గల గ్రామం (మోడరేట్) అని, 2000 పైబడిన జనాభా గల గ్రామాన్ని పెద్ద గ్రామం అని మూడు వర్గాలుగా విభజించింది. గ్రామ జనాభాలో ముస్లింల నిష్పత్తిని బట్టి మళ్ళీ మూడుగా విభజించింది - ముస్లింలు 10 శాతం లోపు ఉన్న గ్రామాలు, 10 నుంచి 40 శాతం దాకా ఉన్న గ్రామాలు, 40 శాతం మించి ఉన్న గ్రామాలు.

ఈ విశ్లేషణ ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. గ్రామంలో స్కూలు ఉండడం, వైద్య సదుపాయం అందుబాట్లో ఉండడం, పోస్టాఫీసు అందుబాట్లో ఉండడం, బస్‌స్టాప్ ఉండడం, పక్కా రోడ్డు ఉండడం అనే అయిదు వసతులూ ముస్లింలు తక్కువగా ఉన్న గ్రామాలలో మెరుగుగానూ, ముస్లింలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో హీనంగానూ ఉన్నాయి. బడి విషయంలో పెద్ద గ్రామాలలో ఈ తేడా అంతగా కనబడదు గానీ చిన్న గ్రామాలలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 1000 లోపు జనాభా ఉన్న గ్రామాలను తీసుకుంటే వాటిలో ముస్లింలు 10 శాతంలోపు ఉన్న గ్రామాలలో 80 శాతం బడి కలిగి ఉన్నాయి. ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 69 శాతం మాత్రమే బడి కలిగిఉన్నాయి. బస్ వసతి సగటున దాదాపు 40 శాతం గ్రామాలకు ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 32 శాతానికి మాత్రమే ఉంది. పెద్ద గ్రామాలలో 67 శాతానికి బస్ వసతి ఉండగా ముస్లింలు 40 శాతం మించి ఉండే గ్రామాలలో 45 శాతానికి మాత్రమే ఉంది. పక్కా రోడ్డు పెద్ద గ్రామాలలో సగటున 82

శాతానికి ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉండే గ్రామాలలో 72 శాతానికి మాత్రమే ఉంది. వైద్య వసతి పెద్ద గ్రామాలలో 10 శాతం లోపు ముస్లింలు ఉన్న వాటిలో 75 శాతానికి ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 64 శాతానికి మాత్రమే ఉంది. పోస్టు, టెలిగ్రాఫ్ సేవలు పెద్ద గ్రామాలలో ముస్లింల సంఖ్య 10 శాతం లోపు ఉన్న వాటిలో 84 శాతానికి అందుబాట్లో ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న ఊర్లలో 63 శాతానికి మాత్రమే అందుబాట్లో ఉన్నాయి. పెద్ద గ్రామాల విషయంలో కనిపించిన ఈ తేడాలన్నీ ఒక మోస్తరు గ్రామాలలోను కనిపిస్తాయి. చిన్న ఊర్లలో ఎట్లాగూ ఈ వసతులు ఎక్కువ ఉండవు కాబట్టి ఈ తేడా అంతగా కనిపించదు.

రాష్ట్రాల వారీగా తీసుకుంటే ముస్లింలు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాలలో విద్యా వ్యవస్థ హీనంగా ఉన్న ఘనత పశ్చిమబెంగాల్, బీహార్‌లకు దక్కుతుంది. వైద్య వ్యవస్థ విషయంలో ఈ ఘనత అస్సాం, జమ్మూకాశ్మీర్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లకు దక్కుతుంది. పోస్టు, టెలిగ్రాఫ్ సదుపాయాల విషయంలో ఇవే రాష్ట్రాలలో ముస్లింల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలలో వసతులు కడుహీనంగా ఉన్నాయి. పక్కా రోడ్ల విషయంలోనూ ఈ రాష్టాలే ప్రధాన దోషులుగా నిలబడతాయి - జార్ఖండ్‌తోబాటు. అన్ని విషయాలలోనూ దక్షిణ భారత రాష్ట్రాలు, మహారాష్ట్రల పరిస్థితి సాపేక్షంగా నయం.

కరెంటు వాడకం విషయమూ అంతే. కరెంటు వాడకాన్ని బట్టి గ్రామాలను సచార్ కమిటీ ఆరు వర్గాలుగా విభజించింది. అసలే కరెంటు లేని గ్రామాలు ఒక చివర, 90 శాతం పైగా నివాసాలకు కరెంటు ఉన్న గ్రామాలు ఆ చివర పెట్టి మధ్యలో నాలుగు వర్గాలు చేశారు. అసలే కరెంటు లేని గ్రామాలలో ముస్లింల జనాభా గ్రామ జనాభాలో దాదాపు 10 శాతం ఉంది. 90 శాతం పైగా నివాసాలకు కరెంటు ఉన్న గ్రామాలలో ముస్లింల జనాభా 5 శాతం ఉంది. ముస్లిం జనాభా నిష్పత్తి తగ్గే కొద్దీ అదే వరసలో విద్యుదీకరణ పెరగడం కనిపిస్తుంది. ఇదే విషయాన్ని ఇంకొక రకంగా చూడవచ్చు. దేశంలో చిన్న గ్రామాలలో (1000 లోపు జనాభా కలిగినవి) అసలే కరెంటు లేనివి 29 శాతం దాకా ఉండగా, ముస్లిం జనాభా 40 శాతం మించి ఉన్న చిన్న గ్రామాలలో దాదాపు 40 శాతం కరెంటు లేనివి. ఒక మోస్తరు (1000 నుంచి 2000 వేల జనాభా కలిగిన) గ్రామాలలో కరెంటు లేనివి 14 శాతం కాగా, ముస్లింల జనాభా 40 శాతం మించి ఉన్న ఒక మోస్తరు గ్రామాలలో కరెంటు లేనివి 23 శాతం. పెద్ద గ్రామాలలో (2000 పైబడిన జనాభా కలిగినవి) అసలే కరెంటు లేనివి 5 శాతం కాగా, ముస్లిం జనాభా 40 శాతం మించి ఉన్న పెద్ద గ్రామాలలో అసలే కరెంటు లేనివి 10 శాతం.

రక్షిత మంచినీటి లభ్యతలో పట్టణ ప్రాంతాలలో ముస్లింలు సగటు కంటే కొంచెం మాత్రమే వెనుకబడి ఉన్నారు కానీ గ్రామీణ భారతంలో 25 శాతం జనాభాకు రక్షిత మంచినీరు అందుబాట్లో ఉండగా, ముస్లింలలో 15 శాతానికి మాత్రమే ఉంది.

ఇళ్ళు, టాయిలెట్ల విషయంలో మాత్రమే ముస్లింల స్థితి అంత హీనంగా లేదు. పక్కా ఇళ్ళు కలిగి ఉండే విషయంలో ముస్లింల స్థితి దేశ సగటు కుటుంబం స్థితితో సమానంగానే ఉంది. ఒక్క హిందూ అగ్రకులాలు మాత్రమే వారికంటే మెరుగైన స్థితిలో ఉన్నారు. టాయిలెట్లు కలిగి ఉండే విషయంలో హిందూ అగ్రకులాల కంటే కూడా ముస్లిం గృహాలది మెరుగైన స్థితి. ప్రైవసీకి - ముఖ్యంగా స్త్రీల విషయంలో - ముస్లింలు సాంస్కృతికంగా ఇచ్చే విలువ దీనికి కారణం అయి ఉంటుందని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. అయితే పేదరికం అధికంగా ఉన్న సామాజిక వర్గం ఒకే వసతి మీద ఇంత ఖర్చు పెడితే వేరే ఎక్కడో చాలా కోల్పోతూ ఉంటుందనేది విదితమే.

మొత్తానికి భారతదేశంలో ముస్లింలు సామాజిక, భౌతిక వసతులు హీనంగా ఉన్న ఒక ఉపప్రదేశంలోకి నెట్టబడ్డారని వ్యాఖ్యానించడం అతిశయోక్తి కాబోదు.

## పేదరికం

ఆర్థిక స్థోమతను ఆదాయంతో కొలవవచ్చు, ఖర్చుతోనూ కొలవవచ్చు. పేదల ఆదాయమూ తక్కువ ఉంటుంది, వారు చేసే ఖర్చూ తక్కువ ఉంటుంది. సచార్ కమిటీ వివిధ సామాజిక వర్గాలలో పేదరికాన్ని పోల్చడానికి నెలవారీ తలసరి సగటు ఖర్చును ప్రమాణంగా తీసుకుంది. 2004-2005 లెక్కల ప్రకారం హిందూ అగ్రకులాలలో నెల రోజుల తలసరి ఖర్చు 1023 రూపాయలు ఉండగా, బిసిలలో 646 రూపాయలు, ముస్లింలలో 635 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టిలలో 520 రూపాయలు ఉంది. పట్టణ ప్రాంతాలను విడిగా తీసుకుంటే ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టిలతో సమానం. ఇద్దరి నెల రోజుల తలసరి ఖర్చు 800 రూపాయలు. బిసిలలో అది 950 రూపాయలు, అగ్రకులాలలో 1470 రూపాయలు ఉంది. పట్టణం చిన్నదైన కొద్దీ ముస్లింల స్థితి మరింత దిగజారడం కనిపిస్తుంది. జనాభా 50 వేలకు తక్కువ ఉన్న ఊర్లలో ముస్లింలలో నెలరోజుల తలసరి ఖర్చు ఎస్‌సి, ఎస్‌టిల కంటే తక్కువ.

పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో అంతర్గత అసమానత కూడా ఎక్కువే. పట్టణ ప్రాంత పేదరికం ముస్లింలలో ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా ఉందని చెప్పుకున్నాం. అయితే బాగా పేద వర్గాలలో మాత్రం ముస్లింల నిష్పత్తే ఎక్కువ. నెలకు తలసరి 350 రూపాయల ఖర్చుతో బతికే ముస్లింలు పట్టణ ప్రాంత జనాభాలో 17 శాతం. అదే నిష్పత్తి ఎస్‌సి, ఎస్‌టిలలో 15.7 శాతం. ధనిక వర్గాలలో ఇద్దరి స్థానమూ ఒకటే. మధ్యస్తంగా ఉండేవారు ముస్లింలలో కొంచెం తక్కువ, ఎస్‌సి, ఎస్‌టిలలో కొంచెం ఎక్కువ.

రాష్ట్రాలవారీ గణాంకాలు ఇదే వాస్తవాన్ని చూపిస్తాయి. అయితే పశ్చిమ బెంగాల్, బీహార్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో తలసరి ఆదాయం ఎస్‌సి, ఎస్‌టిల కంటే తక్కువ. అయితే అన్ని చోట్లా గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల స్థితి ఎస్‌సి, ఎస్‌టిల కంటే సాపేక్షంగా మెరుగైనదే.

దరిద్రరేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి కూడా ఇదే చిత్రాన్ని ఇస్తుంది. 2004-2005 లెక్కలలో భారతదేశంలో దరిద్రరేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి 22.7 శాతం. అగ్రకులాలలో ఇది 8.7 శాతం, బిసిలలో 21 శాతం, ముస్లింలలో 31 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 35 శాతం. మళ్ళీ పట్టణ ప్రాంతాలలో ఎస్‌సి, ఎస్‌టిల కంటే కూడా ముస్లింలలోనే నిరుపేదలు ఎక్కువ. దరిద్రరేఖకు దిగువన ఉండే పట్టణ ప్రాంత జనాభా నిష్పత్తి ఎస్‌సి, ఎస్‌టిలలో 36.4 శాతం కాగా, ముస్లింలలో 38.4 శాతం. అయితే దరిద్రరేఖ అనేది పేదలెందరు అనే విషయం చెప్తుంది తప్ప వాళ్ళు ఎంత పేదగా ఉన్నారని చెప్పదు. దరిద్రరేఖకు దిగువన ఉన్నవారు ఎంత దిగువన ఉన్నారో చూడడం కూడా సమగ్ర పరిశీలనకు అవసరం. దీనికొక మార్గం - దరిద్రరేఖకు దిగువన ఉన్నవారు సగటున ఆ రేఖను సూచించే ఆదాయంలో ఎంత శాతం (సగం, ముప్పావు వగైరా) ఆదాయం కలిగి ఉన్నారో లెక్కించడం. ఈ లెక్క తీస్తే, పట్టణ ప్రాంతాలలో దరిద్రరేఖకు దిగువన ఉన్న ముస్లింలు సగటున దరిద్రరేఖను సూచించే ఆదాయంలో 77 శాతం ఆదాయం కలిగి ఉండగా, ఎస్‌సి, ఎస్‌టిలలో ఆ నిష్పత్తి 76 శాతం.

అన్ని సామాజిక వర్గాలలాగే ముస్లింలలో కూడా కాలక్రమంలో దరిద్రరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య తగ్గుతున్నది. అయితే ముస్లింలలో ఈ తగ్గుదల గ్రామీణ ప్రాంతాలలో ఉన్నంత పట్టణాలలో లేకపోవడం వల్ల ముస్లింలలో పేదరికం పట్టణాలలో కేంద్రీకృతమై ఉందని సచార్ కమిటీ విశ్లేషించింది.

## ప్రభుత్వ ఉద్యోగాలు

మంచి జీతాలు, భద్రత, హోదాల కారణంగా చాలామంది ఇప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలను కాంక్షిస్తారని చెప్తూ ముస్లింలు ఈ రంగంలో ఎంతమేరకు ఉన్నారన్న విశ్లేషణ సచార్ కమిటీ చేపట్టింది. ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగాలు అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలోని ఉద్యోగాలే కాక ప్రభుత్వరంగ సంస్థలలోని ఉద్యోగాలు కూడా. అన్నిచోట్లా ముస్లింలు తమ జనాభా నిష్పత్తి కంటే చాలా తక్కువ ఉన్న విషయం సచార్ కమిటీ బయటపెట్టింది.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ముస్లింలు 6.3 శాతం ఉన్నారు. రైల్వేలో 4.5 శాతం, బ్యాంకులలో 2.2 శాతం, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో 5 శాతం, భద్రతా సంస్థలలో

3.2 శాతం, విశ్వవిద్యాలయాలలో 4.7 శాతం ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో మొత్తం 4.9 శాతం ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో 3.3 శాతం, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో 10.8 శాతం ఉన్నారు. ఇందులో ఈ చివరి సంఖ్య ఒక్కటే జనాభాలో ముస్లింల దామాషా అయిన 13.4 శాతానికి కొంచెమైనా దగ్గరకొస్తుంది.

ఐఎఎస్‌లో ముస్లింలు 3 శాతం, ఐపిఎస్‌లో 4 శాతం. అందులో అనివార్యమైన ప్రమోషన్ మీద ఐఎఎస్, ఐపిఎస్ హోదా పొందిన వారిని మినహాయించి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి ఐఎఎస్, ఐపిఎస్ హోదా పొందిన వారిని మాత్రమే లెక్కిస్తే ముస్లింలలో వారు 2.4 శాతం, 2.3 శాతం మాత్రమే. ఒక్క ఐఎఎస్, ఐపిఎస్‌లే కాక యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల ద్వారా ఎంపికచేసే అన్ని సర్వీసుల స్థితీ ఇదే. 2003, 2004లలో ఈ పరీక్షలు రాసిన వారిలో 4.9 శాతం మాత్రమే ముస్లింలు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పరీక్షలు రాసిన వారిలో ఉత్తీర్ణులైన వారి నిష్పత్తి అగ్రకులాలతో సమానంగా ఉంది. అంటే ఉన్నతస్థాయి పరీక్షలు, పదవులు అందుకోగలిగితే ముస్లింలు అందరిలాగా రాణించగలరు. అందుకోలేకపోవడమే సమస్య.

వివిధ ప్రభుత్వ శాఖలలో ముస్లింలు ఉన్నదే తక్కువంటే ఆ ఇంత కూడా కిందిస్థాయి ఉద్యోగాలలోనే తప్ప పైస్థాయి ఉద్యోగాలలో కాదు. 14 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే రైల్వేలో ముస్లింలు 4.5 శాతం మాత్రమే కాగా అందులో 98.7 శాతం గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టులలో ఉన్నారు. 1.3 శాతం మాత్రమే గ్రూప్ - ఎ, గ్రూప్ - బి (అంటే ఆఫీసర్) పోస్టులలో ఉన్నారు.

ఈ విషయాన్ని ఇంకొక కోణం నుంచి కూడా చూడవచ్చు. రైల్వేలోని గ్రూప్ - ఎ పోస్టులలో 72 శాతం సవర్ణ హిందువులు, 18 శాతం ఎస్‌సి, ఎస్‌టిలు ఉండగా కేవలం 3 శాతం ముస్లింలున్నారు. క్రింది స్థాయి ఉద్యోగాల కొచ్చేసరికి వాటి సంఖ్య చాలా ఎక్కువ కాబట్టి ముస్లింల సంఖ్య ఎక్కువే ఉందిగానీ ఆ స్థాయిలోనూ ముస్లింల వాటా 5 శాతమే. అంటే ఏ స్థాయిలోనూ వారి వాటా జనాభాలో వారి వాటాతో పోల్చదగ్గది కాదు. ఆ ఉన్న కొద్దిమంది కూడా నూటికి 98.7 శాతం మంది కిందిస్థాయి పోస్టులలోనే ఉన్నారు.

అన్ని సర్వీసుల విషయమూ అంతే. కేంద్ర పారామిలటరీ బలగాలైన బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్, సి.ఐ.ఎస్.ఎఫ్, సశస్త్ర సీమాబల్‌లలో ముస్లింల వాటా పైస్థాయి ఉద్యోగాలలో 3.6 శాతం, కింది స్థాయి ఉద్యోగాలలో 4.6 శాతం ఉంది. రెండు స్థాయిలలోనూ వారి వాటా వారి జనాభా నిష్పత్తి కంటే బాగా తక్కువే. కాని ఉన్న వారిలో 96 శాతం కిందిస్థాయి ఉద్యోగాలలోనే ఉన్నారు.

విశ్వవిద్యాలయాలలోని బోధన, బోధనేతర సిబ్బంది గణాంకాలను కూడా సచార్ కమిటీ సేకరించింది. బోధన సిబ్బందిలో అగ్రకులాలు 45 శాతం ఉండగా బోధనేతర సిబ్బందిలో 47 శాతం ఉన్నారు. బిసిలు బోధన సిబ్బందిలో 35 శాతం దాకా ఉండగా బోధనేతర సిబ్బందిలో 18 శాతం ఉన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలలో బోధన సిబ్బందిలో 7.4 శాతం, బోధనేతర సిబ్బందిలో 16.9 శాతం ఉన్నారు. ముస్లింలు బోధన సిబ్బందిలో 3.7 శాతం, బోధనేతర సిబ్బందిలో 5.4 శాతం ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలోని ఉన్నత స్థాయి మేనేజర్ హోదాలో హిందూ అగ్రకులాలు 70 శాతం దాకా ఉండగా రిజర్వేషన్ పుణ్యాన ఎస్‌సి, ఎస్‌టిలు 20 శాతం ఉన్నారు. రిజర్వేషన్లు లేని బిసిలు, ముస్లింలు చెరి 3 శాతం ఉన్నారు. హోదాలో కింది కొచ్చే కొద్దీ బిసిల సంఖ్య కొద్దిగాను, ఎస్‌సి, ఎస్‌టిల సంఖ్య గణనీయంగానూ పెరగడం కనిపిస్తుందిగానీ అతి తక్కువ హోదాలో సహితం ముస్లింలు 5 శాతం మించి లేరు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ఇదే చిత్రం. ఏ రాష్ట్రంలోను (జమ్ము కాశ్మీర్‌తో సహా) ముస్లింల భాగస్వామ్యం వారి జనాభా దామాషాతో సమానం కాదు. నాలుగు రాష్ట్రాలలో తప్ప (పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్) వేరే ఎక్కడా అందులో సగం కూడా లేదు. అన్ని రాష్ట్రాల కంటే మెరుగైన ఆంధ్రప్రదేశ్‌లో సైతం జనాభాలో ముస్లింలు 9.2 శాతం కాగా ప్రభుత్వ ఉద్యోగులలో వారి నిష్పత్తి 5.6 శాతం! బహుశా అన్నిటికంటే ఆశ్చర్యం కలిగించేది జమ్ము కాశ్మీర్ పరిస్థితి. ఆ రాష్ట్ర జనాభాలో ముస్లింలు 68 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో ముస్లింలు కేవలం 18.1 శాతం. (ఇవి కాశ్మీర్ లోయకు సంబంధించిన గణాంకాలు కావు, మొత్తం రాష్ట్రానికి సంబంధించినవి.)

రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు కాక రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలను తీసుకుంటే పరిస్థితి కొంచెం మెరుగుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ముస్లిం సిబ్బంది 10.7 శాతం. ఇది సైతం జనాభాలో వారి వాటా కంటే తక్కువే అయినా ఇతర రంగాలకు సంబంధించిన గణాంకాలంత హీనంగా లేదు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ముస్లింల వాటా జనాభాలో వారి వాటా కంటే కొంచెం ఎక్కువ.

## సంక్షేమ పథకాలు

వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలుచేసే విషయం తెలిసిందే. పేదలు, చిన్న పిల్లలు, మహిళలు, రైతులు మొదలైన వర్గాల కోసం చేపట్టే ఈ పథకాలు ఆయా వర్గాలలోని ముస్లిం ప్రజానీకానికి ఎంతమేరకు అందుతున్నాయన్న సమాచారం సేకరించడానికి సచార్ కమిటీ ప్రయత్నించింది. అయితే

లబ్ధిదారుల మతాన్ని నమోదు చేయని కారణంగా ఈ సమాచారం అన్ని రాష్ట్రాల నుంచి లభ్యం కాకపోవడం వల్ల పాక్షికమైన చిత్రం మాత్రమే ఇవ్వగలిగారు.

కేరళలో దరిద్రరేఖకు దిగువన ఉన్న పేదలలో ముస్లింలు 30.7 శాతం. కానీ పేదలకోసం ఉద్దేశించిన ఏ పథకంలోనూ ముస్లిం లబ్ధిదారులు 30 శాతం కూడా లేరు. గ్రామీణ అభివృద్ధి శాఖ చేపట్టే స్కీంలలో ముస్లింలకు 12 శాతం లభిస్తున్నాయి. తక్కిన పథకాల లబ్ధిదారులలో ముస్లింలు 5 నుంచి 18 శాతం దాకా ఉన్నారు. సహకార సంస్థల రుణాల లబ్ధిదారులలో మాత్రం 25 శాతం ఉన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో పేదలలో 23.6 శాతం ముస్లింలు కాగా పేదలకోసం ఉద్దేశించిన వివిధ పథకాలలో ముస్లిం లబ్ధిదారుల వాటా 3 నుంచి 14 శాతం దాకానే ఉంది. స్వర్ణ జయంతి ఉపాధి పథకంలో అత్యధికంగా 16 శాతం ఉంది.

అంగన్‌వాడీల స్థాపన బడికి పోయే వయసు లేని పిల్లలకు ఆటపాటలు నేర్పడానికి ఉద్దేశించబడింది. ఆ వయసు పిల్లలకు పౌష్టికాహారం అందించడం కూడా ఆ వ్యవస్థ లక్ష్యాలలో ఒకటి. ఇది సమగ్ర శిశు అభివృద్ధి సేవ (ఐసిడిఎస్) అనే ప్రోగ్రాం ద్వారా అమలవుతుంది. పేదరికం అధికంగా ఉన్న సామాజిక వర్గాల పిల్లలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉండగల పథకం. ఈ పథకం 11 శాతం మేరకే అమలవు తున్నదని (అంటే అందవలసిన పిల్లలలో 11 శాతానికి మాత్రమే అందుతున్నదని) సచార్ కమిటీ వ్యాఖ్యానిస్తూ, అందులోనూ ముస్లింల వాటా ఇతర వెనుకబడిన సామాజిక వర్గాలతో పోలిస్తే హీనంగా ఉందని అనింది. బిసిలలో అర్హులైన పిల్లలలో 13 శాతానికి ఐసిడిఎస్ సేవలు అందుతుండగా ఎస్‌సి, ఎస్‌టిలలో 10 శాతానికి, ముస్లింలలో 8 శాతానికి మాత్రమే అందుతున్నదని 2004-2005 గణాంకాలు తెలుపు తున్నాయి. ఇక్కడ కూడా మళ్ళీ 'హిందీ రాష్ట్రాల' పరిస్థితి మరీ హీనం. ఆ రాష్ట్రాలలో అంగన్‌వాడి సేవలు అర్హులైన పిల్లలలో 3 శాతానికి మాత్రమే అందుతున్నాయి.

పౌష్టికాహారానికి మరొక ఆధారమైన మధ్యాహ్న భోజన పథకం స్థితీ ఇంతే. ఆ పథకం ప్రభుత్వ స్కూళ్ళకే తప్ప ప్రైవేటు విద్యాసంస్థలకు వర్తించదు. మొత్తం స్కూలుకు పోగల వయసున్న పిల్లలలో (అంటే 6 నుంచి 16 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలలో) 27 శాతం మధ్యాహ్న భోజన పథకం నుంచి ప్రయోజనం పొందుతున్నారు. అయితే ఎస్‌సి, ఎస్‌టిలలో ఈ నిష్పత్తి 35 శాతం ఉండగా, బిసిలలో 28 శాతం, ముస్లింలలో 23 శాతం ఉంది.

మైనారిటీల అభ్యున్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పిన వివిధ సంస్థలున్నాయి. వాటి గురించి సచార్ కమిటీ కొంత చర్చ చేసింది. వాటి వలన కొంత

ఉపయోగం ఉన్నప్పటికీ వాటికి కేటాయిస్తున్న నిధులు నామమాత్రం కావడం వల్ల అవి తమ లక్ష్యాన్ని సాధించలేకపోతున్నాయని సచార్ కమిటీ నిర్ధారించింది.

## రిజర్వేషన్లు, ఇతర ప్రత్యేక హక్కులు

భారతదేశంలో ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతుల గురించి వివరమైన చిత్రాన్ని ఇచ్చిన పిదప, ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి ప్రత్యేకమైన చర్యలేవైనా ప్రభుత్వాలు చేపట్టాయా అన్న ప్రశ్న సచార్ కమిటీ వేసుకుంది. అన్ని రంగాలలోనూ ముస్లిం ప్రజానీకం హిందూ అగ్రకులాల కంటే బాగా వెనుకబడి ఉన్నారనీ, బిసిలకు సంబంధించి విడిగా సమాచారం ఉన్న రంగాలలో బిసిల కంటే కూడా వెనుకబడి ఉన్నారనీ, ఎస్‌సి, ఎస్‌టిలకు సన్నిహితంగా ఉన్నారనీ ఈ చిత్రం చెబుతుంది. మొదట్లో చెప్పినట్టు, ఎస్‌సి, ఎస్‌టిలను కలగలపకుండా వేరుచేసి పరిశీలించి ఉంటే, ఎస్‌సిలు చాలా విషయాలలో ఎస్‌టిల కంటే సాపేక్షంగా మెరుగుగా ఉంటారు కాబట్టి ముస్లింల స్థితి ఎస్‌సిల స్థితికి మరింత సన్నిహితం అనే విషయం స్పష్టం అయి ఉండేది.

అయితే బిసిలకూ ఎస్‌సి, ఎస్‌టిలకూ సమాన అవకాశాలు కల్పించే దిశగా రిజర్వేషన్లు, స్కాలర్ షిప్పులు, ప్రత్యేక హాస్టళ్ళు, ఆశ్రమ పాఠశాలలు మొదలైన హక్కులూ వసతులూ కల్పించిన ప్రభుత్వాలు ముస్లింల విషయంలో అటువంటి చొరవ తగురీతిలో తీసుకోలేదు. అందువల్ల తమ స్థితి నుంచి బయటపడడానికి స్వశక్తి తప్ప ముస్లింలకు వేరే ఆసరా లేకుండా ఉంది. వారి స్వంత శక్తి చాలని కారణంగా వారి స్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది.

విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు అసమాన అవకాశాలను అధిగమించడానికొక ముఖ్య సాధనం కాబట్టి ఈ ప్రయత్నం వివిధ రాష్ట్రాలలో ఏ మేరకు జరిగిందన్న విశ్లేషణ సచార్ కమిటీ చేపట్టింది. భారతదేశంలోని ముస్లింలలో నాలుగు చారిత్రక స్రవంతులకు చెందినవారున్నారు. కొందరు విదేశాలనుంచి వచ్చిన ముస్లింల సంతతిగా తమను తాము భావిస్తారు. కొందరు మతం మార్చుకున్న హిందూ అగ్రకులాల వారి సంతతి. కొందరు వివిధ ఉత్పాదక వృత్తులకు చెందినవారు - ఇందులో చాలావరకు హిందూ బిసి కులాల నుంచి మత మార్పిడి ద్వారా ముస్లింలైన వారే. చివరి వర్గం అంటరాని కులాల నుంచి, ఆదివాసుల నుంచి ముస్లింలైనవారు. ఉత్తర భారతదేశంలో ఇందులో మొదటి రెండు వర్గాలకు చెందిన వారిని అష్రాఫ్ అనీ, మూడవ వర్గానికి చెందిన వారిని అజ్లాఫ్ అనీ, నాలుగవ వర్గానికి చెందిన వారిని అర్జాల్ అనీ వ్యవహరిస్తున్నారని సచార్ కమిటీ తెలిపింది. దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ఈ రకమైన వర్గీకరణ వ్యవహారంలో లేకపోవచ్చును గానీ సమకాలీన ముస్లిం ప్రజానీకం పై నాలుగు స్రవంతుల నుంచి రూపొందిన వారేనని చెప్పుకోవచ్చు.

ఇందులో చివరి వారికి ఎస్‌సిలుగా గుర్తింపు ఇవ్వడం ఉచితంగా ఉంటుందనీ, అట్లా జరగకపోవడం వారికి అన్యాయం చేసిందనీ సచార్ కమిటీ భావించింది. అయితే ఇవ్వాళ ఎస్‌సిగా ఉండి ముస్లింగా మత మార్పిడి చేసుకున్న వ్యక్తి సహితం ఎస్‌సి గుర్తింపు కోల్పోతున్న పరిస్థితిలో, చారిత్రకంగా అంటరాని ప్రజానీకంలో భాగంగా ఉండి ఇస్లాం స్వీకరించిన వారిని ఎస్‌సిలుగా గుర్తించాలన్న కోరిక తీరడం రాజకీయంగా కష్టం కావచ్చు. ఆ కారణంగా, ముస్లింలలో సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించటం అంటూ జరిగిన రాష్ట్రాలలో సైతం ఎస్‌సిలుగా ఉండవలసిన ముస్లిం వర్గాలు బిసి జాబితాలో ఉన్నారు. ఎస్‌సిలలో కాకపోతే కనీసం 'అత్యంత వెనుకబడిన వర్గాల' (ఎంబిసి) జాబితాను సృష్టించి దాని కోటా విడిగా కల్పించి వీరిని అందులో చేర్చాలని సచార్ కమిటీ అభిప్రాయపడింది.

ఇక రిజర్వేషన్ల విషయంలో ఉనికిలో ఉన్న పరిస్థితి ఏమిటో చూద్దాం. కేరళ కర్ణాటక రాష్ట్రాలు ముస్లింలను మొత్తంగానే బిసిలుగా గుర్తించి ఇతర బిసి వర్గాలతో బాటు రిజర్వేషన్లు ఇస్తున్నాయి. తమిళనాడు ప్రభుత్వం ముస్లింలలో దాదాపు 95 శాతాన్ని బిసిలుగా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్ కొంతకాలం ముస్లింలలో కొద్దిమందిని మాత్రం బిసిలుగా గుర్తించింది. ఈ మధ్య ముస్లింలందరినీ బిసి జాబితాలో చేర్చాలని ప్రయత్నించి రెండుసార్లు కోర్టులో ఓడిపోయింది. ప్రస్తుతం ముస్లింలలో అందరినీ కాక అధికభాగాన్ని బిసిలుగా గుర్తించే చట్టాన్ని జారీచేసింది. అది కూడా కోర్టు లిటిగేషన్‌లో నలుగుతూ ఉంది.

ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ముస్లింలలో కొన్ని వర్గాలను బిసిలుగా గుర్తించి రాష్ట్ర బిసి జాబితాలో చేర్చిన రాష్ట్రాలు చాలా ఉన్నాయి. ఉత్తరాంచల్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, అస్సాం, హిమాచల్‌ప్రదేశ్‌లలో అతి కొద్ది ముస్లిం వర్గాలు మాత్రమే బిసిలుగా గుర్తింపు పొందారు. పంజాబ్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో ముస్లింలెవ్వరూ బిసిలు కారు. బీహార్, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో చెప్పుకోదగ్గ సంఖ్యలో ముస్లిం ఉపవర్గాలు బిసి జాబితాలో చేర్చబడ్డాయి. మొత్తంగా భారతదేశ ముస్లింలలో 40.7 శాతం బిసిలుగా గుర్తించబడ్డ వర్గాలలో ఉన్నారనీ, దేశంలోని బిసి జనాభాలో వారు 15.7 శాతం అనీ సచార్ కమిటీ తెలిపింది.

నిజానికి ముస్లింల స్థితిగతుల గురించి సచార్ కమిటీ వెలువరించిన వాస్తవాలను దృష్టిలో ఉంచుకున్నట్టయితే ముస్లింలు మొత్తంగానే - పిడికెడు నవాబీ కుటుంబాలను మినహాయించి - రిజర్వేషన్లకు అర్హులై ఉండాలి. అన్ని విషయాలలోనూ ముస్లింలు హిందూ బిసిల కంటే వెనుకబడి ఉండగా, వీరిలో వంద శాతం రిజర్వేషన్లు పొందుతుండగా, వారిలో కేవలం 40.7 శాతం మాత్రమే అర్హులెట్లా అవుతారు?

ఈ సందర్భంగా సచార్ కమిటీ వ్యక్తపరచిన అభిప్రాయాన్ని మొత్తంగా ఉటంకించడం ఉచితంగా ఉంటుంది. ముస్లిం సమాజంలో వారు అష్రాఫ్, అజ్లాఫ్, అర్జాల్ అన్న మూడు వర్గాలను - చారిత్రక మూలాల ఆధారంగా గుర్తించిన సంగతి చూశాము. ఆ ప్రాతిపదిక మీదనే ముస్లింలకు రిజర్వేషన్లు, ఇతర ప్రత్యేక హక్కులు కల్పించాలని సచార్ కమిటీ అభిప్రాయపడింది.

> *సామాజిక నిర్మాణం ప్రాతిపదికన ముస్లింలలో మూడు వర్గాలను గుర్తించవచ్చును - అష్రాఫ్, అజ్లాఫ్, అర్జాల్ అనేవి ఈ మూడు. ఈ మూడు వర్గాలకు భిన్నమైన చర్యలు అవసరం. రెండవ వర్గమైన అజ్లాఫ్ బిసిలకు ప్రత్యేక హక్కులు అవసరం. అవి హిందూ బిసిల హక్కులను పోలి ఉండాలి. ఎస్‌సిలతో పోల్చదగ్గ సంప్రదాయ వృత్తులు కలిగిన మూడవ వర్గం అణచివేత దొంతర కింద నలుగుతున్నారు. కాబట్టి వారి అభ్యున్నతికి బహుముఖమైన చర్యలు అవసరం. రిజర్వేషన్లు వాటిలో ఒకటి. వీరిని అత్యంత వెనుకబడిన వర్గం (ఎంబిసి)గా గుర్తించాలి.*

## ప్రభుత్వం ఏం చేయాలి?

మైనారిటీ వర్గాలకు సామాజిక ఆర్థిక న్యాయం అన్నదొక్కటే కాక సాంస్కృతిక గుర్తింపు, భద్రత అనేవి కూడా సమస్యలుగానే ఉంటాయని చెప్తూ, తమ కమిటీని పరిశీలించమన్నది సామాజిక ఆర్థిక అసమానతలను మాత్రమే కాబట్టి వాటికే పరిమితం అయ్యామని సచార్ కమిటీ ముగింపు అధ్యాయంలో అనింది.

ఈ అసమానతకు కారణం ఉద్దేశ్యపూర్వకమైన వివక్ష అని ముస్లింలు భావిస్తున్నారనీ, ఆ నిరసన వల్ల సమస్య మరింత జటిలం అయిందనీ కూడా అనింది. అయితే ఉద్దేశ్యపూర్వకమైన వివక్ష నిజంగా ఉందా లేదా అన్న ప్రశ్న వేసుకోలేదు, జవాబు వెతకలేదు. ముస్లింల స్థితి చాలా దయనీయంగా ఉందని తెలిపే సమాచారాన్ని విశ్లేషణాత్మకంగా వెలికితీసి బయటపెట్టిన సందర్భాలలో కూడా వారిని ఉద్దేశ్యపూర్వకంగా భారత సమాజం, పాలకులు ఆ స్థితిలోకి నెట్టారా లేక ఎవరి దురుద్దేశాలతో నిమిత్తం లేకుండా చారిత్రక కారణాలవల్ల అట్లా జరిగిపోయిందా అన్న చర్చకు సచార్ కమిటీ కావాలనే దూరం ఉండిపోయింది. ఆ చర్చ పెట్టుకోవడం ముస్లిం ప్రజానీకం స్థితిగతులను వాస్తవికంగా గుర్తించి మెరుగుపరచగల చర్యలను సూచించే తక్షణ కర్తవ్యానికి నష్టకరం అని భావించారేమో.

వైవిధ్యాన్ని గౌరవిస్తూ, ముస్లింలను అభివృద్ధి స్రవంతిలోకి తీసుకొచ్చే విధానాలు రచించే ఆవశ్యకతను సచార్ కమిటీ నొక్కి చెప్పింది. దీనికోసం అనేక సూచనలు చేసింది.

## 1. జాతీయ సమాచార బ్యాంకు

ప్రజా జీవితానికీ, పరిపాలనకూ సంబంధించిన సమాచారం సామాజిక వర్గాల వారీగా లభ్యం కాకపోవడం వల్ల వివిధ సామాజిక వర్గాల స్థితిగతులు, వారికి ప్రభుత్వం ఎంత చేస్తున్నది మొదలైన విషయాలు తెలియడం కష్టంగా ఉంది. ఎస్‌సి, ఎస్‌టిల విషయంలో కొంత మేరకు సమాచారం దొరుకుతున్నది గానీ బిసిలు, ముస్లింల విషయంలో సమాచారం దొరకడం లేదు. వివిధ సామాజిక వర్గాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఒక జాతీయ సమాచార బ్యాంకులో పొందుపరచాలని సచార్ కమిటీ సూచించింది. ఇందులో వారి స్థితిగతుల గురించే కాక ప్రభుత్వ పథకాలు వారికి ఏ మేరకు అందుతున్నాయి, ఎంతమంది ప్రయోజనం పొందుతున్నారు ఇత్యాది విషయాలు కూడా పొందుపరచాలి.

## 2. పర్యవేక్షక కమిటీ

ఈ సమాచారం అందుబాట్లోకి వచ్చినట్టయితే ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ సులభతరం అవుతుంది. దానికోసం కేవలం ప్రభుత్వ అధికారులే కాక విద్యావంతులు, పౌరసంస్థల బాధ్యులు కూడా సభ్యులుగా ఉన్న పర్యవేక్షక కమిటీలను నెలకొల్పి వ్యవస్థీకరించాలి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలు ఏ సామాజిక వర్గానికెంత అందు తున్నాయో పరిశీలించి సలహాలూ, సూచనలూ ప్రభుత్వానికి ఇవ్వడం ఈ పర్యవేక్షక కమిటీ కర్తవ్యం.

## 3. సమాన అవకాశాల కమిషన్

మైనారిటీ అయినందుకు తాము వివక్షకు గురి అవుతున్నామని ముస్లింలు భావిస్తున్న విషయం తమ విచారణలో పదేపదే ముందుకొచ్చిందని సచార్ కమిటీ అనింది. ఏ రకమైన వర్గ వివక్షయినా భారత రాజ్యాంగానికి విరుద్ధం. అటువంటి ఫిర్యాదులను పరిశీలించడానికి న్యాయస్థానాలే కాక జాతీయ మానవ హక్కుల కమిషన్, మైనారిటీ కమిషన్ వగైరా సంస్థలున్నప్పటికీ న్యాయస్థానాలలో వ్యాజ్యాలు నడపడంలో ఉన్న సమస్యలు ఒకెత్తు కాగా, మిగిలిన కమిషన్‌ల అధికారాలు, పరిధి పరిమితమైనవని సచార్ కమిటీ గుర్తించింది. మైనారిటీలు వివక్షకు సంబంధించి ఫిర్యాదు చేసుకుని న్యాయం పొందగల వేదిక ఉండడం, దానికి ఈ విషయంలో స్పష్టమైన అధికారా లుండడం అవసరం అని భావించింది. ఈ సందర్భంగా బ్రిటన్‌లోని జాతి సంబంధాల చట్టాన్ని (రేస్ రిలేషన్స్ యాక్ట్‌ను) ఒక నమూనాగా ప్రస్తావించింది. తాను సూచించిన న్యాయ వేదికకు సమాన అవకాశాల కమిషన్ అనే పేరును కూడా సచార్ కమిటీ ప్రతిపాదించింది.

## 4. పాలనలో భాగస్వామ్యం

పాలనలో తగు భాగస్వామ్యం లేకపోవడం అభివృద్ధి ఫలాలను అందుకోలేక పోవడానికొక కారణం కాగలదని సచార్ కమిటీ గుర్తించింది. అన్ని స్థాయిలలోనూ ప్రాతినిధ్య వ్యవస్థలలో అగ్రకులాలది పెద్ద వాటా కాగా ఎస్‌సి, ఎస్‌టిలకు గ్రామ పంచాయితీ నుంచి పార్లమెంటు దాకా జనాభా దామాషాలో ప్రాతినిధ్యం రాజ్యాంగమే కల్పించింది. బిసిలకూ స్త్రీలకూ గ్రామ పంచాయతీ నుండి జిల్లా పరిషత్ వరకు రిజర్వేషన్ కల్పించబడింది. ముస్లింలకు మాత్రం ఏ స్థాయిలోనూ ఇది లేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే పంచాయితీలలో (అన్ని స్థాయిలలోనూ), మునిసిపాలిటీలలో, సహకార సంస్థలలో మైనారిటీల నుండి కోఆప్ట్ చేసుకునే ఏర్పాటు ఉంది. ఈ మార్గం ద్వారా సభ్యులైన వారికి ఓటువేసే హక్కు లేకున్నా కనీసం తమ వర్గానికి చెందిన సమస్యలను చర్చకు పెట్టే హక్కు, అవకాశం ఉన్నాయి. సచార్ కమిటీ ఈ ఏర్పాటును అభినందిస్తూ, ముస్లింలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఏ కారణంగానో రిజర్వేషన్ కల్పించాలని సూచించే బదులు నామినేషన్ పద్ధతి పెంచాలనింది. అయితే ఓటు హక్కులేని నామినేటెడ్ ప్రతినిధులు ఉండడం వల్ల లభించే ప్రయోజనం స్వల్పమే.

ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో ఎస్‌సిలకు రిజర్వ్ చేసిన అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలన్నీ ముస్లింలు అత్యధికంగా నివసించే ప్రాంతాలనే విషయాన్ని గణాంకాలతో సహా సచార్ కమిటీ చూపించింది. దీనివల్ల, కనీసం తాము అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాలలోనైనా తమ వారిని ఎన్నుకునే అవకాశం లేకుండా పోయిందని కమిటీ ముందు హాజరైనవారు అన్నారని చెప్పింది. సవర్ణ హిందువులు తమ రాజకీయ ఆధిపత్యాన్ని చేజారనియ్యకుండా ఉండడానికి ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకే ఎస్‌సి రిజర్వేషన్‌ను పరిమితం చేయడం దీనికి కారణం అనేది స్పష్టమే. నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపట్టినప్పుడు ఈ స్థితిని సవరించాలని సచార్ కమిటీ సూచించింది. ఈ మధ్యనే దేశవ్యాప్తంగా పూర్తయిన డీలిమిటేషన్ ఈ సూచనను లెక్కించిందో లేదో తెలీదు.

## 5. వైవిధ్యం పెంపుదల

మైనారిటీలు తమ వాడలకు, మొహల్లాలకు పరిమితం కావడం మంచిది కాదని గుర్తించి, నివాస స్థలాలలో, విద్యాలయాలలో, ఆటస్థలాలలో వైవిధ్యాన్నీ సహజీవనాన్నీ ప్రోత్సహించే సూచనలు సచార్ కమిటీ ఇచ్చింది. విద్యాసంస్థలకూ, నివాస కాలనీల బిల్డర్లకూ తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒక ముఖ్య సూచన. నగరంలో

ప్రభుత్వ స్థలాల వినియోగాన్ని గురించి నిర్ణయం తీసుకునేటప్పుడు భిన్నమతాల వారు కలిసి ఉండే ప్రాంతాలలో పార్కులకు, ఆటస్థలాలకు, లైబ్రరీలకు భూములు ఎక్కువ కేటాయించాలనేది మరొక సూచన. సామాజిక రంగాలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు సాంస్కృతిక, సామాజిక వైవిధ్యాన్ని గురించి అవగాహన కల్పించే శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలనేది కూడా చాలా ముఖ్యమైన సూచన.

## 6. విద్యారంగం

ఒక సామాజిక వర్గం పురోగమనంలో విద్యకుండే ప్రాముఖ్యం దృష్ట్యా దీనిమీద సచార్ కమిటీ చాలా దృష్టి పెట్టింది. ప్రాథమిక విద్య దశలోనే ముస్లింల స్థితి మరీ హీనంగా ఉందని సచార్ కమిటీ గుర్తించింది. స్కూలుకు పోయేవారి నిష్పత్తి, వారిలో అయిదవ తరగతి పూర్తి చేసేవారి నిష్పత్తి, ఈ రెండూ చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ఆ దశ దాటిన వారిలో చదువు కొనసాగించే వారి నిష్పత్తి మరీ అంత హీనంగా లేదు. కాబట్టి 14 సంవత్సరాల వరకు ఉచితంగా, నిర్బంధంగా చదువు నేర్పించాలని రాజ్యాంగం ప్రభుత్వంపైన పెట్టిన బాధ్యత ముస్లింల విషయంలో చాలా కీలకమైనదని సచార్ కమిటీ భావించింది. ప్రైవేట్ స్కూళ్ళు ముస్లింలకెక్కువగా అందుబాట్లో ఉండవు కాబట్టి ఉన్నత ప్రమాణాలు గల ప్రభుత్వ పాఠశాలలను ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో నెలకొల్పాలనింది. ముస్లిం కుటుంబాలు - ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో - ఇరుకైన చిన్న ఇళ్ళలో నివసిస్తున్నారు కాబట్టి ప్రాంతీయంగా స్టడీసెంటర్‌లు నెలకొల్పాలని, అక్కడ కూర్చొని చదువుకునే వాతావరణం కల్పించాలనీ అనింది. ఆడ పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు అన్నిచోట్లా లేకపోవడం ముస్లిం అమ్మాయిలు చదువు మానుకోవడానికొక కారణం కాబట్టి హైస్కూలు స్థాయిలో అటువంటి ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పాలనింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలలాగే ముస్లింలకు - ముఖ్యంగా అమ్మాయిలకు హాస్టళ్ళు నెలకొల్పాలనింది. మాతృభాషలో విద్యాబోధన విద్యాభివృద్ధికి చాలా కీలకం కాబట్టి ఉర్దూను మాతృభాషగా గల ముస్లిం వర్గాలున్న చోట ఉర్దూ మాధ్యమంలో స్కూళ్ళు నెలకొల్పాలనింది. ఉర్దూలో పాఠ్యపుస్తకాలు విరివిగా లభ్యం అయ్యేలాగ చూడాలనింది. మాధ్యమం సంగతి అటుంచి, ఉత్తర భారతదేశంలో త్రిభాషా సూత్రం కింద ఇంగ్లీష్ - హిందీ - సంస్కృతం నేర్పడం ఆనవాయితీ అయిపోయిన కారణంగా ఉర్దూ భాషను స్కూల్లో చదువుకునే అవకాశం సైతం లేకుండా పోయిందని వాపోయింది.

పాఠ్యాంశాలలోని విషయాలపైన కూడా సచార్ కమిటీ దృష్టి పెట్టింది. మన సమాజంలోని వైవిధ్యం పాఠ్యాంశాలలో కూడా ఉండాలనీ, లేకపోతే మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలు పాఠాలనుండి మానసికంగా దూరమయ్యే ప్రమాదం ఉందనీ అనింది. మైనారిటీలను కించపరిచే వ్యాఖ్యలు పాఠ్యాంశాలలో లేకుండా చూసుకోవడం అవసరం

అనింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విద్యారంగంలో కృషి చేసే ఎన్‌జివోల సహకారంతో పాఠ్యపుస్తకాలను ప్రక్షాళన చేసిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రశంసించింది. అధ్యాపకుల కిచ్చే తర్ఫీదు (టీచర్ ట్రైనింగ్) కూడా వైవిధ్యాన్ని గౌరవించే విశాల దృక్పథాన్ని నేర్పేదిగా ఉండాలనింది.

ఉన్నత విద్యలో ముస్లింల భాగస్వామ్యం చాలా తక్కువ అని గుర్తించిన సచార్ కమిటీ దానిని మెరుగుపరచడానికి కొన్ని సూచనలు చేసింది. అన్నిటికంటే సరళమైనది, సులభంగా అమలయ్యేది రిజర్వేషన్. అయితే ఏ కారణంగానో సచార్ కమిటీ విద్యా సంస్థలకు ప్రోత్సాహకాలు కల్పించే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంది. విద్యాలయాలకూ యూనివర్సిటీలకూ నిధులు సమకూర్చే యు.జి.సి వాటిలోని సామాజిక వైవిధ్యాన్ని బట్టి ఎక్కువ నిధులు ఇవ్వాలని అనింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులలో అనేక ముస్లిం సంస్థలు మైనారిటీ విద్యాసంస్థలు నెలకొల్పి ముస్లింలలో విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న వైనాన్ని ప్రస్తావించి, అయితే ఆ సంస్థలు ముస్లింలలోని పేదలకు అందుబాట్లో లేవని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. ఆ సంస్థలు పేదలకిచ్చే సీట్లను బట్టి ప్రభుత్వం వాటికిచ్చే వసతులు, ఆర్థిక సహాయం ఉండాలని సూచించింది.

మదరసాలలో చదువుకునే ముస్లిం పిల్లల శాతం చాలా తక్కువే అయినప్పటికీ ఆయా ప్రాంతాలలో అవే వారికి పాఠశాలలుగా ఉన్నాయి కాబట్టి వాటిని హైస్కూళ్ళతో ముడిపెట్టి మదరసాలో చదువు ముగించిన పిల్లలు నేరుగా హైస్కూలులో లేక కాలేజీలో చేరే అవకాశం కల్పించాలని సచార్ కమిటీ సూచించింది.

## 7. ఉపాధి

విద్య విషయంలో లాగే ఉపాధి విషయంలో కూడా సచార్ కమిటీ కచ్చితమైన హక్కులు కల్పించే సూచనలు కాక, సమాచార పారదర్శకత, ప్రోత్సాహకాలు మొదలైన మార్గాలను వెనుకబాటుతనానికీ వివక్షకూ విరుగుడుగా సూచించింది. అధికంగా స్వయం ఉపాధి రంగంలో చిక్కుకున్న ముస్లిం ప్రజానీకానికి బ్యాంకు రుణాలు అందుతున్నది చాలా తక్కువ కావడం వారి ఉపాధి అవకాశాలలోని స్తబ్దతను సూచిస్తుంది. బ్యాంకును అప్పు అడిగిన వారు ఏ సామాజిక వర్గానికి చెందినవారు, వారికి అప్పు ఇచ్చిందీ లేనిదీ తెలిపే సమాచారాన్ని బ్యాంకులు పారదర్శకంగా నమోదుచేసి ఉంచాలనీ, అమెరికాలో ఇటువంటి నియమం వివక్షను అరికట్టడానికి పనికొచ్చిందనీ సచార్ కమిటీ అంటుంది. 2001 జనాభా లెక్కలను బట్టి చూస్తే ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో బ్యాంకు శాఖలు తక్కువ ఉన్నాయని తెలుస్తున్నది కాబట్టి ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో శాఖలు తెరిచే బ్యాంకులకు ప్రోత్సాహం కల్పించాలని సచార్

కమిటీ అంటుంది. నాబార్డ్ వంటి సంస్థలు మైనారిటీలకు ప్రయోజనకరమైన పథకాలపైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అంటుంది. ముస్లింల జనాభా 25 శాతం మించి ఉన్న జిల్లాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరగాలని అంటుంది. ఎస్‌సి, ఎస్‌టిలకు, బిసిలకు ఉన్నట్టు ముస్లింలకు కూడా ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉండాలని అంటుంది.

సామర్థ్యాన్ని పెంచడం కోసం ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు విరివిగా నెలకొల్పాలని సచార్ కమిటీ సూచించింది. స్వయం ఉపాధి మీదనూ, దినకూలి మీదనూ ముస్లింలు ఎక్కువగా ఆధారపడుతున్నారు కాబట్టి రెండవ లేబర్ కమిషన్ సిఫారసులు త్వరగా అమలు చేయడం ముస్లిం ప్రజానీకానికి చాలా ఉపయోగకరం అనింది. ముస్లింలకు ఎక్కువగా ఉద్యోగాలిచ్చే సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం, ఉద్యోగ ప్రకటనలు ఉర్దూలో కూడా ఇవ్వడం, సంస్థలు తమవి 'సమాన అవకాశాల సంస్థలు' అని ప్రకటించుకోవడం ద్వారా వెనుకబడిన వర్గాల వారు కూడా అప్లై చేసుకోవడాన్ని ప్రోత్సహించడం - వగైరా చర్యలను సచార్ కమిటీ సూచించింది. ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలోని పోలీస్‌స్టేషన్లు, ఆస్పత్రులు వగైరా సంస్థలలో కనీసం ఒక్కో అధికారి అయినా ముస్లిం ఉండేటట్టు చూడాలన్నదొక్కటి నిర్దిష్టమైన ప్రతిపాదన.

సచార్ కమిటీ సూచనల స్వరూపం ఈ పాటికి అర్థమై ఉంటుంది. కచ్చితమైన హక్కులు కల్పించమని చెప్పకుండా హక్కులు లభించే దిశగా ప్రోత్సాహకాలు ఇవ్వడం, పారదర్శకత నెలకొల్పడం, వ్యవస్థ తమకు కూడా చోటు కల్పిస్తుందన్న విశ్వాసం కలిగించడం, ఇత్యాది చర్యలు సూచించడం సదుద్దేశంతో అనుసరించిన వ్యూహమే అయి ఉండవచ్చు. రిజర్వేషన్లు, కోటాలు కలిగించినంత వ్యతిరేకత ఇవి కలిగించవు. అందువల్ల వీటికి రాజకీయ ఆమోదం సులభతరం కావచ్చు. అయితే మన దేశ పాలనా యంత్రాంగంతో మనకున్న అనుభవం ఏమిటంటే కచ్చితమైన హక్కులకే భరోసా లేదు. అనిర్దిష్టమైన సూచనలు ఆమోదం పొందేయవచ్చు. కాని ఆ తర్వాత ఏమీ జరగకపోవచ్చు. అందుకే మొదట్లోనే అన్నాము - సచార్ కమిటీ సిఫారసుల కంటే వారి నివేదిక విలువైనదని.

కాగా, తాను సూచించిన చర్యలకు అవసరమైన నిధులను నిరుపయోగంగా ఉన్న ముస్లిం ప్రజల ధార్మిక ఆస్తులను అమ్మి, లేక వ్యాపార సంస్థలకు లీజుకిచ్చి సేకరించడం సబబుగా ఉంటుందన్న సచార్ కమిటీ సూచన ఎంతవరకు ఆమోదించ దగ్గదన్నది చర్చించాల్సిన విషయమే. ఎక్కువగా పట్టణ ప్రాంతాలలో ఉన్న వక్ఫ్ ఆస్తులు

ఇప్పుడు చాలా విలువైనవనడంలో సందేహం లేదు. వాటినుంచి ముస్లిం ప్రజలు పెద్దగా ప్రయోజనం పొందుతుండకపోవచ్చు. అయితే నిరుపయోగంగా ఉన్న వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం ద్వారా డబ్బు సంపాదించి దానిని ముస్లిం ప్రజల లౌకిక అభ్యున్నతి కోసం ఖర్చుపెట్టాలన్నది అనేక సమస్యలకు దారితీయగల సూచన. దీనిమీద ఇంకా చాలా చర్చ జరగవలసి ఉంది.

*మానవహక్కుల వేదిక  బులెటిన్ - 9*
*డిసెంబర్ 2008*

# ఒబిసిల కోటా అగ్రకులాలకు!

ఉన్నతస్థాయి కేంద్రీయ విద్యా సంస్థలలో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం చేసిందని పత్రికలలో అందరూ చదివే ఉంటారు. కాని ఆ చట్టం ఫలితంగా ఆ విద్యాసంస్థలలో అగ్రకులాల విద్యార్థులకు మరిన్ని సీట్లు దక్కాయంటే ఆశ్చర్యపోతారేమో. ఏ కేంద్రీయ విశ్వవిద్యాల యాన్నయినా, ఏ ఇతర ఉన్నతస్థాయి కేంద్రీయ విద్యాసంస్థ నయినా పరామర్శించండి - ఇది నిజమని తెలుస్తుంది. దీనికి కారణం, అగ్రకులాలు చేసిన రచ్చకు లొంగి కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని రూపొందించిన తీరు, దానికి సుప్రీంకోర్టు ఇచ్చిన వ్యాఖ్యానం.

కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటి, ఐఐఎం వంటి సంస్థలలో వెనుకబడిన వర్గాల విద్యార్థుల ప్రవేశం చాలా స్వల్పంగా ఉందని ప్రభుత్వం గుర్తించి, వారికి రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణ యించింది. రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో ఉన్న అదే స్థాయి విద్యాసంస్థలలో అనేక రాష్ట్రాలలో ఇప్పటికే ఆ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దాని సత్ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి కూడా. రాష్ట్ర విశ్వవిద్యాలయాలిప్పుడు పూర్తి అగ్రహారాలుగా లేవు. తొలుత విద్యార్థులలోనూ, తరువాత అధ్యాపకులలోనూ సామాజి కంగా వెనుక ఉంచబడ్డ కులాలవారు చెప్పుకోదగ్గ సంఖ్యలో ప్రవేశించ గలిగారు. కేంద్ర ప్రభుత్వం యాజమాన్యంలో ఉన్న విద్యా సంస్థలలోనూ అటువంటి రిజర్వేషన్లు ఎప్పుడో కల్పించ వలసింది. ఆలస్యంగానయినా ఆ ఆలోచన చేసిన కేంద్ర ప్రభుత్వం మొదట దానిని అనవసరంగా సంక్లిష్టం చేసుకునింది. ఏ చట్టమూ

జారీ చేయకుండానే రిజర్వేషన్లు ఇచ్చి ఉండవచ్చును గానీ, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కల్పించమని యాజమాన్యాలను ఆదేశించే అధికారం ప్రభుత్వానికి లేదంటూ సుప్రీంకోర్టు 2002లో అనాలోచితంగా వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని రాజ్యాంగ సవరణ ద్వారా అధిగమించ వలసిన అవసరాన్ని దీనితో కలిపింది. దానివలన అనవసరమైన లిటిగేషన్ కొని తెచ్చుకుంది.

అందుకోసం రాజ్యాంగాన్ని సవరించి ప్రభుత్వ రంగంలోనయినా, ప్రైవేట్ రంగంలోనయినా విద్యాసంస్థలలో సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులకు (ఒబిసిలకు) రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది అంటూ అధికరణం 15లో క్లాజ్ 5 చేర్చారు. ఆ అధికారాన్ని వినియోగించుకుని, కేంద్రీయ విద్యాసంస్థల అడ్మిషన్లలో వెనుకబడిన వర్గాలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆదేశిస్తూ చట్టం చేశారు. ఈ చట్టంలో ఉద్దేశించినవన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో కేంద్ర ప్రభుత్వం అజమాయిషీలో ఉన్న సంస్థలే కాబట్టి వీటిలో రిజర్వేషన్లు ఇవ్వడానికి చట్టం చేయనవసరం లేదు, చేసినా దానికి అధికరణం 15ను సవరించవలసిన అవసరం లేదు. ఏ ప్రతిభావంతుడి సలహా మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ పని చేసిందో తెలీదు. దీనివల్ల అధికరణం 15కు చేర్చిన 5వ క్లాజుతో బాటు ఈ రిజర్వేషన్‌ను కూడా సవాలు చేసే అవకాశం అగ్రకులాలకు దక్కింది.

వాళ్లు నిజానికి చట్టం చేయకముందే అల్లరి మొదలుపెట్టారు. ఉన్నతస్థాయి విద్యాసంస్థలలో 'ప్రతిభ'కు తప్ప దేనికీ చోటు ఉండకూడదని ఒకవైపు వాదిస్తూ, ఒకవేళ రిజర్వేషన్లు ఇచ్చేటట్టయితే ఎంత శాతం ఇస్తారో అంత శాతం మొత్తం సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ రెండు వాదనలకూ పొంతన లేదనేది స్పష్టమే. ఒకవేళ రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ప్రతిభ దెబ్బతినేటట్టయితే, సీట్లు పెంచితే దెబ్బతినకుండా ఉండదు కదా. వారి అసలు ఆందోళన తమ కోటాగా భావించే 'ఒ.సి' కోటా తగ్గకూడదనేది తప్ప వేరే ఏమీ కాదు. అంతేకాక, రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో ఉన్న అదే స్థాయి విద్యాసంస్థలలో దక్షిణ భారత రాష్ట్రాలలో, మహారాష్ట్రలో చాలాకాలంగా ఒబిసిలకు అమలవుతున్న రిజర్వేషన్ల వల్ల ఏం నష్టం జరిగిందో వివరించే ప్రయత్నం వారు గానీ, వారికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం గానీ చేయలేదు.

తలొగ్గడం మాత్రం జరిగింది. ఎంత మేరకు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వడం జరుగుతుందో అంతమేరకు మొత్తం సీట్లు పెంచాలని చట్టంలోనే కేంద్ర ప్రభుత్వం రాసేసింది. ఇది చిన్న విషయం కాదని ప్రభుత్వానికి తెలుసు. సీట్లు పెంచితే దానితోబాటు అధ్యాపకుల సంఖ్య పెంచవలసి ఉంటుంది. వైజ్ఞానిక సంస్థలలోనయితే పరిశోధనా పరికరాలు అదనంగా కొనవలసి ఉంటుంది. క్లాస్ రూంలు చాలకపోతే

కొత్తవి కట్టవలసి ఉంటుంది. చివరికి పెంచిన సీట్ల సంఖ్యతో ఈ చట్టాన్ని అన్ని కేంద్రీయ విద్యాసంస్థలలో అమలు చేయడానికి 17 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయని ప్రభుత్వమే అంచనా వేసింది. బలవంతుల బ్లాక్‌మెయిల్‌కు లొంగిన ఫలితం ఈ ఆర్థిక భారం.

విజయవంతంగా 'ఒసి' కోటా కాపాడుకున్నాము కదా అని అగ్రకుల శక్తులు ఊరుకున్నారా అంటే లేదు. రాజ్యాంగ సవరణనూ, దాని ఫలితంగా జారీ అయిన చట్టాన్నీ కూడ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. 'ప్రతిభ' అని తనను తాను పిలుచుకునే గుణంలోని సంకుచితత్వం ఎంతటిదో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. (కోర్టులో వారు చేసిన వాదనలలో ఒకటి: 'పేద విద్యార్థులకు ప్రాథమిక విద్య అందించడానికి డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం, ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసిలకు రిజర్వేషన్ ఇవ్వడానికి 17 వేల కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉండడం ఎంత అన్యాయం!') 1992లో 9 మంది జడ్జీల బెంచి మండల్ కమిషన్ కేసులో వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ రాజ్యాంగ బద్ధమేనని తీర్పు ఇస్తూ దానికి వ్యతిరేకంగా వచ్చిన అన్ని వాదనలకూ జవాబు చెప్పింది కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే ఏమయ్యేదో చెప్పలేము. మొదట వారి సవాలు ఇద్దరు జడ్జీల బెంచి ముందుకు రాగా వారు కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఆ కేసును అయిదుగురు జడ్జీల బెంచికి నివేదించారు. ఆ బెంచిలో ముగ్గురు మళ్ళీ అదే వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ కూడ మండల్ కమిషన్ తీర్పుకు తల ఒగ్గక తప్పదు కాబట్టి (ముగ్గురిలో ఒక జడ్జీ ఈ మాట అననే అన్నాడు) చివరికి రాజ్యాంగ సవరణనూ చట్టాన్నీ కూడా ఆమోదించారు. అయితే ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో మండల్ కమిషన్ జారీ చేసిన ఆదేశాన్ని అనుసరించి విద్యా రిజర్వేషన్లలో కూడా వెనుకబడిన వర్గాలలో 'క్రీమీలేయర్'ను తొలగించాలన్న నియమం ఎంత సబబన్న విషయం ఎట్లాగున్నా, ఉన్నత విద్య దాకా ఎంతో కొంత స్తోమత ఉన్నవారే రాగలరు కాబట్టి క్రీమీలేయర్ తొలగింపు నియమం వల్ల అసలెవరూ రిజర్వేషన్‌ను అందుకోలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. అదే జరిగింది. కనీసం ప్రవేశ అర్హత కోసం ఆయా విద్యాసంస్థలు నిర్వహించే పరీక్షలో పొందవలసిన మార్కులను తగినంత సడలించినా ఇంకొంత మంది అందుకునేవారేమో. కానీ దానికీ సుప్రీంకోర్టు అడ్డుపడింది.

మొదట కేంద్ర ప్రభుత్వం ప్రవేశపరీక్షలో పొందవలసిన కనీస మార్కులను వెనుకబడిన వర్గాల విషయంలో ఎంతమేరకు సడలించేదీ ఆయా విద్యాసంస్థలే నిర్ణయించాలని ఒక ఆదేశం జారీ చేసింది. 'విద్యా ప్రమాణాలను కాపాడుకుంటూ తగినంత మంది వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉండేటట్టు నిర్ణయం చేయమని' అనింది. అయితే ఎంతమేరకు సడలించవచ్చు, నిండకుండ మిగిలిపోయిన వెనుకబడిన వర్గాల కోటాను ఏం చేయాలి అన్న ప్రశ్నలతో ఒక రిటైర్డ్

ఐఐటి ప్రొఫెసర్ మళ్ళీ సుప్రీంకోర్టుకు పోయాడు. 'ఇది న్యాయస్థానాలు చేయవలసిన నిర్ణయం కాదు. ప్రభుత్వాన్ని అడగండి' అని కోర్టు అనవలసింది. అయితే రిజర్వేషన్ల విషయంలో విధాన నిర్ణయాలు తామే చేయాలన్న ఉబలాటం న్యాయస్థానాలలో చాలా పెరిగింది. అది తమ పరిధిలోని విషయం కాదన్న తటపటాయింపు వారిని ఆపడం లేదు. అందువల్ల సుప్రీంకోర్టు ప్రవేశ అర్హతకు పొందవలసిన మార్కులను నూటికి 10 కంటె తగ్గించటానికి వీలులేదనీ, నిండకుండా మిగిలిపోయిన సీట్లు ఒ.సి కోటాలో నింపాలనీ ఆదేశించింది. నిజానికి ఈ ప్రవేశపరీక్షలు ఆయా విద్యా సంస్థలు అప్లై చేసుకున్న విద్యార్థులను జల్లెడ పట్టడానికి రూపొందించుకున్నవే. వారందరికీ ఆ కోర్సులో చేరడానికి అవసరమైన ప్రాథమిక అర్హత ఎలాగూ ఉంటుంది. ఉంటేనే అప్లై చేయగలుగుతారు. కాబట్టి ప్రవేశ అర్హత కోసం ఆ ప్రవేశ పరీక్షలో పొందవలసిన మార్కులను రిజర్వేషన్ లక్ష్యాన్ని సాధించడం కోసం కొంచెం ఎక్కువగానే తగ్గించినా తప్పేమీ లేదు. కాని సుప్రీంకోర్టు ఇదేదీ లెక్కలోకి తీసుకోకుండ తన పరిధిలో లేని ఆదేశం జారీ చేసింది.

అందుకే ఈ సంవత్సరం అన్ని కేంద్రీయ ఉన్నత విద్యా సంస్థలలోనూ సగానికి సగం మిగిలిపోయిన వెనుకబడిన వర్గాల కోటా ఒసి కోటాలో కలిసి అగ్రకులాలవారు ఎప్పటికంటె ఎక్కువ మోతాదులో సీట్లు పొందగలిగారు. ఓడిపోయి గెలిచే ప్రతిభ అందరికీ ఉండదు మరి!

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*26 ఆగస్టు 2009*

అనుబంధం

# గట్టి ప్రయత్నం అవసరం

వెనుకబడిన తరగతులవారికి రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 340 అధికరణ కింద 1953లో మొదటిసారిగా కాకాసాహెబ్ కలేల్కర్ కమిషన్‌ను నియమించింది. అయితే ఆ కమిషన్ నివేదికను పార్లమెంటుకు సమర్పించటం గాని, ఆమోదించటం గాని జరగలేదు. తర్వాత 26 ఏళ్ళకు 1979లో బి.పి. మండల్ అధ్యక్షతన జనతా ప్రభుత్వం మరో కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ తన నివేదికను పార్లమెంటుకు సమర్పించిన దాదాపు పది సంవత్సరాల తర్వాత నివేదికలోని కొన్ని సూచనలను (కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించే సూచన మాత్రమే) అమలు చేయటానికి వి.పి.సింగ్ ప్రభుత్వం ప్రయత్నించింది. దీనికి అగ్రకులాల నుంచి ఎదురయిన తీవ్ర ప్రతిఘటనను సాకుగా తీసుకుని సుప్రీంకోర్టు స్టే మంజూరు చేసింది.

దీనికి ముందు కూడా వివిధ రాష్ట్రాల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వాలు జారీచేసిన ఉత్తర్వులను రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టుల్లో సవాలు చేశారు. మొదట్లో కోర్టులు వారి వాదనలను సమర్థిస్తూ వాటిని కొట్టివేయడం జరిగింది. అయితే 1975 సంవత్సరం నుండి రిజర్వేషన్ల పట్ల కోర్టుల దృక్పథంలో కొంతమార్పు వచ్చింది. అందువల్ల రిజర్వేషన్ వ్యతిరే కులు ఇప్పుడు ఉద్యమాల ద్వారా వాటి అమలును ఆపేప్రయత్నం చేస్తున్నారు. 1980లో, మళ్ళీ 1985లో గుజరాత్‌లో రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం ఉధృతంగా సాగింది. 1985 ఆందోళనలో

అక్కడ దాదాపు 200 మంది పేదప్రజలు, అమాయకులు బలయ్యారు. ప్రస్తుతం మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా రిజర్వేషన్ వ్యతిరేకశక్తులు దేశవ్యాప్తంగా ఉద్యమించి బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఏ మాత్రం రిజర్వేషన్లు అమలుచేసినా ప్రభుత్వాలనే పడగొట్టే స్థాయికి చేరుకున్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో భాగమైన రిజర్వేషన్లను కాపాడు కోవడానికి వెనుకబడిన తరగతులవారు చాలా గట్టి ప్రయత్నమే చేయాల్సి వస్తోంది.

కాయకష్టం చేసుకుని బ్రతికే దళిత ప్రజల జీవితం దినదినగండంగా తయారయింది. వాళ్ళ వృత్తులు నాశనం అయినాయి. ప్రత్యామ్నాయ జీవన అవకాశాలు దొరకడం లేదు. వాళ్లు తమ హక్కుల కోసం నిలబడి అడిగితే భూస్వాములూ పెత్తందార్లూ కుల వ్యతిరేకతను రెచ్చగొట్టి వాళ్ళమీద పాశవికమయిన దాడులు చేయిస్తున్నారు. కారంచేడు నుండి ఇప్పటిదాకా జరిగిన ఏ ఒక్క దాడిలోనూ సరయిన న్యాయం జరగలేదు. దళిత కులాల సాధారణ పరిస్థితి ఇలాగుండగా వాళ్ళలో కొంచెం చదువుకున్న వాళ్లు ప్రభుత్వ ఉద్యోగరంగంలోనయినా ప్రవేశించి జీవనం సంపాదించుకుందామని ప్రయత్నిస్తే దానికి పెద్దఎత్తున ప్రతిఘటన వస్తూవుంది. ఉద్యోగరంగాన్ని తమ గుత్తాధిపత్యంలో పెట్టుకున్నవాళ్ళు 'ప్రతిభ' పేరిట అడ్డుపడుతున్నారు. సామాజిక న్యాయాన్ని గురించి కోర్టులు అనుసరించిన వైఖరిని ఈ నిర్దిష్టమయిన నేపథ్యంలో అర్థం చేసుకోవాలి.

ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల పట్ల కోర్టుల దృక్పథాన్ని తెలుసుకోవడం కూడా అవసరం. సుప్రీంకోర్టు *బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూరు* (1963) కేసులో ఇచ్చిన తీర్పును ఇప్పటికీ శిరోధార్యంగా, గీటురాయిగా చెప్పుకుంటారు. కాని 1975 తర్వాత సుప్రీంకోర్టు ఇందుకు భిన్నమైన తీర్పులు ఇచ్చింది. 1985లో కర్ణాటక ప్రభుత్వం *వసంతకుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక (AIR 1985, Sc 1495 పేజీ)* కేసులో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించడానికి, వారిని గుర్తించడానికి ఒక కమిషన్‌ను వేస్తామని, ఇందుకు సుప్రీంకోర్టు తగిన సూచనలు చేయాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు ఐదుగురు జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తమ సూచనలు తెలిపింది. వీటిలో ప్రతిభ, సామర్థ్యం, అగ్రకులాల్లోని పేదవారికి రిజర్వేషన్లు, అసలు రిజర్వేషన్లకు ప్రాతిపదిక మొదలైన అంశాలు చర్చకు వచ్చాయి. ఈ ఐదుగురు జడ్జీలలో ఒకరైన జస్టిస్ చిన్నపరెడ్డిగారి అభిప్రాయాలు 'రిజర్వేషన్లు సమాజంలో సమానత్వం సాధించడానికి ప్రజాస్వామ్యబద్ధమైన ఒక సాధనం' అనే

దృక్పథానికి దగ్గరగా ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న రిజర్వేషన్ వ్యతిరేక, అనుకూల వాదనలను రాజ్యాంగపరంగా, న్యాయస్థానాల పరిధిలో అవగాహన చేసుకోవడానికి దోహదం చేస్తుందనే ఉద్దేశ్యంతో జస్టిస్ చిన్నపరెడ్డిగారి అభిప్రాయాల సంక్షిప్త అనువాదాన్ని ఈ పుస్తకరూపంలో ప్రచురిస్తున్నాం.

**'రిజర్వేషన్లు - సామాజిక న్యాయం - కోర్టులు'**
*బుక్‌లెట్‌కి బాలగోపాల్ ముందుమాట*
*ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అనంతపురం జిల్లా శాఖ ప్రచురణ*
*డిసెంబర్ 1990*

# రిజర్వేషన్లు - సామాజిక న్యాయం - కోర్టులు

రాజ్యాంగం ప్రజలందరికీ సమానత్వాన్ని, సమాన అవకాశాలను, సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని అమలు చేస్తానని వాగ్దానం చేసి మూడు దశాబ్దాలు దాటింది. రాజ్యాంగంలోని అధికరణాలు 15(4), 16(4) కింద విద్యాసంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ఈ రోజు ఈ రిజర్వేషన్ల సదుపాయాన్ని పొందటానికి 'మమ్మల్ని వెనుకబడిన తరగతులుగా గుర్తించండని' చాలామంది డిమాండు చేస్తున్నారు. ఒక కులాన్ని వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలనీ, వేరొక కులాన్ని తొలగించాలనీ ఘర్షణ పడుతున్నారు. ఇది చాలా దురదృష్టకరమైన పరిణామం. కర్ణాటక రాష్ట్రంలోని వక్కళిగలు, లింగాయతులు తమను వెనుకబడిన తరగతులుగా గుర్తించాలని కోరుతున్నారు. అలా గుర్తింపు పొంది రిజర్వేషన్ల వల్ల లాభం పొందాలని ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతులను గుర్తించడానికి కమిషన్లను వేయటం, సమర్పించిన నివేదికలను పరిశీలించటం, రిజర్వేషన్లను అమలు చేస్తామని ఉత్తర్వులు జారీచేయటం, చివరికి వాటిని కోర్టుల్లో సవాలు చేయడం రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుండి జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మళ్ళీ కర్ణాటక ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమిస్తానని, అందుకు తగిన సూచనలు చేయాలని సుప్రీంకోర్టును కోరినందున రిజర్వేషన్ల సమస్యను కొంత విపులంగా పరిశీలించాల్సి వచ్చింది.

భారతదేశం సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా చాలా వైవిధ్యం గల సమాజం. దేశంలో గర్వించదగ్గ అంశాలు ఉన్నప్పటికీ మనం సిగ్గుపడాల్సిన విషయాలు కూడా చాలా ఉన్నాయి. అందులో సామాజిక, ఆర్థిక అసమానతలు ప్రధానమైనవి. షెడ్యూల్డు కులాలు, తెగలవారు, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారు - ఒక్క మాటలో చెప్పాలంటే బలహీనవర్గాలకు చెందిన ప్రజలు ఉన్నతవర్గాల స్థాయికి చేరడానికి చాలా అడ్డంకులు దాటవల్సి ఉంది. వీరికి ప్రత్యేకంగా సహాయ సౌకర్యాలను, చేయూతను ఇవ్వాల్సిన అవసరమెంతైనా ఉంది. వీరి అభివృద్ధి ప్రభుత్వం దయా దాక్షిణ్యాల మీద ఆధారపడిన విషయంగా కాక, వారి హక్కుగా గుర్తించాలి. వారి కోర్కెలను, డిమాండ్లను హక్కులుగా అర్థం చేసుకోవాలి. ఏకలవ్యుడి రోజులు పోయాయి. వారు ఇప్పుడు రాజ్యాంగం వాగ్దానం చేసిన సమానత్వాన్ని, సమాన అవకాశాలను, తద్వారా సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్నీ కోరుతున్నారు. వీటిని ఆచరణలో సాధించడానికి రాజ్యాంగం అధికరణాలు 15(4) మరియు 16(4) ద్వారా విద్యాసంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పించింది.

కర్ణాటక ప్రభుత్వానికి సూచనలు చేసేముందు రిజర్వేషన్ సమస్య పట్ల మనం మనకున్న పాలకవర్గ భావజాలం నుండి, కులీనవర్గం ఆలోచనా పద్ధతి నుండి, లోప భూయిష్టమైన సాంప్రదాయక ఆలోచన నుండి బయటపడాలి. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వపు హక్కును విస్మరించి రిజర్వేషన్లు వెనుకబడిన తరగతులకు దయతో, సానుభూతితో ప్రవేశపెట్టారని అనుకోవడం లేక అమెరికా న్యాయశాస్త్రం నుండి అరువు తెచ్చుకున్న పదాలను - Protective Discrimination, Preferential Treatment and Compensatory Discrimination - వాడటం సరైన పద్ధతి కాదు. ఈ ఆలోచనా పద్ధతి నుండి మనం బయటపడకపోతే వెనుకబడిన తరగతులకు రాజ్యాంగం సాధిస్తానన్న సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాల ప్రాముఖ్యతను తెలుసుకోలేము.

'ప్రతిభ'కు, రిజర్వేషన్లకు మధ్య వైరుధ్యం ఉందని భావించటం కులీనవర్గాల ఆలోచనా పద్ధతి. ఇది వాస్తవం కాదు. సకల సౌభాగ్యాలతో జీవించే ధనికులకు, పేదరికంతో బాధపడే ప్రజలకు మధ్య నిజమైన వైరుధ్యాలే ఉన్నాయి. దేశంలో అధిక శాతం జనాభా దారిద్ర్యంతో, నిరక్షరాస్యతతో బాధ పడుతున్న పరిస్థితిలో, వారి గురించి ఆలోచించేటప్పుడు 'ప్రతిభ' గురించి మాట్లాడటం చాలా ప్రమాదకరమైన ఫలితాల నిస్తుంది. 'ప్రతిభ' అంటే ఏమిటి? దారిద్ర్యాన్ని, నిరక్షరాస్యతను, ప్రజా వ్యతిరేక సంస్కృతిని పెంచి పోషించే వ్యవస్థకు ప్రతిభ లేదు. 'ప్రతిభ' మనిషి పుట్టుక మీద కాకుండా చుట్టూ ఉన్న పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. షెడ్యుల్డు కులానికి చెందిన పిల్లవాళ్ళు చదువుకోవడానికి పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉండవు. వినడానికి, చూడటానికి రేడియో, టి.వి ఉండవు. ఇంటి దగ్గర చదువులో సహకరించగల

స్థోమత, అవకాశం వారి తల్లిదండ్రులకుండదు. సరయిన సంరక్షణ ఉండదు. ఈ పిల్లవాళ్ళకు పరీక్షలో 40 శాతం మార్కులు వచ్చినా ఇంటి దగ్గర అన్ని వసతులూ ఉండి, పబ్లిక్ స్కూళ్ళలో చదువుకొని 70 శాతం మార్కులు సాధించిన విద్యార్థుల కంటే వీళ్ళే ప్రతిభావంతులు. సామాజికంగా, సాంస్కృతికంగా ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని ఉన్నత విద్యనభ్యసించినవారే ప్రతిభావంతులు.

రిజర్వేషన్ వ్యతిరేకుల పెదాలపై 'సామర్థ్యం' అనే మరో పదం కూడా ఎప్పుడూ నాట్యం చేస్తూ ఉంటుంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించితే 'సామర్థ్యం' నాశనమవుతుందని వాదిస్తారు. ప్రమోషన్లలో రిజర్వేషను అమలు చేస్తే 'సామర్థ్యం' దెబ్బ తింటుందని బాధపడతారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత పదవులు అగ్రకులాల వారికి మాత్రమే పరిమితమైన నందనవనంగా భావిస్తారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందటానికి ఉద్యోగం ఒక సాధనం. ఈ అవకాశం అగ్రకులాల వారికే ఉండాలని, రిజర్వేషన్ల వల్ల నిమ్నకులాల వారు, వెనుకబడిన కులాల వారు వచ్చి తమ నందనవనాన్ని కలుషితం చేస్తున్నారని వీరి భావన. అందుకే 'సామర్థ్యం' పడిపోతున్నదని వాదిస్తారు. ప్రభుత్వ సర్వీసుల్లోని ఉన్నత పదవులు వారి సొంతమైనట్లు, రిజర్వేషన్ కోవకు చెందిన వారు వీటిని కబళిస్తున్నట్లు భయపడుతున్నారు. దళిత కులాల వారిని నీచంగా చూడటం వీళ్ళ సంస్కృతి. ఈ ఆలోచనా పద్ధతి పాలకవర్గాల భావజాలం. 'ప్రతిభ', 'సామర్థ్యం' పేరుతో న్యాయమైన, ప్రజాస్వామికమైన రిజర్వేషన్ విధానాన్ని వాళ్ళు వ్యతిరేకిస్తున్నారు. వీటిని సరిగా అవగాహన చేసుకోవడానికి వారు ఇష్టపడడం లేదు. అందుకే బలహీనవర్గాలకు చెందిన ప్రజలు వారి వ్యతిరేకతను, ఇతర అడ్డంకులను ఎదుర్కోవాల్సి వస్తున్నది.

'సామర్థ్యం' అనేది గురువు శిష్యుని చెవిలో ఊదే మంత్రం కాదు. పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకొన్నంత మాత్రాన పరిపాలనాదక్షులు కాలేరు. అర్హతలతో పాటు సమాజంలోని బలహీనవర్గాల ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని పరిష్కరించే వారే మంచి పరిపాలనాదక్షులు. అయితే బలహీనవర్గాల అభ్యున్నతి అగ్ర కులాలకు చెందిన అధికారుల నుండి ఆశించడం అసహజమే అవుతుంది. ఇంతెందుకు, స్వాతంత్ర్యం వచ్చి 35 సంవత్సరాలు దాటినా షెడ్యూల్డు కులాల, తెగల పరిస్థితి ఎందుకు బాగుపడలేదు? జిల్లా యంత్రాంగంలో, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో వెనుకబడిన తరగతులకు చెందినవారు ఎందుకు ప్రవేశించలేకపోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పటం కోర్టుల పరిధికి మించిన పని. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల మంచిచెడ్డల గురించి వ్యాఖ్యానించడం కోర్టుల పని కాదు. వెనుకబడిన తరగతులకు చెందిన వారిని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడానికి సరైన మార్గాలను, సూత్రాలను, కనీస అర్హతలను ప్రభుత్వం నిర్దేశించవచ్చు. డాక్టరు, ఇంజనీరు కావడానికి, ఆ వృత్తులలో ప్రత్యేక నైపుణ్యం సాధించడానికి కనీస అర్హతలను పెట్టవచ్చు. ప్రస్తుతం

పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులకు, అందులో ఉత్తీర్ణులు కావడానికి కనీస అర్హతలు ప్రభుత్వం నిర్దేశించి అమలు చేస్తున్నది. 'సామర్థ్యం' పేరు చెప్పి ఉన్నత పదవులను అగ్రకులాలు, వర్గాలు సొంతం చేసుకోడానికి వీలులేదు. కాబట్టి ఉన్నత విద్యాసంస్థల్లో, ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తప్పక ఉండాలి.

సమానత్వం వ్యవస్థను బట్టి, అందులోని పరిస్థితుల ఆధారంగా నిర్ణయించ బడుతుంది. పుట్టుకతోనే మనిషికి ప్రతిభ ఉండదు. ప్రతిభ స్వంతంగా సాధించుకునేది కాదు. సామాజిక పరిస్థితుల వల్ల అది నిర్ణయించబడుతుంది. కావున ప్రతిభ అనే వాదన రిజర్వేషన్ల అమలు స్వభావాన్ని సరిగా అర్థం చేసుకోకుండా గందరగోళపరుస్తుంది.

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన అధికరణలు 15(4), 16(4) రిజర్వేషన్ సౌకర్యాలను కల్పిస్తున్నాయి. ఈ హక్కుల ముందు 'ప్రతిభ'కు, 'సామర్థ్యాని'కి ప్రాధాన్యం లేదు. అయితే అసలు సమస్య షెడ్యూల్డు కులాలు, తెగలు, సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారు అంటే ఎవరు అనేది, విద్యాసంస్థల్లో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందటానికి అర్హులు ఎవరు అనేది. వీరిని గుర్తించటానికి అందరికీ వర్తించే ప్రాతిపదిక ఏదీ లేదు. అందుకోసం మన సమాజ స్వభావాన్ని, పరిస్థితులను మొత్తంగా అర్థం చేసుకోవాలి.

ధనికవర్గాలు, పేదవర్గాలు, మధ్యతరగతి, అలాగే పాలకవర్గం, కార్మికవర్గం అనే పదాలను మనం మన మాటల్లో సాధారణంగా వాడుతుంటాం. అయితే రాజ్యాంగం లోని అధికరణ 15(4), 16(4)లలో వాడిన 'వర్గాలు' అనే పదానికి అర్థం ఏమిటి? సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు అర్థం ఏమిటి? అసలు వెనుక బాటుతనం అంటే ఏమిటి? ఈ పదాలను అర్థం చేసుకోవడానికి మొదట సామాజిక అసమానతలను అర్థం తెలుసుకోవాలి. సమాజంలో వ్యక్తులు, వారి వర్గపునాది, సమాజంలో వారి స్థితి, అధికారంతో వారికి గల సంబంధాన్ని బట్టి సామాజిక అసమానత ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి వర్గం అతను ఉత్పత్తి క్రమంలో (ఉత్పత్తి, పంపిణీ, వినిమయం) పాల్గొనే విషయం మీద ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత అసమానతను - అతని ఆదాయం, సంపాదనా మార్గాలు, సంఘంలో ఉన్నత స్థాయికి పోవడానికి అతనికున్న అవకాశాలు ప్రధానంగా నిర్ణయిస్తాయి. ఒక వ్యక్తి వర్గం అతడు ఆర్థిక అంతస్తులో ఏ స్థాయిలో ఉన్నాడనే దాని ఆధారంగా నిర్ణయించవచ్చు.

సమాజంలో వ్యక్తి స్థితి(Status)ని ఆచారాలు, అలవాట్లు, సంఘంలో ఉన్న గౌరవాన్ని బట్టి నిర్ణయించవచ్చు. నైపుణ్యంతో పనిచేసే కార్మికులు కూలివాళ్ళకంటే తాము గొప్ప అనుకుంటారు. అలాగే ఒక ఇంజనీరు లేదా డాక్టరు ఇతరుల కంటే ఉన్నత స్థానంలో ఉన్నట్లు భావిస్తారు. వేషభాషలను బట్టి కూడా వ్యక్తి స్థితిని అంచనా

వేయొచ్చు. అయితే ఇవన్నీ ప్రధానంగా వ్యక్తి ఆదాయంపై ఆధారపడి ఉంటాయి. అలాగే రాజకీయ అధికారం లేదా నిర్ణయాధికారంలో వ్యక్తి పాత్రను బట్టి ఆ వ్యక్తికుండే అధికారాన్ని అంచనా వేయవచ్చు. ఒక వ్యక్తి లేదా వర్గం యొక్క రాజకీయాధికారం ప్రధానంగా ఆర్థికాధికారం పైనే ఆధారపడి ఉంటుంది. కావున వ్యక్తుల వర్గం, స్థితి, అధికారం వారి యొక్క ఆర్థిక అధికారాన్ని బట్టి ఉంటాయి. ఆర్థిక అసమానత సామాజిక అసమానతలకు ముఖ్యమైన కారణం. బలహీనవర్గాల సామాజిక లేక ఆర్థిక అసమానతలకు, వారి వెనుకబాటుతనానికి పేదరికం మూలం. ఈ వెనుకబాటుతనానికి భారతదేశంలో ప్రత్యేకించి కులం ఎక్కువగా దోహదం చేస్తున్నది. ఈ కులం మనుషులను విడగొట్టి కొందరిని నీచమైనవారిగా పరిగణించి సమాజంలో వారి స్థానాన్ని నిర్ణయిస్తున్నది. సంఘంలో తక్కువ స్థానం నుండి ఉన్నత స్థితికి చేరడానికి కులం అడ్డం వస్తున్నది.

గ్రామాల్లోని భూస్వాములు, వ్యాపారస్తులు, పురోహిత వర్గం అగ్రకులాలకు చెందినవారే. వీరికంటే క్రింది స్థాయిలో ఉన్నవారు శూద్రులు. అంతకంటే హీనంగా ఉన్నవారు షెడ్యూల్డు కులాలకు చెందిన అంటరానివారు. వీరు చాలా వెనుకబడి పేదరికంలో కూరుకొనిపోయి, విద్యా ఉద్యోగావకాశాలు అందుబాటులో లేక ఇప్పటికీ అగ్రకులాలవారితో పోటీకి నిలబడలేకపోతున్నారు.

భారతదేశంలో కులానికి, ఆర్థిక స్థితికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. భూమి, విద్య అగ్రకులాల గుత్తాధిపత్యంగా కొనసాగుతున్నది. వ్యాపారం, గౌరవప్రదమైన వృత్తులు చేసేవారు తరువాతి కోవలోకి వస్తారు. శారీరక శ్రమ, మలినమైన పనులు చేసేవారు అన్ని కులాల కంటే తక్కువగా చూడబడతారు. కులాన్నీ వృత్తినీ బట్టి సమాజంలో వ్యక్తి స్థానాన్ని, ఆర్థిక హోదాను నిర్ణయించటం జరుగుతోంది. దళిత కులాలకి చెందినవారు సాధారణంగా పేదవారు. పేదవారిలో ఎక్కువ శాతం ఈ కులాలకి చెందినవారే. ఒక వ్యక్తికి సమాజంలో ఉండే హోదా, ఆర్థిక బలం ఆ వ్యక్తి కులంతో ముడిపడి ఉన్నాయి. కావున భారతదేశంలో వెనకబాటుతనానికి పేదరికం కారణమైతే ఈ పేదరికానికి కులం ఒక ప్రధాన కారణం. కులాన్ని బట్టి వెనుకబాటుతనాన్ని (సామాజికంగా, విద్యాపరంగా) అంచనా వేయవచ్చును. మన వ్యవస్థలో కులం వివిధ స్థాయిల్లో ఉంది. హిందూమతంలో చాలా కులాలున్నాయి. ఇతర మతాలలోకి కూడా ఈ కులాలు పాకాయి. ఉదాహరణకు క్రిస్టియన్ రెడ్లు, క్రిస్టియన్ హరిజనులు, క్రిస్టియన్ కమ్మలు. ఆంధ్రరాష్ట్రంలో దూదేకుల కులానికి చెందినవారు వాస్తవానికి ముస్లిం మతస్తులు. అయితే వీరికి గ్రామాల్లో వెనుకబడినవారిగానే గుర్తింపు ఉంది.

సమాజంలోని ఆర్థిక అంతస్తులు, కులం, వృత్తి, ఆచారాలు, అలవాట్లు, విద్యా పరిమాణం 'సామాజిక, విద్యాపరమయిన వెనుకబాటుతనాన్ని' సూచిస్తాయి. పై

అంశాలను బట్టి సామాజిక పరిశోధకులు ఒక కులానికి చెందినవారు వెనుకబడిన వర్గమా కాదా అనే విషయాన్ని సులభంగానే నిర్ణయించవచ్చు. అడవుల్లో, కొండల్లో, ఎడారుల్లో జీవిస్తున్నవారు, నీచమైనవిగా భావించబడుతున్న వృత్తులపై ఆధారపడి బతుకుతున్న వారు సాధారణంగా పేదలు. వీరందరిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనం ఉంటుంది.

షెడ్యూల్డు కులాలు, తెగలకు, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రాజ్యాంగంలో వివిధ అధికరణాల ద్వారా ప్రత్యేక సౌకర్యాలను, రిజర్వేషన్లను రాజ్యాంగ నిర్మాతలు కల్పించారు. (అధికరణాలు 15(4), 16(4), 330 నుండి 342). లోక్‌సభలో, రాష్ట్ర అసెంబ్లీలో షెడ్యూల్డు కులాలకు, తెగలకు, ఆంగ్లో - ఇండియన్లకు రిజర్వేషన్ సౌకర్యం ఉంది. అయితే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు ఈ అవకాశం లేదు. అంతేగాక కేంద్ర సర్వీసుల్లో రిజర్వేషన్ సదుపాయం లేదు. షెడ్యూల్డు కులాలకు, తెగలకు సంబంధించిన సమస్యలను, డిమాండ్లను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన కార్యక్రమాలు అమలుచేయవల్సిన బాధ్యతను రాజ్యాంగం ప్రభుత్వంపై ఉంచింది. కాని వెనుకబడిన తరగతులకు సంబంధించిన ఈ బాధ్యత గురించి రాజ్యాంగంలో ఇంత నిర్దిష్టంగా ఏమీ లేదు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి సూచనలు చేయడానికి ఒక కమిషన్ వేయవచ్చని రాజ్యాంగంలోని అధికరణ 340 తెలుపుతుంది. (కాని కమిషన్ సమర్పించిన నివేదికను తప్పనిసరిగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద లేదు.)

రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లోని 14వ అధికరణం చట్టం ముందు అందరూ సమానులని, అందరికీ సమాన అవకాశాలు ఉండాలని నిర్దేశిస్తుంది. 15(1) అధికరణం మతం, కులం, లింగం, జన్మస్థలాన్ని బట్టి పౌరుల మధ్య వివక్ష చూపడాన్ని నిషేధిస్తుంది. అధికరణం 29(2) ప్రభుత్వ సహాయంతో ఏర్పాటయిన విద్యాలయాల్లో జాతి, కుల, మత, భాషల ఆధారంగా ప్రవేశం నిరాకరించడాన్ని నిషేధిస్తుంది. అయితే అధికరణం 15(3) కింద ప్రభుత్వం స్త్రీలకు, బాలలకు ప్రత్యేక సదుపాయాలను కల్పించవచ్చు. అలాగే అధికరణం 15(4) ప్రకారం సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ప్రత్యేక సౌకర్యాలను కల్పించవచ్చు. ఇటువంటి సౌకర్యాలు కల్పించటానికి అధికరణాలు 15(1) గాని, 29(2) గాని అడ్డంకి గావు. అదే విధంగా 16వ అధికరణం ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంపిక, నియామక విషయాల్లో సమాన అవకాశాలను కల్పిస్తుంది. 16(2)వ అధికరణం ఉద్యోగావకాశాల్లో జాతి, కుల, లింగ, మతాల ఆధారంగా వివక్ష చూపరాదని చెబుతుంది. అధికరణం 16(4) ప్రకారం ప్రభుత్వం దృష్టిలో వెనుకబడిన వర్గాలకు చెందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేనప్పుడు వారికి

రిజర్వేషన్ సదుపాయం కల్పించవచ్చును. ఈ రిజర్వేషన్లు అధికరణం 16(1)కి వ్యతిరేకం కాదు. కావున విద్యాసంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పించటానికి ప్రాథమిక హక్కులైన 15(4), 16(4) అధికరణాలు చాలా ముఖ్యమైనవి.

అధికరణం 15(4)లో రాజ్యాంగ నిర్మాతలు ఉపయోగించిన 'సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు' అనే పదాలకు, అలాగే అధికరణం 16(4)లో వాడిన 'ప్రభుత్వ ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలు' అనే పదాలకు తేడా లేదు. రాజ్యాంగ నిర్మాతలు పై పదాలను 'వెనుకబడిన వర్గాలు' అనే అర్థంలోనే ఉపయోగించారు. *త్రిలోకనాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ జమ్ము కాశ్మీర్* కేసులో కోర్టు తీర్పునిస్తూ అధికరణం 16(4) అమలుకు సంబంధించి 'ప్రభుత్వ సర్వీసుల్లో తగినంత ప్రాతినిధ్యం లేని వర్గాలు' మరియు 'వారి ప్రగతికి ప్రత్యేక సదుపాయాలు' అనే పదాలను బట్టి వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల సదుపాయమే కాకుండా, ఆర్థిక సహాయం, విద్య, వైద్య సదుపాయాలు, హాస్టలు సౌకర్యం, స్కాలర్‌షిప్‌లు, ఉచిత రవాణా, గృహ సౌకర్యాలు కల్పించాలని దాని అర్థం' అని పేర్కొన్నది. అంతేకాక విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో ప్రవేశానికి నిర్ణయించిన నిబంధనల్లో మినహాయింపులు ఇవ్వాలని కూడా అర్థం చేసుకోవాలి. విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం తగినంత లేనప్పుడు వారికి అవసరమైన రిజర్వేషన్లు కల్పించాలి. మొత్తం సర్వీసులలో వారి యొక్క ప్రాతినిధ్యాన్ని అంచనా వేసి విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో వివిధ కులాల వారి ప్రాతినిధ్యం ఎంత ఉందో సులభంగా తెలుసుకోవచ్చును. ఆ విధంగా శతాబ్దాలుగా అవకాశాలను కోల్పోయిన వెనుకబడిన తరగతులకు వారి జనాభా నిష్పత్తికంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చు.

రిజర్వేషన్లకు సంబంధించిన సుప్రీంకోర్టు తీర్పులను పరిశీలించినట్లయితే కొంతవరకు మన పొరపాటు అవగాహన దూరం కావడానికి అవకాశం ఉంది. *థామస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ* కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చేంతవరకు *బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూరు* తలమానిక లేదా గీటురాయి అనుకున్నారు. బాలాజీ కేసులో జస్టిస్ గజేంద్ర గడ్కర్ ఇచ్చిన తీర్పు ప్రారంభం నుండీ కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన రిజర్వేషన్ల పట్ల అసంతృప్తిని వ్యక్తపరిచింది. '1958 నుండి కర్ణాటక ప్రభుత్వం 15(4) అధికరణ కింద రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రయత్నించడం, వాటిని కోర్టులో సవాలు చేయడం జరుగుతూనే ఉన్నది. ఇప్పటికి నాలుగుసార్లు ఇలా జరిగింది. ప్రస్తుతం 15(4) కింద ప్రభుత్వం తీసుకువచ్చిన రిజర్వేషను ఉత్తర్వును మళ్ళీ 226 అధికరణ కింద హైకోర్టులో సవాలు చేసారు.' కర్ణాటక ప్రభుత్వం నాగన్‌గౌడ కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా మెడికల్ కళాశాలల్లో 28 శాతం సీట్లను వెనుకబడిన తరగతులకు, 22 శాతం చాలా వెనుకబడిన తరగతులకు, 15 శాతం షెడ్యూల్డు కులాలకు, 3 శాతం షెడ్యూల్డు

తెగల వారికి రిజర్వేషన్లను కల్పిస్తూ ఉత్తర్వు ప్రకటించింది. మొత్తం 68 శాతం సీట్లను రిజర్వుడు కేటగిరికి, మిగిలిన 32 శాతం సీట్లను జనరల్ కేటగిరికి (కోర్టు ఈ కోటాను 'మెరిట్ పూల్' అని పేర్కొన్నది) కేటాయించింది. నాగన్‌గౌడ కమిటీ సాంఘికంగా, విద్యా పరంగా వెనుకబడిన తరగతులను గుర్తించడానికి కులాన్ని ప్రధాన ప్రాతిపదికగా తీసుకున్నదనీ, మిగతా ఆర్థికపరమైన అంశాలను వెనుకబాటుతనానికి దోహదం చేసేవిగా మాత్రమే భావించిందని కోర్టు అభిప్రాయపడింది. కమిటీ కులాన్నీ, వర్గాన్నీ ఒకటిగా భావించిందనీ, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కులం ఆధారంగా వెనుకబాటుతనాన్ని అంచనా వేయటం అతిశయోక్తి అవుతుందని కోర్టు పేర్కొన్నది. కావున వ్యక్తులను, గ్రూపులను, వర్గాలను వెనుకబడిన వారిగా నిర్ణయించడానికి కులం ప్రధానమైన ప్రాతిపదిక కాదు, ఒకానొక అంశం మాత్రమేనని కోర్టు అభిప్రాయపడింది. సాంఘికంగా వెనుకబాటుతనానికి పేదరికం చాలావరకు కారణం. వృత్తిని బట్టి కూడా కొంతవరకు సాంఘిక వెనుకబాటుతనం ఆధారపడి ఉంటుంది. ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం కులాన్ని ప్రధాన ప్రాతిపదికగా తీసుకుని కమిటీ వెనుకబడిన తరగతులను వర్గీకరించిందని, అందువల్ల ఇది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు పేర్కొంది.

బాలాజీ కేసు తీర్పులో మరోచోట సుప్రీంకోర్టు అధికరణం 15(4)లో చెప్పబడిన సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు, అధికరణం 338 లో చెప్పబడిన షెడ్యూల్డు కులాలు, తెగలకు పోలిక ఉందని భావించింది. అంటే షెడ్యూల్డు కులాలు, తెగలతో దగ్గరి పోలిక ఉన్నవే వెనుకబడిన కులాలని భావించింది. వాస్తవానికి షెడ్యూల్డు కులాలు, తెగలకు, వెనకబడిన తరగతులకు మధ్య పోలిక లేదు. రాజ్యాంగంలో వాడిన పదాలను చట్టపరంగా వాఖ్యానం చేయకుండా విస్తృత పరిధిలో, ప్రజా ప్రయోజనాల దృష్టితో విశ్లేషించాలి. ఎందుకంటె మన రాజ్యాంగం 20 శతాబ్దం మధ్యకాలంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఫలితంగా ఉనికిలోకి వచ్చింది. ఉన్నతమయిన సమాజం కోసం జరిగిన పోరాటాల, విప్లవాల, రాజ్యాంగ వ్యవస్థల ప్రభావం మన రాజ్యాంగంపై ఉంది. అందువల్ల రాజ్యాంగంలోని పదాలను వాటి సాధారణ అర్థంలో కాకుండా తాత్విక దృష్టితో అర్థం చేసుకోవాలి. గ్రామాల గురించి కొద్దిపాటి అవగాహన ఉన్న వారెవరికైనా షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వారు చాలా నికృష్టమైన జీవితం గడుపుతున్నారనీ, వారు నిమ్న కులాలుగానే కాకుండా అంటరాని కులాలుగా కూడా పరిగణించబడుతున్నారనీ అవగతమవుతుంది. కావున వెనుకబడిన తరగతులకు చెందినవారికీ, షెడ్యూల్డు తెగలకు, కులాలకు చెందిన వారికీ వెనుకబాటుతనంలో పోలిక ఉండాలని చెప్పడం వాస్తవ విరుద్ధం. ఇలా భావించటం దురుద్దేశ్యంతో కూడుకున్నది. ఎందుకంటే వెనుకబడిన తరగతులుగా

కొన్నిటిని మాత్రమే గుర్తించి వాటిని షెడ్యూల్డు కులాల, తెగల జాబితాలో చేర్చి వారికి కొన్ని రాయితీలు కల్పించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను తాము అనుభవించాలని, జనాభాలో అధికశాతం ఉన్న వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ అవకాశం లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో 'ప్రతిభ' గల అగ్రకులాల వారు ఈ వాదనలు చేస్తున్నారు.

ఇంతకు ముందు గమనించినట్టుగా సాంఘిక వెనుకబాటుతనానికి పేదరికం ముఖ్య కారణమని కోర్టు భావించింది. బాలాజీ కేసులో (AIR 1963, పే.480) కోర్టు ఈ విధంగా అభిప్రాయపడింది. 'అంతిమ పరిశీలనలో వెనుకబాటుతనానికి పేదరికం చాలా వరకు కారణం. ఎవరైతే దారిద్ర్యంతో బాధపడుతుంటారో వారు తప్పనిసరిగా సమాజంలో వెనుకబడినవారు అవుతారు. సమాజంలో వారికి ఎటువంటి హోదా ఉండదు. సాధారణంగా వీరు తక్కువ కులానికి చెంది ఉండటంచేత వెనుకబాటుతనం మరింత తీవ్రంగా ఉంటుంది. అందువలన భారత సమాజంలో మనం కులానికీ పేదరికానికీ మధ్య దగ్గర సంబంధాన్ని గమనించవచ్చును.' ఉదాహరణకి మహారాష్ట్ర ప్రభుత్వం బలహీనవర్గాలకు ఆర్థిక సహాయం అందజేయడానికి, వారిని గుర్తించటానికి ఉపయోగించిన ప్రాతిపదికను కోర్టు పరిశీలించింది. 'బలహీనవర్గాలు' కావడానికి, అంటే సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండటానికి పేదరికం కారణమని గ్రహించింది. ఆ విధంగా సుప్రీంకోర్టు బాలాజీ కేసులో సమాజంలో వెనుకబడిన తరగతులను గుర్తించడానికి పేదరికం, కులం ప్రాతిపదిక అని పేర్కొంది. వాటితోపాటు వృత్తి, నివాస స్థలం కూడా ముఖ్యమైన అంశాలుగా భావించింది. ఈ విధంగా అధికరణం 15(4)లో చెప్పబడిన 'వెనుకబాటుతనం' పై అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుందని సుప్రీంకోర్టు భావించింది. ఏమైనప్పటికీ భారత సమాజంలో వెనుకబాటుతనాన్ని గుర్తించటం చాల క్లిష్టమైన సమస్య. సరైన ప్రాతిపదికను నిర్ణయించడానికి విషయ సేకరణ, శాస్త్రీయ పరిశోధన అవసరం.

తర్వాత బాలాజీ కేసులో కోర్టు విద్యాపరంగా వెనుకబడి ఉండడానికి ప్రమాణం ఏమిటని పరిశీలించింది. నాగన్‌గౌడ కమిటీ దానికి ఒక విధానాన్ని అనుసరించింది. రాష్ట్రంలోని మొత్తం స్కూలు విద్యార్థులలో హైస్కూలు చివరి మూడు క్లాసులలోని విద్యార్థుల నిష్పత్తిని తీసుకున్నారు. ఒక్కొక్క కులం నుండి 1000 మంది విద్యార్థుల శాంపిల్ తీసుకొని, అందులో హైస్కూలు చివరి మూడు క్లాసులలో ఉన్నవారి నిష్పత్తిని లెక్కించారు. ఇది రాష్ట్ర సగటులో 50 శాతం కంటే తక్కువ ఉంటే ఆ కులం 'చాలా వెనుకబడి' ఉన్నట్టు. స్కూలు చదువు పూర్తి చేయకుండా మధ్యలో మానుకోవడం అనేది విద్యాపరమైన వెనుకబాటుతనం లక్షణం అని భావించి ఈ ప్రమాణాన్ని రూపొందించారు. సుప్రీంకోర్టు ఈ వర్గీకరణ సహేతుకమైనది కాదని చెప్పింది.

'వెనుకబడిన తరగతుల' వారిని వెనుకబడిన తరగతులుగా మరియు 'చాలా వెనుకబడిన తరగతులు'గా వర్గీకరణ చేయడం అధికరణ 15(1)కు వ్యతిరేకమని సుప్రీం కోర్టు పేర్కొనింది. ఇలా చేయడం మొదలుపెడితే రాష్ట్రంలోని 90 శాతం ప్రజలకు రిజర్వేషన్లు కల్పించబడతాయని భావించింది. కాని రిజర్వేషన్లు అర్హులైన వారికే చెందాలంటే పై వర్గీకరణ అవసరం. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బాగా అభివృద్ధి చెందిన వారికంటే కొద్దిగా వెనుకబడిన తరగతులవారు కొందరు ఉండవచ్చును. చాలా వెనుకబడిన తరగతులు కూడ ఉండవచ్చు. అందరినీ ఒకే గాటన కట్టడం సరైన పద్ధతి కాదు. 'వెనుకబడిన తరగతులు', 'చాలా వెనుకబడిన తరగతులు' అంటూ వర్గీకరించడం ద్వారా వెనుకబడిన వర్గంలో అభివృద్ధి చెందినవారే రిజర్వేషన్లను అనుభవించకుండా, చాలా వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడానికి వీలవుతుంది. వెనుకబడిన వారిలో అభివృద్ధి చెందినవారికి అసలే రిజర్వేషన్లు లేకపోతే అగ్రకులాలకు చెందిన వారే మొత్తం సీట్లను కైవసం చేసుకుంటారు. అయితే వెనుకబడిన వారినందరినీ కలిపేస్తే వెనుకబడిన వర్గంలో అభివృద్ధి చెందినవారు 'చాలా వెనుకబడిన'వారిని రిజర్వేషన్ల నుండి నెట్టి వేయడం కూడ జరుగుతుంది. కాబట్టి ఇటువంటి వర్గీకరణ చాలా సహేతుకమైనది.

అదే విధంగా గ్రామసీమల్లో ఏ కులానికి, వర్గానికి విద్య అందుబాటులో ఉందో సులభంగానే గ్రహించవచ్చు. డిగ్రీ, వృత్తి కోర్సుల్లో ఎవరి ప్రాతినిధ్యం ఎంత వుందో తెలుసుకోవడం చాలా సులభం. పై క్లాసుకు పోయే కొద్దీ చదువు మానివేస్తున్న విద్యార్థులు ఎక్కువ శాతం వెనుకబడిన తరగతులకు చెందినవారే. ఈ విధంగా డిగ్రీ చేరడానికి లేదా మెడికల్ ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరడానికి వెనుకబడిన తరగతి వారు కనీసమైన అర్హత లేకుండా పోతున్నారు. ఉద్యోగం డిగ్రీపై ఆధారపడినందున కనీస అర్హతలు సంపాదించుకున్నవారు ఎక్కువమంది ఉన్నత కులాలకు చెందినవారే. కావున నాగన్‌గౌడ కమిటీ విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని పరిశీలించడానికి తీసుకున్న రాష్ట్ర సగటు విద్యా ప్రమాణం చాలా సబబైనదే.

తర్వాత బాలాజీ కేసులో రిజర్వేషన్లు అధికరణ 15(4) కింద ఎంత శాతం ఉండాలి అనే అంశాన్ని కోర్టు పరిశీలించింది. ఈ సందర్భంగా 'ప్రతిభ' సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి ఎక్కువ శాతం రిజర్వేషన్లు సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయని భావించింది. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగంలో చేరినవారు అసమర్థులనీ, 'మెరిట్' ప్రకారం వచ్చినవారు సమర్థులనీ 'ప్రతిభావంతులు' చెబుతున్నారు. రిజర్వేషను ద్వారా ఎవరైనా డాక్టరు వృత్తి చేపడితే అతని అసమర్థత వల్ల రోగులు ప్రాణాలు కోల్పోయి ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుందని వాదిస్తారు. (ఇటువంటి వాదనలు వాస్తవం కాదు. పరీక్షల్లో

ఉత్తీర్ణులు కావడానికి ఏ కులానికి చెందిన విద్యార్థికైనా కనీసమైన మార్కులు రావలసిందే). సామర్థ్యాన్ని నిర్ణయించే నైపుణ్యం కోర్టులకు లేదు. ఉద్యోగాల్లో ప్రభుత్వం కనీస అర్హతలను నిర్ణయించుకోవచ్చు. తన ముందు ఎటువంటి సమాచారం లేకుండా ఎంత శాతం రిజర్వేషన్లు ఉండాలని చెప్పడం కోర్టుల పరిధిలోని విషయం కాదు. అంతేకాక 40 శాతం, 50 శాతం లేదా 60 శాతం ఉండాలని చెప్పడం కోర్టుల యొక్క నిరంకుశ వైఖరి మాత్రమే అవుతుంది. కోర్టులు నిరంకుశంగా వ్యవహరించడం రాజ్యాంగం ఒప్పుకోదు. అయితే బాలాజీ కేసులో సాధారణంగా (generally and in a broad way) ప్రత్యేక సదుపాయాలు 50 శాతం కంటె తక్కువ ఉండాలని, ఎంత తక్కువ ఉండాలనే విషయం పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని కోర్టు పేర్కొనింది. 'సరైన పరిమాణం ఏదని కచ్చితంగా చెప్పటానికి అయిష్టంగా ఉందని' కోర్టు తెలిపింది. అయితే కర్ణాటక ప్రభుత్వం 68 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వు రాజ్యాంగంలోని అధికరణ 15(4)కు విరుద్ధమని పేర్కొనింది.

50 శాతం రిజర్వేషన్లు సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయని చెప్పడానికి తగిన సమాచారం లేదు. నిపుణులు పరిశోధించి నిరూపించలేదు. క్లిష్టమైన సామాజిక సమస్యలు, అందులో కార్యనిర్వాహక వ్యవస్థకు సంబంధించిన వాటికి కోర్టులు సమాధానం చెప్పలేవు. ఒక్కొక్కప్పుడు ఎక్కువ శాతం రిజర్వేషన్లు ఓట్ల కోసం వేసే ఎత్తుగడగా చెబుతుంటారు. ఇది నిజం కావచ్చు, కాకపోవచ్చును. అయితే ఎంత త్వరగా అణగారిన జనం అభివృద్ధి గురించి ప్రభుత్వాలు పట్టించుకుంటాయో దేశానికి అంత మంచిది.

చిత్రలేఖ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూరు కేసులో సుప్రీంకోర్టు కులాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఆదాయం మరియు వృత్తి ప్రాతిపదిక మీద వెనుకబడిన తరగతుల వర్గీకరణను సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబం యొక్క సంవత్సరాదాయం రూ. 1200 లేక అంతకంటె తక్కువ ఉన్నవారిని, వ్యవసాయం వృత్తిగా గలవారిని, చేతివృత్తులవారిని, శారీరక శ్రమ చేసేవారిని సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించింది. ప్రభుత్వం కులాన్ని ప్రాతిపదికగా తీసుకోలేదు. అయినా ఈ ఉత్తర్వును రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. ఎందుకంటే బాలాజీ కేసులో సుప్రీంకోర్టు వెనుకబాటు తనానికి కులం ప్రధానమైన కారణం కాకపోయినప్పటికీ ఒకానొక అంశమని భావించింది. అందువల్ల ప్రభుత్వం వెనుకబడిన తరగతులను గుర్తించటంలో కులాన్ని పరిగణనలోకి తీసుకోనందున దాని ఉత్తర్వు చెల్లదని పేర్కొన్నది. అయితే ఈ కేసు అప్పీల్ సుప్రీంకోర్టుకు పోయినప్పుడు జస్టిస్ సుబ్బారావు హైకోర్టు తీర్పు తప్పని, బాలాజీ కేసు తీర్పును తప్పుగా అర్థం చేసుకుందని చెప్పాడు. 'వెనుకబాటుతనానికి కులం ఒక్కటే ప్రధానమైన అంశం కాదని, అది ఒకానొక అంశం మాత్రమేనని, ప్రభుత్వం

వెనుకబడిన తరగతులను వర్గీకరించటానికి కులాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు లేదా మినహాయించవచ్చును' అని జస్టిస్ సుబ్బారావు తీర్పునిచ్చారు.

రాజ్యాంగం యొక్క ఉద్దేశ్యం ప్రకారం రిజర్వేషన్లు వ్యక్తుల, గ్రూపుల అభ్యున్నతికి తోడ్పడాలని, ఒకవేళ వారు ఒక కులానికి చెందినా, ఆ కులంలో మెజారిటీ సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చును గానీ వాస్తవానికి కొంతమంది ఆర్థికంగా అభివృద్ధి చెందిన వర్గానికి చెందివుంటారు. అందువల్ల కులం - వర్గం రెండూ పర్యాయపదాలు కాదు అని జస్టిస్ సుబ్బారావు భావించారు. ఉదాహరణకి ఒక రాష్ట్రంలో ఒక కులం మెజారిటీగా ఉండి అది సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని అనుకుందాము. మైనారిటీగా ఉన్న అగ్రకులంలో (ఉదా- బ్రాహ్మణులు, వైశ్యులు) కూడా కొంతమంది విద్యాపరంగా వెనుకబడిన వారు ఉండవచ్చు. అప్పుడు కులం ప్రాతిపదికగా తీసుకుంటే అగ్రకులంలోని వెనుకబడినవారికి రిజర్వేషన్లు లభ్యం కావు. కావున కులం - వర్గం ఒకదానికొకటి పర్యాయపదాలు కావు. రాజ్యాంగంలో వర్గాలు అనే పదం వాడారు, కులం అని చెప్పలేదు. అందువల్ల కులాన్ని వర్గంగా భావించటం రాజ్యాంగ విరుద్ధం. అయితే కులం ఒకానొక అంశంగా వెనుకబాటుతనానికి ప్రాతిపదికగా తీసుకోవచ్చునని జస్టిస్ సుబ్బారావు పేర్కొన్నారు.

అయితే కోర్టు ఒక కచ్చితమైన ప్రాతిపదికను సూచించటంలో ఉన్న సంక్లిష్టతను గుర్తించి జస్టిస్ సుబ్బారావు 'సర్వత్రా వర్తించే ప్రాతిపదికను సూచించటం మా ఉద్దేశ్యం కాదు' అని తన తీర్పులో పేర్కొన్నారు. 'అలా చేయటం కష్టసాధ్యమయింది. ప్రాతిపదిక కేసును బట్టి, పరిస్థితులను, ప్రాంతాన్ని బట్టి మారుతూ వుంటుందని' చెప్పారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ వర్గాన్ని కులంతో ముడిపెట్టడం సరైనది కాదని, అయితే అధికరణం 15(4) ప్రకారం వెనుకబడిన తరగతులను గుర్తించటానికి కులాన్ని పరిగణనలోకి తీసుకోకుండా చేసిన వర్గీకరణ కూడా రాజ్యాంగ విరుద్ధం కాదని చిత్రలేఖ కేసులో తీర్పు చెప్పారు.

*రాజేంద్రన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాసు* కేసులో కులాల ప్రాతిపదికపై రిజర్వేషన్లు కల్పించినప్పుడు ఆ కులాలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడినవని రుజువు చేయలేకపోతే అట్టి రిజర్వేషన్లు సమానత్వపు హక్కుకు భంగం కల్గించినట్లేనని సుప్రీంకోర్టు భావించింది. అయితే కులం కూడా ఒక వర్గమేనని, ఒక కులం మొత్తంగా సామాజికంగా విద్యాపరంగా వెనుకబడినట్లయితే ఆ కులం వారికి రిజర్వేషన్లు కల్పించవచ్చునని కోర్టు తీర్పునిచ్చింది. *త్రిలోకనాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ జమ్ము కాశ్మీర్* కేసులో కులం, వర్గం పర్యాయపదాలు కాదని, ఒక కులం మొత్తంగా సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడినట్లయితే ఆ కులాన్ని వెనుకబడిన తరగతుల

జాబితాలో చేర్చవచ్చునని కోర్టు భావించింది. ఈ విధంగా కులం ప్రాతిపదిక ఆధారంగా వారిని వెనుకబడిన తరగతిలో చేర్చకుండా కేవలం వారు ఒక వర్గానికి చెందినవారు కాబట్టి జాబితాలో చేర్చవచ్చని కోర్టు భావించింది.

సాధారణంగా వ్యక్తి యొక్క వర్గం సమాజంలో వారికున్న స్థానం, వృత్తి, నివాసం, ప్రాంతం, జాతి, మతం, కులం మొదలైన అంశాలమీద ఆధారపడి ఉంటుంది. అధికరణ 16(4) ప్రకారం కేవలం పైన చెప్పబడిన ఒకే ఒక అంశంపై ఆధారపడి వెనుకబడిన తరగతులను వర్గీకరించడం రాజ్యాంగ స్వభావానికి విరుద్ధం అని కోర్టు భావించింది.

అయితే *పెరియకరుప్పన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు* కేసులో కోర్టు తీర్పునిస్తూ, 'కులమే వర్గంగా చాలా కాలంగా గుర్తించబడినదని, దేశంలో చాలా కులాలు సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడినవని, ఈ విషయాన్ని గ్రహించకపోవటం వాస్తవాన్ని నిరాకరించటమేనని' భావించింది. ఆ తర్వాత *స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వర్సెస్ బలరామ్* కేసులో, మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను వెనుకబడిన తరగతులకు కేటాయిస్తూ జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వును కేవలం కులంపై ఆధారపడి చేసిన వర్గీకరణగా భావించి, బాలాజీ కేసులోని తీర్పుకు వ్యతిరేకమని హైకోర్టు కొట్టివేసింది. తర్వాత ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ అధికరణ 15(4) కింద వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను కేవలం కులంపై ఆధారపడి నిర్ణయించకుండా, సరైన సమాచారం సేకరించిన తర్వాత ఒక కులం వారు సాంఘికంగా, విద్యాపరంగా వెనుక బడినట్లు రుజువైతే, ఒకవేళ ఆ కులంలో కొంతమంది అభివృద్ధి చెందినవారున్నప్పటికీ, ఆ కులం మొత్తం వెనుకబడినదిగా గుర్తించాలని పేర్కొన్నది.

ఆ తర్వాత *జానకిరామ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ జమ్ము కాశ్మీరు* కేసులో పేదరికం వెనుకబాటుతనానికి ఒకానొక కారణమని, అయితే పేదరికం ప్రాతిపదికగా రిజర్వేషన్లు కల్పించటం ప్రభుత్వానికి అసాధ్యమయిన పని అని కోర్టు భావించింది. అలాగే *స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ వర్సెస్ ప్రదీప్ టాండన్* కేసులో, పేదరికం వెనుకబాటుతనానికి ఒకానొక కారణమని, కొండప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల్లో సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనం ఉంటుందని, అందుకు కారణం వారికి విద్యావైద్య సౌకర్యాలు లేక, వనరులను ఉపయోగించుకొనే జ్ఞానం లేక, విద్యపట్ల ఆసక్తి లేక మూఢాచారాలలో జీవిస్తున్నందున వారు తప్పనిసరిగా వెనుకబడినవారేనని, దేశాల్లో ఇలాంటి ప్రాంతాలు చాలా ఉన్నవని, వీరిని వెనుకబడిన తరగతులుగా గుర్తించాలని కోర్టు తీర్పునిచ్చింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరినీ వెనుకబడినవారిగా గుర్తించటానికి కోర్టు నిరాకరించింది.

జయశ్రీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో ఒక కుటుంబంలోని సభ్యుల సంవత్సరాదాయం రూ. 6000 ఉండి, రాష్ట్ర ప్రభుత్వం జాబితాలో పేర్కొన్న కులానికి చెందినవారైతే వారు సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడినవారని జారీచేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు సమర్థించింది. అంటే పేదరికం, కులం రెండూ వెనుకబాటు తనానికి సూచనలుగా కోర్టు భావించింది. అయితే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులను గుర్తించటం ప్రభుత్వం యొక్క విధి అని, అలా గుర్తించటానికి ఉపయోగించిన ప్రాతిపదిక సమంజసమైనదా? కాదా? అని చెప్పటం మాత్రమే కోర్టుల పని అని సుప్రీంకోర్టు పేర్కొన్నది.

పై కేసుల్లోని తీర్పులకంటే స్టేట్ ఆఫ్ కేరళ వర్సెస్ ఎన్.ఎమ్.థామస్ కేసు రిజర్వేషన్లకు సంబంధించి ముఖ్యమైన కేసు. ఈ కేసును 7గురు సుప్రీంకోర్టు జడ్జీలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో, ప్రమోషన్ విషయాల్లో కూడా రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని తీర్పునిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎల్.డి.సి. నుంచి యు.డి.సి.కి ప్రమోషన్ పొందటానికి డిపార్టుమెంట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. అయితే ఈ నిబంధనను మినహాయిస్తూ షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందినవారికి పరీక్ష పాస్ కావటానికి కొంత సమయం యిచ్చి ప్రమోషన్ కల్పించింది.

ఈ రూలును సవాలుచేస్తూ ప్రమోషన్‌లు 50 శాతం మించితే అధికరణ 16(1)కి వ్యతిరేకమని వాదించారు. కోర్టు ఈ వాదనను త్రోసిపుచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూలును సమర్థిస్తూ ఉద్యోగాల్లో ప్రవేశం మొదలుకొని ఉద్యోగ విరమణ వరకు మధ్యలో అవకాశం ఉన్న అన్ని ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలుచేయాలని చీఫ్ జస్టిస్ రే తీర్పునిచ్చారు. 'ప్రభుత్వ సర్వీసుల్లో సరైన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన తరగతులవారికి ప్రాధాన్యతనిస్తూ రిజర్వేషన్లను కల్పించటం అధికరణాలు 14కు, 16(1)కు వ్యతిరేకం కాదని' కోర్టు భావించింది. ఉద్యోగాల్లో సమాన అవకాశాలను కల్పించటానికి అధికరణ 16(4) ప్రకారం వివిధ పద్ధతులను అవలంబించవచ్చును. కావున షెడ్యూల్డు కులాలకు, తెగలకు ప్రమోషన్లలో రిజర్వేషను కల్పించటం అధికరణ 16(4)కు అనుగుణంగా చేసినదేనని కోర్టు తీర్పునిచ్చింది. అలాగే జస్టిస్ మాథ్యూ ఇతర జడ్జీలతో ఏకీభవిస్తూ 'సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించడం, మానవ హక్కులను అనుభవించటానికి సరయిన పరిస్థితులను కల్పించటం ప్రభుత్వం యొక్క తప్పనిసరి విధి' అని చెప్పాడు.

ఈ విధి నిర్వహణలో అధికరణ 16(4) కింద ప్రభుత్వం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు అగ్రకులాలతో సమానంగా పోటీ పడటానికి ఉద్యోగాల్లో ప్రవేశానికి, ప్రమోషన్లకు సదుపాయాలు కల్పించినప్పుడే అందరికీ సమాన

అవకాశాలు కల్పించటం జరుగుతుంది. రిజర్వేషన్‌లు అందులో భాగమే. కాబట్టి అధికరణ 16(4) అధికరణ 16(1)కి పరిమితి కాదు. ఈ కేసులో షెడ్యూల్డు కులాలకు, తెగలకు ప్రమోషన్ అర్హత పొందటానికి అవసరమైన పరీక్ష నుండి మినహాయింపు ఇచ్చారు. అధికరణలు 46 మరియు 335లలో పైన పేర్కొన్న సాంఘిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికి, శతాబ్దాలుగా అణచబడిన కులాలకు, తెగలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతను రాజ్యాంగం ప్రభుత్వం పైన ఉంచింది. అధికరణ 16(4)ను 16(1)లో చెప్పిన సమానత్వపు హక్కుకు పరిమితిగా చూడకూడదు. ఎందుకంటే అసమానులను సమానంగా పరిగణించడం వల్ల సమాజంలో అసమానత పటిష్టమవుతుంది తప్ప సమసిపోదు. బలవంతులను, బలహీనులను ఒకే గాటన కట్టడంవల్ల బలవంతుల ఆధిపత్యం ఇంకా పెరుగుతుంది. అందరూ సమానంగా పరిగణించబడాలంటే బలహీనులకు బలవంతులతో సమానంగా అవకాశాలను ఉపయోగించుకోడానికి ప్రభుత్వం చేయూతనివ్వాలి. తద్వారా బలవంతులతో సమానంగా బలహీనులు అభివృద్ధి చెందగల్గుతారు. కావున అధికరణ 16(4) సమానత్వపు హక్కుకు పరిమితి కాదు. అలాగే విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను కల్పిస్తున్న అధికరణ 15(4) సమానత్వపు హక్కుకు పరిమితి కాదు. సమానత్వపు హక్కును విస్తృతపరచడం కోసం, అందరికీ అందుబాటులోకి తేవడంకోసం జరిగే ప్రయత్నమే రిజర్వేషన్లను కల్పించటం.

థామస్ కేసులో జస్టిస్ కృష్ణయ్యర్ మెజారిటీ తీర్పుతో ఏకీభవిస్తూ ఉద్యోగ నియామకాల్లో, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించటాన్ని సమర్థించాడు. రిజర్వేషన్లు 50 శాతంకంటె మించకూడదని చెప్పిన కోర్టు తీర్పులకు ప్రాముఖ్యత నివ్వకూడదని, ప్రభుత్వ సర్వీసుల్లో ఒక్క సంవత్సరంలో కల్పించిన రిజర్వేషన్లు 50 శాతం కంటె ఎక్కువ ఉన్నాయో తక్కువ ఉన్నాయో అని చూడకుండ, ఆ సర్వీసులో మొదటి నుండి ఇప్పటివరకు వివిధ కులాల, వర్గాల ప్రాతినిధ్యాన్ని బట్టి ఎంత శాతం ఉండాలో నిర్ణయించాలని సూచించాడు. అయితే జస్టిస్ కృష్ణయ్యర్ కూడా ఉన్నత వర్గాల భావజాలం నుండి, కులీన ఆలోచనా విధానం నుండి బయటపడలేకపోయారు. రిజర్వేషన్లను బలహీన వర్గాల్లోని బలవంతులు కైవసం చేసుకుంటున్నారనీ, అర్హులైనవారికి లభ్యం కావటం లేదనీ అభిప్రాయపడ్డారు. సామాజిక అసమానతలు తొలగటానికి విస్తృతమైన విద్యా ఉద్యోగ అవకాశాలను, కుల వైషమ్యాలు పోవడానికి కులాంతర వివాహాలను ప్రభుత్వం ఒక కార్యక్రమంగా చేపట్టాలని సూచించాడు. అయితే బలహీనవర్గాలు రిజర్వేషన్ల సదుపాయం వల్ల ఎంత అభివృద్ధి చెందారో, రిజర్వేషన్‌లు ఎవరికి కల్పించాలో అనే విషయాలను శాస్త్రీయమైన సామాజిక పరిశోధన ద్వారా తెలుసుకోవచ్చనీ, కోర్టుల యొక్క అభిప్రాయాలు స్వీయ మానసికమైనవని జస్టిస్ కృష్ణయ్యర్ పేర్కొన్నాడు.

ఈ విధంగా థామస్ కేసులో మెజారిటీ జడ్జీలు రిజర్వేషన్‌లు 50 శాతం కంటె మించవచ్చునని, ఉద్యోగ నియామకాల్లో ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు వర్తిస్తాయని, అధికరణ 16(4) సమానత్వపు హక్కుకు పరిమితి కాదని, సమాన అవకాశాలనూ సమానత్వపు హక్కునూ విస్తృతపరిచే అవకాశం 16(4) వల్ల రాజ్యాంగం కల్పిస్తున్నదని తీర్పు చెప్పారు.

జస్టిస్ కృష్ణయ్యర్ *అఖిల భారతీయ సోషిత్ కర్మచారి సంఘ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా* కేసులో షెడ్యూల్డ్ కులాల, తెగల రిజర్వేషన్లలో క్యారీ ఫార్వర్డ్ రూలును బలపరుస్తూనే సామర్థ్యం దెబ్బతింటుందనే వాదన ముందుకు తెచ్చారు. ఉన్నత ఉద్యోగాల ఎంపికకు పోటీ పరీక్షలు అవసరమని, సీనియారిటీ మీద ప్రమోషన్ ఇవ్వటం వల్ల సామర్థ్యం పెరగదని భావించారు. ఇటువంటి వాదన, అవగాహన పాలకవర్గాల భావనల నుండే వస్తుంది. ఉన్నతస్థాయి ఉద్యోగాలకైనా, తక్కువస్థాయి ఉద్యోగాలకైనా కనీస అర్హతలు నిర్ణయిస్తే సామర్థ్యం దెబ్బతినకుండా ఉంటుంది. ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పాము. రాజ్యాంగంలో చెప్పబడిన సమానత్వం, సామాజిక న్యాయం ఆచరణలో సాధ్యం చేయడానికి వేల సంవత్సరాలుగా అణచబడి, రాజ్యాంగ నిర్వహణలో స్థానం లేకుండా ఉన్న బలహీనవర్గాలకు ప్రత్యేక సదుపాయాలు, రిజర్వేషన్లు కల్పించి చేయూతనివ్వాలి. అలా చేయకపోతే రాజ్యాంగంలో సమానత్వపు హక్కు అర్థం లేనిదిగా మిగిలిపోతుంది. అందరికీ సమానమైన అవకాశాలు సమానమైన ఫలితాలను సమానంగా పంపిణీ చేయాలి. ఆ దృక్పథంతోనే అధికరణలు 15(4), 16(4)లను అవగాహన చేసుకోవాలి.

ఇంతవరకు మనం కులం - వర్గం వాటిపట్ల ఉన్న తాత్విక ధోరణి, రిజర్వేషన్ అనుకూలురు, వ్యతిరేకులు చేస్తున్న వాదనలను, రాజ్యాంగంలో వెనుకబడిన తరగతులకు కల్పించిన హక్కులను చారిత్రకంగా, సామాజికంగా పరిశీలించాము. దశాబ్దాలుగా వీరి అభ్యున్నతికి ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ ఏమి చేశాయి? ఇప్పటికీ ఒకవైపు ధనికులు, అగ్రకులాలకు చెందిన భూస్వాములు, విద్యావంతులు, పురోహిత వర్గం, వ్యాపారవర్గం వారు జనాభాలో తక్కువ శాతంగా ఉన్నారు. మరో పక్క షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందినవారున్నారు. ఈ రెంటికి మధ్య అధికశాతం జనాభా సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతికి చెందినవారున్నారు. సమాజంలో పేదరికం, కులం, వృత్తి, నివాసం మొదలైన అంశాలు ఒక వర్గం వెనుకబాటు తనానికి ప్రధాన కారణాలు. ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పూజించే దేవతలు వ్యక్తుల వెనుకబాటుతనానికి, సమాజంలో నీచంగా చూడబడ్డానికి నిదర్శనాలు. బాల్య వివాహాల నిరోధక చట్టం, హిందూ వివాహాల చట్టం అమల్లో ఉన్నప్పటికీ బలహీనవర్గాల

కుటుంబాల్లో బాల్యవివాహాలు విరివిగా జరుగుతున్నాయి. చిన్నవయస్సులోనే వివాహాలు చేసుకుంటున్నారు. పెళ్ళి సందర్భంలో హిందూ సాంప్రదాయం ప్రకారం నిర్వహించే సప్తపది వెనుకబడిన తరగతికి చెందిన కులాల్లో పాటించరు. వితంతువుల పునర్వివాహ చట్టం, విడాకుల చట్టం రాకమునుపే వితంతువులు మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి, విడాకులు తీసుకోడానికి వెనుకబడిన కులాల్లో అవకాశం ఉండేది. సంసారంలో, కుటుంబంలో వచ్చిన సమస్యలను కుల పంచాయితీల ద్వారా పరిష్కరించుకొనే కట్టుబాట్లు వారిలో ఉన్నాయి. నీచ కులాలుగా వ్యవహరించబడుతున్న కొన్ని కులాల్లో వివాహాలు జరిపించడానికి పురోహితులు, విడాకులు తీసుకోవడానికి కోర్టులు అందుబాటులో లేవు.

వేషధారణ, ఆహార అలవాట్లలో కూడా కులం యొక్క వెనుకబాటుతనం కనిపిస్తుంది. పూజించే దేవతల్లో కూడా ఈ తారతమ్యం కనబడుతుంది. అగ్ర కులాలకు చెందినవారు రాముణ్ణి, కృష్ణుణ్ణి, శివుణ్ణి పూజిస్తారు. గ్రామాల్లో వెనుకబడిన కులాల వారు సుంకులమ్మ, పోచమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ మొదలైన దేవతలను కొలుస్తారు. హిందువులు ప్రధానంగా జరుపుకునే దసరా, దీపావళి వేడుకల్లో అందరూ పాల్గొంటారు. కాని నిమ్నకులాలు చేసుకొనే చాలా పండుగలను అగ్రకులాలకు చెందిన హిందువులు చేయరు. ఈ విధంగా కులాచారాలు, సంప్రదాయాలు, ఆహార అలవాట్లు మొదలైన విషయాలను బట్టి సాంఘిక వెనుకబాటుతనాన్ని సులభంగా గుర్తించవచ్చు.

సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనానికి పేదరికం ఒక ముఖ్యమైన కారణమైనప్పటికీ అది ఒక్కటే ప్రాతిపదిక కాదు...పేదరికంలో జీవిస్తున్న అధిక శాతం జనాభాని రాజ్యాంగం వెనుకబడినవారిగా గుర్తించదు. ఎందుకంటే అగ్రకులాల్లో చాలా మంది పేదవారున్నారు. అంతమాత్రాన బ్రాహ్మణులను సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడినవారని చెప్పలేము. వారు ఆర్థికంగా పేదవారైనప్పటికీ సామాజికంగా, సాంస్కృతికంగా సమాజంలో ఉన్నత స్థాయిగా గుర్తించబడ్డారు...బ్రాహ్మణుల్లోని పేదవారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని అనటం సబబు కాదు. అదే విధంగా గుజరాత్‌లోని పటేళ్ళు, బెంగాల్లోని కాయస్తా, ఆంధ్రప్రదేశ్‌లోని కమ్మ, రెడ్డి కులాల్లో చాలా మంది రైతులు, వ్యవసాయ కూలీలు ఉన్నప్పటికీ వారందరూ సమాజంలో ఉన్నత కులానికి తద్వారా ఉన్నత స్థితికి చెందివున్నారు. అదేవిధంగా ఆంధ్రరాష్ట్రంలోని కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి, బెస్తలు సులభంగా వారి కులాన్ని బట్టి వెనుకబడిన వారిగా భావించవచ్చు. ఒకవేళ వీరిలో కొంతమంది సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందివుంటే అందులో ఆదాయపరిమితి పెట్టి అర్హులైన వారికి రిజర్వేషన్లు కల్పించవచ్చు.

ఈ విధంగా రిజర్వేషన్లను వెనుకబడిన కులాల, వర్గాల వారికి కల్పిస్తే ఉన్నత వర్గాల్లోని పేదవారి సంగతి ఏమిటి? వీరికి విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు బదులు ఇతర ఆర్థిక సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత ఉంది. అంతిమంగా ఆర్థిక సమానతను సాధించడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి. ఒకవేళ ఆదాయాన్ని బట్టి ఆర్థికంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించితే ప్రస్తుతం ఆదాయం సర్టిఫికెట్లను భూస్వాములు, ధనికులు ఎలా పుట్టిస్తున్నారో మనందరికీ తెలుసు. గ్రామాల్లోని పెత్తందార్లు, భూస్వాములు, ధనికులు వ్యవసాయంలో వచ్చే ఆదాయంపై పన్ను కట్టనవసరం లేదు. కాబట్టి దొంగ ఆదాయం సర్టిఫికెట్లు తమ పలుకుబడితో సంపాదించి ఆర్థిక సౌకర్యాలను పొందుతున్నారు. వాస్తవానికి అర్హులైన వారు సర్టిఫికెట్ సంపాదించలేని పరిస్థితుల్లో ఉన్నారు.

*వసంతకుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో*
*జస్టిస్ చిన్నపరెడ్డిగారు ఇచ్చిన తీర్పుకి సంక్షిప్త అనువాదం*
*డిసెంబర్ 1990*

# పర్‌స్పెక్టివ్స్ ఎందుకోసం

మానవజాతి భవిష్యత్తును గురించి ఇవ్వాళ చాలా చర్చ జరుగుతూ ఉంది. ఏ రకమయిన అసమానతగానీ, అణచివేతగానీ లేని సమాజం కావాలని అభ్యుదయవాదులందరూ కోరుకుంటారు. కానీ ఆ సమాజ స్వరూప స్వభావాలను గురించి ఏకాభిప్రాయం మట్టుకు అభ్యుదయవాదులలో సర్వత్రా లేదు. మార్క్స్ రచనలతో ఒక ప్రామాణికమయిన రూపం తీసుకున్న చర్చ ఈనాటికీ ముగియలేదు. అణచివేతలోనూ అసమానతలోనూ కొత్త కోణాలను చరిత్ర ముందుకు తెచ్చేకొద్దీ చర్చ మరింత వాడిగా సాగుతూ ఉంది. మరింత జటిలం అవుతూ ఉంది. కొత్త కోణాలలో కొన్ని నిజానికి చాలా పాతవే కావడంతో వాటిని ఇన్నాళ్ళూ ఎందుకు చూడలేకపోయామన్న విమర్శ చర్చకు కొంత వేడిని కూడా చేరుస్తూ ఉంది.

ఆ చర్చలో అనేక రకాల దృక్పథాలు గల వ్యక్తులు పాల్గొంటున్నారు. అనేక ఉద్యమాలు పాల్గొంటున్నాయి. అసమానతకూ, అణచివేతకూ కొత్త కోణాలను ఆవిష్కరించేవారు, ఇప్పటికే ఉన్న విప్లవ సిద్ధాంతాలు వాటిని ఆకళింపు చేసుకోలేవనే వారు, అసలు కొత్త కోణాల ఆవిష్కరణే నిరుపయోగ మయిన ప్రయాస అనుకునేవారు, ఇప్పటికి ఉన్న సిద్ధాంతాలే సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ అవగాహన చేసుకోగలవనుకునే వారు, అసలు 'సిద్ధాంతం', 'నిర్మాణం' అనేవే మానవజాతి వికాసానికి అవరోధం అనుకునే వారు, అభ్యుదయం కోసం ఇప్పటిదాకా జరిగిన ప్రయత్నమంతా వృథా అనుకునేవారు, దాని మంచి చెడుల నుండి గుణపాఠాలు తీసుకోగల మనుకునేవారు, రాజకీయ ఆచరణలో నిమగ్నం అయినవారు, ఆచరణతో నిమిత్తం లేనివారు...ఇంకా అనేకులు ఇవాళ మానవ భవితవ్యాన్ని గురించిన ఈ చర్చలో పాల్గొంటున్నారు.

ఈ చర్చకు సంబంధించి 'పర్‌స్పెక్టివ్స్'కు ఒక దృక్పథం ఉంది. మానవ సమాజం గురించీ దాని భవిష్యత్తు గురించీ బుద్ధుడి నుండి ఈనాటిదాకా అనేకులు ఊహలు చేశారు. సిద్ధాంతాలు చేశారు. ఎవ్వరూ కాదనలేని ఆదర్శాలు మన ముందుంచారు. ఆ ఆదర్శాలను సాధించే మార్గాలను ప్రతిపాదించారు. ఈ అన్వేషణకు శాస్త్రీయ ప్రాతిపదిక కల్పించి నేలమీద నిలబెట్టింది మార్క్సిజం. మార్క్స్ రచనలు చేయడం మొదలు పెట్టిన తరువాత చర్చ యావత్తూ ఆయన

ప్రతిపాదించిన అధ్యయన చట్రం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది. అంగీకరించేవాళ్ళూ, సవరించేవాళ్ళూ, తిరస్కరించే వాళ్ళూ అందరూ దానినే ప్రమాణంగా స్వీకరించారు. ఇవ్వాళ తూర్పు యూరప్, సోవియట్ రష్యా, చైనా దేశాలలో వస్తూన్న మార్పుల ఫలితంగా చెలరేగుతున్న చర్చ స్వభావం కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఇకమీదట ఉండబోతుందని మేము అనుకోవడం లేదు.

ఇప్పటికీ సిద్ధాంతం ఆచరణలకి సంబంధించిన సమస్యలని మార్క్సిజం అధిగమించిందని చెప్పలేం. పాత సమస్యలు పరిష్కరించుకునే క్రమంలో కొత్త సవాళ్ళు మార్క్సిజం ముంగిట కొస్తున్నాయి. కొత్త నిర్వచనాలు, కొత్త ప్రతిపాదనలు, ప్రత్యామ్నాయాలు రూపొందుతున్నాయి. సామాజిక పరివర్తన కోసం జరుగుతున్న మొత్తం చర్చలో భాగమే మార్క్సిజం గురించిన చర్చ కూడా. ఈ చర్చలో అన్ని కోణాలకూ అన్ని పోకడలకూ వేదిక కల్పించాలని 'ప ర్ స్పె క్టి వ్స్' భావిస్తూ ఉంది. ఆర్థిక పరిమితుల వల్ల అన్ని పుస్తకాలు ప్రచురించ వీలుకాకున్నా, ఆ దిశగా చర్చను ప్రతిపాదించే పుస్తకాలను ప్రచురించాలనుకుంటున్నాం.

అణచివేతనూ, అసమానతనూ వ్యతిరేకించేది ఏదయినా ప్రజాస్వామిక దృక్పథమే. మౌలికంగా అభ్యుదయ దృక్పథమే. ఆపైన ఎన్ని తేడాలున్నా వినదగినదే, చర్చించదగినదే, అధ్యయనం చేయదగినదే. ***'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ'*** అని మావో ఒక చారిత్రక సందర్భంలో ఇచ్చిన పిలుపుకు ఈ నిర్దిష్టమయిన అర్థంలో సార్వత్రిక ప్రాతిపదిక ఉందని 'ప ర్ స్పె క్టి వ్స్' భావిస్తూ ఉంది. ఆ అవగాహనతో ప్రచురణలు చేపడుతోంది. ప్రజాస్వామిక స్వభావం కలిగిన సమర్థవంత మయిన రచనలను ఎక్కువగా తెలుగులో, వీలున్నప్పుడు ఇంగ్లీషు, హిందీలో కూడా ప్రచురించడం ద్వారా కొనసాగుతున్న 'గ్రేట్ డిబేట్'కు దోహదం చేయాలని మా సంకల్పం.

మే
1999

- కె. బాలగోపాల్
ప ర్ స్పె క్టి వ్స్
సామాజిక శాస్త్రం / సాహిత్యం
హైదరాబాదు

# 1988 నుంచి 2013
# ప ర్ స్పె క్టి వ్స్ ప్రచురణలు

| | | | | |
|---|---|---|---|---|
| ✯ | 1. Probings in the Political Economy of Agrarian classes and Conflicts - | May | 1988 | by K. Balagopal<br>Ed. G. Haragopal |
| ✯ | 2. సహచరులు - | జూలై | 1989 | వరవరరావు |
| ✯ | 3. పతంజలి భాష్యం - | జూలై | 1989 | కె.ఎన్.వై. పతంజలి |
| ✯ | 4. సృజన సంపాదకీయాలు | జనవరి | 1990 | వరవరరావు/సాహితీ మిత్రులు |
| ✯ | 5. అభివృద్ధి వెలుగునీడలు | మే | 1990 | ఆర్.ఎస్.రావు |
| ✯ | 6. కఠోర షడ్జమాలు - | తొలి ముద్రణ | 1990 | వసంత కన్నబిరాన్ |
| | | మలి ముద్రణ | 1996 | |
| ✯ | 7. మతవర్గ తత్వం - | ఫిబ్రవరి | 1991 | ఎడిటర్స్ : హరి, జి. హరగోపాల్ |
| ✯ | 8. ఇలా మిగిలేం - | తొలి ముద్రణ | 1991 | చలసాని ప్రసాదరావు |
| | | మలి ముద్రణ | 1993 | |
| ✯ | 9. పరాధీన భారతం | తొలి ముద్రణ | 1992 | ఎ.బి.కె. ప్రసాద్ |
| | | మలి ముద్రణ | 1993 | |
| ✯ | 10. డంకెల్ దుశ్శాసనం | జూన్ | 1993 | నూర్ భాషా |
| ✯ | 11. దినదినగండం | సెప్టెంబర్ | 1993 | అనువాదం :<br>కోదండ రామిరెడ్డి |
| ✯ | 12. మన చలం - | మే | 1994 | ఎడిటర్ : కృష్ణాబాయి |
| ✯ | 13. Towards Understanding Semi Feudal Semi Colonial Society | Jan | 1995 | by R.S. Rao<br>Ed. D. Narasimha Reddy |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ✯ | 14. | ఏడోసారా కథ | జూలై | 1995 | బుర్ర రాములు |
| ✯ | 15. | శాక్కొ - వాంజెట్టి | నవంబర్ | 1995 | బి. చంద్రశేఖర్ |
| ✯ | 16. | బంగారమ్మ కథ | జనవరి | 1996 | అనువాదం - కృష్ణాబాయి |
| ✯ | 17. | కార్టూన్ కబుర్లు - | సెప్టెంబరు | 1996 | మోహన్ |
| | 18. | నాకో పిస్తోల్ కావాలి - | అక్టోబర్ | 1996 | అనువాదం :<br>చలసాని ప్రసాదరావు |
| | 19. | సాహిత్యంలో వస్తు శిల్పాలు | మార్చ్ | 1997 | త్రిపురనేని మధుసూదనరావు |
| ✯ | 20. | కల్లోల కథా చిత్రాలు | డిసెంబర్ | 1997 | కె. బాలగోపాల్<br>ఎడిటర్ : చలసాని ప్రసాద్ |
| ✯ | 21. | ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణలు/ ప్రపంచబ్యాంక్ ఎజెండా | మార్చ్ | 1998 | ఎడిటర్ : డి. నరసింహారెడ్డి |
| ✯ | 22. | మూడు దశాబ్దాల నక్సల్బరీ గమ్యం-గమనం | తొలి ముద్రణ<br>ఆగస్ట్ 1998<br>మలి ముద్రణ<br>అక్టోబర్ 1998 | | ఎడిటర్స్ :<br>ఎస్. సుధాకర్,<br>ఎం. కోదండరామిరెడ్డి |
| ✯ | 23. | పరాధీన భారతంలో దారితప్పిన రూపాయి | డిసెంబర్ | 1998 | ఎ.బి.కె. ప్రసాద్ |
| ✯ | 24. | శారద నవలలు (ఏది సత్యం, మంచీ-చెడు, అపస్వరాలు) | ఆగస్ట్ | 1999 | శారద (ఎస్. నటరాజన్) |
| ✯ | 25. | సింగరేణి | నవంబర్ | 2000 | ఎం.డి. మునీర్ , ఎం.డి. అన్వర్ |
| ✯ | 26. | ఖాదర్ లేడు | మే | 2001 | మహమ్మద్ ఖదీర్ బాబు |
| ✯ | 27. | ప్రమాదంలో ప్రజారోగ్యం | ఫిబ్రవరి | 2002 | డా॥ ఎస్. తిరుపతయ్య<br>డా॥ పి. జగదీశ్వర్ |
| ✯ | 28. | ఎన్జీవోల కథ | జనవరి | 2003 | బి. చంద్రశేఖర్ |
| ✯ | 29. | జాగ్తే రహో | జూన్ | 2003 | చలసాని ప్రసాదరావు<br>ఎడిటర్ : డి. వెంకట్రామయ్య |

| | | | | |
|---|---|---|---|---|
| ★ | 30. | ఉదయగీతిక (రెండవ కూర్పు తొలిముద్రణ) | డిసెంబర్ 2003 | రచన - యాంగ్ మో<br>అనువాదం : ఎన్. వేణుగోపాల్ |
| ★ | 31. | వరల్డ్ సోషల్ ఫోరం ఆర్థిక రాజకీయాలు | జనవరి 2004 | **RUPE (MUMBAI)**<br>అనువాదం : బి. చంద్రశేఖర్ |
| ★ | 32. | ఎర్రమందారాలు (రెండవ కూర్పు తొలి ముద్రణ) | మే 2005 | రచన-లోకువాంగ్-పిన్<br>యాంగ్ యీా-యెన్<br>అనువాదం : డా॥ టి.నళిని |
| ★ | 33. | నూరేళ్ళ తెలుగు నవల (1878-1977) | ఆగస్ట్ 2007 | సహవాసి<br>సంపాదకులు- డి. వెంకట్రామయ్య |
| | 34. | అల్లంరాజయ్య సాహిత్యం -1 మూడు నవలలు- | జనవరి 2008 | అల్లం రాజయ్య<br>సంపాదకులు-వరవరరావు |
| | 35. | విభిన్న | ఆగష్టు 2008 | హరిపురుషోత్తమరావు |
| | 36. | పతంజలి భాష్యం | మార్చ్ 2009 | కె.ఎన్.వై.పతంజలి |
| | 37. | మృగన (కవిత్వం) | ఏప్రిల్ 2009 | విమల |
| | 38. | రాజ్యం - సంక్షేమం | అక్టోబర్ 2010 | కె. బాలగోపాల్ |
| | 39. | అల్లం రాజయ్య సాహిత్యం-2 సృష్టికర్తలు (కథలు) | ఏప్రిల్ 2011 | అల్లం రాజయ్య<br>సంపాదకులు-వరవరరావు |
| | 40. | సంభాషణ | జులై 2011 | కె. శ్రీనివాస్ |
| | 41. | దళిత | అక్టోబర్ 2011 | కె. బాలగోపాల్ |
| | 42. | జాజిమల్లి (మొదటి ముద్రణ) | డిసెంబర్ 2011 | మల్లీశ్వరి |
| | | (రెండవ ముద్రణ) | ఏప్రిల్ 2012 | |
| | 43. | త్రిపుర (కథలు) | డిసెంబర్ 2011 | త్రిపుర |
| | 44. | ప్రాణహిత (మొదటి ముద్రణ) | జులై 2012 | అల్లం నారాయణ |
| | | (రెండవ ముద్రణ) | సెప్టెంబర్ 2012 | |

| | | | |
|---|---|---|---|
| 45. | మనిషి మార్క్సిజం | | కె. బాలగోపాల్ |
| | (మొదటి ముద్రణ) | అక్టోబర్ 2012 | |
| | (రెండవ ముద్రణ) | మార్చి 2013 | |
| 46. | కొమురం భీము | జనవరి 2013 | సాహు, అల్లం రాజయ్య |
| | | | సంపాదకులు - వరవరరావు |
| 47. | సింహాలపేట (కథలు) | మార్చి 2013 | రమణజీవి |
| 48. | రిజర్వేషన్లు ప్రజాస్వామిక దృక్పథం | అక్టోబర్ 2013 | కె. బాలగోపాల్ |

★ ప్రతులు లేవు

త్వరలో....

వసంతగీతం......అల్లం రాజయ్య
సంపాదకులు : వరవరరావు

సండే కామెంట్స్ : వసంతలక్ష్మి

**Perspectives**
***Social Sciences / Literature***
**Publishing** *for* **Change**



Reservationlu
Prajaswamika Drukpatham

The Right *of* Reservations by K.Balagopal

సామాజిక న్యాయం కోసం చేసే ఏ చట్టాలూ ఎందుకు అమలు కావని చాలా మంది అడుగుతుంటారు. వాటికి ఎవరో స్వార్థపరులు అడ్డం పడనవసరం లేదు. వాటిని అమలు చేయవలసినవారే వాటిని న్యాయమైనవిగా అనుకోరు. ఓట్ల కోసమో, తప్పుడు ఔదార్యం వల్లనో, గురి తప్పిన కారుణ్యం వల్లనో ఉనికిలోకి వచ్చిన తెలివితక్కువ నియమాలుగా వాటిని భావిస్తారు.

చట్టాలను, పాలనా విధానాలను అమలు చేసేవారు కుంటివాళ్ళు కారు, గుడ్డివాళ్ళు కారు, మాలవాళ్ళు కారు, మాదిగవాళ్ళు కారు, ఆడవాళ్ళు కారు, ఆదివాసులు కారు, ఆకలెరిగిన వారు కారు. కానీ వారే ఈ సమాజానికి సంబంధించిన 'ప్రధాన స్రవంతి'. దీనికి వెలుపల ఉండే వాళ్ళ ఒత్తిడి వల్ల 'సామాజిక న్యాయం' అనే భావం, దానికి సంబంధించిన చట్టాలు ఉనికిలోకి వచ్చినా ఆ భావన పట్ల ఏ మాత్రం సానుభూతి లేనివారు వాటిని అమలు చేయాలి కాబట్టి అవి అమలు కావడం సులభం కాదు.

అందువల్ల చట్టాలలోని హక్కులనేకం ఆచరణలో భాగం కావు. కాకుండా చేసినవారికి ఏ శిక్షా లేనంత కాలం, ఏ కష్టమూ రానంతకాలం ఈ పరిస్థితి మారదు. దీనికి విరుగుడు కనిపెట్టనిదే సామాజిక న్యాయం చట్టాలలోకి ఎక్కినా సామాజిక ఆచరణలో భాగం కాదు.

కె.బాలగోపాల్

**Perspectives**
Social Sciences/Literature
Publishing *for* Change

Rs. 120/-

ISBN 978-93-81172-05-6

9 789381 172056